వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 11 సంచిక : 3 హైదరాబాద్ 140 మార్చ్ 2013 పేజీలు : 68 రు. 15

- మూలాలు పట్టని పేలుళ్ల చర్చ
- జస్టిస్ వర్మ కమిటీ సిఫారసులు
- సీమ, ఉత్తరాంధ్ర, జై ఆంధ్ర గళాలు
- ఆర్థిక పతనం - ఎఫ్‌డిఐల పాత్ర
- అఫ్జల్ గురు, తబస్సుమ్ లేఖలు
- సమాజ స్వభావం - సామాజిక మార్పు
- సిరియాలో అమెరికా జోక్యం

మీ గ్రంథాలయానికి వీక్షణం వస్తోందా!

వీక్షణం మిత్రులకు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి!

మీ గ్రామంలో, మండలంలో, జిల్లా కేంద్రంలో, మీకు తెలిసిన విద్యా సంస్థలలో ఉన్న గ్రంథాలయాలలో వీక్షణం పత్రిక వస్తోందా? రాకపోతే అక్కడి పాఠకులకు వీక్షణం అందించే బాధ్యత మీదే.

మీ వంతుగా ఇటు వీక్షణం మనుగడకు, అటు సామాన్య పాఠకులకు అందుబాటులోకి తీసుకువెళ్లడానికి సహకారం అందించండి.

ప్రకటనలు, విరాళాల ద్వారా వీక్షణం మనుగడలో మీరూ భాగస్వాములు కండి!

చందా వివరాలు

	సంస్థలకు/లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	-
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	-

వీక్షణంలో మీ ప్రకటనలకై చెల్లించాల్సిన రుసుం

చివరి కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	రు. 40,000;	రెండవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	రు. 25,000
మూడవ కవర్ (కలర్‌లో ఫుల్ పేజీ)	రు. 25,000;	లోపల పేజీ (బ్లాక్ అండ్ వైట్‌లో ఫుల్ పేజీ) 24సెం.మీ. ×17 సెం.మీ.)	రు. 20,000
లోపలి పేజీ (బ్లాక్ & వైట్ సగం పేజీ) (12 సెం.మీ. × 17 సెం.మీ.)	రు. 10,000	లోపలి పేజీ (బ్లాక్ & వైట్ పావు పేజీ) (12 సెం.మీ. × 8.5 సెం.మీ.; లేదా 6 సెం.మీ. × 17 సెం.మీ.)	రు. 5,000

వీక్షణం అకౌంట్ నెంబర్ - 013911011002175, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

ఇమెయిల్ : veekshanam2003@gmail.com

వీక్షణంను ఈ సైట్‌లో చూడొచ్చు, చదవవచ్చు **www.veekshanam.wordpress.com**

KRSA102M267

140 ISSN 2231-6892

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మార్చ్ 2013
సంపుటి : 11
సంచిక : 3

వ్యవస్థాపక సంపాదకులు : వి. హనుమంతరావు
సంపాదకులు : ఎన్. వేణుగోపాల్
కరస్పాండెంట్ / సర్క్యులేషన్ మేనేజర్ : వై. రామచంద్రం
సబ్ ఎడిటర్ : ఎ. మల్లేశ్
ఆఫీస్ అసిస్టెంట్ : ఎస్. వెంకటేష్

లోపలి పేజీల్లో...

❖ పాఠకుల వీక్షణం			4
❖ సంపాదకీయం	◆ మూలాలు పట్టని పేలుళ్ల చర్చ		5
❖ సంపాదకీయ వ్యాఖ్యలు	◆ అఫ్జల్ గురు హత్యతో సాధించిందేమిటి? ◆ బాలచంద్రుని మృతదేహం అడుగుతున్న ప్రశ్నలు		6
❖ కొత్త పుస్తకాలు / సి.డి.లు			7
❖ ఈనేల		- ఎ. మల్లేశ్	8
❖ విధానవిమర్శ	స్వాతంత్ర్య పూర్వస్థితికి దిగజారుతున్న దేశ పరిస్థితి	- వి. హనుమంతరావు	9
❖ విధానవిమర్శ	ఆర్థిక పతనం - ఎఫ్‌డిఐల పాత్ర	- డా. శ్రీనివాసరావు చొప్పర	11
❖ పునరుక్తి	చిల్లర వర్తకం - అమెరికా అనుభవం	- ఎన్‌విఎస్ నాగభూషణ్	14
❖ కార్మికరంగం	బిహెచ్‌ఇఎల్ ఏం కానుంది?	- విద్యాభూషణ్	16
❖ వర్తమానం	అత్యాచార నిరోధక ఆర్డినెన్స్	- జి. ఉదయ	18
❖ వర్తమానం	వర్మ కమిటీ నివేదిక - ప్రభుత్వ చిత్తశుద్ధి	- చిమ్మె జాన్ బర్నబాస్	20
❖ వర్తమానం	ఈ వ్యవస్థలో మహిళలకు రక్షణ సాధ్యమేనా..?	- జి. లచ్చయ్య	22
❖ ప్రాంతీయం	సీమ గొంతుకనూ వినండి!	- సోమశేఖరశర్మ	24
❖ ప్రాంతీయం	సమైక్యాంధ్ర ఒక ప్రతీఘాతక ధోరణి	- పల్నాటి శ్రీరాములు	28
❖ ప్రాంతీయం	ఉత్తరాంధ్ర సమస్యలు - సమైక్యవాదుల వైఖరి	- పి. కృష్ణారావు	30
❖ విధానవిమర్శ	లోక్‌పాల్‌తో అవినీతిని ఆపగలమా?	- ఎన్. యాకయ్య, డా. సంకినేని వెంకటయ్య	31
❖ సైద్ధాంతిక చర్చ	సమాజ స్వభావం - సామాజిక మార్పు	- ఎన్. వేణుగోపాల్	34
❖ వర్తమానం	నొక్కబడిన నా గొంతు వినండి	- మహమ్మద్ అఫ్జల్ గురు	38
❖ వర్తమానం	న్యాయం కోసం విన్నపం	- తబస్సుమ్ గురు	40
❖ వర్తమానం	భారత ప్రజాస్వామ్యానికి మచ్చ	- అరుంధతీ రాయ్	42
❖ అంతర్జాతీయం	సిరియాలో అమెరికా జోక్యం	- ఎ. నర్సింహారెడ్డి	44
❖ సామాజికాంశం	ప్రజలపై పెరుగుతున్న రాజ్యహింస	- కిరణ్	49
❖ పరిశోధన	కనిపించే యథార్థాలు	- డా. ఎం. శ్రీకాంత్‌రెడ్డి	50
❖ ప్రాంతీయం	ఎర్రచందనం దోపిడీ - కూలీల హత్య	- ఎం.కె. కుమార్	53
❖ ప్రాంతీయం	ఓపెన్ కాస్టుల వల్ల ఎవరికి లాభం?	- కొండపాక శ్రీలత	55
❖ ప్రాంతీయం	జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్	- దామరపల్లి నర్సింహ్మారెడ్డి	56
❖ పుస్తక సమీక్ష	వేగుచుక్క - చేగువేరా	- బి.వి.ఎన్. స్వామి	58
❖ చర్చ	భారత చైనా యుద్ధం - కొన్ని అర్ధ సత్యాలు	- ఎస్. కృష్ణమూర్తి	59
❖ చర్చ	మంచి వ్యాసాలు, కాని అవగాహనా లోపాలు	- ఎన్. ఆదిరెడ్డి	60
❖ చర్చ	కుండెడు అమృతంలో.. రెండు విషపు చుక్కలు పడవచ్చునా?	- రంగనాయకమ్మ	61
❖ చర్చ	చరిత్ర తప్పితే జవాబు కోరే ప్రశ్నలెన్నో...	- ఎన్. నర్సింహులు	62
❖ ఇరుగు-పొరుగు		- వై. రామచంద్రం	65
❖ అసహజ మరణాలు		- వై. రామచంద్రం	66

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ /
చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజెన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	-
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	-

వీక్షణం అకౌంట్ నెంబర్ - 013911011002175
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు ANDB 000/0139 నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం ఫిబ్రవరి సంచికలో 'ప్రత్యామ్నాయ చరిత్ర నిర్మాణం పేరిట చరిత్ర మౌలిక వాస్తవాలనే విస్మరించిన వ్యాసం'లో పేజీ నెంబర్ 63లోని మూడవ పేరాలో కింది నుండి 5వ లైన్‌లో విరివిగా లభ్యమైంది (500) కాపీలు అని అచ్చు తప్పు జరిగింది. దాన్ని 5000 అని చదువుకోగలరు. -సం.

జనవరి సంచికలో కొబాడ్ గాంధీగారి వ్యాసం 'ఏముందో చూద్దాం' అన్నట్లు మొదలుపెట్టాను. చివరి వరకు ఎంతో ఆసక్తితో చదివాను. ఉత్పతి విధానం మీద ఇంత ఆలోచింపజేసే వ్యాసం తెలుగులో చాలా తక్కువ. దీని ప్రాతిపదికగా చర్చ కొనసాగిస్తే ఉద్యమాలకు ఎంతో ఉపయోగం ఉంటుంది. వరవరరావుగారు రాసిన వ్యాసం మూడు దశాబ్దాల క్రితం విన్న చరిత్ర గుర్తు తెచ్చింది. ఉద్యమంలో ముందడుగు, వెనుకంజ సహజం అనేది నిజమే కాని నిర్దిష్ట పరిస్థితులలో, ఉత్తర తెలంగాణా, రాయలసీమ, నల్లమల, బెంగాల్‌లో వచ్చిన వెనుకంజకు కారణాలు నిర్దిష్టమైన ఆచరణ, సిద్ధాంత పరిశీలనలో తేల్చాలి. నిషేధం తొలగింపు, మైదాన ప్రాంతాలకు, ముఖ్యంగా కార్మిక ఉద్యమాలు విస్తరణ అనేది ప్రధానంగా రాజకీయ సమస్య. పదిహేను సంవత్సరాలకు పైగా బాలగోపాల్, మనోరంజన్ మొహంతి, సుమంతా బెనర్జీ, ఇ.పి.డబ్ల్యు.వంటి పత్రికలు చేసిన విమర్శలు, పార్టీ సీనియర్ నాయకులూ బెంగాల్లో జరిపిన హత్యలపై వెలిబుచ్చిన ఆందోళన (టైమ్స్ ఆఫ్ ఇండియా, సెప్టెంబర్ 16, సుశీల్ రాయ్), ఎన్నికల బహిష్కరణ విధానాన్ని విడవకుండా తృణమూల్‌కు అనుకూల ప్రకటన వంటి స్వీయ వైరుధ్యాలు, తమ మీద జరుగుతున్న దాడులు, హత్యలు మరచి ఇతర ఎం.ఎల్. పార్టీలు నిషేధం తొలగింపు వంటి ఉద్యమాలలో కలుస్తాయా ? ఇటువంటి ప్రశ్నలతో తలపడకుండా మావోయిస్ట్ ఉద్యమం ముందుకు సాగదు. అదే పనిని మళ్లీ, మళ్లీ చేసుకుంటూ పోతే కొత్త ఫలితాలు ఆశించలేం. ఈళం చరిత్ర వంటిది ఇక్కడ జరిగితే సంభవించే జన నష్టం, విధ్వంసం జరగకుండా చూడడం ఇప్పటి అవసరం.

– కె. నరేంద్రమోహన్

(వీక్షణం బ్లాగ్ www.veekshanam.wordpress.com పై పోస్ట్ చేసిన వ్యాఖ్య)

వీక్షణం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మీరు ప్రచురించిన ప్రత్యేక సంచిక బాగా వచ్చింది. అభినందనలు. శుభాకాంక్షలు. అయితే, నేడు సమాజం ముందు ఉన్న మరెన్నో ముఖ్యమైన విషయాల మీద వ్యాసాలు ఉండవలసింది. అవి లేకపోవడం లోటే. ఆ విషయాల మీద వీలు వెంబడి అయినా వ్యాసాలు రాయించి ప్రచురించండి. ఇక ప్రత్యేక సంచికలో వచ్చిన వ్యాసాలలో కొన్ని చాలా బాగా ఉండగా, కొన్ని అలా అలా ఉండగా, కొన్ని బాగా లేవు. పత్రికలో వచ్చే అన్ని వ్యాసాలూ ఒకే రకంగా ఉండాలని లేదు గాని వీక్షణంలో వచ్చే వ్యాసాల గురించి ఎక్కువ ఆశ ఉంటుంది. మొత్తం పత్రిక మీద సమీక్ష చేస్తే పెద్ద గ్రంథం అవుతుంది గాని క్లుప్తంగా నా అభిప్రాయాలు రాస్తాను. ముదునూరి భారతి వ్యాసం అర్థం చేసుకోవడం కొంచెం ఇబ్బంది అయ్యేట్టు ఉంది గాని, ఒకటికి రెండు సార్లు చదివితే బాగుంది. కోబడ్ గాంధీ వ్యాసం ప్రస్తుతం అవసరమైన చర్చ కాని అది ఇంకా వివరంగా ఉండాలని అనిపించింది. ఎన్ వేణుగోపాల్ వ్యాసంలో చరిత్ర, పాత డాక్యుమెంట్ల నుంచి కొటేషన్లు బాగున్నాయి గాని, ప్రస్తుతం అక్కడ వాస్తవంగా ఏమి జరుగుతున్నదో వివరాలు తక్కువైపోయాయి. ఇటువంటి పనులనే ఇదివరకు నక్సలైట్లు సంస్కరణవాదం అని కొట్టివేసేవారు కదా అని ఒక మిత్రుడు అన్నాడు. కె. సజయ తదితరులు రాసిన వ్యాసం చాలా బాగుంది. ప్రస్తుతం వ్యవసాయ సంక్షోభం ఎట్లా రైతుల ప్రాణాలు బలి తీసుకుంటున్నదో బాగా వివరించారు. నష్టపరిహారం ఇవ్వడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం గురించి ఒక్క మాటలో తేల్చేస్తే సరిపోయేది. ప్రభుత్వ స్వభావమే అంత. వి. హనుమంతరావు వ్యాసం ఈ ప్రత్యేక సంచికకు సరిపోయినట్టుగా లేదు. పైగా వ్యాసం చివర కాంగ్రెస్ ను ఓడించమని పిలుపు. అందరూ దొంగలే అయినప్పుడు ఒక దొంగను ఓడించమంటే అర్థం ఏమిటి? ఇది అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలు పాలకవర్గంలో భాగమేననే అవగాహన లేకపోవడం. పార్టీల మధ్య ఏదో తేడా ఉందని భ్రమ పడడం. సత్యనారాయణ రెడ్డి వ్యాసం మామూలు దినపత్రికల వ్యాసాల లాగ సమాచారమంతా ఒక్కచోట చేర్చి, ఒకటి రెండు మార్క్సిస్టు దృక్పథపు వ్యాఖ్యలు చేర్చినట్టు ఉంది. పేదరికానికి మూలకారణాలను సరిగా చర్చించినట్టు అనిపించలేదు. కె ఆర్ చౌదరి వ్యాసం కొన్ని అభిప్రాయాలు (అవి కూడ ఆయన చాలా సార్లు చెప్పినవే) రాసినట్టుంది గాని ఒక ప్రత్యేక సంచిక వ్యాసంలా లేదు. లోకసంచారి వ్యాసం సామ్రాజ్యవాద విషఫలితాలను ఒక పద్ధతిలో చెప్పింది గాని అసలు సామ్రాజ్యవాదం ఎందుకు వచ్చిందో ఎట్లా పెరిగిందో ఎట్లా పోతుందో చెప్పలేదు. విషఫలితాలను చెప్పినచోట్ల కూడ చాలావరకు బూర్జువా ప్రచారసాధనాల ప్రభావం కనబడుతున్నది గాని సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకోవడానికి కీలకమైన మార్క్సిస్టు అవగాహన కనబడడం లేదు. ఎ. నర్సింహారెడ్డి వ్యాసం ప్రస్తుత భారత సమాజంలోని లోపాలను బాగానే చూపింది గాని వాటికీ పార్లమెంటరీ వ్యవస్థకూ సంబంధాన్ని బలంగా నిరూపించలేదు. పార్లమెంటరీ వ్యవస్థ పుట్టుకను వివరంగానే చర్చించారు గాని, అసలు ఆ వ్యవస్థ భారత సమాజానికి ఉపయోగపడుతుందా లేదా, అది భారత సమాజంలోని ఏ చెడుగులను ఎలా ఉపయోగించుకుని బలపడుతున్నదీ చెప్పలేదు. కె. సత్యనారాయణ వ్యాసం దళిత ఉద్యమాన్ని వీలైనంతవరకు సరిగ్గానే చిత్రించింది గాని సాహిత్యం పాత్ర ఎక్కువైపోయింది. అలాగే ముఖ్యంగా చర్చించవలసిన కుల సమస్య – మార్క్సిస్టులు గురించి ఎక్కువ చర్చ చేయలేదు. పి వి రమణ వ్యాసం కార్మికోద్యమ చరిత్రను వివరంగా, బాగా చెప్పింది. అయితే ప్రపంచీకరణ తర్వాత కార్మికోద్యమపు కొత్త సవాళ్ల గురించీ, వాటినిఎదుర్కొంటున్న తీరు గురించీ ఇంకా రాస్తే బాగుండేది. డా. నళిని వ్యాసం ప్రధాన ఘట్టాలను బాగానే వివరించింది గాని ఆ ఘట్టాల నుంచి తీయవలసిన నిర్ధారణలు ఏమిటో సరిగా రాలేదు. ఫెమినిస్టుల మీద విమర్శ చాలా వరకు సరిగానే చేశారు. వ్యక్తిగతం కూడ రాజకీయమే అనే నినాదాన్ని అనవసరంగా విమర్శించారు. ఫెమినిస్టులు లేవనెత్తిన నినాదాలలో చాలా అర్థవంతమైనదీ, సరైనదీ ఆ నినాదం. సమాజంలో వ్యక్తిగత, సామాజిక అనే విభజన ఉండి, సామాజిక విషయాలు మాత్రమే రాజకీయమైనవిగా చలామణీ అవుతున్నప్పుడు, ఆ విభజనను ఎదిరిస్తూ, వ్యక్తిగతమైనవని అనుకుంటున్నవి కూడ రాజకీయమైనవే అని ఫెమినిస్టులు విశ్లేషించారు. దాన్ని విమర్శించడం సరికాదు. వరవరరావు వ్యాసం సుదీర్ఘమైన కాన్వాస్ తీసుకోవడం వల్ల, ఆ విషయానికి ఉన్న విస్తృతి వల్ల అసంపూర్తిగా ఉన్నట్టు అసంతృప్తి కలిగింది. ఏది ఏమైనా చాలా విలువైన వ్యాసాలతో ఒక మంచి ప్రత్యేక సంచికను తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు.

– వై నవీన్ బాబు

దారకొండ

గత జనవరి 22న చంద్ర (చంద్రశేఖర్, న్యాయవాది, గుంటూరు) (1) చనిపోయాడు/ మరణించాడు(2) అమరుడయ్యాడు (3) దివంగతుడయ్యాడు/ పరమపదించాడు. ఈ మూడింటిలో చంద్రకు ఏది నప్పుతుంది అంటే (చంద్రతో సహా) మూడవదే అని నిక్కచ్చిగా చెప్పవచ్చు. ప్రవృత్తి చంద్ర విషయంలో ప్రకోపించింది. చంద్ర తన్ను తాను బ్రాహ్మడిగా పునరావిష్కరించుకున్నాడు. ప్రవృత్తి అనగానే బాలగోపాల్ గుర్తుకొస్తాడు. "మానవ ప్రవృత్తి" సిద్ధాంతం చైతన్యానికి పెద్దపీట వేస్తుంది. చైతన్యాన్ని నిర్ణాయక స్థానంలోకి తీసుకుపోతుంది. వస్తుగత వాస్తవికత లేక పదార్థం ఉప ఉత్పత్తి మాత్రమేనని చెప్పకనే చెపుతుంది. స్వార్థం స్థానంలో పరమార్థం, సంకుచితత్వం (అల్పత్వం) స్థానంలో విశాల హృదయం మనుషులకు అబ్బినప్పుడే సోషలిజం సాధ్యమవుతుందని ప్రవృత్తి సిద్ధాంతం చెపుతుంది. సోషలిజానికి పునాది చైతన్యం, భౌతిక/వస్తుగత వాస్తవికత కాదు. తలకిందికి, కాళ్లుపైకిగా నిల్చున్న హెగెల్‌ను మార్క్స్ సరిచేశాడు. తద్వారా మార్క్స్

(మిగతా 64వ పేజీలో...)

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ;

మూలాలు పట్టని పేలుళ్ల చర్చ

హైదరాబాదు దిల్‌సుఖ్‌నగర్‌లో ఫిబ్రవరి 21 సాయంత్రం జరిగిన రెండు బాంబు పేలుళ్ల ఘటన అత్యంత దుర్మార్గమైనది. అందులో పదహారు మంది అమాయకులు బలి అయిపోయారు. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. నగర జీవనం మొత్తంగానే అభద్రతా భయంలోకి నెట్టబడింది. అది నూటికి నూరుపాళ్లు అమానుషమైన, గర్హనీయమైన నేరమే. ఆ నేరస్తులను పట్టుకుని విచారణ జరిపి శిక్షించవలసిందే. ఆ ఘటనలో మృతుల బంధువులు, బాధితులు, సాధారణ ప్రజలు కూడ ప్రకటిస్తున్న ఆగ్రహావేశాలు సహజమైనవే. కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న, శారీరకంగానూ మానసికంగానూ గాయపడిన, నష్టపోయిన బాధితులు నేరస్తుల మీద ప్రకటిస్తున్న ప్రతీకారవాంఛను అర్థం చేసుకోవచ్చు. కాని ఆ ఘటనను సాకుగా తీసుకుని పాలకవర్గాలు, అధికార వర్గాలు, ప్రచారసాధనాలు అనుసరిస్తున్న వైఖరి, చేస్తున్న ప్రకటనలు, పనులు చాల అభ్యంతరకరంగా, ప్రమాదకరంగా, మత విద్వేషాలను రెచ్చగొట్టేట్టుగా, అమాయకులను వేధించేట్టుగా ఉన్నాయి. ఆ దుర్ఘటన ఎందుకు జరిగిందో ఆలోచించేబదులు ఉద్దేశపూర్వకంగా కారణాల చర్చ రాకుండా బాధితులను రెచ్చగొడుతున్నారు. ఆ దుర్ఘటన ఎలా జరిగిందో నిష్పాక్షిక విచారణ జరిపి తేల్చేబదులు ఎటువంటి విచారణ లేకుండానే తమ అనుమానాలను, దురభిప్రాయాలను, అపోహలను యథేచ్ఛగా ప్రకటిస్తూ విచారణను తప్పుదారి పట్టిస్తున్నారు. ఆ దుర్ఘటన జరగకుండా చూడడానికి ఏ మౌలిక చర్యలు తీసుకోవాలో సూచించే బదులు తాత్కాలిక, తక్షణ, చిల్లరమల్లర పరిష్కారాలతో కాలం గడుపుతున్నారు.

ఈ దుర్ఘటన ఎందుకు జరిగిందో మౌలిక కారణాలను వెతకడం చాల పెద్దపని. అందుకు సుదీర్ఘమైన చరిత్రను, మతభావనలను, రాజకీయాలను, పాలకవర్గ కుటిల ఎత్తుగడలను అర్థం చేసుకోవాలి. కాని పాలకవర్గాలు తమ ప్రయోజనాల కోసం ఏదో ఒక తక్షణ కారణాన్ని చూపెడతాయి. ఏదో ఒక నెపం వెతుకుతాయి. మొన్నటి సంఘటనే నిన్నటి సంఘటనకు కారణమని మొరటు కార్యకారణ సంబంధాన్ని వెతుకుతాయి. చరిత్ర తవ్వి సంక్లిష్ట కారణాలను వెతికితీసే ఓపిక లేని ప్రచార సాధనాలు పాలకులు ఏ సమాచారం ఇస్తే ఆ సమాచారం తీసుకుని, దానికి తమ సంచలనాత్మక మసాలా అద్ది, కథనాలు వండి వార్చి తమ అమ్మకాలు, టిఆర్‌పి రేట్లు పెంచుకుంటాయి. ఈ గందరగోళంలో అసలు ఆ దుర్ఘటన ఎందుకు జరిగిందో అర్థం చేసుకోవడం అసాధ్యమూ కష్టసాధ్యమూ అవుతుంది. సమస్యే అర్థం కాకపోతే దాన్ని పరిష్కరించడమూ అసాధ్యమై పోతుంది. సమస్య మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటుంది. తలెత్తిన ప్రతిసారీ ఈ నాటకమే పునరావృతమవుతుంది. మధ్యలో వందలూ వేలూ అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటారు గాని పాలకవర్గాలకు ప్రజల ప్రాణాల విలువేమిటి?

ఇక ఎట్లా జరిగిందో, నేరస్తులెవరో తేల్చవలసినది సక్రమమైన, నిష్పాక్షికమైన విచారణ ద్వారా మాత్రమే. మన అపోహల ద్వారా కాదు. అనుమానాలు ఎవరిమీదనైనా ఉండవచ్చు. నిజానికి అన్ని అనుమానాలనూ విచారిస్తూ, ఒక్కొక్క అనుమానాన్ని నివృత్తి చేసుకుంటూ పోయినప్పుడే అంతిమంగా బాధ్యులెవరనేది తేలుతుంది. కాని దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల ఘటనలో పోలీసులూ, విచారణ సంస్థలూ, పత్రికలూ, టివి ఛానళ్లూ, రాజకీయ నాయకులూ, మేధావులూ కూడబలుక్కున్నట్టుగా ఒకరిపైనే, ఒక మతానికి చెందిన సంస్థలపైనే అనుమానం ప్రకటిస్తున్నారు. తమ అనుమానమే నిజమన్నట్టు ప్రవర్తిస్తున్నారు. హేతుబద్ధంగా, నిష్పాక్షికంగా ఆలోచిస్తే ఈ దుర్ఘటన వెనుక పాలకవర్గాలు ఉండే అవకాశం ఉంది. రానున్న ఎన్నికలలో తానే మెజారిటీ మతస్తుల రక్షకురాలినని చూపుకునే వ్యూహంలో భాగంగా ఆ మతస్తులలో అభద్రతా భావం పెంచడానికి అధికారపార్టీకి ఇటువంటి ఘటన అవసరం. తన జాగాలోకి అధికారపక్షం చొరబడుతున్నదనే భయంతో, తనను తాను రక్షించుకోవడానికి, కోల్పోతున్న జాగా నిలబెట్టుకోవడానికి మతోన్మాదమే ఏకైక విధానం అయిన ప్రధాన ప్రతిపక్షం, లేదా దాని పరివారంలోని సంస్థలు ఇటువంటి పని చేసి ఉండడానికి అవకాశం ఉంది. భారత రాజకీయాలను, సమాజాన్ని అస్తవ్యస్తం చేసే లక్ష్యంతో నడుస్తున్న పొరుగుదేశాల ప్రభుత్వాలకు ఈ ఘటన అవసరం. ఆ పొరుగుదేశాల ప్రేరణతోనో, భారత పాలకుల మతోన్మాద రాజకీయాల పట్ల కోపంతో స్వయంగానో ఇటువంటి ఘటన జరపడానికి ఉత్సాహపడే ఒక మతవర్గపు యువకులూ ఉన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆందోళనను పక్కదారి పట్టించి విస్మరింపజేసే కుట్రలో భాగంగా ఇది జరిగిందని వాదిస్తున్న వాళ్లూ ఉన్నారు. అంటే కనీసం ఆరు భిన్నమైన శక్తులను అనుమానించడానికి ఆస్కారం ఉంది. వీరిలో ఎవరైనా చేసి ఉండవచ్చుననే అభిప్రాయంతో విచారణ ప్రారంభించి, ఒక్కొక్కరి మీద సందేహనివృత్తి చేసుకుంటూ చివరి అభియోగపత్రం న్యాయస్థానం ముందుకు తీసుకుపోవాలి. అక్కడ సక్రమమైన, న్యాయమైన, చట్టబద్ధమైన విచారణ జరిపి నేరస్తులను శిక్షించాలి. కాని ఘటన జరిగిన మరుక్షణం నుంచే ఈ అనుమానితులలో కొందరే ఒకే ఒక్క వైపు గురిపెట్టి అనుమానాన్ని సృష్టిస్తున్నారు. ఆరు సంవత్సరాల కింద మక్కా మసీదులో జరిగిన పేలుడు ఉదంతాన్ని గుర్తు తెచ్చుకుంటే అప్పుడు కూడ ఇలాగే ఒకే మతస్తులవైపు గురిపెట్టి అనుమానం తయారీ జరిగింది. ఆ మతానికి చెందిన వందలాది మంది యువకులను అరెస్టు చేశారు, చిత్రహింసలు పెట్టారు. పేలుళ్ల కుట్ర సమాచారం వారి దగ్గర దొరికిందన్నారు, పేలుడు పదార్థాలు దొరికాయన్నారు. ఆ పచ్చి అబద్ధాలను ప్రచారసాధనాలు అత్యంత హీనమైన విధేయతతో వల్లెవేశాయి, తమ అత్యుత్సాహపు విచారణలు జరిపి అవే నిజాలన్నట్టు ప్రకటించాయి. కాని అవన్నీ అబద్ధాలని, మక్కా మసీదు పేలుళ్లు జరిపింది ఒక హిందూ తీవ్రవాద సంస్థ అని బైటపడింది. కనీసం ఆ అనుభవంతోనైనా ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎవరూ అనుకోవడంలేదు.

ఇక భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా ఆపాలనే ఉద్దేశ్యం పాలకులకు ఉండే అవకాశమే లేదు. ప్రజలను చీలదీయడం, వారిమధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, వందల ప్రాణాలు పోయినా ఫరవాలేదు, తమ ప్రయోజనాలు నెరవేరితే చాలునని అనుకోవడం మన పాలకవర్గాల నైజం. మృతుల పట్ల అపారమైన గౌరవం, సానుతాపం ప్రకటిస్తూనే, ప్రతీకార వాంఛలను, అబద్ధ అనుమానాల తయారీని ఖండించడం ప్రజలలో ప్రతిఒక్కరి బాధ్యత.

అఫ్జల్ గురు హత్యతో సాధించిందేమిటి?

అఫ్జల్ గురును ఉరి తీశారు. అబద్ధపు సాక్ష్యాలతో, అక్రమమైన విచారణతో మరణశిక్ష విధించి ఏడు సంవత్సరాలుగా ఉరికంబం నీడలో ఉంచి ఇవాళ ఎన్నికల రాజకీయాల కోసం ఉరితీశారు. అసలు అఫ్జల్ గురు ఉరికి ప్రాతిపదిక అయిన పార్లమెంటు దాడి వ్యవహారం మొత్తంగానే అనుమానాస్పదమైనది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీవ్రవాద నిరోధక చట్టాన్ని తేదలచుకున్నప్పుడు, అంతకు రెండు సంవత్సరాల ముందు జరిగిన కార్గిల్ యుద్ధ సమయంలో శవపేటికల కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగిందని చర్చ జరుగుతున్నప్పుడు పార్లమెంటుపై దాడి జరిగింది. అది నిజమైన దాడా, నాటకమా ఇప్పటికీ నిస్సందేహంగా చెప్పగలిగిన స్థితి లేదు. ఆ దాడిలో కారులో వచ్చిన ఐదుగురినీ అక్కడికక్కడే కాల్చి చంపి సాక్ష్యాధారాలు లేకుండా చేశారు. ఇక మిగిలింది ఆ కారుకూ, ఆగంతుకులు వాడిన సెల్‌ఫోన్లకూ సంబంధించిన ఆధారాలు మాత్రమే. ఆ ఆగంతుకులలో ఒకరైన మహమ్మద్ ఆ కారు ఢిల్లీలోనే కొన్నాడని, ఆ కారు కొంటున్నప్పుడు పక్కన అఫ్జల్ గురు ఉన్నాడని పోలీసుల అభియోగం. కాని అహ్మద్‌ను తనకు పరిచయం చేసిందీ, ఢిల్లీ తీసుకువెళ్లి ఇల్లు, ఇతర అవసరాలు చూసిపెట్టమని చెప్పిందీ కశ్మీర్‌లోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులేనని అఫ్జల్ గురు చెప్పిన మాట నిజమో కాదో విచారణే జరపలేదు. తన సెల్‌ఫోన్‌లోనూ, మహమ్మద్ సెల్‌ఫోన్‌లోనూ ఆ అధికారులతో మాట్లాడిన వివరాలు ఉన్నాయని, అవి పరిశీలించమని అఫ్జల్ గురు అన్న మాట అరణ్యరోదనే అయింది. అసలు నేరవిచారణ జరిగే కింది కోర్టులో అఫ్జల్‌కు న్యాయవాదే లేడు. ఏమి విచారణ జరిగిందో తెలియదు. వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన వారిని ప్రశ్నించిన వారు లేరు. అఫ్జల్ చెప్పిన వ్యక్తులను విచారించడానికి పిలవనే లేదు. పోలీసుల దగ్గర ఇచ్చే ఒప్పుకోలు ప్రకటన సాధారణంగా బలవంతపెట్టి చిత్రహింసలు పెట్టి, నిందితుడికి తెలియకుండానే తయారు చేస్తారని ఎన్నోసార్లు రుజువైంది. అందువల్ల మెజిస్ట్రేట్ దగ్గర ఇచ్చిన ఒప్పుకోలు ప్రకటనను మాత్రమే గుర్తించాలని నిబంధన ఉంది. కాని కింది కోర్టు పోలీసులు ఇచ్చిన అఫ్జల్ ఒప్పుకోలు పత్రం మీద సంపూర్ణ నమ్మకం ఉంచి, నేరం చేశాడని నమ్మి మరణ శిక్ష విధించింది. ఇక పై కోర్టులో మౌలిక సాక్ష్యాధారాల విచారణ ఉండదు గనుక, కింది కోర్టు వాదనల మీద వాదనలే ఉంటాయి గనుక హైకోర్టు ఆ శిక్షను ఖరారు చేసింది. సుప్రీంకోర్టు తీర్పులో ఆ ఒప్పుకోలు పత్రాన్ని అంగీకరించనక్కర లేదని సరిగానే గుర్తించారు. అఫ్జల్ తీవ్రవాద సంస్థ సభ్యుడని పోలీసులు చెప్పిన మాటకు ఆధారం లేదన్నారు. హతుడైన నేరస్తుడికి ఇల్లు, కారు సమకూర్చిన సందర్భ సాక్ష్యం (సర్కమ్ స్టాన్షియల్ ఎవిడెన్స్) తప్ప అఫ్జల్ మీద ఇతర ఆధారాలు లేవన్నారు. మామూలుగా సందర్భ సాక్ష్యాన్ని బట్టి శిక్ష విధించరు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ (అనుమాన ప్రమాణం) కింద వదిలేస్తారు. కాని అసాధారణంగా 'జాతి మనోభావాలను సంతృప్తి పరచడానికి' అఫ్జల్ గురుకు మరణ శిక్ష విధిస్తున్నానని న్యాయమూర్తి రాశాడు. ఇంత అన్యాయంగా, అబద్ధంగా తయారయిన కేసు, దుర్మార్గంగా సాగిన విచారణ, అమానుషంగా విధించిన మరణశిక్షలతో ఒక మనిషిని ఉరితీస్తే, చూస్తున్న మనమందరం మౌనంగా ఉన్నామంటే ఈ దేశానికీ, సమాజానికీ ఏమవుతున్నట్టు? వీ

బాలచంద్రుని మృతదేహం అడుగుతున్న ప్రశ్నలు

నాలుగు సంవత్సరాల కింద శ్రీలంక సింహళ జాతీయోన్మాద ప్రభుత్వం అక్కడి తమిళ జాతి పోరాటాన్ని నెత్తురుటేర్లలో ముంచి, జాతి హననం సాగించింది. భయంకరమైన యుద్ధ నేరాలకు పాల్పడింది. అప్పుడు ఆ ప్రభుత్వాన్ని విమర్శించినవాళ్లను కొందరు విజ్ఞులు 'మరి ఎల్‌టిటిఇ చేసిన నేరాల సంగతేమిటి' అని ప్రశ్నించారు. ఒక ప్రజా ఉద్యమ సంస్థ, ప్రజాశ్రేయస్సు లక్ష్యంగా పనిచేసే సంస్థ చేసేది హింస అనో, ఆ హింస పెద్ద ఎత్తున ఉన్నదనో అనుకోవడానికి ఎవరికైనా హక్కు ఉంది. కాని ఆ హింస ఎంత పెద్దదయినా రాజ్యం జరిపే హింసతో పోల్చదగినది కాదు. అందువల్లనే తమిళ ఈలం ఉద్యమ కారుల లక్ష్యాలతోనూ, ప్రభాకరన్ అనుసరించిన పోరాట వ్యూహాలతోనూ సమ్మతి లేనివారు కూడ మహింద రాజపక్షె హింసోన్మాదం గురించి వివరాలు బైటపెడుతున్నారు. ఖండిస్తున్నారు. ఇంత దుర్మార్గమైన రాజ్య బీభత్సం జరిగి పోనివ్వవచ్చునా అని ప్రపంచ ప్రజలను ప్రశ్నిస్తున్నారు. జాతిహననం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండిపోయిన ఐక్యరాజసమితి మీద ఒత్తిడి తేవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలలో భాగంగానే గతంలో బిబిసి చానల్ 4లో కిల్లింగ్ ఫీల్డ్స్ అనే డాక్యుమెంటరీ ప్రసారమైంది. శ్రీలంక సైన్యాలు రెడ్ క్రాస్ స్థావరాల మీద, ఆస్పత్రుల మీద నిర్విచక్షణగా బాంబులు కురిపించి వేలాది మందిని బలిగొన్నాయని, తమిళులను నో వార్ జోన్‌లకు తరలించిన శ్రీలంక సైనికులు ఆ ప్రాంతాలలో బాంబుదాడులు, పేలుళ్లు, కాల్పులు జరిపారని ఆ డాక్యుమెంటరీ కళ్లకు కట్టినట్టు చూపింది. అప్పటికీ ఎల్‌టిటిఇ చేసిన ఘోరాల వల్ల రాజ్య బీభత్సాన్ని సమర్థించవచ్చునని వాదించినవాళ్లున్నారు. లేదా శ్రీలంక సింహళ జాతీయోన్మాదం గురించి సామ్రాజ్యవాద దేశాలు, ప్రచార సాధనాలు చెపుతున్నాయి గనుక దాన్ని నమ్మనక్కరలేదని, నమ్మినా ఒక మూడో ప్రపంచ దేశ ప్రభుత్వంగా శ్రీలంక ప్రభుత్వాన్ని సమర్థించాలని అన్నవాళ్లున్నారు. వాళ్లకు జవాబుగా కాదు గాని, శ్రీలంక సైన్యాల దుర్మార్గ హత్యాకాండ గురించి మరికొన్ని నిజాలను వెలికితీస్తూ అదే ఛానల్ 4 లో కాలమ్ మెక్రే తీసిన 'శ్రీలంకాస్ కిల్లింగ్ ఫీల్డ్స్: వార్ క్రైమ్స్ అన్ పనిష్డ్' అనే మరో డాక్యుమెంటరీని ఇటీవల ప్రసారం చేసింది. దానిలో ఇంతకాలమూ శ్రీలంక సైన్యాలు చెపుతున్నట్టు ప్రభాకరన్ కొడుకు బాలచంద్రన్ ఎదురుకాల్పులలో చనిపోలేదని నిస్సందేహమైన రుజువు దొరికింది. ఆ పన్నెండేళ్ల ముక్కుపచ్చలారని పిల్లవాణ్ని శ్రీలంక సైనికులు సజీవంగా పట్టుకున్నారు. ఒక బల్ల మీద కూచోబెట్టారు. బిస్కెట్ కూడ తినిపించారు. మరుక్షణం నేరుగా గుండెలో తూటాలు దించి చంపేశారు. ఇప్పుడు ఈ దుర్మార్గపు ఫొటోలు చూసి హాహాకారాలు చేస్తున్న అమెరికా ప్రభుత్వం, భారత ప్రభుత్వం, తమిళ రాజకీయ నాయకులు అందరివీ బాలచంద్రన్ నెత్తురంటిన చేతులే. శ్రీలంక ప్రభుత్వ యుద్ధనేరాలను సమర్థించినవారిని ఇవాళ బాలచంద్రన్ మృతదేహం ప్రశ్నిస్తున్నది. అతనేమీ యుద్ధం చేయలేదే, అతనేమీ సాయుధుడు కాడే, అతను కనీసం యవ్వనంలోనే ప్రవేశించలేదే. నిష్టాగరిష్టుడైన బౌద్ధుడు మహింద రాజపక్షె ఆ అమాయక బాలచంద్రుడిని ఎందుకు బలి తీసుకున్నట్టు? వీ

❖ 'సీమ' మాటేమిటి? (మరికొన్ని వ్యాసాలు) - రాయలసీమ విద్యావంతుల వేదిక - 39 పేజీలు, 1/8 డెమీ రు. 10, ప్రతులకు: రాయలసీమ విద్యావంతుల వేదిక, 87/106, శ్రీలక్ష్మీనగర్, బి.క్యాంప్, కర్నూలు-518002



❖ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో అమరుడైన డా. కోట్నీస్ - షెంగ్ గ్జియాన్, లూజిషాన్, జాంగ్ చాంగ్‌మన్‌ల సహాయంతో, చైనీస్ మూలం ఇంగ్లిష్ అనువాదం: జాంహ్‌షెన్, తెలుగు అనువాదం: గుండా సత్యనారాయణ రెడ్డి, పోరునేల, 154 పేజీలు, 1/8 డెమీ, రు : 100, ప్రతులకు : రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు



❖ మార్క్స్ 'కాపిటల్' అధ్యయనానికి.. (సంకలనం) - లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ - 52 పేజీలు, 1/8 డెమీ, రు: 20, ప్రతులకు: విశాలాంధ్ర; ప్రజాశక్తి; మైత్రి; దిశ; సహచర; నవయుగ; మణి బుక్‌స్టాల్స్

❖ గాయపడ్డ అక్షరం (కవిత్వం) - కుంచే నాగసత్యనారాయణ - 68 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: కె. నాగ సత్యనారాయణ, గవర్నమెంట్ హైస్కూల్, కపిలేశ్వరపురం, తూర్పు గోదావరి - 533 309



❖ వీరవనం - దీర్ఘ కవిత - వడ్డెబోయిన శ్రీనివాస్ 24 పేజీలు, 1/8 డెమీ, రు.10, ప్రతులకు: వడ్డెబోయిన శ్రీనివాస్, 25-4-115/2, రహమత్‌నగర్, కాజీపేట - 506 003, వరంగల్



❖ వొల్లెడ - దీర్ఘ కవిత - వనపట్ల సుబ్బయ్య - 72 పేజీలు, 1/8 డెమీ, రు.30, ప్రతులకు: వనపట్ల సుబ్బయ్య, 18-37, సంజయ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ - 509 209, తెలంగాణ రాష్ట్రం

❖ రైతు నానీలు - మేరెడ్డి యాదగిరి రెడ్డి - యువ రచయితల సమితి - 46 పేజీలు, 1/8 డెమీ, రు: 40, ప్రతులకు: మేరెడ్డి యాదగిరి రెడ్డి, ప్లాట్ నెం. 51, అలకాపురి కాలనీ, మిర్యాలగూడ రోడ్, నల్లగొండ - 508 001; సెల్: 9949415796

❖ గొల్ల-కురుమల సంస్కృతి - గొప్ప సంస్కృతి - డా. ప్రభంజన్ యాదవ్ - ప్రభంజనపథం పబ్లికేషన్స్ - 64 పేజీలు, 1/8 డెమీ, రు: 50, ప్రతులకు: ప్రభంజనపథం పబ్లికేషన్స్, సత్యశోధక విద్యాపీఠం, గూడూరు (గ్రా), పాలకుర్తి (మం), వరంగల్ - 506 252; తెలంగాణ; అన్ని ప్రముఖ పుస్తక షాపుల్లో

❖ రాంగ్ వే - ఎం.ఎం. ప్రాణ్‌రావ్ - 150 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : ఎస్.ఎం. ప్రాణ్‌రావ్, 9-14/1, రవీంద్ర కాలనీ, హబ్సిగూడ, హైదరాబాద్ - 500 007; విశాలాంధ్ర; ప్రజాశక్తి; నవోదయ, అన్ని ప్రముఖ పుస్తక షాపులలో

❖ అగాధం - ఆస్కార్ వైల్డ్స్ డి ప్రొఫండీస్, తెలుగు: అశ్విని. కె - మిసిమి ప్రచురణలు - 75 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు: మిసిమి పబ్లికేషన్స్, కళాజ్యోతి ప్రాసెస్ ప్రై.లి. 1-1-605, ఆర్టీసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్ - 500020; ఫోన్: 040-27645536

❖ జూన్ 15, 1983-సంతాపకీయాలు- కూర్పు: సింగంపల్లి అశోక్‌కుమార్ - శ్రీశ్రీ సాహిత్య నిధి - 87 పేజీలు, 1/8 డెమీ, రు : 45, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతినగర్, విజయవాడ - 520004, ఫోన్:0866-6617375, సెల్: 9246277375 ఇమెయిల్: srisri_sahityanidhi@yahoo.com



❖ గురజాడ జీవితంలో బౌద్ధం - (చారిత్రాత్మక గురజాడ లేఖకు వందేళ్ళు) - టి. రవిచంద్ - బుద్ధపూర్ణిమ ప్రచురణ మిళింద ప్రచురణలు - 8 పేజీలు, 1/8 డెమీ, రు : 1, ప్రతులకు : టి. రవిచంద్, హెచ్.నెం. 11-5-4, నాళంవారి వీధి, బాపట్ల - 522101; సెల్: 9966134406

❖ మేఘమందిరం - కవిత్వం - పల్లాపు రాము - కృష్ణవంశీ క్రియేషన్స్ - 75 పేజీలు, 1/8 డెమీ, రు : 100, ప్రతులకు : పల్లాపు రాము, 25-3-1972, 'ఎ' బ్లాక్, 7వ వీధి, ప్రగతి నగర్, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు - 524004; సెల్: 9440462279

❖ మనసు పలికే - కథలు - భీమరాజు వెంకటరమణ - పాలపిట్ట బుక్స్ - 107 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ - 500 036. ఇమెయిల్: palapittabooks@gmail.com



❖ ప్రపంచీకరణతో మారిన పల్లెలు - దామరపల్లి నర్సింహ్మారెడ్డి - హారిక పబ్లికేషన్స్, 73 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు : డి. నర్సింహ్మారెడ్డి, ప్లాట్ నెం. 35, జర్నలిస్ట్ కాలనీ, దమ్మాయిగూడ, ఫోస్ట్-నాగారం, హైదరాబాద్ - 500083; విశాలాంధ్ర; ప్రజాశక్తి; దిశా; సహచర

❖ కాళోజీ నా గొడవ - కవితలు - కాళోజీ ఫౌండేషన్ - 430 పేజీలు, 1/4 క్రౌన్, రు. 400, ప్రతులకు : కాళోజీ ఫౌండేషన్, ప్లాట్ నెం. 268, ఎక్సైజ్ కాలనీ, హన్మకొండ, వరంగల్లు - 506 001

తెలంగాణ కోసం సమర దీక్ష

హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ దగ్గర తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జనవరి 27, 28 తేదీలలో 36 గంటల సమర దీక్ష రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి (జెఎసి) ఆధ్వర్యంలో జరిగింది. వేలాదిగా ప్రజలు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, కళాకారులు ఈ దీక్షలో పాల్గొన్నారు. వివిధ జెఎసి సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొని ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి.

ఆదివాసీ గ్రామంపై పోలీసుల దాడి

ఖమ్మం జిల్లా చర్ల మండలం కొండెవాయి గ్రామవాసులు మావోయిస్టులకు సహకరిస్తున్నారనే నెపంతో పోలీసులు ఫిబ్రవరి 7న ఈ గ్రామంలోకి చొరబడి కనిపించిన వారినల్లా చితక బాది, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించి, ఇండ్లల్లో సామాగ్రిని ధ్వంసంచేసి తొమ్మిది మందిని అరెస్టు చేశారు. అరెస్టును అడ్డుకున్న మహిళలపై చేయి చేసుకున్నారు.

థర్మల్ కేంద్రాన్ని వ్యతిరేకించిన ప్రజలు

తూర్పుగోదవరి జిల్లా రంగంపేట మండలంలోని జి.దొంతమూరు, బిక్కవోలు మండలంలోని బలభద్రపురం గ్రామాల సరిహద్దులో 100 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టును స్థాపించడానికి ఫిబ్రవరి 6న కె.పి.ఆర్. ఇండస్ట్రీ సంస్థ ప్రజాభిప్రాయాన్ని చేపట్టగా ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించి నిరసనను తెలియజేశారు.

కె.ఎస్. రమణ మృతి

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులు, కవి, కథా రచయిత, సాహిత్య విమర్శకులు డా. కనకసభా రమణ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 4న ఉదయం గుండెపోటుతో మరణించారు. రాయలసీమ తొలితరం కథకుడు, కె.సభా కొడుకుగా, చలం రమణాశ్రమంలో బాల్యం గడిపిన రమణ చిత్తూరు జిల్లా యువ కవుల బృందం 'నిశి కవుల'లో ఒకరిగా సాహిత్య జీవితం ప్రారంభించారు. చలం మ్యూజింగ్స్‌పై పిఎచ్‌డి చేశారు. రెండు కవితా సంకలనాలు, ఒక కథా సంకలనం ప్రచురించారు.

నాగోబా జాతర

నాగోబా జాతర ఫిబ్రవరి 9న ప్రారంభమై, 14న ముగిసింది. ఈ జాతర తెలంగాణలో అతిపురాతన కాలం నుంచి జరుగుతుంది. నాగోబా దేవాలయం ఆదిలాబాద్ జిల్లా, ఇంద్ర మండలం కెస్లాపూర్‌లో ఉంది. ఈ జాతరలో గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి దర్బారు ఏర్పాటు చేస్తారు. ఈ దర్బారును 1946లో లండన్‌కు చెందిన మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్ ప్రారంభించాడు. ఇప్పుడు దేవాదాయ శాఖవారు ఈ దర్బారు నిర్వహిస్తున్నారు.

అకాల వర్షాలకు 17 మంది మృతి

రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వలన 17 మంది మరణించారు. 857 ఇళ్లు దెబ్బ తిన్నాయి. 6.23 లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగిందని వ్యవసాయ, ఉద్యావన శాఖలు ప్రాథమిక అంచనా వేశాయి.

మరో ఫైనాన్స్ మోసం

ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ సెక్యూర్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ మార్కెటింగ్ సర్వీసెస్ (సిమ్స్) మూడున్నర ఏళ్లలో రు. 500 కోట్లకు పైగా దోపిడీ చేసింది. అధిక వడ్డీకి ఆశపడి లక్షలు డిపాజిట్ చేసిన ఉత్తరాంధ్ర ప్రజలు అధిక వడ్డీకి మోసపోయారు. ఈ ఫైనాన్స్ కంపెనీ వెనుక బడా రాజకీయ నాయకుల హస్తం ఉందని ఆరోపణలు వెలువడుతున్నాయి.

జన విజ్ఞాన వేదిక రజతోత్సవాలు

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 16, 17 తేదీలలో జన విజ్ఞాన వేదిక (జెవివి) రజతోత్సవాలను జరుపుకుంది. ఈ సభలకు ముఖ్య అతిథిగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి హాజరైనారు. ప్రజల్లో కంటే రాజకీయ నాయకుల్లోనే ఎక్కువ మూఢ విశ్వాసాలు ఉన్నాయని, ఈ మూఢత్వాన్ని పెంచుతున్నది రాజకీయ నాయకులేనని ఆయన చెప్పారు. ఈ సభల్లో ఎం.ఎల్.సి.వి. బాల సుబ్రహ్మణ్యం, కె. సత్యప్రసాద్, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ అధ్యక్షుడు డి. రఘునందన్ పాల్గొన్నారు.

జూడాల సమ్మెపై నిషేధం పొడిగింపు

జూనియర్ డాక్టర్ల అత్యవసర సర్వీసులు నిలిపివేస్తూ సమ్మె చేయడంపై నిషేధాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రత్నకిషోర్ ఫిబ్రవరి 16న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిషేధం జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లు, పి.జి.వైద్యులు, సీనియర్ రెసిడెంట్లకు వర్తిస్తుంది.

తెలంగాణలో మరో మూడు పవర్ ప్రాజెక్టులు

తెలంగాణంలో అదనంగా మరో మూడు విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు ప్రభుత్వ రంగ సంస్థ ఎ.పి. జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్నాయి. వీటిలో రామగుండం వద్ద 1320 మెగావాట్లు, భూపాలపల్లి వద్ద 800 మెగావాట్లు, కెటిపిస్ వద్ద 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు స్థాపించను. మొత్తంగా 2920 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ పవర్ ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఈ ఏడాది చివరి(డిసెంబర్) నాటికి ప్రారంభకానున్నాయి.

హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు

ఫిబ్రవరి 21న హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో రెండు చోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి. ఈ పేలుళ్లో 16 మంది మరణించగా, 120 మందికి పైగా గాయాలైనాయి. ఈ పేలుళ్లు సాయంత్రం జనం రద్దీగా ఉన్న సమయంలో జరగడంతో జన నష్టం ఎక్కువగా సంభవించింది. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, ముఖ్యమంత్రి క్షతగాత్రులను పరామర్శించారు. మృతులకు ఆరు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

కొన'సాగుతున్న' పాదయాత్రలు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'మీ కోసం వస్తున్నా' పాదయాత్ర ఫిబ్రవరి 25 నాటికి (146 రోజులు) 2119.3 కిలోమీటర్లకు చేరింది. అలాగే జగన్ సోదరి షర్మిల 'మరో ప్రజా ప్రస్థానం' యాత్ర ఫిబ్రవరి 25 నాటికి (74 రోజులు) 1046.8 కిలోమీటర్లు ప్రయాణించింది. ఈ ఇద్దరి యాత్రలు అధికారం కోసమే తప్ప ప్రజల సమస్యలను తెలుసుకోనేందుకు కాదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

డివైఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) 13వ రాష్ట్ర మహాసభ ఫిబ్రవరి 25న మెదక్ జిల్లా సంగారెడ్డిలో జరిగింది. మహాసభను ప్రారంభిస్తూ ఎంఎల్‌సి డా. నాగేశ్వర్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనీ, యువతకు నైపుణ్యం, విద్య, ఆరోగ్యం కోసం డివైఎఫ్‌ఐ పోరాడాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు ఎం.బి. రాజేష్, సీఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు చుక్క రాములు తదితరులు మాట్లాడారు.

దిగజారుతున్న దేశ పరిస్థితి

పాలకవర్గాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల ప్రజల జీవన స్థితిగతులు నానాటికీ దిగజారిపోతున్నాయనీ, ఇలాగే కొనసాగితే దేశం తిరిగి వలస పాలనలోకి మారి పోతుందనీఅంటున్నారు **వి. హనుమంతరావు**

స్వాతంత్ర్య పూర్వస్థితికి దేశం దిగజారుతోందా? అవును, దిగజారుతోంది. రెండవ స్వాతంత్ర్య పోరాటం సాగించాలని తరచుగా వినిపిస్తున్న పిలుపే అందుకు ఒక నిదర్శనం. తెల్లదొరలు పోయి నల్లదొరలొచ్చారనే అభిప్రాయం తరచుగా వినపడుతుండడం రెండో నిదర్శనం. తెల్లదొరలు ప్రవేశపెట్టిన చట్టాలే (ఉదాహరణకు: భూసేకరణ చట్టం) ఈ నాటికీ అమలు పరుస్తుండడం మూడో నిదర్శనం. దేశ సహజ వనరులను కొల్లగొట్టుక పోతుండే పరిస్థితి నేడు కొనసాగుతుండడం నాలుగో నిదర్శనం. తెల్లదొరల ప్రత్యక్ష పరిపాలన అంతరించింది కాని మన ఆర్థిక పరిస్థితిపై వారి ఉడుంపట్టు మరింత బిగుస్తోందని ఆచరణలో కనిపిస్తుండడం అయిదో నిదర్శనం. బ్రిటిష్ పాలనలో పుట్టి పెరిగి, నేటికీ బతికి ఉన్న వయస్సు మీరిన వారు 'అవే మంచి రోజులు' అని అంటుండడం వింటున్నాం. గ్రామీణ జీవితం వైపు దృష్టి సారిస్తే అప్పుడు గ్రామీణ ప్రజల ప్రాథమిక అవసరాలు అన్ని గ్రామాల్లోనే లభ్యమవుతుండేవి. ఇప్పుడు ఆ అవసరాలకు దగ్గరగా ఉన్న పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. నా చిన్నప్పుడు (1930 పూర్వార్థకాలం) మా ఊరిలో సబ్బు బిళ్ల కావాలంటే, గంట ప్రయాణం పట్టే దూరంలో ఉన్న పట్టణానికి వెళ్లి తెచ్చుకోనేవారు. స్త్రీలయితే సున్నిపిండి, కుంకుడుకాయ రసంతో స్నానాలు చేస్తుండేవారు. ఒక రకమైన స్వయం పోషకత్వం గ్రామాల్లో కనిపించేది. చేతి వృత్తుల వారు గ్రామీణుల అవసరాలన్నీ తీర్చేవారు. పేదరికం అప్పుడు ఉంది, ఇప్పుడు పెరిగింది. అయితే అపుడున్న కరువు కాటకాల తీవ్రత తగ్గింది కాని ఇంకా చూరు పట్టుకొని వేలాడుతూనే ఉంది. పేదరికం అప్పుడూ ఉంది. ఇప్పుడూ ఉంది; కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్నాళ్లూ ఉంటుంది. ఓట్లు పడాలంటే పేదరికం కొనసాగాలి.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అప్పట్లో సోవియట్ యూనియన్ పరిణామాలతో ప్రభావితుడైన ప్రధాని నెహ్రూ కొన్ని ప్రజానుకూల నిర్ణయాలకు, దేశాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామాలవైపు దృష్టి కేంద్రీకరించమని గాంధీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించకపోయినా, వ్యవసాయ రంగానికి ఉపయోగపడే కొన్ని ప్రాథమిక చర్యలు (ఉదాహరణకు: పూనా వ్యవసాయ పరిశోధనా కేంద్రం, సేంద్రీయ ఎరువుల కర్మాగారం వగైరా) తీసుకొన్నారంటే, ఆహార ధాన్యాల దిగుమతుల మీద ఆధారపడుతున్న దేశాన్ని స్వయం పోషకత్వం వైపు తీసుకొని వెళ్లాలనే లక్ష్యంతోనే జరిగింది. అయితే దేశాన్ని పారిశ్రామికవంతం చేస్తేనే గాని నిరుద్యోగ సమస్య పరిష్కారం కాదనేది ఆయన గట్టి అభిప్రాయం. కాని అప్పట్లో ఆనాటి పారిశ్రామికవేత్తల వద్ద భారీ పరిశ్రమలు పెట్టగలిగే స్తోమత లేదు. టెక్నాలజీ మొదలే లేదు. అది వాళ్లకూ తెలుసు. అందుచేతనే స్వాతంత్ర్యం రాకముందే బొంబాయిలో వారంతా సమావేశమై ప్రభుత్వమే పరిశ్రమలు నెలకొల్పాలని కోరుతూ తీర్మానించారు. ఇప్పటి పారిశ్రామికవేత్తలు ప్రభుత్వరంగంలో ఉన్న పరిశ్రమలను హాంఫట్ అంటూ మింగేయాలని చూస్తున్నారు. ప్రభుత్వం వద్ద నిధుల్లేవు; పారిశ్రామికవేత్తలు కూర్చొంటే లేవలేని పరిస్థితి. కాగా విదేశాల వైపు దృష్టి సారించాల్సి వచ్చింది. యంత్రాల దిగుమతి, యంత్రాల తయారీకి కావాల్సిన ఉక్కు మీద కేంద్రీకరణ జరిగింది. అప్పట్లో అమెరికా, సోవియట్ యూనియన్‌లు మాత్రమే ఈ సహాయాన్ని అందచేయగలిగే స్థితిలో ఉన్నాయి. అమెరికాది వ్యాపార దృష్టి, సోవియట్‌ది సహాయ దృష్టి. భారతదేశం లాంటి అధిక జనాభాగల దేశాన్ని తన ఉత్పత్తులకు మార్కెట్‌గా వినియోగించుకోవాలనేది ఆ దేశాల లక్ష్యం. సోవియట్ యూనియన్‌కు కూడా అలాంటి దృష్టి లేకపోలేదు. అయితే, సహాయం చేసి, భారతదేశాన్ని ఒక మిత్ర రాజ్యంగా మలచుకోవాలని, సోషలిస్టు సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయాలనేది సోవియట్ ఆలోచన. ఒక ఉదాహరణ, మన దేశంలో చమురు నిక్షేపాలున్నాయో లేదో కనుక్కోమని అమెరికాను కోరితే, చమురు ఉన్నదని చెబితే, తమ తమ ఆధీనంలో చమురు నిల్వలున్న దేశాల నుంచి భారతదేశానికి ఎగుమతి చేసి లాభాలు దండుకొందామనే దురుద్దేశంతో అక్కడక్కడ తవ్వకాలు జరిపి, మీ దేశంలో అలాంటి నిల్వల్లేవని చెప్పగా, సోవియట్ యూనియన్ నిపుణులు అస్సాంలో నిల్వలున్నాయని చెప్పడమే కాక దేశంలో మొట్టమొదటి ఉక్కు కర్మాగారాన్ని భిలాయిలో నిర్మించి పెట్టింది. పారిశ్రామికంగా చిన్న చిన్న అడుగులు వేయడం ప్రారంభమైంది.

ఈ పరిణామ క్రమంలో చోటు చేసుకొన్న మరొక ముఖ్య సంఘటన బ్యాంకుల జాతీయీకరణ. కాంగ్రెస్ పార్టీలో ఇందిరా గాంధీకి, మొరార్జీ దేశాయ్‌కు మధ్య పార్టీ మీద ఎవరు పట్టు సాధించాలో అనే విషయంలో వివాదం చెలరేగింది. ప్రభుత్వరంగంలో పరిశ్రమల ఏర్పాటును కమ్యూనిస్టులు, ఇతర వామపక్షాలు స్వాగతించడాన్ని గమనించిన ఇందిరాగాంధీ ఆ పరిస్థితిని తనకనుకూలంగా వినియోగించుకోవాలనుకొంది. అదే సమయంలో అధిక దిగుబడి వంగడాలు దేశంలోకి వచ్చాయి. వాటిని ఉపయోగించుకొని అధిక దిగుబడిని సాధించాలని ధనిక రైతాంగం భావించింది. కాని అందుకు కావాల్సిన పెట్టుబడులు వారి వద్ద లేవు. (అప్పట్లో ఎకరానికి పది బస్తాలు పండేవి). కాగా బ్యాంకులను జాతీయం చేస్తే ఇటు వామపక్షాలు, అటు రైతాంగం హర్షిస్తుంది. మితవాద పక్ష నాయకుడు మొరార్జీని దెబ్బతీయవచ్చు. ఇక్కడ ఒక చిన్న కథ వినిపిస్తా. ఆ రోజుల్లో నేను యుఎన్ఐ వార్తా సంస్థలో పనిచేస్తున్నా, అర్ధరాత్రి అవుతుండగా ఒక ఫోన్‌కాల్ వచ్చింది. ఒక స్పెషల్ విమానం వచ్చింది అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. నాలోని విలేకరి మేల్కొన్నాడు. ఏదో వార్త ఉంది అనేంత వరకే నా తలకాయ

పనిచేసింది కాని అంతకుమించి ఏ ఆలోచనా రాలేదు. ఢిల్లీలోని మా సంస్థ కేంద్ర కార్యాలయానికి ఫోన్ చేసి మీ ప్రయత్నం మీరు చేయండని చెప్పా. తెల్లవారి పత్రికల్లో బ్యాంకులు జాతీయం చేసిన వార్త వచ్చింది. విషయమేమంటే అప్పుడు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉన్నారు. ఆయన సంతకం కోసం ఒక ప్రత్యేక అధికారి ప్రత్యేక విమానంలో వచ్చాడన్న మాట. అటు ఫోన్‌కాల్, ఇటు రాష్ట్రపతి హైదరాబాద్‌లో ఉన్న రెండు పరిణామాలను లింక్ చేసి ఉంటే ఒక సంచలన వార్త మిస్ అయి ఉండే వాడిని కాదు. ఇందిరాగాంధీ పాచిక పారింది. ఇది కేవలం రాజకీయ ఎత్తుగడ మాత్రమే. అంతవరకూ ప్రైవేట్ రంగంలో నిల్వల మీద అధికారం ప్రభుత్వానికి దక్కింది. తానొక అభివృద్ధి కాముకురాలు అనే కీర్తి సంపాదించుకుంది. అదే సమయంలో 20 సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఓట్ల వర్షం కురిసింది. ఆ తర్వాత డిక్టేటర్‌గా వ్యవహరించింది. దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన విషయం ఇక్కడ అప్రస్తుతం. అదే ప్రైవేట్ రంగాన్ని మీరు ప్రైవేట్ బ్యాంకులను ప్రారంభించుకోవచ్చునని అదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇవాళ ఎర్ర తివాచీ పరిచి ఆహ్వానిస్తోంది. బోర్డు తిప్పేయడంలో ఆ పార్టీకి ఆ పార్టీయే సాటి.

బ్యాంకు శాఖలు పెద్ద ఎత్తున విస్తరించాయి. అదే స్థాయిలో రుణాలివ్వడం జరిగింది. అంతవరకూ వ్యవసాయానికి ప్రైవేట్ రంగంలో ఉన్న బ్యాంకులు ఇస్తూ వచ్చిన రుణం మొత్తం 0.9 శాతం (సుమారు రు. 75 కోట్లు మాత్రమే) (1951-52). జిడిపిలో వ్యవసాయం వాటా 55 శాతం ఉన్నా వ్యవసాయానికి ఎంగిలి చేయి విదల్చడమే జరిగింది. సహజంగానే వ్యవసాయదారులు 24.9 శాతం వడ్డీ వ్యాపారస్తుల మీద ఆధారపడాల్సి వచ్చింది. డిసెంబర్ 1950 గణాంకాల ప్రకారం మొత్తం రుణంలో 32 శాతం పరిశ్రమలకు ఇస్తే, వ్యవసాయానికి కేవలం 2.3 శాతం మాత్రమే.

జాతీయం చేసిన తర్వాత 1991 నాటికి బ్యాంకు శాఖల సంఖ్య 1969లో 8262 నుంచి 1991 నాటికి 68,355కు, 2012 నాటికి 99,894కు పెరిగాయి. ఈ గణాంకాలు బ్యాంకు శాఖల విస్తరణను చూపిస్తున్నాయి గానీ 1991లో సంస్కరణల తర్వాత శాఖల విస్తరణ రేటు తగ్గుతూ రావడం, పట్టణాల్లో, నగరాల్లో పెరుగుతూ రావడం జరిగింది. ఇలా తగ్గుతూ రావడం ఇందిరాగాంధీ కొడుకు రాజీవ్‌గాంధీ ప్రధాని కావడం తర్వాతనే అనేది గమనించాల్సిన విషయం. '21వ శతాబ్దంలోకి' అనే నినాదంతో బ్యాంకుల దృష్టి ప్రధానంగా నగరాల వైపు మళ్లింది. గ్రామీణ శాఖల విస్తరణ వేగం తగ్గుతూ వచ్చింది. ప్రపంచ బ్యాంకుకు భారత ప్రభుత్వం పాదాక్రాంతం కావడమే దీనికి ప్రధాన కారణం. సంస్కరణలు ప్రవేశపెట్టిన కాలంతో పోల్చి చూస్తే, గ్రామీణ ప్రాంతంలో విస్తరణ వేగం తగ్గింది. అయితే ఇక్కడి రెండు ముఖ్య పరిణామాల గురించి చెప్పుకోవాలి. కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు వ్యవసాయరంగంలో దూసుకొని వెళ్లడం, ప్రభుత్వం అమలు పరుస్తున్న అనేక ప్రజానురంజక పథకాల ద్వారా పేదలకు అందచేసే ఆర్థిక సహాయం బ్యాంకుల ద్వారా చెల్లించడం ఈ రెండు పరిణామాలు గ్రామీణ బ్యాంకు శాఖల విస్తరణకు దారి తీయవచ్చు. శాఖలు విస్తరించవచ్చు గాని, బ్యాంకుల్లో పనిచేసే వారి సంఖ్య పెంచకపోతే, ప్రస్తుతం పనిచేస్తున్న వారి మీద పనిభారం పెరిగి నిరసనలకు, సమ్మెలకు ఆస్కారం ఏర్పడుతుంది. కొత్తగా ప్రారంభించిన బ్యాంకు కరస్పాండెంట్ల వ్యవస్థ రైతు కంటిని తుడవడానికే గాని పెరిగిన, పెరగనున్న పని భారాన్ని తగ్గించలేదు. ఆధార్ కార్డుల పంపకం అస్తవ్యస్తంగా ఉంది. కార్డు లేనిదే బ్యాంకులో ఎకౌంటు ప్రారంభించడమే కష్టం. ఈ పథకం ప్రకారం దేశంలో ఉన్న జనాభా యావన్మందికి ఆధార్ కార్డులుండాలి.

తాజా పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. చిల్లర వర్తకంలో విదేశీ పెట్టుబడులకు, విదేశీ బ్యాంకులు మన దేశంలో శాఖలు తెరవడానికి జరుగుతున్న ప్రయత్నం, దేశంలో కార్పొరేట్లు ప్రైవేట్ రంగంలో కొత్తగా బ్యాంకులు తెరవడానికి అనుమతి ఇవ్వాలనే 0ప్రతిపాదన బ్యాంకింగ్ రంగాన్ని సామాన్యులకు దూరం చేయడమే. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే 1) పారిశ్రామికవేత్తలను ప్రైవేట్ రంగం ఆకర్షించడంతో, వారి అవసరాలను ఆ బ్యాంకుల ద్వారా తీర్చుకోవడం ప్రారంభిస్తే, ఇంత వరకూ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఉన్న వారి ఖాతాలు ఈ ప్రైవేట్ బ్యాంకులకు మళ్లుతాయి లేదా రెండు రంగాల్లో ఉన్న బ్యాంకుల నుంచి కూడా వారి అవసరాలను తీర్చుకొంటారు. దీనితో ప్రభుత్వరంగ బ్యాంకుల వ్యాపారం తగ్గుతుంది. కార్పొరేట్ రంగం వ్యవసాయం వైపు దృష్టి సారించింది కాబట్టి, అక్కడ పెట్టే పెట్టుబడులను జిల్లా, గ్రామీణ బ్యాంకుల నుంచి సంపాదించుకుంటారు. ఈ పరిణామాలు ప్రభుత్వరంగ క్షీణతకు దారితీస్తాయి. ఈ పరిణామాన్ని సహజంగానే వ్యతిరేకిస్తారు. ఫిబ్రవరి 20,21న జరిగిన రెండు రోజుల సమ్మె ఈ పరిణామాలను నిలుపుదల చేయడానికే ఉద్దేశించింది. ప్రస్తుతం ప్రభుత్వరంగంలో జరుగుతున్న వ్యాపారం ప్రైవేట్ బ్యాంకులకు మళ్లితే, ఉద్యోగులను ఇంటికి పంపించే పరిస్థితి ఏర్పడవచ్చు. ఇటు ప్రభుత్వం, అటు ప్రైవేట్ రంగాల మధ్య పోటీ ఏర్పడుతుంది. మొత్తం ప్రభుత్వరంగమే, బ్యాంకింగ్ వ్యవస్థే తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది. ఇప్పుడు జరిగిన సమ్మె ప్రభుత్వానికి ఒక రెడ్ సిగ్నల్. ఉద్యోగులకు కూడా బ్యాంకులు స్వాతంత్ర్యానికి పూర్వ స్థితికి చేరుకోనున్నాయి. అప్పుడు, భూగర్భంలో ఉన్న ఖనిజాలు బ్రిటిష్ పాలకులు దోచుకపోయే వారు. ఇప్పుడు ప్రభుత్వమే గిరిజనులను వెళ్లగొట్టి, ఖనిజ సంపదను తీసుకొని వెళ్లడానికి ఆహ్వానిస్తోంది. లక్షల మంది బీదా బిక్కి జనానికి, ఇటు గ్రామీణ, అటు మధ్యతరగతి ప్రజలకు వారి నిత్యావసర సరుకులు దుకాణాలలోనే లభించేవి. లేదా దుకాణదారులే ఇంటికి పంపేవారు. నెలకొకసారి డబ్బు తీసుకొనేవారు. వ్యవసాయ కూలీలకు నా చిన్నప్పుడు రెండణాలు లేదా నాలుగణాలు పొలాల్లో పనిచేసేందుకు కూలీ ఇచ్చేవారు. అందులో ఒక అణా ఇస్తే ఆరోజు వంటకు కావాల్సిన పచారి సరుకులిచ్చేవారు. అందరూ కలిసి పాటలు పాడుకుంటూ ఇళ్లకు వెళ్లేవారు. ఇప్పుడు బహుళజాతి సంస్థలు గ్రామాల్లో జొరబడి కొన్ని సరుకులను రూపాయి, రెండు రూపాయిల పాకెట్లలో అమ్మకం ప్రారంభించి గ్రామంలోని చిల్లర దుకాణదారులను దెబ్బతీస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రు. 200లు ఇస్తే, పప్పు, ఉప్పు, చింతపండు వగైరా సరుకులన్నీ పాకెట్‌లో అందిస్తామని పథకం ప్రవేశపెడతాదట. కుటుంబానికి నెల అంతటికీ సరిపోయే బియ్యాన్ని నెలకొకసారే రేషన్ షాపులో కొనుక్కోవడానికి డబ్బులుండవు కాని, ఈ పాకెట్లు రెండు వందలకు కొనుక్కోవడానికి డబ్బేది? మరి పేదవాడికి ఆ పూట ఎలా గడుస్తుందా అని కిందా మీదా పడుతుంటే, వాళ్లు రెండొందలు పెట్టి కొనుక్కోగలరా? మధ్యతరగతుల వారు జీతాలొచ్చిన తర్వాత డబ్బిస్తాం అంటే వాల్‌మార్ట్ సంస్థ ఆ అవకాశాన్నిస్తుందా? అప్పుడు బియ్యం

ఆర్థిక పతనం - ఎఫ్‌డిఐల పాత్ర

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు బహుళజాతి సంస్థలకూ, కార్పొరేట్ శక్తులకూ మాత్రమే లాభాలు చేకూరుస్తాయనీ, వాటి వల్ల దేశ ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదనీ అంటున్నారు డా. శ్రీనివాసరావు చొప్పర

ఉపాధిని, సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తిశక్తులను అభివృద్ధి పరిచేందుకూ, అంతర్జాతీయ ఆర్థిక మందగమనం నుంచి దేశాన్ని రక్షించేందుకే చిల్లర వర్తకం, విమానయానం, సమాచార ప్రసార రంగాల్లో విదేశీ ప్రత్యక్ష్య పెట్టుబడులను (ఎఫ్‌డిఐలను) ఆహ్వానించామని ప్రధాని ప్రకటించారు. నాడు అద్వానీ 'ఇండియా వెలిగిపోతుంది' అంటే, నేడు మన ఆర్థిక మంత్రి చిదంబరం 'ఆల్ ఈజ్ వెల్' అంటూ దేశ దేశాల్లో రోడ్‌షోలు చేస్తూ విదేశీ పెట్టుబడులకు ఎర్రతివాచీ పరుస్తున్నాడు. పెట్టుబడుల అనుమతుల మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటుచేసి బహుళజాతి సంస్థల పాదసేవలో ప్రభుత్వం తరిస్తుండగా, మేము సైతం అంటూ పాలక పక్షాలన్ని ప్రత్యక్షంగా కొన్ని, పరోక్షంగా మరికొన్ని టోకుగా అమ్ముడుపోయి తమ నైజాన్ని చాటుకోవడానికి ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాలు చక్కని వేదికలయ్యాయి. చావు తప్పి కన్ను లొట్ట పోయిందన్న చందంగా ప్రభుత్వం చిల్లర వర్తకంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల బిల్లును 2012 సెప్టెంబర్ 12న ఆమోదింపచేసుకుంది. దీనితో అమెరికాలోని వాల్‌మార్ట్ ఆనందంతో పొంగిపోయింది. కాని అదే రోజు అమెరికాలోని న్యూయార్క్ నగరం నుంచి వాల్‌మార్ట్‌ను తరిమివేశారు. జపాన్ రానివ్వలేదు. జర్మనీ తరిమేసింది. అమెరికన్లు తమ స్వదేశీ వాల్‌మార్ట్ మాకొద్దు అని నినదిస్తుంటే మన వాళ్లు విదేశీ వాల్‌మార్ట్ కావాలంటున్నారు.

'తాడి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడమేతకు' అని అన్నాడంట, అలా తన అసలు ఉద్దేశాన్ని కప్పిపుచ్చడానికీ, అడిగిన వాడిని పక్కమార్గం పట్టించడానికీ చేపడుతున్న మోసపూరిత ఎత్తుగడల సమాధానాన్నే విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడంపై ప్రభుత్వం చెబుతోంది. తాను ఆహ్వానిస్తున్న విదేశీ పెట్టుబడుల వలన ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని చెప్పి వాస్తవంలో దేశానికి జరిగే నష్టాన్నీ, సామ్రాజ్యవాదులకు తాను చేస్తున్న పాదసేవ నుండి దేశ ప్రజలను పక్కదోవ పట్టించాలని ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆయా రంగాలలో అనుమతించడానికి చెబుతున్న కారణాలు సరైనవేనా? వాటి ఫలితాలు ఏమిటి? అనే అంశాలను పరిశీలించే ముందు విదేశీ పెట్టుబడుల తీరుని పరిశీలిద్దాం.

భారత్‌లోని విదేశీ పెట్టుబడుల కాలాన్ని స్థూలంగా మూడుగా విభజించవచ్చు. 1947-1991 కాలాన్ని మొదటిదిగా చెప్పవచ్చు. కొంత మేరకు పటిష్టంగా ఉండిన ఎంఆర్‌టిపి, ఫెరా చట్టాల ప్రకారం విదేశీ ఈక్విటీ 40 శాతం కాగా, ఆ పరిమితిని 70 శాతంకు పెంచారు. సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉండే, ఎగుమతి ఉద్దేశంతో ఉండే, మౌలిక రంగ పరిశ్రమల్లో మాత్రమే 70 శాతం పెంచుతున్నామన్నారు. 1991-2000 కాలం రెండవదిగా చెప్పవచ్చు. నేటి ప్రధాని, నాటి ఆర్థిక మాత్యులు ప్రపంచ బ్యాంకు విధానాలనే ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రకటించినదే 1991 పారిశ్రామిక విధాన ప్రకటన. ఈ ప్రకటన ప్రకారం 35 హెచ్చు స్థాయి గల పరిశ్రమలలోని 51శాతం వరకు విదేశీ పెట్టుబడులు కేంద్ర ప్రభుత్వ, రిజర్వు బ్యాంకు అనుమతి లేకనే ఆటోమాటిక్ రూట్‌లో పొందవచ్చు అన్నారు. 1996లో ఇలాంటి పరిశ్రమల సంఖ్యను 35 నుండి 111కు పెంచారు. వాటిని 4 క్యాటగిరీల కింద విభజించి మొదటి రకం 50 శాతం వరకు, రెండవ రకం 51 శాతం వరకు, మూడవ రకం 74 శాతం వరకు, నాలుగవ రకం 100 శాతం వరకు విదేశీ ఈక్విటీని అనుమతిస్తూ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఉపాధిని పెంచుతాయని ప్రకటించారు. 2000 నుండి ఇప్పటి వరకు గల కాలాన్ని మూడవదిగా చెప్పవచ్చు. ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేసే ప్రపంచీకరణ ప్రభావాన్ని ఇది తెలియచేస్తుంది. నిర్దిష్ట జాబితా తప్ప మిగిలిన రంగాలన్నింటిలోకి ఆటోమాటిక్ మార్గంలో విదేశీ పెట్టుబడు లకు గేట్లు బార్లా తెరిచి దేశాన్ని అమ్మకానికి పెట్టిన కాలం. చాలా రంగాల నియంత్రణలను క్రమంగా తొలగించడం జరిగింది. బీమా, రక్షణ రంగాల్లో 26 శాతం అనుమతించారు. టెలికమ్యూనికేషన్స్ లో 49 శాతం నుండి 74 శాతానికి, సింగిల్ బ్రాండ్ చిల్లర వర్తకంలో 51 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించారు. అప్పుడు కూడా ఉపాధి అవకాశాలు, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన అనే పాత పాటను కొత్తగా మళ్లీ ఆలపించారు. ఇలా నాలుగు దశాబ్దాలలో మొత్తం ఆర్థిక, ఆర్థికేతర రంగాలను (రక్షణ వ్యవస్థను) విదేశీ కంపెనీలకు అప్పగించారు. మళ్లీ 20 ఏళ్ల కిందటి పరిస్థితి దాపురించిందని, మరోసారి తీవ్రమైన విధాన చర్యలు తీసుకోవలసి వచ్చిందని చెబుతూ మలి విడత సంస్కరణలతో మరింత దూకుడుగా వ్యవహరిస్తూ అరకొరగా మిగిలిన రంగాలను సైతం

బస్తా నాలుగు రూపాయలకు అమ్మిన రోజులు; ఇప్పుడు కిలో బియ్యం కూడా రావు.

ఇప్పుడు ప్రైవేటీకరణ రామనామస్మరణ అయిపోయింది. అప్పుడు ప్రతీ పనికి ప్రభుత్వమే శ్రీకారం చుట్టాల్సి వచ్చేది. అలా శ్రీకారం చుట్టి, అభివృద్ధి చేసిన తర్వాత ప్రైవేట్ రంగం ప్రవేశానికి ప్రభుత్వం దారులు తెరుస్తుంది. అప్పుడు గ్రామీణులు చేనేత బట్టలనే ధరించేవారు; ఇప్పుడు మగ్గాలు మూతపడుతున్నాయి. ఈ ధోరణులు చూస్తూంటే మేము పరిపాలించలేక పోతున్నాం, మీరే వచ్చి ఆ పని చేయాలని ప్రభుత్వం కోరుకోదు కదా?

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

ముస్తాబు చేసి అంతర్జాతీయ విపణిలో నిలబెట్టిన వైనం ఇటీవల మనం చూశాం. మల్టీబ్రాండ్ చిల్లర వర్తకంలో, బీమా, పెన్షన్ రంగాలలో విమాన యానంలో, సమాచార ప్రసార మాధ్యమంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించడం, ఉపాధి పాట పాడడం జరిగిపోయింది.

ఈ నాలుగు దశాబ్దాల కాలంలో దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయకపోగా మరింత దిగజార్చాయి. అలానే ఉపాధి అవకాశాలను హరించివేశాయి. వచ్చిన పెట్టుబడులన్నీ అనుత్పాదక, సేవా రంగాలైన ఐ.టి, టెలికమ్యూనికేషన్ రంగాలలోకి, ఆటోమొబైల్ రంగాలలోకి రాగా, మౌలిక సదుపాయాలను, ఉత్పాదక శక్తులను అభివృద్ధిపరిచే రంగాలలోకి వచ్చినవి నామ మాత్రమే. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశంలోకి వస్తున్నా 2005-06 నుండి వీటి ఒరవడి పెరిగింది. 2005-06లో 5.5 బిలియన్ల డాలర్లు రాగా, 2009-10లో 25.83 బిలియన్ డాలర్లు, 2010-11లో 19.42 బిలియన్ డాలర్లు వచ్చాయి. అంటే 2005-06 కంటే సరాసరిన 5 రెట్లు అధికంగా వచ్చాయి. 2010-11లో వచ్చిన ఎఫ్‌డిఐలు మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో 1.4 శాతంగా ఉన్నాయి. దేశం మొత్తం పెట్టుబడులలో ఎఫ్‌డిఐల వాటా 7.1 శాతం. గతం కంటే జిడిపిలో ఎఫ్‌డిఐల శాతం పెరిగింది. ప్రధానంగా 2001-02 నుండి 2005-06 వరకు బహుళజాతి సంస్థలు తమ ఎఫ్‌డిఐల ద్వారా వచ్చిన ఆదాయాన్ని తిరిగి ఇక్కడే పెట్టుబడి పెట్టాయి. కాని 2006-07 నుండి ఎఫ్‌డిఐల పై వచ్చిన ఆదాయాన్ని ఇక్కడ పెట్టుబడి పెట్టకుండా ఆ మొత్తాలను తమ దేశాలకు తరలించారు. ఫలితంగానే 2009-10, 2010-11లలో ఎఫ్‌డిఐలు స్థూలంగా తగ్గాయి. ఆ సంవత్సరాలలో ఎఫ్‌డిఐ ఇన్‌ఫ్లో జిడిపిలో వరుసగా 2.58, 1.4 శాతం ఉండగా, అవుట్‌ఫ్లో అదే జిడిపిలో వరుసగా 0.76, 1.16 శాతంగా ఉంది. కొత్త రంగాలలోకి ఎఫ్‌డిఐలు వస్తుండగా ఇప్పటికే పెట్టుబడి పెట్టిన రంగాల నుండి లాభాలను తరలించడం, దేశ సంపదను దోచుకోవడం మనం చూడవచ్చు.

2009లో విదేశీ సాంకేతిక ఒప్పంద విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సరళీకరించింది. ఇది ఎఫ్‌డిఐలను, టెక్నాలజీని మరింత ఆకర్షించ గలమని, దేశానికి ప్రయోజనమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కాని దీని వలన బహుళజాతి సంస్థలు తమ భాగస్వామ్య కంపెనీల ద్వారా రాయల్టీ ఫీజు పేరుతో కోట్ల రూపాయలు తరలించుకు పోతున్నాయి. దేశంలో బహుళజాతి సంస్థలకు రాయల్టీలు చెల్లించే 25 పెద్ద కంపెనీ లను పరిశీలిస్తే గత 5 సంవత్సరాలలో అవి చెల్లించే రాయల్టీలు రెట్టింపయ్యాయి. వాటి అమ్మకాలు కేవలం 70 శాతం మాత్రమే పెరిగాయి. ఈ 25 కంపెనీలు 2007-08 లో 1528 కోట్ల రూపాయలు రాయల్టీ చెల్లిస్తే, 2011-12లో 3635 కోట్లు చెల్లించాయి. ఈ కంపెనీలు 2012లో తమ రాబడిలో 25 శాతం రాయల్టీ కింద తమ భాగస్వామ్య బహుళజాతి సంస్థలకు చెల్లించాయి. ఉదాహరణకు, ఎన్ఇఎస్‌టిఎల్ఇ ఇండియా కంపెనీ తమ నికర లాభాలలో 30 నుండి 40 శాతం వరకు రాయల్టీ చెల్లిస్తుంది.

మరోవైపు 2011-12లో ఆర్థికవృద్ధి గత దశాబ్దంలో ఎన్నడూ లేనంత తక్కువగా కేవలం 5 శాతంతోనే ముగించబోతున్నట్లు భారత గణాంక శాఖ వెల్లడించింది. అంతేగాక పారిశ్రామిక వృద్ధి మరింత దిగజారి సమీప భవిష్యత్‌లో ఆర్థిక రంగం కోలుకుంటుందన్న ఆశలను వమ్ముచేసింది. గణాంక శాఖ వెల్లడించిన దాని ప్రకారం పారిశ్రామిక వృద్ధిరేటు 2011లో 2.7 శాతం కాగా, వర్తమాన ఆర్థిక సంవత్సరంలో అది 0.7 శాతానికి పరిమితమైంది. వ్యవసాయం మళ్లీ గాడితప్పి గత సంవత్సరపు వృద్ధి 3.85 శాతం కంటే సగానికి తగ్గి కేవలం 1.85 శాతానికి దిగజారింది. సర్వీస్‌రంగం కూడా గత ఏడాదితో పోలిస్తే 3 శాతం తగ్గి 8.6 శాతానికి చేరుతుందని అంచనా. కరెంటు ఖాతా లోటు జాతీయ ఉత్పత్తిలో 5 శాతం మించిపోతుంది. ఇంత లోటును భారతదేశం ఎప్పుడూ ఎరగదు. ఉత్పత్తి, వ్యవసాయ రంగాలతో పాటు ఈసారి సేవారంగం కూడా జిడిపి వృద్ధి దిగజారడానికి దోహదకారి అయింది.

దేశ ఆర్థిక పరిస్థితి ఇది కాగా దేశంలోకి ఎఫ్‌డిఐల రాక పెరిగితే దానికి అనుగుణంగా నూతన పరిశ్రమలు పెరిగి నూతన ఉపాధి అవకాశాలు పెరుగుతాయనడం ఎంత వరకు వాస్తవం? పెరిగిన ఎఫ్‌డిఐలు నూతన ఉపాధి అవకాశాలను పెంచలేదు. ఉన్న ఉపాధి అవకాశాలను మింగేశాయి. ఉపాధి రేటు 4.14 శాతం నుండి 1.11 శాతంకు తగ్గింది. ఈ కాలంలో ప్రైవేటురంగంలో ఉపాధి రేటు 2.73 శాతం తగ్గింది. చివరకు అసంఘటిత రంగంలో ఉపాధి పెరుగుతుందనే సంస్కరణవాదుల కొత్త ప్రచారమూ తప్పని ఆ రంగంలోని ఉపాధి అవకాశాల పరిస్థితి తెలియచేస్తుంది. మొత్తం సరుకుల ఉత్పత్తి పెరుగుతున్నా ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో నిరుద్యోగుల సంఖ్య 12 కోట్లకు చేరి 9.4 శాతం నిరుద్యోగ రేటు నమోదైంది. 'పని చేయగల జనాభా' ప్రతి సంవత్సరం అదనంగా కోటి 95 లక్షలు చేరుతుంటే ఉపాధి మాత్రం అదనంగా 25 లక్షల మందికి కంటే తక్కువగా దొరుకుతుందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. నూతనంగా శ్రామిక రంగంలోకి ప్రవేశించే వారిలో 2 శాతం మాత్రమే ఎఫ్‌డిఐలు అధికంగా ఉన్న ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో ఉపాధి దొరుకుతుంది. ఎఫ్‌డిఐలతో జరిగే ఈ తరహా అభివృద్ధి (జిడిపి) వేగం 15.2 శాతానికి చేరినా కొత్తగా ప్రతి సంవత్సరం శ్రామిక మార్కెట్‌లోకి చేరుతున్న వారికి ఉపాధి చూపడం కష్టం అని ఆర్థికవేత్తలు రుజువు చేస్తున్నారు. ఎఫ్‌డిఐలు ఉపాధిని హరిస్తాయి తప్ప అదనపు అవకాశాలను ఏ మాత్రం కల్పించవు. ఒక చిల్లర వర్తకంలోనే ప్రత్యక్ష్యంగా 4.5 కోట్ల మంది ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఉంది. వాల్‌మార్ట్, టెస్కోలు ఉద్యోగాలు తెస్తాయనేది పెద్ద బోగస్. ఇవి వెళ్లిన ప్రతి చోటా ఉద్యోగాలు తగ్గాయే కాని పెరగలేదు. అమెరికాలో 1979లో సుమారు రెండు కోట్లు ఉన్న ఉద్యోగులు 2000 నాటికి కోటి డెభై లక్షలకి, 2009 నాటికి కోటి పన్నెండు లక్షలకి తగ్గాయి. అంటే అమెరికాలోనే 32 ఏళ్లల్లో కొత్తగా ఉద్యోగాలు రాకపోగా 90లక్షల ఉద్యోగాలు తగ్గారు. ఆఫ్రికా దేశాల్లో వందలాది ఎకరాల్లో యాపిల్ పండిస్తూ అక్కడి కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లించి శ్రమ దోపిడీ చేస్తోందని టెస్కో కంపెనీ మీద కేసులు నడుస్తున్నాయి. మరో వైపు వాల్‌మార్ట్ రాకతో మరింత దివాలా తీసే పరిస్థితి వస్తోంది. అమెరికా ప్రభుత్వ లెక్కల ప్రకారమే 1950లో అమెరికా రైతులకి వినియోగదారులు ఖర్చుపెట్టే ఆహార ఖర్చులో సరాసరి 40శాతం వాటా వస్తుండగా, రిటైల్ సంస్థలు వచ్చిన తరువాత అది 23.28 శాతం మాత్రమే చెందుతుంది. థాయ్‌లాండ్, రష్యా, అర్జెంటీనా, చిలీ, హాంకాంగ్, బ్రెజిల్ మొదలైన దేశాలలో వ్యవస్థీకృత చిల్లర వర్తకంతో చిన్న దుకాణాలు గణనీయంగా మూతపడ్డాయని పలు అధ్యయనాలలో వెల్లడించారు. దీనితో నిరుద్యోగం పెరిగిపోయింది.

ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశంలోకి బదిలీ చేసే ఎఫ్‌డిఐలను మాత్రమే అనుమతిస్తామని, అవి దేశాభివృద్ధికి తోడ్పడతాయని చెప్పడం పెద్ద మోసం. బహుళజాతి సంస్థలు తాము అభివృద్ధి చేసుకున్న ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని వలస, అర్ధవలస దేశాల్లోకి తమ అవసరాలకోసం

తరలిస్తాయి. బహుళజాతి సంస్థలు మన దేశంలోకి ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని తరలించడమా? లేదా అనేది ఆ సంస్థల ప్రయోజనాలే నిర్ణయిస్తాయి తప్ప దేశ ప్రయోజనాలు ఎంత మాత్రం కాదు. తమ అవసరాల కోసం దేశంలోకి తరలించిన నూతన టెక్నాలజీపై వారిదే సర్వాధికారం. అయినా విచ్చలవిడిగా ఎఫ్‌డిఐలను అనుమతించినా, దాని వలన దేశంలోకి ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం వెల్లువలా వచ్చి పడుతుందనేది ఒట్టి భ్రమని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. దేశ సంపదను కొల్లగొట్టడానికి ఎంతకాలం అవకాశం ఉంటుందో, అంతవరకు బహుళజాతి సంస్థల టెక్నాలజీ ఇక్కడ ఉంటుంది. పరిస్థితులు మారితే ఎక్కడ లాభాలు వస్తాయనుకుంటే అక్కడికి పరిశ్రమలతో పాటు, నూతన టెక్నాలజీ కూడా తరలిపోతున్న పరిస్థితి గతం కంటే పెరిగింది. ఇటీవల కాలంలో దక్షిణకొరియా, మెక్సికోలోని బహుళజాతి సంస్థల పరిశ్రమలు చైనాకు తరలిపోవడం దానినే తెలియజేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థ స్వతంత్ర ఎదుగుదలకూ, శ్రామిక ఉపాధి అభివృద్ధికి ఉపయోగ పడకుండా, స్వదేశంలోనే ఉంటూ, బహుళజాతి సంస్థల అదుపూ, అజ్ఞలలో ఉండే 'విదేశీ సాంకేతిక పరిజ్ఞానం' జాతి వ్యతిరేకమైనది.

వందల సంవత్సరాల చరిత్ర కలిగిన స్థిరమైన ఉపాధిని, స్వయం ఉపాధిని కల్పిస్తున్న చిల్లర వర్తకంలోకి, బీమా, పింఛను రంగాలలోకి ఎఫ్‌డిఐలను అనుమతించడం ద్వారా వీళ్ళు ఆశిస్తున్న టెక్నాలజీ ఏమిటీ? టెక్నాలజీ ఏ మాత్రం అవసరం లేని రంగాలకు ఎఫ్‌డిఐ గేట్లు తెరవడంలో వీరు ఆశించింది ఉపాధినా? టెక్నాలజీనా? లేక వాల్‌మార్ట్ విసిరిన చిల్లర కొరకా? వాల్‌మార్ట్ లాబీ ముందు 4.5 కోట్ల చిల్లర వర్తకుల బతుకులు ఏ మాత్రం విలువ లేనివైనాయి. ప్రవర్ధ ఆర్థిక వ్యవస్థ నుండి లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్న వాల్‌మార్ట్ 2008 నుండి భారత్‌లో వివిధ లాబీయింగ్ కార్యకలాపాలకు (లంచాలు ఇవ్వడానికి) 25 మిలియన్ డాలర్లు అంటే సుమారు 125 కోట్ల రూపాయలు వెదజల్లింది. ఒక్క 2012లోనే చిల్లర వర్తకానికి ఆమోదం పొందిన గత పార్లమెంట్ సమావేశాల రోజుల్లోనే 30లక్షల డాలర్లు వెచ్చించింది. ఇది వాల్‌మార్ట్ స్వయంగా అమెరికన్ సెనేట్‌కు సమర్పించిన నివేదికలో ఉంది. 125 కోట్ల లాబీయింగ్‌కు జాతి యావత్తును తాకట్టు పెట్టడమే.

ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కొరకు ఎఫ్‌డిఐలను అనుమతిస్తున్నాం అనడంలోని వాస్తవం ఎంత? సామ్రాజ్యవాదుల యాజమాన్యంలోని విదేశీ పెట్టుబడులు దేశంలోని ఉత్పత్తి శక్తుల అభివృద్ధిని అడ్డుకుంటూ ఆటంకపరుస్తాయి. ఎఫ్‌డిఐలకుండే ఈ సహజ స్వభావాన్ని మరుగు పరుస్తూ ఉత్పత్తిశక్తుల అభివృద్ధికి తోడ్పడే ఎఫ్‌డిఐలను ఆహ్వానిస్తున్నామని మోసపు వాదనను చేస్తుంది మన ప్రభుత్వం. 'సమాజం సృష్టించుకున్న ఉత్పత్తి సాధనాలూ, ప్రధానంగా శ్రమ పరికరాలూ, వాటితో పాటు భౌతిక సంపదను ఉత్పత్తి చేసే ప్రజలనూ కలిపి ఉత్పత్తి శక్తులు' అంటాం. సామ్రాజ్యవాదులు 'తమకు అవసరమైన మేరకు' ఉత్పత్తి సాధనాలను (ముఖ్యంగా యంత్రాలూ, పనిముట్లూ), శ్రామికుల పని సామర్థ్యాన్ని అభివృద్ధి పరచుకుని లాభాలను పొందుతున్నారు. ఎఫ్‌డిఐల వలన దేశ సంపద తరలిపోవడమూ, ప్రజలు ఉపాధి కోల్పోతూ నిరుద్యోగం పెరిగిపోతూ ఉండడమూ, ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతూ ఉండడమూ అనే పరిస్థితులు, దేశంలోని ఉత్పత్తి శక్తులను 'ఒక పరిమితి మేరకు' తప్ప అవి ఎంతవరకు అభివృద్ధి కావడానికి అవకాశం ఉందో అంతవరకు అభివృద్ధి కాకుండా అడ్డుకుంటున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుండడం వలన, సరుకు నిల్వలు పేరుకు పోతుండడం వలన, సరుకులకు కొత్త గిరాకీ ఏర్పడకపోవడం వలనా దేశంలోని పరిశ్రమలు తమ సామర్థ్యం కంటే తక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి. వ్యవసాయరంగం సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. ఈ పరిస్థితి దేశంలోనే కాదు, సామ్రాజ్యవాద దేశాలన్నింటిలో అధికోత్పత్తి, ఉన్న సామర్థ్యం కంటే తక్కువగా ఉత్పత్తి చేయడం అనే సాధారణ పెట్టుబడిదారీ సంక్షోభం నెలకొని ఉంది. ఈ సంక్షోభంలోకి సామ్రాజ్యవాదులు అంతకంతకు కూరుకుపోతుంటే, వారు మన దేశంలో ఉత్పత్తిశక్తులను అభివృద్ధి చేస్తారని చెప్పడం దేశ ప్రజలను మోసగించడమే. నేడున్న అసమాన సంబంధాలు రద్దు కాకుండా, అవి కొనసాగినంత కాలం ఒకవేళ ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందినా (ఒక పరిమితి మేరకు అనేది గమనంలో ఉంచుకోవాలి) సరుకుల రాశి పెరుగుతుంది, అంతేగాని స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ గానీ, దేశ ఆంతరంగిక మార్కెట్ గానీ అభివృద్ధి చెందవు.

ఆర్థిక అసమానతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. రెండు దశాబ్దాల ఆర్థిక సంస్కరణలు భారత్‌లో పేదరికాన్ని తగ్గించకపోగా మలివిడత సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఉపాధి కల్పించని అభివృద్ధి, ఆహారం ఇవ్వని వృద్ధి మన ఆర్థిక విధానాలు సాధించిన ఫలితాలు. పేదరికంలో ఉన్న వారి ఆకలి తీర్చడంలో 'భారత ఆర్థికాభివృద్ధి' విఫలం అయ్యిందని అంతర్జాతీయ ఆహార విధానాల పరిశోధన సంస్థ 2012 లో రూపొందించిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్ వెల్లడించింది. భారత్ తలసరి ఆదాయం దాదాపు రెట్టింపు స్థాయికి పెరిగిన కాలంలో, మూడింట రెండొంతుల మంది ఆకలితో అలమటిస్తున్నారని ఆ నివేదిక తెల్పింది. విదేశీ పెట్టుబడుల ద్వారా ఏ దేశ ఆర్థిక వ్యవస్థా బలోపేతమైనట్లు చరిత్రలో లేదు. చరిత్రలోకి వెళ్లితే మలబార్ రాజు (కేరళ ప్రాంతం) ఇతర రాజ్యాలతో యుద్ధాల కొరకు విదేశాల నుండి అశ్వాలను (గుర్రాలను) దిగుమతి చేసుకొనేవారు. అలా ప్రతి సంవత్సరం వాటి దిగుమతి అయ్యేవి. అయితే అశ్వాలను పెంచే నైపుణ్యం ఉండే అశ్వ పెంపక నిపుణులను మాత్రం ఇక్కడకు పంపేవారు కాదు. కారణం వాళ్లను పంపితే గుర్రాల ఉత్పత్తి, పునరుత్పత్తి, వాటి రక్షణ అంతా ఇక్కడే జరిగిపోతుంది. ఇక మన మీద ఆధార పడకుండా, వాటిని దిగుమతి చేసుకోరు, వ్యాపారం దెబ్బతింటుంది అనే దానితో ఆ నిపుణులను, ఆ పరిజ్ఞానాన్ని అందించేవారు కాదు. ఫలితంగా ఖజానా ఖాళీ కావడం తప్ప మిగిలింది శూన్యం. ఇక్కడ, వాళ్లు వ్యాపార నీతిని ప్రదర్శించారు. అది వ్యాపార సంస్థల నైజం. కాగా ఆ రాజు కూడా దీర్ఘ దృష్టితో రాజ్యం స్వయం పోషకత్వం గూర్చి ఆలోచించకుండా తన తాత్కాలిక ప్రయోజనాలకే పరిమితం కావడం జరిగింది. ఇటు రాజుగాని, అటు విదేశీయులు కాని తమ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలను కాపాడలేదు. ఇది చరిత్ర నేర్పిన పాఠం. ఎఫ్‌డిఐల ద్వారా దేశంలో ప్రవేశిస్తున్న బహుళజాతి సంస్థలు ఇందుకు భిన్నంగా వ్యవహరించవు. 'సామ్రాజ్యవాద పెట్టుబడి' ఒకసారి దేశంలోకి ప్రవేశించిందంటే అది దేశాన్ని దోచుకుంటుంది. పరాధీనతలోకి, బానిసత్వంలోకి నెడుతుంది. దాని ఫలితమే నేడు భారత ఆర్థిక వ్యవస్థ గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కోవడం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తాయి. అందుకే దేశ ప్రజల ప్రయోజనాలు కాపాడే స్వతంత్ర ఆర్థిక వ్యవస్థ రూపొందాలి.

(రచయిత లెక్చరర్, జవహర్‌భారతి డిగ్రీ కాలేజీ, కావలి) ✓

చిల్లర వర్తకం - అమెరికా అనుభవం

ఎఫ్‌డిఐలను దేశంలోకి ఆహ్వానిస్తే జరిగే పరిణామాలనూ, ప్రజలకు జరిగే నష్టాలనూ వివరిస్తూ, దీనిని అమలు చేస్తున్న అమెరికా ఎఫ్‌డిఐల వల్ల ఎట్లా నష్టపోయిందో చారిత్రక వివరణలతో చెబుతున్నారు ఎన్‌విఎస్ నాగభూషణ్

ఒక వ్యాపార కులంలో సంబంధాలు వెతికేప్పుడు, చిల్లరకొట్టు వ్యాపారుల పట్ల చిన్నచూపు చూపిస్తారుగాని, ఇప్పుడు చిల్లరే శ్రీ మహాలక్ష్మి అని అందరికీ తెలిసొచ్చింది. నిజానికి చిల్లరకొట్టు పాడికుండ లాంటిది. కాకుంటే ఈ కొట్లు పెట్టుకోవడానికి వాల్‌మార్ట్ లాంటి బడా కంపెనీ 125 కోట్లు కేవలం లంచాలకే ఎందుకు ఖర్చు చేస్తుంది? ఏమైనా ఈ చిల్లర బిల్లు గెలిపించుకోవడానికి పార్లమెంట్‌లో తమకు మెజారిటీ లేదని తెలిసినా ప్రభుత్వం వివిధ రాజకీయ పక్షాలతో ఎన్నో చిల్లర బేరాలు కుదుర్చుకోవాల్సి వచ్చింది కదా! బిల్లును వ్యతిరేకిస్తామని గప్పాలు కొట్టిన రకరకాల పక్షాలు చివరికి ఎలాంటి చిల్లర సాకులు చెప్పిందీ పార్లమెంట్ సాక్షిగా ప్రజలంతా గమనించారు. దేశంలోనే అత్యున్నతమైన పార్లమెంట్‌లోని సభ్యులే ఇలాంటి చిల్లర బుద్ధులు ప్రదర్శిస్తే, ప్రజలకు ఏది దారి?

వట్టిగొడ్డునైనా అందాలు వర్ణిస్తే, సంతలో ఎగరేసుకు పోతారు. ఈ బిల్లును గెలిపించుకోవడానికి ప్రధాని దీన్ని ఎంతగా వర్ణించారంటే, వాటిలో ముచ్చటగా మూడింటిని చూద్దాం. 1) లక్షలాది ఉద్యోగాలు; 2) రైతాంగానికి గిట్టుబాటు ధర; 3) స్థిరమైన విదేశీ పెట్టుబడులు. ఇవి ఎంతవరకు నిజమో చూద్దాం.

సాధారణంగా చిల్లర కొట్లు ఒక మధ్యస్థంగా ఉండే పల్లెటూళ్లో నాలుగైదు ఉంటే, పట్నంలోనయితే నలభై, యాభై దాకా ఉంటాయి. పల్లెలోని దుకాణంలో యజమానితో కలిపి పనివారు ఐదుగురనుకుంటే, పట్టణం మొత్తంలో రెండు వందల నుంచి రెండు వందల యాభై దాకా పనిచేస్తారనుకోవచ్చు. అదే వాల్‌మార్ట్ దుకాణాలొస్తే పట్టణంలో నాలుగైదుంటాయి. ఒక్కో దుకాణంలో ఇరవై మంది ఉంటారనుకున్నా మొత్తం పట్టణంలో వంద మందికి మించరు. చిల్లర కొట్ల జీతాలతో పోలిస్తే వీరి జీతాలు ఎక్కువే ఉంటాయి. మొదట్లో ఈ దుకాణాలు పెట్టినప్పుడు వీటి ప్రభావం అంతగా తెలియకున్నా, వీరి మోనోపలీ మొదలయ్యాక, చిల్లర దుకాణాలు ఎత్తేసుకోవాల్సిందే. అప్పుడు వీటిలో పనిచేసే గుమాస్తాలు నిరుద్యోగులై, అంతంత మాత్రపు చదువు సంధ్య వాళ్లు గనుక ఏ దినసరికూలీలుగానే బతకాల్సి రావచ్చు. కనుక ఈ దుకాణాల్లో విదేశీ పెట్టుబడుల వల్ల నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందే తప్ప తరగదు. ఇప్పటికే సూపర్ మార్కెట్ల ప్రభావం వల్ల, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చిల్లర దుకాణాలు పెరగడం లేదన్నది గమనిస్తే, పరిస్థితి మనకర్థం అవుతుంది. అయితే నేడు కుప్పలుతెప్పలుగా ఉత్పత్తి అవుతున్న ఇంజనీర్లు, ఎంసిఎలు, ఎంబిఎలు రాబోయే వాల్‌మార్ట్ దుకాణాల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ (సేల్స్‌మాన్‌ల ఆకర్షణీయమైన మారుపేరు)లుగా కాస్త హెచ్చు జీతాలపై కుదురుకుంటే, అంతగా చదువురాని గుమాస్తాలు దినసరి కూలీలుగా మారతారు.

ఇక రైతాంగానికి గిట్టుబాటు ధర గురించి చూస్తే, ఇప్పటికే పంజాబ్ లాంటి అభివృద్ధి చెందిన వ్యవసాయదారులు కార్పొరేట్ వలలో పడి గిలగిలకొట్టుకుంటున్న విషయం విదితమే. ఒప్పందాలు కుదుర్చుకున్న తొలి సంవత్సరాల్లో ఆకర్షణీయమైన ధరే ఇస్తారు. వీరి వలలో చిక్కగానే కనిపిస్తాయి చుక్కలు! వారెంత రేటు నిర్ణయించినా, ఏ పంట సాగు చేయమన్నా, ఏ ఎరువులు వాడమన్నా - అన్నీ వారు చెప్పినట్లే తలవంచు కొని చేయాలి. అంటే శ్రమ మనది, పొలం మనది, పంట మాత్రం వారిది. లాభాలు వారివి. ఇక రైతాంగానికి వేరే ప్రత్యామ్నాయం ఉండదు.

ఇక పెట్టుబడుల గురించి. పెట్టుబడులు వస్తాయి నిజమే. ఇవి స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లా అస్థిర పెట్టుబడులు నిజమే. అయితే ఈ పెట్టుబడులు వచ్చి చేసే పనేమిటి? దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు, దేశంలోని సామాన్య ప్రజలకు చేరువలో ఉండే చిల్లర వ్యాపారాన్ని తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు, రైతాంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకునేందుకు, ప్రజావసరాలకు ఉపయోగపడే పంటలను కాక, తమ లాభాలకు ఉపయోగపడే పంటలను పండించేందుకు భూమి ఉపయోగ పడేలా నియంత్రించేందుకు ఈ పెట్టుబడులు ఉపయోగపడతాయి. అందువల్ల వీటివల్ల అన్ని విధాలా నష్టమే తప్ప, లాభం లేదు. అంతేకాదు, ఈ పెట్టుబడులపై ప్రభుత్వాలకు నియంత్రణ కూడ ఉండదన్నది గమనించాలి. ఇలాంటి పెట్టుబడుల్ని ఆహ్వానించిన ప్రపంచంలోని పలు దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. అంతెందుకు, ఇలాంటి పెట్టుబడుల్ని ప్రోత్సహించిన అమెరికాయే స్వయంగా నష్టపోయిన చరిత్ర. ఈ చారిత్రక నగ్నసత్యాన్ని తన అద్భుత రాజకీయ నవల 'ఉక్కుపాదం' ద్వారా సామాన్య పాఠకులక్కూడా అర్థమయ్యేలా రాశాడు ప్రసిద్ధ అమెరికా సోషలిస్టు రచయిత జాక్‌లండన్. వందేళ్ల కిందటే రాయబడ్డ ఈ నవలలో చిల్లర వర్తకుల పాలిట కార్పొరేట్లు, బహుళజాతి గొలుసుకట్టు సంస్థలు ట్రస్టులూ ఎలా విలన్‌లుగా తయారయిందీ తెలిపే ఒక చర్చను గురించి తెలుసు కుందాం.

ఈ చర్చ నవల నాయకుడూ, కార్మిక నాయకుడూ అయిన ఎర్నెస్ట్ ఎవర్‌హార్డ్ అనే యువ మేధావి, చిల్లర వర్తకం చేసే కొంతమంది వర్తకులకూ మధ్య జరిగింది. సందర్భం: ఎర్నెస్ట్ సోషలిస్టుల తరఫున పోటీ చేస్తున్న ఎన్నికల ప్రచారం సందర్భంగా. విందు ఇచ్చిన వారు సోషలిస్టులంటే అభిమానంగల ప్రొఫెసర్ కన్నింగ్‌హామ్. ఈ విందుకు ఎర్నెస్ట్ పెట్టిన పేరు 'యంత్ర విధ్వంసకుల విందు'. ఈ విందులో పాల్గొన్న వ్యాపారస్తులు ఎవరికీ పెట్టుబడి రెండు లక్షల డాలర్లు దాటదు. వీరిలో కిరాణా కొట్ల బ్రాంచీలనేకం గల సిల్వర్‌బర్గ్, ఓవెన్ అండ్ కంపెనీకి చెందిన ఓవెన్, కోవాల్ట్ వాష్‌బర్న్ అనే మందుల దుకాణ భాగస్వాములిద్దరూ, గ్రానైట్ గని యజమాని ఆస్మెన్‌సెన్, ఇంకా ఇటువంటి వారు. వీరిద్దరి అభియోగం ఏమంటే, పెద్ద కార్పొరేషన్లూ, ట్రస్టులూ దోపిడీకి మూలం కాబట్టి, వాటిని ధ్వంసం చేయాలని, రైల్వేలు, టెలిగ్రాఫ్‌లు వంటి పెద్ద ట్రస్టులని (అవి ఆనాడు ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో నడిచేవి) గవర్నమెంట్ తీసుకోవాలని, ఎక్కువ ఆదాయాన్ని బట్టి ఎక్కువ శాతం ఆదాయ పన్ను విధించడం ద్వారా పెద్ద పెట్టుబడిదారుల డబ్బు నిలువల్ని కరిగించాలని, అలాగే ప్రజావసరాలైన నీరు, గ్యాస్, టెలిఫోన్, రవాణా సౌకర్యాల్ని మునిసిపాలిటీలు

ఆధీనం తీసుకోవడం ద్వారా స్థానిక ఆర్థిక మాంద్యాన్ని నివారించవచ్చునని వీరి వాదన. వారంత తమ సమస్యలు చెప్పాక, ఎర్నెస్ట్ వారిని కొన్ని ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టాడు.

కిరాణా కొట్ల బ్రాంచీలనేకంగల ఓవెన్‌ను ప్రశ్నించాడు ఎర్నెస్ట్. 'మీరీ ఊళ్లో ఆర్నెల్ల కిందట కిరాణా కొట్టు బ్రాంచీ తెరవగానే, పక్కనున్న మూడు కిరాణా షాపులు మూతపడ్డాయి. అందుక్కారణం మీకొట్టే కదూ?' జవాబుగా ఓవెన్ చిరునవ్వుతో 'అవును, అవి మాతో పోటీకెక్కడ నిలుస్తాయి? మా పెట్టుబడి ఎక్కువ. పెద్ద వ్యాపారంలో వృథా తక్కువ ఉంటుంది. మేం వాళ్లకన్నా ఎక్కువ సమర్థంగా పనిచేస్తాం' అన్నాడు. 'అయితే ఆ మూడు చిన్న కొట్ల లాభాన్నీ మీరు కాజేశారన్న మాట. అయితే ఆ ముగ్గురు చిన్న వ్యాపారాలు ఇప్పుడేమయ్యారు?' అని ఎర్నెస్ట్ ప్రశ్నకు, ఒకడు మా వ్యాగన్ డ్రైవర్‌గా ఉన్నాడు. మిగతా వారేమయ్యారో తెలీదు' అన్నాడు ఓవెన్.

అలాగే మిగిలిన అందరి నుంచీ ఒకే లాంటి సమాధానాలు రాబట్టాక అన్నాడు ఎర్నెస్ట్ 'అంటేమిటి. ఇతరుల నుంచి లాభాలు లాగాలని గానీ, మీ నుంచి ఇతరులు లాగడానికి అనుమతించకూడదు. అవునా? అప్పుడు వారంతా' ఔను. అది దోపిడీగా మారనంత కాలం ఎవరూ లాభాలు చేసుకున్నా అభ్యంతరం లేదు' అన్నారు.

'దోపిడీ అంటే ఏమిటి? బాహాటంగా విపరీతంగా లాభం చేసుకోవడం! కానీ ఇలాంటి లాభం మీరు తీసుకోవడానికి మాత్రం మీకేమీ అభ్యంతరం లేదనుకుంటాను?' అని ఎర్నెస్ట్ అనేసరికి, అస్మన్‌సేన్ సిగ్గపడుతూ ఒప్పుకున్నాడు.

కొద్దికాలం కిందటిదాకా పాడి వ్యాపారం చేసిన కాల్విన్ అనే అతన్ని 'పాల ట్రస్టును వ్యతిరేకించిన మీరు 'గ్రాంజీ' పార్టీ రాజకీయాల్లోకి ఎలా దిగారు?' అని ఎర్నెస్ట్ ప్రశ్నించాడు. (రైతుల్ని సంఘటితపరిచి, ఓ రాజకీయ పార్టీలా తయారు చేసి, ట్రస్టులు, కార్పొరేషన్ల మొనాపలీని శాసనబద్ధంగా అంతం చేయాలని 'గ్రాంజీ' పార్టీ కోరింది.)

'మేం పోరాటాన్ని విరమించలేదు. ట్రస్టులతో రాజకీయంగా పోరాడుతాం. మేం చేసే వ్యాపారాల్లో పోటీ వల్ల లాభం కొంత తగ్గినప్పటికీ, మా ఇష్ట ప్రకారం మా వ్యాపారం సాగించాం. అప్పుడు పాల ట్రస్ట్ నుంచి వాళ్ల ఏజెంట్ వచ్చి తమలో చేరితే లాభాలు పొంద వచ్చునని, లేకుంటే నష్టపోతారని చెప్పాడు. చేరని వాళ్లు నిజంగానే నష్టపోయారు. చేరిన వారికి మొదట మంచి రేటిచ్చారు గానీ, ఆ తర్వాత పాల ధర పెంచినా మాకేమీ ఇవ్వలేదు. మా ఫిర్యాదులెవ్వరూ పట్టించు కోలేదు. చివరికి మేం బొమ్మల మాదిరి అయ్యాం. అలా పాల వ్యాపారులు అదృశ్యం కాగా, పాల ట్రస్ట్ మాత్రం మిగిలింది' అన్నాడు కాల్విన్.

'వారు పెంచిన పాల రేటుని మీరు కూడా పెంచి, ట్రస్టుతో పోటీ పడొచ్చుకదా?' అని ఎర్నెస్ట్ ప్రశ్నిస్తే, మొదట అలాగే ప్రయత్నించామని, అయితే తాము పాలను నష్టాలకు అమ్మినప్పుడు, ట్రస్ట్ తమకన్నా తక్కువ రేటుకి అమ్మి కూడా కొద్దిపాటి లాభం చేసుకుందని, అలా తమలాంటి వారెందరో దివాళా తీసి, అసలు వ్యాపారం నుంచే తప్పుకోవలసి వచ్చిందనీ చెప్పాడు కాల్విన్.

'అంటే ట్రస్ట్ మీ లాభాలన్నింటినీ లాగేసుకుందన్న మాట! కనుకనే మీరు చట్టబద్ధంగా ట్రస్టుల్ని నిషేధించి తిరిగి పూర్వంలా లాభాల్ని పొందడానికి రాజకీయాల్లోకి వచ్చారన్న మాట!' అని ఎర్నెస్ట్ అనగానే, కాల్విన్ మొహం వెలిగిపోయింది. 'నేను సరిగ్గా మా పార్టీ సభ్యులకు ఇదే చెపుతాను. మా పార్టీ లక్ష్యమే ఇది' అన్నాడతను.

'మీరేం చెప్పినా, ట్రస్ట్ మాత్రం మీ కన్నా చవగ్గా పాలను అమ్మ గలుగుతుంది' ఎర్నెస్ట్ అనేసరికి, 'ఎందుకమ్మ లేదు?' 'బ్రహ్మాండమైన పెట్టుబడితో, ఆధునిక మెషిన్లతో పనిచేస్తే, ఎవరైనా అమ్మ గలరు' అంటూ కాల్విన్ ట్రస్టుల్ని నాశనం చేద్దాం' అనేదొక్కటే తమ నినాదమన్నాడు. అప్పుడక్కడున్న వర్తకులంతా ఆ నినాదాన్ని ఏకకంఠంతో తిరిగి పలికారు.

'పాపం వీళ్ల దృష్టి బాగానే ఉంది గానీ, ఎక్కువ దూరం చూడలేరు. వీళ్ల స్వార్థ ప్రయోజనాలు వీరికి మరేమీ కనిపించనివ్వకుండా చేస్తున్నాయి' అన్నాడు ఎర్నెస్ట్ తనను ప్రేమించిన ప్రొఫెసర్ గారమ్మాయి ఏవిల్‌తో. వీరు పాత పద్ధతుల్లోనే వ్యాపారాలు చేసి లాభాలు గడించడానికి వీలుగా ట్రస్టుల్ని నిషేధించాలంటున్నారనీ, ఇలాంటి వారిని 'యంత్ర విధ్వంసకులు' అనడం సమంజసమనీ అంటూ 18వ శతాబ్దంలో ఇంగ్లండ్‌లో చేతిమగ్గాలతో గుడ్డలు నేసే జనం, ఆ తర్వాత వచ్చిన ఆవిరి యంత్రాల పోటీకి తట్టుకోలేక ఆ ఫ్యాక్టరీల్లోనే కూలీ పనికి వెళ్లారనీ అన్నాడు. అయితే వీరికి పోటీగా చిన్న పిల్లలు కూడా వచ్చి తక్కువ కూలీకే పని చేయసాగే సరికి, నిరుద్యోగ సమస్య ఎదురైందనీ, చివరికి తిండి కరువై, ఈ అనర్థానికంతటికీ యంత్రాలే కారణం కాబట్టి, వాటిని ధ్వంసం చెయ్యాలనుకున్నారనీ, కానీ పోలీసు యంత్రాంగం వల్ల ఆ పని చేయలేక పోయారనీ చెప్పాడు. నాటి ఆ చేనేత కార్మికుల్లాగానే, ఇప్పుడు చిల్లర వ్యాపారులు కూడా ఒకటిన్నర శతాబ్దం తర్వాత అలాగే చేద్దామను కుంటున్నారని అన్నాడు. తర్వాత వర్తకులతో 'మీరు దోచుకున్నప్పుడు ఆ బాధ మీకు తెలియలేదు. ఇప్పుడు మాత్రం సమాన స్వేచ్ఛావకాశాలు కావాలనుకుంటున్నారు. 'స్వేచ్ఛ' అంటే మీ ఉద్దేశం ఇతరులని దోచుకునే స్వేచ్ఛ. కనుక మీరొకసారి ఆత్మపరిశీలన చేసుకోవడం మంచిది' అన్నాడు.

అతని మాటలకు వారందరి మొహాలూ కోపంతో, భయంతో ఎరుపెక్కాయి. అయితే అతని వాదనా పటిమ వారిని ఆశ్చర్యంలో ముంచింది. 'మీరు నిజమే చెప్పారు. మనలో మనం నిజాయితీగా మాట్లాడుకుందాం. మా లాభాలు మాకు దక్కాలంటే ట్రస్టుల్ని ధ్వంసం చేయక తప్పదు' అన్నాడు కాల్విన్

'ఇప్పుడు అసలు విషయానికొచ్చాం' అంటూ ఎర్నెస్ట్ తన వాదాన్ని కొనసాగించాడు. 'ఆర్థిక ప్రవాహం ముందుకే తప్ప వెనక్కి ప్రవహించదు. అలా ప్రవహింప చేయాలనుకోవడం మూర్ఖత్వం. ఉత్పత్తి తక్కువగా ఉన్న ఆ కాలంలో చిన్న పెట్టుబడిదారులు ఒకరితో ఒకరు పోటీపడి ఆర్థిక అరాచకాన్ని సృష్టించారు. ఉత్పత్తి ధరలు అధికంగా ఉన్న ఆ రోజులు మళ్లీ రావు. చిన్న పెట్టుబడిదారుల రోజులు చెల్లిపోయాయి. అతి బలహీనంగా ఉన్న ఆది మానవుడు ఆ తర్వాత సంఘటిత శక్తితో క్రూరమృగాలను వేటాడాడు. వైయక్తిక శక్తికీ, సంఘటిత శక్తికీ జరిగిన శతాబ్దాల పోరాటంలో వ్యక్తులెప్పుడూ ఓడిపోతూనే ఉన్నారు' అన్నాడు. అప్పుడు కాల్విన్ 'పోటీ ఫలితంగానే కదా ట్రస్ట్ ఏర్పడింది!' అన్నాడు

'అందుకే ట్రస్టులే స్వయంగా పోటీని నాశనం చేశాయి. అందుకే మీరీనాడు పాడి వ్యాపారంలో లేరు' అని ఎర్నెస్ట్ అనేసరికి, హాల్లో ఉన్న అందరితోపాటు కాల్విన్ కూడా నవ్వును ఆపుకోలేకపోయాడు.

అప్పుడు ఎర్నెస్ట్ చేతి మగ్గం కన్నా మరమగ్గం అధిక ఉత్పత్తి చేస్తుంటే, తిరిగి చేతి మగ్గం కావాలనడం ఎంత మూర్ఖత్వమో, అలాగే ఇప్పుడు అధిక ఉత్పత్తిని చేసే ఆధునిక యంత్రాల్ని ధ్వంసం చెయ్యాలనడం కూడ అంతే మూర్ఖత్వమనీ, ఇప్పుడు చేయాల్సింది ఈ ఆధునిక యంత్రాల్ని కంట్రోల్ చేయడమనీ, అందుకోసం ప్రస్తుత యజమానుల్ని తరిమికొట్టి మనందరం కలిసి వాటిని నడిపిద్దామనీ, అదే సోషలిజమనీ చెప్పాడు. అందువల్ల వారందర్నీ తమతో చేతులు కలపమని ఆ చిన్న పెట్టుబడిదారులతో ఎర్నెస్ట్ అన్నాడు. అయితే అందుకు వాళ్లు ఒప్పుకోక పోయేసరికి, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి ఎక్కువై ఎలా సామ్రాజ్య వాదానికి దారితీస్తుందో, అప్పుడు బలహీన దేశాలూ ఎలా పెట్టుబడిదారీ దేశాలుగా ఎదుగుతాయో వివరించి, చివరికి అంతటా ఉత్పత్తి ఇబ్బడి ముబ్బడై ఆర్థిక

బిఎచ్‌పివి ఏం కానుంది?

ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకూ, పాలకుల స్వార్థ ప్రయోజనాలకూ మధ్య బలవుతున్న బిఎచ్‌పివి కార్మికుల దైన్య స్థితిని వివరిస్తున్నారు విద్యాభూషణ్

సమర్థత, సామర్థ్యం అన్నీ పుష్కలంగా ఉన్న మన పారిశ్రామిక రంగం, ప్రగతి పథం నుండి ప్రైవేటీకరణ దిశగా మళ్లుతోంది. మన ప్రభుత్వరంగ పరిశ్రమలను మూకుమ్మడిగా సమాధి చేసేందుకై రాజకీయాలు మూకుమ్మడిగా సమాయత్తం అవుతున్నాయి. ఈ సమాధుల ఏర్పాటుకు గాను వారికి అవసరమయ్యే చందాలకే యావత్ దేశ ప్రగతిని, కార్మిక వర్గాన్ని ఫణంగా పెట్టేందుకు సైతం వెనుకాడడం లేదు. ఇందుకనుగుణంగా నిర్ణీత పథకాలనేస్తున్నారు. ప్రజలకు చెప్పే దానికి ఆచరణలో చేపడుతున్న విధానాలు పూర్తిగా విభిన్నం. దీనికి ఏ ఒక్కరు అతీతంగా లేరు. పాలకవర్గ పార్టీల ప్రధాన లక్ష్యం ప్రైవేటీకరణే. కనుక తుమ్మితే ఊడిపోయే సంకీర్ణ దశలో రోజులు దొర్లిస్తున్న అధికార పక్షం రోజుకో అవినీతి కుంభకోణంతో తలమునకలై ఉంది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే దుష్టయత్నంలో విపక్షాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తన ప్రైవేటీకరణ విధాన లక్ష్యానికి కొన్ని లక్ష్యాలను ఇది వరకే ప్రకటించింది. ఇందులో ప్రధానాంశంగా ప్రభుత్వ రంగ సంస్థలను 26 శాతానికి లేదా ఇంకా తక్కువ శాతానికి ప్రభుత్వ వాటాలను కుదించాలంటూనే అభివృద్ధి పరంగా మంచి అవకాశాలు గల ప్రభుత్వరంగ సంస్థలను పునర్నిర్మించగలమనీ కేంద్రం ప్రకటించింది. పునరుద్ధరించడానికి వీలుగా లేని ప్రభుత్వ రంగ సంస్థలను మూసి వేస్తామని, అయితే ఇక్కడ కార్మికుల ప్రయోజనా లను పూర్తిగా పరిరక్షించడం జరుగుతుందని కేంద్రం ప్రకటించింది. పరస్పర విరుద్ధ లక్ష్యాలతో కూడిన ఈ ప్రకటనతోనే ప్రభుత్వ లక్ష్య శుద్ధి, చిత్తశుద్ధి వ్యక్తం అవుతున్నా, గుర్తింపు పొందిన కార్మిక సంఘాలన్నీ ప్రభుత్వం పట్ల తమ విధేయతను ప్రకటిస్తూ, తలలూపుతూ కార్మికవర్గాన్ని బలి పెడుతున్నాయి. తమ జేబులు నింపుకుంటున్నాయి.

గడచిన ఇరవై ఏళ్ల ఆర్థిక సంస్కరణల ప్రభావంలో దేశ వ్యాప్తంగా పునరుద్ధరించిన పరిశ్రమ ఒకటి కూడ లేదు. పైగా ఉపాధి కోల్పోతా మేమోనన్న భయంతో, వేతన సవరణల అమలును సైతం వాయిదా వేసుకుంటూ తమ పరిశ్రమను తామే రక్షించుకోవాలన్న లక్ష్యంతో కార్మికులు దైన్యాన్ని అనుభవిస్తున్నారు. దీనిని అలుసుగా తీసుకొని పాలక వర్గాలు తమ చిత్తం వచ్చినట్టు కార్మికుల జీవితాలతో ఆటలాడు కుంటున్నాయి. ఇందుకు ఉదాహరణ అత్యంత లాభాలతో నడుస్తున్న బాల్కో ను ప్రభుత్వం ప్రైవేటు కంపెనీకి అమ్మేసింది. దీనిపై అనేక తర్జన భర్జనలు చేపట్టి కార్మికులు సమ్మె చేసినా ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. ఇప్పుడు ఇదే బాటలో విశాఖపట్నంలోని భారత హెవీ ప్లేట్ అండ్ వెసల్స్ (బిఎచ్‌పివి) సంస్థ ఉంది. వారి పరిస్థితులను ఒకసారి పర్యవేక్షిద్దాం.

సుమారుగా 1970వ దశకంలో ఏర్పాటు చేసిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ, అత్యంత సమర్థవంతమైన సంస్థగా సుమారు నాలుగు వేల మంది సిబ్బందితో తలమానికంగా నిల్చింది. 1980 నాటికల్లా అందమైన టౌన్ షిప్‌తో అధునాతన వైద్య విద్యా సంస్థలనూ ఏర్పర్చుకోగలిగింది. నగరంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికి ఆదర్శ ప్రాయంగా ఉండేది. విశాఖ స్టీల్ ప్లాంటుకు, హిందూస్థాన్ పెట్రోలియం సంస్థలకు ఉపకరించే ప్రెజర్ వెసల్స్ హట్-ఎక్చేంజర్స్, మల్టీలేయర్ వెసల్స్, న్యూక్లియర్స్ రియాక్టర్లు ఆక్సిజన్ నైట్రోజన్ స్టోరేజన్ స్ప్రేయర్స్‌ను తయారుచేయడంలో దేశంలోనే ప్రఖ్యాతిగాంచింది. బిఎచ్‌పివి తయారీ అంటే అంతర్జాతీయ నాణ్యతకు గీటురాయిగా నిల్చేది. దేశ వ్యాప్తంగా ఉన్న పెట్రో కెమికల్స్ ఎరువుల తయారీ సంస్థలు న్యూక్లియర్ పవర్ ప్లాంటులు బిఎచ్‌పివి వారి సేవలను అనునిత్యం వినియోగించుకునేవి.

పి.వి. నరసింహారావు నేతృత్వంలో నూతన పారిశ్రామిక విధానాల మూలంగా ఆనాడు యాజమాన్యంలో ఉన్న అధికారులు ప్రైవేటీకరణకు అనువుగా పావులను కదపనారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండతో అనధికారికంగానే చేయగలిగిందంతా చేశారు. కంపెనీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు పక్కనే ఉన్న ఆటోనగర్‌లో స్వంత అనుబంధ సంస్థలను ఏర్పర్చుకుని కంపెనీలో చేపట్టిన నిర్మాణాలను వారి వారి సంస్థలకు బదలాయిస్తూ బిఎచ్‌పివిని సమిధను చేశారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం నేత చంద్రబాబు నాయుడు హయాంలో సైతం

సంక్షోభం ఎలా ముదిరి పోతుంది అక్కడి వారందరికీ అర్థమయ్యేట్లు అతి సరళంగా వివరించి, ఇదంతా సోషలిజానికి ఎలా అనివార్యంగా దారి తీసేదీ సోదాహరణగా చెప్పాడు. అయినా లాభాలు తినడానికి అలవాటు పడ్డ ఆ చిన్న పెట్టుబడిదారులు ఎర్నెస్ట్‌తో చేతులు కలపడానికి అంగీకరించ లేదనుకోండి, అది వేరే విషయం.

కాబట్టి చిల్లర వర్తకం బిల్లు ఎలా నెగ్గిందన్నది కాదు విషయం. పైన చెప్పిన 'ఉక్కుపాదం'లో ఎర్నెస్ట్ చెప్పినట్లు ఆర్థిక ప్రవాహం ముందుకే సాగుతుంది. ఒకవేళ బిల్లు, ఈ రోజు నెగ్గకపోయింటే, రేపైనా నెగ్గక తప్పదు. అది యుపిఎ నా, ఎన్‌డిఎ నా అని కూడా కాదు. కాకుంటే రాజకీయ నాయకులు చిత్తశుద్ధిని ప్రదర్శిస్తే కొద్దిరోజులు ఆగుతుంది. అది నదికి ఆనకట్ట కట్టినట్టే, వృద్ధి మందగిస్తే, ప్రవాహం ఉధృతమై, ఆనకట్ట తెగినట్టే, ఆర్థిక ప్రవాహం ఒరవడిగా ఉంటుంది. మరో విషయం ఏమంటే ఈ విదేశీ చిల్లర వర్తకాన్ని కాదనే కొన్ని పార్టీలు కూడా, కాదంటున్నది విదేశీ కార్పొరేట్ పెట్టుబడుల్నే కానీ, స్వదేశీ కార్పొరేట్ పెట్టుబడుల్ని కాదు. అంటే దోపిడీకి ఓకె. కానీ, విదేశీనా, స్వదేశీనా అన్నదే అభిప్రాయ భేదానిక్కారణం.

ఏమైనా ఈ పాలక పార్టీలన్నిటికీ కావలసింది దేశం ఎంత వేగంగా అభివృద్ధి (అది పెట్టుబడిదారుల అభివృద్ధే గాని, ప్రజలందరి అభివృద్ధి కాదు) సాధించి, ఎంత త్వరగా మన దేశం ప్రపంచ అగ్రదేశాల్లో ఒకటిగా ఎదిగి, బడుగుదేశాలపై ఎంత త్వరగా పెత్తనం సాగిస్తుందన్నదే అసలు సమస్య. ఇందుకు ప్రధాన, ఏకైక షరతు ఏమంటే మన అభివృద్ధి గ్రాఫ్ అమెరికా ఆమోదం మేరకు సాగడం! అందుకు ఈ పార్టీలన్నీ ఏం చేసేందుకైనా సిద్ధం.

(రచయిత రిటైర్డ్ లెక్చరర్)

ఎల్&టి ని ప్రోత్సాహించడం జరిగింది. 2004లో వై.ఎస్. రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత బిహెచ్‌పివిని బిహెచ్ఇఎల్‌లో విలీనం చేయనున్నామని ప్రకటించారు. అంతకు ముందు (అధికారంలోకి రాక ముందు) ఎన్నికల ప్రచారంలో అయితే బిహెచ్‌పివిని రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టి పునరుద్ధరించనుందని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వరకు ఏ తరహా ప్రయత్నం చేపట్టలేదు. అయితే 2006 మే 20న ప్రధాని విశాఖకు వచ్చిన సందర్భంగా బిహెచ్‌పివి పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఆ తరువాత క్రమంలో ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ (ఇఐఎల్)కు చెందిన ఆర్థికాధిపతి (ఫైనాన్స్ డైరెక్టర్) ఆపరేషన్స్ డైరెక్టర్ 2006 జూన్ 2న బిహెచ్‌పివిని సందర్శించి, విలీన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందించారు. దీనికి నాటి ప్రధాని సైతం ఆమోదం తెలిపారు. బిహెచ్‌పివికి చెందిన ఉన్నత ఉద్యోగులు ఈ విలీన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ ఒక నివేదిక ఇచ్చారు. అయినప్పటికి 2008 మే 10న బిహెచ్ఇఎల్ నుంచి అధ్యయన బృందం ఒకటి వచ్చి అధ్యయనం చేసి విలీన ప్రతిపాదనలను ఖరారు చేశారు. తాము తక్షణం పునరుద్ధరణ క్రమాన్ని చేపడుతూ, రెండు సంవత్సరాల గడువులో తమ సంస్థలో విలీనం చేయనున్నామని ప్రకటించారు. ఇప్పటికీ ఐదు సంవత్సరాలు కావొస్తున్నా విలీన హామీ కార్యరూపం దాల్చలేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే.

2011, సెప్టెంబర్‌లో జరిగిన కార్మికుల యూనియన్ ఎన్నికల సందర్భంగా ఐఎన్‌టియుసి అధ్యక్షుడు సంజీవరెడ్డి తనను గెలిపిస్తే రెండు నెలల్లో బిహెచ్‌పివిని బిహెచ్ఇఎల్‌లో విలీనం చేయిస్తానని హామీ ఇచ్చి గెలుపొందారు. ఈయన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నాయకుడు కూడ. అయితే 2012 ఏప్రిల్ 9న జరిగిన కార్మికుల సర్వ సభ్య సమావేశంలో ఓ కార్మికుడు విలీనం ప్రక్రియ ఎప్పుడు? అని ప్రశ్నిస్తే 'నీవు చచ్చిన తరువాత' అని కార్మిక నేత అసహనం ప్రదర్శించారు. ఇదే నేత అధికారుల సర్వ సభ్య సమావేశంలో, మే నెలాఖరుకు విలీన ప్రక్రియ ముగియనుందని సవినయంగా ప్రకటించారు. విశాఖపట్నం నుంచి పార్లమెంటు సభ్యురాలిగా ఎంపికై, మానవ వనరుల శాఖ, కేంద్ర మంత్రిగా ఉన్న పురందేశ్వరి గారి సమ్మతంతో విలీన ప్రక్రియ మొదలు కానుందని గత సంవత్సర కాలం నుంచి చెపుతూ వస్తున్నారు. అయినా ఈనాటికి ఒక అడుగు ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో బిహెచ్‌పివి కార్మికులకు 1992 నాటి వేతన సవరణనే పదవి విరమణ చేస్తున్న కార్మికులకు వర్తింపజేస్తున్నారు. ప్రస్తుత కార్మికులకు 1997 నాటి వేతన సవరణ వేతనాలను ముందస్తు చెల్లింపులుగా (అడ్వాన్స్ పేమెంటుగా) ఇస్తున్నారు. కరువు భత్యం వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదు. 2007 నాటి వేతన సవరణను విలీనప్రక్రియ ముగిసిన నాటి నుంచే అమలు కానుందని ప్రకటిస్తున్నారు.

బిహెచ్ఇఎల్ పునరుద్ధరణ పేరిట బిహెచ్‌పివిని చేపట్టిన నాటికి బిహెచ్‌పివికి 250 కోట్ల రూపాయల అప్పు ఉందని తేల్చారు. ఈ అప్పులో 60 శాతం అంటే రు. 150 కోట్లు తీరిన తరువాత, 60 శాతం వేతన బకాయిలు (అరియర్స్) చెల్లించేందుకు అంగీకారం కుదిరింది. బిహెచ్ఇఎల్ ప్రస్తుతం ఇస్తున్న వర్క్ ఆర్డర్స్ ప్రకారం ఈ అప్పు తీరే అవకాశాలు మృగ్యం. దీనితో కార్మికులు బకాయి వేతన చెల్లింపులు జరిగేలా కనుచూపుమేరలో లేవు.

వాస్తవంగా బకాయిలాపడ్డ ఏదేని పరిశ్రమ ఇంక ఆరోగ్య పారిశ్రామిక సంస్థలో విలీనం కావడానికి 18 శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్ర మంత్రి వర్గ ఆమోదం పొందాల్సి ఉంటుందని ఇందుకు అదనంగా ఒక సంవత్సర కాలమన్నా పడుతుందని సంస్థకు చెందిన అధికారి ఒకరు చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా కార్మిక వర్గ నేతలు, రాజకీయ ప్రముఖులు నెల, రెండు నెలల్లో విలీనం కానుందని కార్మికులను ఊదర గొడుతున్నారు. ఈ తరహాలో రాజకీయం-సంస్థ ఉన్నత ఉద్యోగులు కార్మికుల జీవితాలతో ఆటలాడు కుంటున్నారు.

బిహెచ్‌పివికి బిహెచ్ఇఎల్ నుండి (డిప్యుటేషన్) మీద వచ్చిన మేనేజర్లు బిహెచ్‌పివి మేనేజర్ల కన్నా నాలుగు రెట్ల అదనపు వేతనం, అదనపు సౌకర్యాలను పొందుతున్నారు. బిహెచ్‌పివి ఇంజనీర్లకు 1992 నాటి వేతన సవరణ ప్రకారం మూల వేతనంగా నాలుగు వేల రూపాయలను పొందుతుంటే బిహెచ్ఇఎల్ నుంచి వచ్చిన ఇంజనీర్ 2007 నాటి వేతన సవరణ ప్రకారం రు. 24,900లు మూల వేతనంగా పొందుతున్నారు. బిహెచ్‌పివిలో ఇంజనీర్ పదవీ విరమణ పొంది ఐదు లక్షల రూపాయాలను విరమణ భత్యాలను పొందుతుంటే ఇదే కేడర్ ఉద్యోగి బిహెచ్ఇఎల్‌లో 50 లక్షల రాయితీలను పొందుతున్నారు. బిహెచ్‌పివిలో మేనేజర్ స్థాయి ఉద్యోగి కన్నా బిహెచ్ఇఎల్ అన్-స్కిల్డ్ కార్మికుడు అధిక వేతనాన్ని పొందుతున్నాడని సంస్థ కార్మికులు వివరించారు. ఇంతటి వివక్ష దేనికి అంటే బిహెచ్ఇఎల్ సంస్థ తమ సంస్థను అనుబంధ సంస్థగానే పరిగణిస్తుంది తప్ప సోదర ప్రభుత్వ రంగ సంస్థగా పరిగణించడం లేదని వాపోతున్నారు.

ఇక బిహెచ్‌పివి టౌన్-షిప్ విషయానికొస్తే అత్యంత ప్రశాంత వాతావరణం, అందమైన పార్కులు, గ్రీన్-బెల్ట్‌తో మనసుకు హాయి నిచ్చేదిగా ఉంటుంది. అతిథి గృహం (గెస్ట్ హౌస్), కళ్యాణ మండపం శిక్షణా కేంద్రం, వైద్యశాల, ఇంగ్లిష్, తెలుగు మాధ్యమ పాఠశాలలు చక్కని మార్కెట్ యార్డ్, కళా వేదికలతో విశాల మైదానంతో చూడ చక్కగా ఉంటుంది. అనునిత్యం టౌన్‌షిప్‌ను పర్యవేక్షించే సివిల్ శాఖ సైతం ఉంది. ఈ రోజున టౌన్ షిప్‌లోకి అడుగెడితే కళ్లు చెమర్చే పరిస్థితి సరైన పర్యవేక్షణ లేక ఎక్కడి కక్కడ చెత్తకుప్పలు మోడువారిన చెట్లు ఉద్యోగులను కుదించడంతో క్వాటర్స్ ఖాళీగా పడి ఉన్నాయి. తుంగ్లాం గ్రామ సమీప సరిహద్దు క్వాటర్స్‌లో అయితే ఎవ్వరూ ఉండనందున ఖాళీగా ఉండి, అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారాయి. దొరికినకాడికి తలుపులు, ద్వారాలు, కిటికీలు పెకిలించుకు పోయారు. కొన్నిచోట్ల చెట్లు - పొదలు అవిచ్ఛిన్నంగా పెరిగి అడవిని తలపింపజేస్తున్నాయి. కనీసం పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులకైనా తగు రాయితీలతో ఆయా క్వార్టర్స్‌ను స్వంతానికి ఇచ్చే పథకం దిశగా ఆలోచించినా కార్మికులు కృతజ్ఞతా పూర్వకంగా మనగలిగే అవకాశం ఉంది. ఏ నాయకులు విశాఖను సందర్శించినా తప్పకుండా బిహెచ్‌పివిని సందర్శించారు. ఇదిగో ఓ నెలలో విలీనం తథ్యం అని అధికారం అంటే, విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని విపక్షం అంటూ ఇన్నేళ్లు కాలయాపన చేశారు. ఇంకా చేస్తారు. అయితే మరి వీరెందుకు బిహెచ్‌పివిని తప్పకుండా సందర్శించడం అంటే ఆ పరిశ్రమ టౌన్‌షిప్‌లో మిగిలి ఉన్న ఖాళీ స్థలాలను కబ్జా చేసి అపార్ట్‌మెంట్లు నిర్మించాలనే యత్నం. బిహెచ్‌పివిని ఆనుకుని ఉన్న తుంగ్లాం గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాల ఆక్రమణ కోసం ఇటీవల ఓ నాయకుడు బిహెచ్‌పివి టౌన్‌షిప్ గేటు ఇరవై నాలుగు గంటలు తెరిచే ఉంచాలని డిమాండ్‌కు పునాది ఇక్కడుంది. ఈ గేటు తెరిచి ఉంచితే తుంగ్లాంకు మార్గం సుగమం అవుతుంది. లేకుంటే చుట్టు తిరిగి వెళ్లాలి. సాధారణంగా ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పదకొండు గంటల వరకు ఈ గేటు భద్రతరీత్యా తెరిచే ఉంటుంది. ఇరవై నాలుగు గంటలూ తెరిచే ఉంటే కార్మికుల భద్రత ఎలా ఉన్నా వారి పథకాలకు భద్రత డిమాండ్ లభిస్తుందన్న అడియాశ కావచ్చు.

ఇది ఆర్థిక సంస్కరణలతో నూతన పారిశ్రామిక విధాన ప్రభావం. ప్రైవేటీకరించి, సంస్థలను సంస్కరించిన తీరు ఈనాడు బిహెచ్‌పివి తరువాత జింక్ స్మెల్టర్ ఆ తరువాత షిప్ యార్డ్ ఇలా కార్మికులు కళ్లు తెరవనంత వరకూ కొనసాగుతూనే ఉంటుంది.

(రచయిత పాత్రికేయులు)

అత్యాచార నిరోధక ఆర్డినెన్స్

అత్యాచారాలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల వర్మ కమిటీ చేసిన సూచనలను, సలహాలను ఆహ్వానిస్తూనే, ప్రజలను రక్షించాల్సిన భద్రతా సిబ్బందికి విచక్షణాధికారాలను కట్టబెట్టి కాపాడుతున్న పాలకుల స్వభావాన్ని వివరిస్తున్నారు జి. ఉదయ

2012 డిసెంబర్ 13 నాడు ఢిల్లీలో 23 ఏళ్ల పారా మెడికల్ విద్యార్థినిపై సాముహిక అత్యాచారం (గ్యాంగ్‌రేప్) జరిగిన తరువాత దేశవ్యాప్తంగా పెల్లుబికిన తీవ్ర నిరసన, విద్యార్థుల అగ్రహావేశాల నేపథ్యంలో మహిళల స్థితిపై దేశంలో తీవ్రమైన చర్చే జరిగింది. ఈ చర్చ మహిళలపై నిరాటంకంగా సాగుతున్న లైంగిక అత్యాచారాల గురించే కాకుండా అసలు ఈ దేశంలో స్త్రీల పట్ల మన దృక్పథం, మారని మగ దృక్పథం, జెండర్ ఈక్వాలిటీ వంటి కీలక అంశాలను కూడ ముందుకు తెచ్చింది. అయితే ఈ సందర్భంగా సాగిన అనేకానేక చర్చలు కానీ, మొత్తం దేశంలో ఏర్పడిన ఉద్రేకభరిత వాతావరణం కానీ, సమస్య మూలాలను గుర్తించడం కానీ, మూలాల నుండి సమస్యను పరిష్కరించడం వైపుకి కానీ తీసుకెళ్లలేక పోయాయి.

ఈ దేశంలో మహిళలపై జరుగుతున్న భయంకర దాడులలో ఢిల్లీ విద్యార్థినిపై దాడి మొదటిదీ కాదు, చివరిదీ కాలేదు. అంతకు ముందు ముఖ్యంగా ఆ తరువాత కూడ ప్రతిరోజూ దేశంలో ఎన్నో చోట్ల ఎంతో మంది స్త్రీలు పసిపిల్లల నుండి వృద్ధుల దాకా అత్యాచారాలకూ, యాసిడ్ దాడులకూ గురవుతూనే ఉన్నారు. ఆయా కేసుల్లో నేరం చేస్తున్న మగవాళ్లు కూడ పసిపిల్లల నుండి పెద్ద వయస్సువాళ్ల వరకూ ఉండడం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఢిల్లీ ఘటనలో అందరి కన్నా చిన్నవాడైన నిందితుడు 18 సంవత్సరాలు కూడ నిండని వాడన్నప్పుడు చర్చించ వలసిందీ శిక్షించగలిగే వయస్సును మరింత తగ్గించి 14, 16 ఏళ్ల పరిధికి తేవడం కాదు. పసి వయసులోనే మగ పిల్లలు ఇంత దుర్మార్గంగా ఎట్లా ప్రవర్తించగలుగుతున్నారు. అసలు మనుషులు ఇంత అమానవీయంగా ఎట్లా తయారవుతున్నారు. పుట్టుకతోనే ఇటువంటి దుర్మార్గ స్వభావంతో పుడతారా లేక వ్యవస్థలోనే వీళ్లు రూపు దిద్దుకుంటున్నారా? ఏ దుర్మార్గ వ్యవస్థా సంస్కృతి వీళ్లను ఇట్లా తయారు చేస్తున్నది. ఆ వ్యవస్థనేమీ మార్చకుండానే ప్రతి రేప్ చేసిన వాడినీ ఉరితీసి చంపడం, హత్య చేసిన వాడిని హత్య చేసి చంపడం వంటి చట్టాలతో ఈ పరిస్థితిని మార్చగలమా వంటి మూలాలను గుర్తించగలిగే, బాగుచేయగలిగే చర్చ జరిగి ఉండాల్సింది. కానీ చర్చ అటువైపు మళ్లకుండా ఉండాలని పాలకులందరూ కోరుకున్నారు. అందుకే పాలకులంతా ఏదో హడావిడి చేసి, మొసలి కన్నీళ్లు కార్చి, లేదు లేదు చట్టాలలో మార్పులు చేసేద్దాం, అందరికీ ఉరిశిక్షలు వేసేద్దాం అంటూ అసలు చట్టాలలో ఏమేం మార్పులు జరగాల్సి ఉందో సూచించమంటూ జస్టిస్ వర్మ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ప్రభుత్వం నియమించింది.

అయితే వర్మ కమిటీ తనకున్న పరిధిలో, సమయంలో విషయాలను నిజాయితీగానే పరిశీలించి చాలా వరకు సరియైన, అవసరమైన సూచనలే చేసింది. అందులో ఢిల్లీ అత్యాచార కేసు తరువాత నేరస్తులకు మరణ శిక్ష విధించాల్సిందే అన్న ప్రజాభిప్రాయం బలంగా వినిపిస్తున్న సమయంలోనే 'కేవలం మరణశిక్ష విధించడం వల్ల నేరాలు ఎక్కడా తగ్గలేదు. కనుక అరుదైన వాటిల్లో, అరుదైన కేసుల్లో కూడ మరణ శిక్ష విధించడం వల్ల ప్రయోజనం లేదు' అంటూ మరణ శిక్షను తిరస్కరిస్తూ జీవితకాల శిక్షను సూచించింది. అలాగే 18 సంవత్సరాల లోపు బాలలు కూడ లైంగిక నేరాలకు పాల్పడుతున్నారు. కాబట్టి జువనైల్ చట్ట పరిధిని 18 నుండి 16కు తగ్గించాలన్న వాదనకు 'ఈ దేశంలో బాలలకు రాజ్యాంగం గుర్తించిన హక్కులను అనుభవించే ఆరోగ్యకరంగా గౌరవ ప్రదంగా ఎదిగే వాతావరణం కల్పించలేకపోయిన ప్రభుత్వాలు కేవలం వారిని మాత్రమే శిక్షించి నేరాలకు బాధ్యతంతా వారిపైనే వేయడం సరయినది కాదు' అని సరిగ్గానే అభిప్రాయపడింది. ఇంకా నేరస్తులను రసాయనాల ద్వారా నపుంసకులను చేయాలన్న విచిత్ర, వికార సూచనలను నిర్ద్వందంగా తిరస్కరిస్తూ, నేరం-శిక్ష అనేవాటిని చూడాల్సిన శాస్త్రీయ, ప్రజాస్వామిక దృక్పథాన్ని కనబరించినందుకు మనం జస్టిస్ వర్మ కమిటీని అభినందిచాల్సిందే. అంతేకాదు ఇంకా చాలా అవసరమైన, ప్రభుత్వాలకు మింగుడుపడని సూచనలు కూడ చేసింది. మహిళలపై అత్యాచారాల కేసుల్లో నిందితులైన ప్రజా ప్రతినిధులను అనర్హులుగా ప్రకటించాలని, వాళ్లను తిరిగి పోటీ చేయకుండా నిరోధించాలని సూచించింది. మహిళలపై నేరాల విషయంలో పోలీసు శాఖ అలసత్వాన్ని తప్పుపడుతూ, అలసత్వం ప్రదర్శించిన పోలీసు అధికారులను శిక్షార్హు లను చేయాలని, మిలటరీకి విస్తృత అధికారాలను ఇస్తున్న 'మిలటరీ ప్రత్యేక అధికారాల చట్టం' వంటి అప్రజాస్వామిక చట్టాలను వెంటనే సమీక్షించాలనీ సూచించింది.

నిజానికి ఈ సూచనలన్నీ చాలా సరయినవే. కాని ఈ దేశంలో బయటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాల కన్నా పోలీసు స్టేషన్లలో జరుగుతున్న అత్యాచారాలే ఎక్కువ. అయినా అతి అరుదుగా తప్ప ఏ పోలీసు, పోలీసునూ, అధికారినీ శిక్షించట్లేదు. అలాగే దేశంలో 'మిలటరీ ప్రత్యేక అధికారాల చట్టం' వంటివి అమలులో ఉన్న ప్రాంతాల్లో అయితే ఆడవాళ్లపైన అత్యాచారం చేయడం కూడ వాళ్లకున్న ఒక ప్రత్యేక అధికారంగానే మిలటరీ భావిస్తోంది. అస్సాం, మణిపూర్, కశ్మీర్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లోనూ, మావోయిస్టులను ఏరివేయడం అనే కార్యక్రమంతో సైన్యాన్ని మోహరించిన చత్తీస్‌గడ్, జార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ మిలటరీ పోలీసులూ, అధికారులూ స్త్రీలపై పాల్పడ్డ అకృత్యాలకూ, అత్యాచారాలకూ లెక్క లేదు. ఈ అత్యాచారాలకు

వ్యతిరేకంగా హక్కుల సంఘాలు, ప్రజలు సుదీర్ఘ పోరాటాలు జరిపి కూడ ఒక్క పోలీసు అధికారికీ శిక్ష పడేలా చేయలేక పోయారు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ జిల్లాలోని వాకపల్లి ఆదివాసి, మహిళలపై స్పెషల్ పోలీసులు, వారి స్వంత గ్రామం మీద పడి అత్యాచారం జరిపిన కేసులో బాధిత ఆదివాసి మహిళలు, హక్కుల సంఘాలు, మానవ హక్కుల కమీషన్ నుంచి హైకోర్టు వరకు వెళ్లి కూడ కనీసం బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేయించలేక పోయారు. మణిపూర్‌లో మిలటరీ మహిళలపై చేస్తున్న అత్యాచారాలతో విసిగిపోయిన మహిళలు, నగ్నంగా దేశం ముందు నిరసన ప్రదర్శన చేయడాన్ని మనం చూశాం. మొన్నటికి మొన్న చత్తీస్‌గడ్‌లోని ఆదివాసి ఉపాధ్యాయిని 'సోని సోడి' మావోయిస్టులతో సంబంధాలు కలిగి ఉందనే నెపంతో నిర్బంధంలోకి తీసుకొని ఆమెపై భయంకరమైన లైంగిక హింసను, దుర్మార్గాన్ని పోలీసులు ప్రయోగించారు. ప్రభుత్వమే చేయించిన మెడికల్ ఎక్సామినేషన్‌లో ఆమె మర్మావయవాల్లో రాళ్లు నెట్టబడ్డాయి అని రిపోర్ట్ వచ్చింది. ఇది మొన్నటి ఢిల్లీ అత్యాచార ఘటనలో నేరస్తుల ప్రవర్తన కన్నా ఏ మాత్రం తక్కువైనది కాదు. ఈ కేసులో కూడ హక్కుల సంఘాలు ఎంతో పోరాడి కూడ నేరస్తులైన పోలీసులపై కేసులు నమోదు చేయించ లేకపోయారు. పోలీసులు, మిలటరీ చేస్తున్న ఇలాంటి అకృత్యాలు కోకొల్లలు.

అయితే ఇటువంటి దుర్మార్గాలు ఏదో కొద్ది మంది పోలీసులు వ్యక్తిగతంగా చెడ్డవాళ్లవడం వల్ల చేస్తున్నవి కావు. ప్రజల పోరాటాలను ప్రతిఘటనను అడ్డుకోవడానికి, మహిళలు ఉద్యమాల్లోకి రాకుండా ఆపడానికి పోలీసు వ్యవస్థ ద్వారా అత్యాచారాన్ని ఒక సాధనంగా వ్యవస్థీకృతంగానే వాడుతున్నారు. వ్యవస్థను ప్రశ్నించే ఉద్యమాల్లో భాగమయ్యే స్త్రీలపై, ఉద్యమాలను నిర్మూలించే క్రమంలో స్త్రీలపై అత్యాచారం అనే ఆయుధం వాడడానికి పోలీసులకు ఒక అలిఖిత ఆమోదం ఉన్నది. అందుకే ఆ పోలీసు అధికారులెవరికి శిక్షలుపడవు. కేసులు నమోదుకావు. అటువంటి కేసుల్లో పోలీసులను ప్రభుత్వమూ, పాలకులూ కాపాడుకుంటారు, కానీ తప్పుపట్టరు. కోర్టుల్లో కూడ పోలీసు రాజ్యమే నడుస్తుంది. కనుక కోర్టులూ ఏం చేయలేవు. 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్ యాక్ట్' (ఎఎఫ్‌ఎస్‌పిఎ) వంటి చట్టాలు అమలులో ఉన్న చోటైతే మిలటరీ ప్రత్యేక అధికారాల కింద ఈ దుర్మార్గాలూ చట్టబద్ధమై పోతాయి.

అందుకే మహిళలపై జరిగే లైంగిక నేరాల్లో పోలీసులకే ఇంత భాగస్వామ్యం ఉండడం వల్ల బయటి సమాజంలో జరిగే అత్యాచారాల విషయంలో పోలీసు వ్యవస్థ ఇంత ఉదాసీనంగా వ్యవహరించడం, లంచం తీసుకొని కేసులే నమోదు చేయకపోవడం జరుగుతోంది. కనుక ఈ పరిస్థితిని మార్చడానికి స్త్రీలపై జరిగే లైంగిక నేరాల పట్ల ఏ మాత్రం అలసత్వాన్ని అనుమతించని విధంగా పోలీసు అధికారులను బాధ్యులను చేయాలని జస్టిస్ వర్మ కమిటీ సూచించింది. అలాగే మిలటరీకి ఉన్న ప్రత్యేక అధికారాల వల్ల మిలటరీ వ్యక్తులపై కేసులు నమోదు చేసే అవకాశమే లేదు. కనుక ఈ ప్రత్యేక అధికారాల చట్టాన్ని వీలైనంత త్వరగా సమీక్షించాలని, ఇటువంటి విచ్చలవిడి అధికారాలను ఇచ్చే చట్టాలను రద్దు చేయాలని వర్మ కమిటీ సూచించింది.

అయితే ప్రభుత్వానికి ఈ సూచనలు ఎంత మాత్రమూ నచ్చలేదు. మిలటరీకీ, పోలీసులకు ఇటువంటి విచ్చలవిడి అధికారాలు లేకపోతే తమ రాజ్యాధికారాన్ని కాపాడుకోవడం కష్టమని హిట్లర్ నాజీ కాలం నుండి ఇవాళ్టి అమెరికా, భారత్ పాలకుల దాకా అందరికీ తెలుసు. అందుకే ఈ కీలకమైన సూచనలన్నీ బుట్టదాఖలు చేస్తూ ఏవో కొన్ని చిన్నా చితక మార్పులతో 'మహిళలపై అత్యాచారాల నిరోధక ఆర్డినెన్స్' అనే డొల్లను ఒక దాన్ని యుపిఎ ప్రభుత్వం తయారు చేసి రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం పంపించారు. ఆ వెంటనే అనేక మహిళా సంఘాలు, హక్కుల సంఘాలు, ఈ ఆర్డినెన్స్ చాలా అసమగ్రమైనది, శుద్ధదండుగైనది, రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఈ బిల్లుపై సంతకం చేయవద్దని అనేక నిరసన ప్రదర్శనలూ, విజ్ఞప్తులూ చేశారు. అయితేనేం దేశంలో అత్యధిక ప్రజల గౌరవమూ, ఆమోదమూ ఉండడం వల్ల దేశ రాష్ట్రపతులు ఎన్నిక కావడం కాకుండా, ఏదో పాలకపార్టీ దయవల్లనే రాష్ట్రపతిగా ఎన్నికవుతున్నారు. కనుక వారు ప్రవేశపెట్టే ప్రతి బిల్లుపై ఆమోద ముద్ర వేసి, వారు కోరుకున్నట్లుగా వ్యవహరించి తమ కృతజ్ఞత ప్రకటించుకోవాల్సి ఉంది. కనుక ప్రస్తుత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఈ బిల్లుపై ఆమోద ముద్ర వేశారు. ఈ ఆర్డినెన్స్ ఇక చట్టంగా రూపొందింది.

ఢిల్లీ సంఘటన తరువాత దాదాపు రెండు నెలల పాటు దేశమంతా సాగిన ఆవేశ ప్రదర్శనలూ, క్యాండిల్ ర్యాలీలూ, విస్తృత చర్చలూ జరిగాయి. వీటన్నింటికి ఫలితం ఒక పనికి మాలిన ఆర్డినెన్స్. దేశ వ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజాగ్రహాన్ని యుపిఎ ప్రభుత్వం ఎంత తెలివిగా దారి మళ్లించింది! విధానపరమైన, వ్యవస్థాగతమైన ఏ మార్పులూ లేకుండా కాగితాలకే పరిమితమైన ఒక చిన్న చట్టం చేసి చేతులు దులిపేసుకుంది.

ఈ మొత్తం కార్యక్రమం సోనియా గాంధీ పర్యవేక్షణలోనే జరిగింది. మరి ఢిల్లీ అత్యాచార ఘటన బాధితురాలిని పరామర్శించిన రోజున సోనియా గాంధీ కంటతడి పెట్టుకుందట! దేశంలో సమస్త అధికారాలూ చేతిలో పెట్టుకున్న సోనియా గాంధీ స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలకు నిజంగా స్పందించి ఉంటే, అత్యాచారాలు లేని భారతాన్ని స్త్రీలు స్వేచ్ఛగా గౌరవంగా ఆత్మ విశ్వాసంతో తిరగగలిగే భారతాన్ని ఆమె చూడాలనుకుంటే జస్టిస్ వర్మ కమిటీ రిపోర్టులోని అంశాలను ఆమె నిశితంగా పరిశీలించి వాటి అవసరం గుర్తించి ఉండేది. మొత్తం ఎఎఫ్‌ఎస్‌పిఎ చట్టాన్ని రద్దు చేయకపోయినా, మిలటరీ మహిళలపై అత్యాచారాలు చేయడానికి వీలులేని విధంగా మిలటరీ జవాబుదారీతనం పెంచే విధంగా కొన్ని మార్పులకైనా సిద్ధపడి ఉండేది. పోలీసు వ్యవస్థలో స్త్రీల పట్ల ఉన్న అలసత్వాన్ని పోగొట్టి వ్యవస్థను కొంతైనా ప్రజాస్వామికీకరించడానికి ప్రయత్నించి ఉండేది. కానీ సోనియాగాంధీకి ఈ దేశంలో స్త్రీల రక్షణ పట్లగానీ, సమానత్వం పట్లగానీ, ప్రజాస్వామిక విలువల పట్లగానీ ఎటువంటి శ్రద్ధ, ఆసక్తి లేవు. శ్రద్ధంతా తమ అధికారాన్ని నిలబెట్టుకోవడం, కొడుకు రాహుల్ గాంధీని ఈ దేశానికి ప్రధానిని చేయడం మీద మాత్రమే. అయితే అధికారంలో యుపిఎ ప్రభుత్వానికి బదులుగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఉంటే వేరుగా జరిగి ఉండేదా? ఎంత మాత్రమూ కాదనడానికి ఎన్‌డిఎ అధికారంలో ఉన్న కాలంలో జరిగిన ఘటనలు చాలు. మరి ఈ దుర్మార్గాలను ఎలా అడ్డుకోగలమో, ఈ వ్యవస్థను ఎలా మార్చగలమో ప్రజలే ఆలోచించాల్సి ఉంది. ప్రజలే పూనుకోవాల్సి ఉంది.

(రచయిత ఉపాధ్యాయురాలు) వీ

వర్మ కమిటీ నివేదిక - ప్రభుత్వ చిత్తశుద్ధి

వర్మ కమిటీ చేసిన సిఫారసుల ప్రాముఖ్యతను చెపుతూ, పాలకులలో, ముఖ్యంగా పోలీసు, మిలిటరీ వ్యవస్థలను సంస్కరించకుండా దేశంలో స్త్రీలపై జరుగుతున్న దురాగతాలను ఆపలేమని అంటున్నారు చిమ్మె జాన్ బర్నబాస్

దేశంలో మహిళలపై పెరిగిపోయిన అత్యాచారాలను, లైంగిక హింసలను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్. వర్మ నేతృత్వంలో ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఇతర సభ్యులు మాజీ న్యాయమూర్తి లీలాసేథ్, సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం. వీళ్లు అతికొద్ది సమయంలోనే అంటే, నెల రోజులలోపే అధ్యయనం చేసి, విచారణ జరిపి, దేశంలోని వివిధ వర్గాల ప్రజలను, ప్రజా సంఘాలను, మహిళా నేతలను, న్యాయ కోవిదులను, రాజనీతిజ్ఞులను, ప్రజా శ్రేయస్సు కోరే అన్ని రకాల ప్రజలను సంప్రదించి తమ నివేదికను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించారు. ఆ నివేదిక ప్రభుత్వానికి చేసిన సూచనలు, సలహాలు అమూల్యమైనవి. అయితే ఎంత చిత్తశుద్ధితో వీటిని అమలులోనికి తీసుకు వస్తారనేది మన ముందు ఉన్న ప్రశ్న. ప్రజలు, ప్రజా సంఘాలు కూడా నివేదిక అమలు కోసం ఉద్యమించ వలసిన అవసరం ఉంది.

2012 డిసెంబర్ 16న ఢిల్లీ నగరంలోని వసంత విహార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పారామెడికల్ విద్యార్థిని గ్యాంగ్‌రేప్ (సామూహిక అత్యాచారం)కు గురైన సంఘటన దీనికి ఒక మూలాధారమైన అంశంగా పరిగణనలోనికి తీసుకోవడం జరిగింది. దేశవ్యాప్తంగా, వివిధ వర్గాల ప్రజలందరినీ కదిలించివేసి, రోడ్డు మీదికి తీసుకొని వచ్చిన సంఘటన ఇది. దాదాపుగా ఐదు రోజులు ఢిల్లీ రోడ్లన్నీ రాష్ట్రపతి భవన్ వైపుకు దారితీసినట్లుగా జన సందోహంతో నిండిపోయిన ఘటన. భాష్పవాయు ప్రయోగం, లాఠీ చార్జీలు, కాల్పులు, అన్ని రకాల నిర్బంధాలను లెక్క చేయకుండా, మొత్తం మధ్యతరగతి ప్రజానీకం ఆగ్రహంతో దేశ ప్రధానినీ, యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీనీ, రాష్ట్రపతినీ నిలదీసింది.

ఇక ఈ దేశంలో మరో అత్యాచారానికి మహిళ గురికాకుడదనే నినాదంతో ఈ ఉద్యమం కొనసాగింది. కానీ పశ్చిమ బెంగాల్‌లోనూ, కేరళలోనూ ఇలాంటి సంఘటనలే పునరావృతం కావడం, పాలకుల చిత్తశుద్ధిని శంకించే దుస్థితికి తెచ్చింది. మనదేశంలో అధికారుల నిర్లక్ష్యం, నిందితుల పట్ల ఉదాసీనత, ధనవంతుల పట్ల గౌరవం, ప్రతి చిన్న సమస్యనూ రాజకీయ కోణంలో చూడడం పోలీసు అధికారులకు అలవాటయిపోయింది.

ఒక మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసు స్టేషన్‌కు పోయి ఫిర్యాదుచేసే పరిస్థితి ప్రస్తుతం దేశంలో లేదు. ఒక మహిళ అత్యాచారానికి గురయితే, భారతీయ శిక్షా స్మృతి (ఐపిసి)లో సెక్షన్ 376 వర్గీకరణ ఎబిసిడిలుగా విభజించింది. నేరం రుజువయితే యావజ్జీవ శిక్ష కూడా విధించవచ్చు. బాధితురాలు చనిపోతే, ఎలాగూ సెక్షన్ 302 (హత్య) వర్తిస్తుంది. కాబట్టి మరణ శిక్ష కూడా విధించే అవకాశాలు ఉంటాయి. కాని ప్రస్తుతం ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. కాబట్టి వీటిని నిర్మూలించడానికి, నివారించడానికి ఒక ప్రత్యేక చట్టం రూపొందించాలనే బలమైన డిమాండ్ మహిళ సంఘాల నుంచీ, వివిధ ప్రజా సంఘాల నుంచీ వినబడుతున్నది. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ కమిటీ కొన్ని సూచనలను తన నివేదికలో పొందుపరిచింది.

మహిళలపై అత్యాచారం చేసిన వారికి మరణశిక్ష విధించాలనీ, లేదా వారిని నపుంసకులుగా మార్చాలనీ చేసిన డిమాండ్‌ను జస్టిస్ వర్మ కమిటీ తీవ్రంగా ఖండించి, దానిని తోసిపుచ్చింది. దీనికి అంతర్జాతీయ మానవ హక్కుల సూత్రాలనూ, ప్రమాణాలనూ పరిగణన లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని జస్టిస్ వర్మ కమిటీ కోరింది. సమస్యను మానవ హక్కుల కోణం నుంచి చూడాలనీ, ప్రతి నేరానికి మరణశిక్ష భావ్యం కాదనీ, యావజ్జీవ కారాగార శిక్ష ఉత్తమమనీ, అదే అసలైన శిక్ష అవుతుందనీ తెలిపింది. నేరస్తుడు తాను ఏ నేరం ఆధారంగా శిక్ష అనుభవిస్తున్నాడో, మరొకరు ఆ నేరం చేయకుండా జాగ్రత్త పడడానికి ఆస్కారం ఉంటుందనీ కూడా కమిటీ అభిప్రాయపడింది. ఢిల్లీలో జరిగిన మానభంగం-హత్య ఘటనలో ఒక మైనర్ బాలుడు (18లోపు వయస్సు) ఉండడం చేత బాల నేరస్తుల వయో పరిమితి 18 నుంచి 16 సంవత్సరా లకు తగ్గించాలన్న డిమాండ్‌తో జస్టిస్ వర్మ కమిటీ విభేదించింది. చిన్న వయస్సులోనే జైల్లో బంధించడం వలన పరిష్కారం లభించదనీ, బాల నేరస్తుల శిక్షాలయాలలో సమగ్రమైన, వ్యవస్థాగతమైన సంస్కరణల ద్వారా వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలనీ జస్టిస్ వర్మ కమిటీ అభిప్రాయ పడింది.

ప్రస్తుతం మారిన సామాజిక పరిస్థితులకు ఇది కొంత ఇబ్బంది గానే ఉంది. అశ్లీల చలనచిత్రాల ప్రభావం, దృశ్య మాధ్యమాలు విస్తరింప జేస్తున్న లైంగిక వికృత భావాల కారణంగా చాలా మంది విద్యార్థి దశలోనే ఎక్కువగా తప్పుదారి పట్టి పోతున్నారు. అశ్లీల దృశ్యాలను చలన చిత్ర మాధ్యమంలో నిరోధించగల పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు లేకపోవడం విచారకరం. పైగా చలన చిత్రాలలోని అశ్లీల దృశ్యాలను తీసివేయాలనే డిమాండ్ ప్రజల నుంచి ఉద్యమరూపంలో వచ్చినా, అలా నిరోధించే ప్రయత్నం స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను హరించే చర్యలుగా కూడా ప్రచారం ఉంది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు (ఆర్టికల్స్ 14-32) భంగం వాటిల్లుతున్నట్లు రాష్ట్ర హైకోర్టులను కూడా ఆశ్రయిస్తున్నారు. మొదట నగరాలలోని పబ్‌లనూ, క్లబ్‌లనూ నిషేధించాలి. బహిరంగంగా మద్యం అమ్మకాలనూ, మద్యాన్ని సేవించడాన్నీ కూడా అరికట్టాలి.

సైనికులూ, స్పెషల్ ఆర్మ్‌డ్ పోలీసులూ తమ ఉద్యోగ (విధి) నిర్వహణ దృష్ట్యా అడవులలోనూ, ఆదివాసి ప్రాంతాలలోనూ ఉంటున్నప్పుడు అక్కడ మహిళలపై అనేక అత్యాచారాలకు పాల్పడుతున్నారనే విషయం మరింత ఆందోళనకరం. మన రాష్ట్రంలో అయితే వాకపల్లి ఘటన (ఐదు సంవత్సరాల క్రితం విశాఖపట్టణం జిల్లా)లో 11 మంది ఆదివాసి మహిళలు సామూహిక అత్యాచారానికి గురయ్యారు. మొత్తం గూడెంలోని మహిళలందరిపైనా ఒక బెటాలియన్ సైన్యం అంతా సామూహిక అత్యాచారానికి పాల్పడింది. కానీ అందులో 11 మంది మహిళలు మాత్రమే తమపై అత్యాచారం జరిగినట్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడానికి, జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు చేయడానికి ముందుకు వచ్చారు. ఇటువంటి నిందితుల పట్ల పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉంటారు. ఎందుకంటే వారంతా ఒకే కులం (వృత్తి) కాబట్టి. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ యాక్ట్ (ఎఎఫ్ఎస్‌పిఎ) ప్రకారం వారు ప్రత్యేక అధికారాలను కలిగి ఉంటారు. అయినా వారు చేసింది నేరమే కానీ ఈ ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం వారిపై కఠిన చర్యలు తీసుకోవడం గానీ లేదా వారు కేంద్ర ప్రభుత్వ పరిధిలోనికి వస్తారు కాబట్టి, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేయడానికి కూడా సాహసించరు. ఇది మరీ అమానవీయం, రాజ్యాంగ వ్యతిరేకం - చట్టవ్యతిరేకం.

చట్టాలను పరిరక్షించాల్సిన పోలీసులే ఈ విధంగా వ్యవహరిస్తే, సామాన్యుని పరిస్థితి ఏమిటి? ఈ ఎఎఫ్ఎస్‌పిఎ చట్టాన్ని సవరించాలని జస్టిస్ వర్మ కమిటీ కోరింది. లైంగిక హింస (అత్యాచారం)కు పాల్పడిన సైనికున్ని శిక్షించడానికి ఆ చట్టంలోని సెక్షన్ 6 (ఉన్నతాధికారి నుంచి ముందస్తు అనుమతి)ను తొలగించాలని కూడా సిఫారసు చేసింది. 'లైంగికత' (సెక్స్) అనేది మానవ జీవన ప్రాథమిక స్వభావంగా ఈ కమిటీ అభిప్రాయ పడింది. అన్నిరకాల లైంగికతలకూ రక్షణ ఉండాలని కూడ జస్టిస్ వర్మ కమిటీ వ్యాఖ్యానించింది.

సమాజంలో సహజసిద్ధ 'లైంగికత' కేవలం స్త్రీ - పురుషుల మధ్యనే కాకుండా, పురుషుల మధ్య కూడా లైంగికదాడి జరుగుతోంది. స్వలింగ సంపర్కాలు, లింగమార్పిడి వారిపై, నపుంసకుల పైన కూడా మానభంగాలు జరుగుతుండడం వాస్తవం. కాబట్టి ఈ వాస్తవాన్ని రాబోయే చట్టం రూపకల్పనలో గుర్తించాలి. మన సాంస్కృతిక ద్వేషాలు రాజ్యాంగ సూత్రాల పరిధిలోనే ఉండాలి. అదే విధంగా, ఖాప్ పంచాయితీలు (పెద్ద మనుషులు - కుల పెద్దలు) శిక్షలు విధించడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించింది. దీని వలన యువతీ యువకులూ తమకు ఇష్టమైన వారిని ఎంచుకునే స్వేచ్ఛ హరించబడుతున్నదని కూడా జస్టిస్ వర్మ కమిటీ అభిప్రాయపడింది.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, ఈ కమిటీ చేసిన విజ్ఞప్తులకు ఏ రాష్ట్రంలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) కూడా తమ తమ నివేదికలను తయారు చేసి పంపించలేదంటే, ఈ దేశంలో పోలీసు వ్యవస్థ ఎంత ఘోరంగా పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. మొత్తం డిజిపిల నియామకాలపై, వారి పనితీరు పట్ల జస్టిస్ వర్మ కమిటీ తీవ్రమైన నిరసనను తెలియజేస్తూ, డిజిపిల వ్యవస్థను సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఢిల్లీలో శాంతి భద్రతలను సమీక్షించాలనీ కోరింది. నేరారోపణలు (తీవ్రమైన) ఎదుర్కొంటున్న ఎంఎల్ఎలు, ఎంపిలు అందరూ స్వచ్ఛందంగా, తమకు తాముగా రాజ్యాంగం మీద గౌరవంతో రాజీనామా చేయాలని కోరింది. తమకు తాముగా ఆత్మావలోకనం చేసుకోంటూ రాజ్యాంగాన్ని పరిరక్షించాలనీ కోరింది. ఎన్నికల సమయంలో సమర్పించే అఫిడవిట్‌లలో తప్పులకు సంబంధించిన 33ఎ సెక్షన్ (ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా) ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించి, కఠినంగా శిక్షించాలని కోరింది.

జస్టిస్ వర్మ కమిటీ, గత కొన్ని సంవత్సరాలుగా మహిళలు కోరుతున్న అనేక డిమాండ్‌లను అంగీకరించే విధంగా, 'తమ శరీరంపై తమ హక్కు'కు భంగం వాటిల్లితే దానిని తీవ్రంగా పరిగణించాలని కూడా అంగీకరించింది. అయితే పోలీసు వ్యవస్థను సంస్కరించకుండా, వారిని చిత్తశుద్ధితో పనిచేయనీయకుండా, నిరంతరం నిఘా, పోరాటాలు - ఉద్యమాలు లేకుండా, వ్యవస్థను మార్చడం అసాధ్యం.

(రచయిత న్యాయవాది,
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

ఎ.నర్సింహారెడ్డి గారి రెండు పుస్తకాలు వెలువడ్డాయి

సామాజిక విద్య - ఒక మిథ్య

వ్యాస సంకలనం

పే. 230

వెల : రు.100

ప్రజా ఎజెండా లేని

పార్లమెంటరీ రాజకీయాలు



పే. 80

వెల : రు.40

ప్రతులకు

వీక్షణం; దిశ; ప్రజాశక్తి; మైత్రి బుక్‌హౌస్

Advt.

ఈ వ్యవస్థలో మహిళలకు రక్షణ సాధ్యమేనా..?

సమాజంలో ఉన్న రుగ్మతలకు శాశ్వత పరిష్కారాలు అంత సులభంగా ఉండవనీ, శిక్షలతో పాటుగా, సామాజిక మార్పును, రాజకీయ మార్పును, సాంస్కృతిక మార్పును తీసుకు రావాలనీ అంటున్నారు జి. లచ్చయ్య

ఢిల్లీ అత్యాచార సంఘటన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులపై, హత్యలపై, అత్యాచారాలపై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. ఈ దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలలో ఢిల్లీ సంఘటన మొదటిది కాదు. చివరిది కాదు. ఈ సంఘటన కాలంలోనే దేశవ్యాప్తంగా మహిళలపై (పసిపిల్లలతో సహా) అత్యాచారాలు అతి హేయంగా జరుగుతున్నాయి. బహుశా జాతీయ నేర పరిశోధన నమోదు సంస్థ (ఎన్‌సిఆర్‌బి) కూడా వీటిని రికార్డు చేయలేకపోతోంది. ఈ అత్యాచారాల పరంపర అమాంతంగా ఇప్పుడే పెరిగింది కాదు. అనాదిగా ఈ దేశంలో జరుగుతూనే ఉన్నాయి. పోతే, ఢిల్లీ సంఘటన తర్వాత పోలీసులలో నెలకొన్న కొంత జాఢ్యం తొలగి కేసుల నమోదు ఊపందుకుంది. ఈ విషయాల్ని లైఫ్ ఒకె టి.విలో, ఇండియా ఫైట్స్ బ్యాక్, సోని టివి క్రైమ్ పెట్రోల్ దస్తక్‌లో చూస్తుంటే, మన పోలీసు వ్యవస్థ రాజకీయ నాయకులకూ, గూండాలకూ, బ్యూరోక్రాట్లకూ ఎలా ఊడిగం చేస్తున్నదో తెలుస్తున్నది. దీనికి ఉదాహరణగా కోల్‌కత్తాలో ఇద్దరు పిల్లల తల్లి అయిన క్రిస్టియన్ మహిళపై జరిగిన సంఘటనే.

నిన్నటి దాకా ఈ సంఘటనలపై మదనపడుతున్న మహిళాలోకం, మానవీయ కోణంలో ఆలోచించే సమాజం, చివరికి విధిలేక ప్రభుత్వ యంత్రాంగం వీటికి పరిష్కారాన్ని వెతుకుతున్నది. ఈ నేపథ్యంలోనే గత డిసెంబరు 23న జె.ఎస్.వర్మ కమిటీని (లీలాసేఠ్, గోపాల్ సుబ్రహ్మణ్యం) కేంద్ర ప్రభుత్వం నియమించింది. కోరినట్లుగానే 29 రోజుల్లోనే ఈ కమిటీ తన రిపోర్టును జనవరి 22న సమర్పించింది. బహుశా ఇంత తక్కువ కాలంలో నివేదికను అందించిన కమిటీ ఇదే కావచ్చు. ఈ అతి స్వల్పకాలంలో ఈ కమిటీకి 80,000 సూచనలు, సలహాలు దేశవ్యాప్తంగానే కాదు, వివిధ దేశాల నుంచి రావడం గమనార్హం. అదే విధంగా కమిటీకి ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్‌ల ప్రొఫెసర్లు, కెనడా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, ఆస్ట్రేలియా జస్టిస్‌లు కూడా మహిళల రక్షణకై అత్యాచారాల నిరోధానికి తీసుకోవాల్సిన చట్టాలపై తగు సూచనలు చేశారు.

అందిన సూచనల్ని, సలహాల్ని దృష్టిలో పెట్టుకొని వర్మ కమిటీ అనేక సూచనల్ని చేసింది. అందులో కొన్ని ప్రభుత్వానికి ఇబ్బందికరంగా ఉండగా, మరికొన్ని రాజకీయ నాయకుల కాళ్లకూ సంకెళ్లు వేసేవిగా ఉన్నాయి. ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే సూచన 'భద్రతా దళాల ప్రత్యేక అధికార చట్టం'కు (ఎఎఫ్‌ఎస్‌పిఎ) అతీతంగా, యూనిఫారం ముసుగులో మహిళలపై జరుగుతున్న అత్యాచారాల్ని, సాధారణ పౌరులుగా చేసినవిగానే భావించాలని, అధికారుల అనుమతి లేకుండానే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చేసిన సూచన అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉంది. కశ్మీరులో, మణిపూర్‌లో, ఒడిషాలో, ఆంధ్రప్రదేశ్‌లో పారామిలటరీ బలగాలు జరిపిన అత్యాచార బాధితులు వేలాదిగా ఈ సూచనలు చేయడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో 2007 ఆగస్టులో విశాఖ జిల్లా జి.మాడుగుల మండలంలోని వాకపల్లిలో 11 మంది గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలే ఇందుకు ఉదాహరణ. మణిపూర్‌లో 2004 లో తంగ్‌జామ్ మనోరమపై అస్సాం రైఫిల్స్ జరిపిన అత్యాచారానికి నిరసనగా 12 మంది మహిళలు నగ్నంగా నిరసన తెలిపారు. 2000 నవంబర్ నుంచి నేటికి ఎఎఫ్‌ఎస్‌పిఎ ఆకృత్యాలకు వ్యతిరేకంగా నిరవధిక ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న ఇరోం షర్మిల(38) మొత్తం మహిళా లోకానికే ఆదర్శంగా ఉన్నది.

వర్మ కమిటీ సూచించినట్టు భద్రతా దళాల్ని సాధారణ పౌరులుగా భావించితే, ప్రభుత్వ దమననీతి, సాయుధ బలగాల ఆకృత్యాలు బయటి సమాజానికి తెలుస్తాయని ప్రభుత్వాలు ఆందోళనకు గురవుతున్నాయి. రెండవ ప్రధాన సూచన రాజకీయ నాయకులు, ముఖ్యంగా ఎంఎల్‌ఎలు, ఎంపిలు సెక్షన్ 33ఎ ప్రకారం నేరచరిత్రను ఎన్నికల కమిషన్‌కు నివేదించడమే కాదు, స్వయానా పదవుల్లో నుంచి తప్పుకోవాలని, ఆయా రాజకీయ పార్టీలు తప్పించాలనే సూచన కూడ రాజకీయ పార్టీలకు మింగుడు పడడం లేదు. ఈ సెక్షన్‌ను మార్పు చేయాలని వర్మ కమిటీ సూచించగా, ఇది అసాధ్యమని అప్పుడే రేణుకా చౌదరి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది కూడా. (ఆమె ఓ మహిళ కావడం గమనార్హం).

ఇక వైద్యపరంగా చేసే ఫింగర్ టెస్టు (వేళ్లతో యోని పరీక్ష) కూడ సరైన విధానం కాదని, పైగా డాక్టర్లు అత్యాచారం జరిగింది, జరగలేదని చెప్పడం ఒకటే సరిపోదని, అలా చెప్పడం సరయినది కాదని, జరిపిన పరీక్షను రికార్డు చేసి భద్రపరిచి న్యాయ స్థానాలకు అందించాలని సూచించడం మరో ముఖ్యమైన అంశం. అలాగే నిందితులు 18 సంవత్సరాల లోపైతే, జువనైల్‌గానే విచారణ జరపాలని, వయస్సును తగ్గించడం సరయినది కాదని కూడా వర్మ కమిటీ సూచించింది.

ఇకపోతే అన్నింటికన్న ముఖ్యమైన రెండు అంశాల్ని వర్మ కమిటీ నిశితంగానే పరిశీలించి తగు సూచనల్ని చేయడం జరిగింది. ఒకటి నిందితులకు ఉరిశిక్ష వేయడం, రెండవది వైద్యపరమైన చర్య తీసుకొని నపుంసకులుగా చేయడం. మొదటిది రాజ్యాంగ పరంగా ఇప్పటికే కొన్ని సందర్భాలలో అమలులో ఉంది. కాని న్యాయపరంగా, వాదనల పరంగా ఉన్న బలహీనతలతో ఒక కోర్టు విధించిన ఉరిశిక్షను మరో కోర్టు నిలుపుదల చేయడం, క్షమాభిక్షలు కోరడం జరుగుతూనే ఉన్నాయి.

నేరం ఏదైనా ఉరిశిక్షలు అమానవీయమని ప్రపంచంలోని అత్యధిక దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. గత నవంబర్ 20న ఐక్యరాజ్యసమితి ఉరిశిక్షలపై నిర్వహించిన అభిప్రాయ సేకరణలో 110 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ ఉరిశిక్ష సమర్ధించింది. భ్రష్టు పట్టిన సమాజాన్ని ఆరోగ్యంగా ఎదగనీయ కుండా, ఇంకా ఆదిమ పద్ధతుల్ని అనుసరించడమే మన అనాగరికతకు నిదర్శనం! అందుకే వర్మ కమిటీ అత్యాచారాల్ని అత్యంత దారుణ సంఘటనగానే భావిస్తూ, కఠిన శిక్షలుంటే మరొకరికి గుర్తుంటుందని భావించి, కనీస శిక్షగా 20 సంవత్సరాలు, అవసరమైతే జీవిత ఖైదు విధించాలని సూచించింది.

ఇక అత్యధికంగా మహిళలు కోరిన వైద్యపరమైన శిక్షను వర్మ కమిటీ తోసిపుచ్చింది. ఇది తాత్కాలిక ఉపశమనం కల్గిస్తుందే తప్ప శాశ్వత పరిష్కారం కాదు. ఈ మధ్యలో వారు తప్పించుకునే ప్రమాదం, లేదా నిర్దోషులుగా బయటపడే అవకాశం ఉంటుంది. కాబట్టి, ఈ చర్య కూడా సరయినది కాదని వర్మ కమిటీ భావించింది. ఇతర ఆలోచనల పరంగా కూడా ఈ విధానాలు సరైన ఫలితాల్ని ఇవ్వక పోవచ్చు! లేదా విలువలకు పాతరేసే మన వైద్యరంగం దీనికి ప్రత్యామ్నాయ మందుల్ని కనుగొని తిరిగి నిందితుల్ని నపుంసకులుగా మార్చే అవకాశం ఉండే ఉంటుంది. అలాగే ఇలా వైద్యపరమైన శిక్షకు గురైనవారు సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతూ, బాధితుల పట్ల కక్ష పెంచుకొని (కుటుంబ సభ్యుల సహకారంతో, స్నేహితుల సహకారంతో) మరికొన్ని దారుణాలకు పాల్పడే అవకాశం కూడ ఉంటుంది. రుగ్మతలతో ఉన్న సమాజంలో శాశ్వత పరిష్కారాలు అంత సులభంగా ఉండవు. శిక్షలతో పాటుగా, సామాజిక మార్పును, రాజకీయ మార్పును, సాంస్కృతిక మార్పును, సంకెళ్లుగా ఉన్న సంప్రదాయాల గురించి ఆలోచించకుండా, పట్టించుకోకుండా, వాటికై పాకులాడకుండా ఉన్న వాతావరణంలోనే పరిష్కారాలు తాత్కాలికంగానే ఉంటాయి తప్ప, శాశ్వత పరిష్కారాలు కాజాలవు.

కాబట్టి, అత్యాచారాలను నిర్మూలించడంతో పాటుగా, ఇతర సామాజిక సమస్యల్ని, రాజకీయ సమస్యల్ని కూడా పట్టించుకొని పోరాడాల్సిన అవసరం ఉంది. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం- బాధితుల పట్ల సమాజపు ఆలోచనలో అనూహ్యమైన మార్పు రావాలి. ఒంటరిగా అయినా బాధిత మహిళ ఫిర్యాదు చేసే వ్యవస్థ రూపు దిద్దుకోవాలి. ఇది అంత సులభతరమైన విషయం కాదు. మనదింకా భూస్వామ్య భావజాలంతో కొనసాగుతున్న వ్యవస్థ. ఈ భావజాలంతో ఉన్నవారు, పనికిరాని విలువలకు, పై వర్గాలకు (రాజకీయ పెట్టుబడిదార్ల, ఉన్నవారి పట్ల) అణిగిమణిగి ఉండాలనే ఆలోచనతో ఉంటారు. ఈ దృక్పథంలో మార్పు రావాలి. బాధితురాలు సమాజంలో తలెత్తుకొనే వాతావరణం ఏర్పడాలి. చిన్నచూపు, కించపర్చడం రూపుమాపాలి. సానుభూతికి స్థానం లేకుండా, సగర్వంగా చూడాలి. అప్పుడే బాధితులు ఈ సమస్యను సమాజపరంగా ధైర్యంగా ఎదుర్కోగలరు. అంటే బాధ్యతతో కూడుకున్న సమాజం, నైతికతతో ఆలోచించే వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. కుటుంబ ఆలోచనా విధానంలో మార్పు రావాలి! శాస్త్రీయబద్ధంగా సమస్యల్ని విశ్లేషించగలగాలి. దీనికి పాఠశాలల్ని కేంద్రంగా మార్చాలి. పాఠ్యాంశాల్లో మార్పురావాలి. లింగ వివక్షత లేకుండా పిల్లల పెంపకం ఇంట్లో జరగాలి. పాఠశాలల్లో ఆచరించాలి. లింగ వివక్షతలేని పాఠ్యాంశాల రూపకల్పన జరగాలి. మహిళల జీవితాన్ని 'పవిత్రత' అనే పదజాలం నుంచి 'గౌరవం' అనే పదజాలంతో చూడాలి. శాస్త్రీయత, హేతుబద్ధత మహిళల్ని తలెత్తుకునేలా చేస్తాయిగాని, సంప్రదాయాలు, అనైతిక విలువలు కావు. ఈ విషయంగా మన సాహిత్యం తిరగ రాయాలి. కొత్త సాహిత్యం సృష్టించాలి. స్త్రీని 'అబల'గా చిత్రించే సాహిత్యాన్ని, మీడియా కథనాల్ని, సినిమాల్ని నియంత్రించాలి. అన్ని పనులు అందరు చేయాలనే ఆలోచనను రేకెత్తించాలి. ఆడపిల్లల పనులు వేరు, మగపిల్లల పనులు వేరు అనే భావజాలాన్ని ఇంట్లో నుంచే తొలగించాలి.

అన్నింటికన్నా ముఖ్యంగా, మన యువతను నిర్మాణాత్మకంగా మల్చుకోవాలి. వారికి నిన్నటి చరిత్ర, అందులోని రక్తాక్షరాల్ని తెలుసుకునేలా చేయాలి. సాంఘిక దురాచారాల్ని విశ్లేషించుకునేలా తీర్చిదిద్దాలి. దేశ నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయాలి. అలాగే భద్రత గల సమాజాన్ని వారికి అందించాలి. వ్యసనాలకు బానిసలు కాకుండా చూసే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పర్చాలి. ప్రజల శ్రమ గురించి, వారి సంస్కృతుల గురించి విశదపరిచి, శ్రమలో విద్యార్థుల్ని కొంతకాలం విధిగా భాగస్వామ్యం చేయాలి. శ్రమైక జీవన సౌందర్యాన్ని యువత గుర్తించగలగాలి. అయితే, ఇది అనుకున్నంత సులభం కాదు. యువతకు అనేక వ్యసనాలతో (క్రికెట్, సెల్‌ఫోన్, చెత్త సినిమాలు, సీరియల్లు, పబ్‌లు, మత్తు పదార్థాలు, అశాస్త్రీయ, అసాంఘిక విద్యావిధానం మొదలైనవి) ముంచేస్తున్న పద్ధతికి స్వస్తి పలకాలి.

ఇది, ఒక రాజకీయ పరిష్కారం ద్వారానే జరుగుతుందనే విషయాన్ని ఎంత ముందుగా గుర్తిస్తే, అంత తొందరగా మన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ కమిటీలు, సూచనలు తాత్కాలిక ఉపశమనాల్ని మాత్రమే కల్గిస్తాయని మాత్రం గుర్తించుకోవాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

కావ్య పబ్లిషింగ్ హౌస్

కావ్య పబ్లిషింగ్ హౌస్
12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,
ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్, గోకుల్‌నగర్, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017. ఫోన్ : 9989599135

KAVYA PUBLISHING HOUSE
A/c. 060411100000681
Andhra Bank, Vidyanagar Branch,
IFSC Code No. ANDB 000 0604

పుస్తకాలు రిజిష్టర్ పోస్టులో పంపిస్తాం. ఎం.ఓ. పద్ధతి లేదు. డి.డి.లు మాత్రమే పంపాలి. లేదా మా అకౌంట్‌లో డబ్బులు జమ చేయండి. మా ఫోన్ నెంబర్‌కి మీ వివరాలు ఎస్.ఎం.ఎస్. చేయండి. లేదా మా అడ్రసుకి ఉత్తరం ద్వారా లేదా ఇమెయిల్ ద్వారా వివరాలు తెలియచేయండి.
email :
kavyaph11@gmail com

నానిగాడి ప్రేమకథ

రచన : వసుంధర, బొమ్మలు : బాపు

అనగనగనగా చిచ్చర పిడుగు బుడుగులాంటి ఓ నానిగాడు వాడ్ని మితిమీరి గారాంచేసే బామ్మ వాడిచేత ప్రేమలేఖలు పంపే బాబాయి వాడి కన్నా కుంచెం పెద్దయిన చిన్నిగాడు వాడు అమితంగా ఆరాధించిన అత్తయ్య వాడు ప్రేమించిన ఎదురింటి రాజకుమారి వాడి పాలిటి రాక్షసుడు - ప్రయివేటు మాస్టారు. వాడికి వీళ్లందర్నీ మించి ఇష్టమైంది అమ్మ కౌగిలి! వాడు కుంచెం చాలా పెద్దయిన రాజకుమారిని ప్రేమించి పెళ్లాడాలనుకునీ మానుకున్న వైనం రాజకుమారిని ప్రేమించిన రాక్షసుడ్ని మంత్రం వేసి మంచివాడ్ని చేసిన వైనం. 'భారతి' సాహిత్య మాస పత్రికలో ప్రచురింపబడిన ఏకైక పిల్లల నవల ఈ నానిగాడి ప్రేమకథ

1/4 డెమ్మి సైజ్ 44 పేజీలు రూ. 60/-

Advt.

సీమ గొంతుకనూ వినండి!

అన్ని రంగాలలో రాయలసీమకు జరిగిన అన్యాయాన్నీ, వివక్షతనూ చెపుతూ, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతోనే రాయలసీమ ప్రజలకు మేలు జరుగుతుందని అంటున్నారు సోమశేఖరశర్మ

రాయలసీమ (వాసుల)ది ఈనాడు ఒక విచిత్రమైన పరిస్థితి. అణగదొక్కబడిన కులాలు తమ స్వంత అస్తిత్వాన్ని చాటుకుంటూ, తమదైన ప్రత్యేకమైన ఉనికి, గుర్తింపుకై ఉద్యమాలు నిర్వహిస్తున్న కాలంలో, సీమప్రాంత వాసులు, శతాబ్దాలుగా తమదైన విశిష్ట చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయ కళారూపాలను, గుర్తింపును పోగొట్టుకొని 'సీమాంధ్రులు'గా చలామణీ అవుతున్న దుస్థితి. అటు ప్రత్యేక తెలంగాణ వాదులు, దాన్ని సమర్ధిస్తున్న ఆ ప్రాంత ప్రజాస్వామ్య, పురోగామి శక్తులతో పాటు, సీమ ప్రాంతవాసులు, తమ ఉనికిని, ప్రత్యేకతను తామే మరిచి, సీమాంధ్రులుగా పిలువబడడం ఎంత వైచిత్రం.

1924లోనే విశ్వవిద్యాలయ విద్య సీమ వాసులకు అందుబాటుకు వచ్చే సమయంలోనూ, ఆ తర్వాత కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టు కర్నూల్ జిల్లా మల్లేశ్వరం దగ్గర నిర్మాణం కాకుండా చూడడంలోనూ, శ్రీబాగ్ ఒడంబడికను తుంగలో తొక్కి, సీమను ఎడారి ప్రాంతంగా మారేందుకు తమవంతు కృషి సల్పడంలో సఫలీకృతమైన దక్షిణ కోస్తా సంపన్నవర్గాల మాటలకు నేడు 'డూడూ బసవన్నల్లా' తలలూపుతున్న నేటి సీమ ప్రాంతపు అన్ని రాజకీయ పార్టీల (పార్లమెంటరీ) నాయకుల ఆధ్వర్యంలో సీమప్రాంతం తన ఉనికిని కోల్పోవడం విచిత్రమేమీ కాదు గానీ, ఆ డూడూ బసవన్నల స్వార్ధ రాజకీయ నాయకులను గొర్రెలుగా ఈ ప్రాంత సోకాల్డ్ మేధావులు అనుసరించడం మాత్రం విచిత్రమే. సీమప్రాంత సామాన్య జనం తరతరాలుగా, తొలుత పాళేగాళ్ళు, ఆ తర్వాత మైనింగ్, రియల్ ఎస్టేట్ మాఫియాల కింద అణచివేయబడి, తమకూ గొంతు ఉందనే విషయం విస్మరించారు. ముఠా నాయకుని కనుసన్నులలో నలిగిన వీరికి తమదైన స్వంత వ్యక్తిత్వం, స్వేచ్ఛ లేవు. అటు తెలంగాణ లోని ప్రజాస్వామిక ఉద్యమాలు గానీ, ఇటు కోస్తా ప్రాంతంలో పెట్టుబడి ప్రవేశం వల్ల వచ్చిన స్వేచ్ఛా వాయువులు గాని సీమలో లేకపోవడం దీనికి కారణం అనవచ్చు. కరువు కాటకాల మధ్య నలుగుతూ, అనునిత్యం జీవన పోరాటం చేస్తున్న ప్రజలకు తమ స్వంత అస్తిత్వాన్ని చాటుకొనే స్పృహ, సామర్థ్యం ఎక్కడిది. కాని, 'గొంతులేని వారి గొంతుకగా, చూపులేని వారి చూపుగా' వ్యవహరించాల్సిన మధ్యతరగతి, ముఠాల స్వైరవిహారాల మధ్య మౌనం వహించడమే బాధాకరం.

1983 లాంటి సీమప్రాంత హక్కుల ఉద్యమాలు వచ్చినా, అవి ఉద్యమనేతలకు రాజకీయాధికారం కలిగించాయి గానీ సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదు. చివరకు, తన పీఠాన్ని పునరుద్ధరించేందుకు అసువులు బాసిన రాయలసీమ వాసులకు రానున్న ఇబ్బందేమీ లేదు. 'తెలుగు గంగ' పేరుతో తమకు పేరు, ప్రతిష్టలు, సంపద చేకూర్చిన తమిళనాడుకు నీరందించడం తప్ప.

కోస్తా ప్రాంత రాజకీయ నాయకుల కుటిలత్వం 1924లోనే బయట పడింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రకటన జనవరి 13, 1924న వెలువడింది. విజయవాడలో విశ్వవిద్యాలయ కేంద్రం, విశాఖ, రాజమండ్రి, అనంతపురంలలో పిజి కేంద్రాలు ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి నాటి మద్రాసు శాసనసభలోని ఆంధ్ర ప్రాంత శాసనసభ సభ్యులు అడ్డుపడడంతో, రాయలసీమకు ఉన్నతవిద్య మరి మూడు దశాబ్దాల దూరానికి వెళ్లింది. తిరిగి 1953లో వేంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపన వరకు సీమ విద్యార్థులు ఉన్నత చదువుకై మద్రాస్ వెళ్లవలసిన దుర్గతి ఏర్పడింది. ఆ విధంగా, మూడు తరాలకు ఉన్నత విద్య దూరం అయింది.

కోస్తా ప్రాంత రాజకీయ నాయకుల కుట్ర, కుతంత్రాలు అర్థం చేసుకున్న రాయలసీమ పెద్దలు 1935 రాయలసీమ రెండవ మహాసభలో 'ఆంధ్ర రాష్ట్ర' ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు కూడా. అంతకు క్రితమే 1928 జనవరి 19న నంద్యాలలో నిర్వహించిన 'దత్త మండలాల మహాసభ'లో ఈ ప్రాంతానికి 'రాయలసీమ' అని నామకరణం చేశారు. తాము దత్తపుత్రులుగా ఉండదలచుకోలేదని, తమకూ స్వంత అస్తిత్వం, ఉనికి, గుర్తింపు ఉన్నాయని నాడే పెద్దలు చాటారు. (నేటి గద్దలు 'సీమాంధ్రులమంటూ' అస్తిత్వాన్ని కోస్తా సంపన్నవర్గాలకు తాకట్టు పెట్టారు.) ఇక 1931 జూన్ 21న కడపలో 'రాయలసీమ ప్రథమ మహాసభ' జరిగింది. అక్కడే కడప కోటిరెడ్డి, పప్పూర్ రామాచార్యుల వంటివారు ఉత్తరాదివారి (కోస్తా ప్రాంత రాజకీయ నాయకుల) నిజాయితీపై అనుమానం వ్యక్తం చేశారు. తాము విడిగా ఉండడమే శ్రేయస్కరమనే నిర్ణయానికొచ్చారు. 1937లో ఇరు ప్రాంత నాయకుల మధ్య 'శ్రీబాగ్ ఒడంబడిక' ఆ తర్వాతి కాలంలో దాని విస్మరణ, ఉల్లంఘనల గురించి చెప్పడం చర్విత చరణమవుతుంది.

ఒక విధంగా చెప్పాలంటే, రాయలసీమ 1956 తర్వాత కూడా దళారీ పాలకుల చేతిలో ఛిద్రమయింది. గతంలో కృష్ణదేవరాయల పాలన తర్వాత, అది పాళెగాళ్ల రాజ్యమయింది. పాళెగాళ్ల పాలనలో సామాన్య ప్రజల్ని పట్టించుకున్న నాథుడే లేడు. ఆ తర్వాత పాళెగాళ్లను బ్రిటిష్ వాళ్లు అణచివేశాక, కొంతమేరకైనా రాయలసీమ సుస్థిరపాలనలోకి వచ్చింది. భూములు సర్వే చేయబడ్డాయి. కె.సి. కెనాల్ బ్రిటిష్ వాళ్ల ప్రయోజనార్థమైనా, ఆ తర్వాతి కాలంలో కర్నూల్-కడప జిల్లా రైతాంగాన్ని కొంతమేరకు సుభిక్ష చేసింది. వరుస కరువులతో సతమతమైన రాయలసీమ ప్రజల, భూముల దాహార్తి తీర్చేందుకు రాయల కాలంలో నిర్మించిన చెరువులు, కుంటలు పాళెగాళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మన్రోలాంటి బ్రిటిష్

గవర్నర్లు వాటిని పునర్నిర్మాణం చేసి, ప్రజల, భూముల దాహార్తిని తీర్చారు. అనంతపురంలో ఐదు జిల్లాలకు ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కర్నూల్‌లో మిషనరీ హైస్కూల్‌లు ప్రారంభించబడ్డాయి. (ఆ తర్వాత స్వతంత్ర భారతంలో 1968 వరకు అనంతపురం జిల్లాకు మరొక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడం ఆశ్చర్యకరమా?) మన్రో పాలనా కాలాన్ని (1800-1807) ఇప్పటికీ 'స్వర్ణయుగంగా' రాయలసీమ వాసులు భావిస్తున్నారంటే, ఆ తర్వాతి పాలకులు ప్రజల ప్రయోజనాల పట్ల ఎంత నిర్లక్ష్యం చూపారో అర్థం చేసుకోవచ్చు.

అత్యంత తక్కువ వర్షపాతం వల్ల, భూమి పైభాగపు మట్టి కొట్టుకుపోయి, రాయలసీమ అంతటా మనకు కనిపించేది రాళ్లే. అయితే, వాటిలో కొన్ని విలువైన ఖనిజాలు కావడంతో, స్వతంత్ర భారతంలో, గతకాలపు పాళెగాళ్లు మైనింగ్ మాఫియాలయ్యారు. ఇక, గనులు, సారా కాంట్రాక్టులు, ప్రైవేట్ బస్ సర్వీసులు, ఎర్ర చందనం వీటన్నింటి ద్వారా డబ్బు సంపాదనకై వీరి మధ్య అంతర్యుద్ధం, కక్షలు, కార్పణ్యాలతో రాయలసీమ నేల రక్తంతో ఎర్రబారింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఇక్కడ అర్థం లేదు. బలమున్న వానిదే రాజ్యం. వాడే సర్పంచు, మండలాధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఛైర్మన్, ఎంఎల్ఎ, ఎంపి; వారి కనుసన్నులలో ప్రభుత్వ యంత్రాంగం. అదెంత భయంకరమైన పరిస్థితికి దిగజారిందంటే, వీరందరూ ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వమే 1981లో 'రాయలసీమలోని ముఠా హింసలపై హౌస్ కమిటీ'ని వేయాల్సి వచ్చింది. ఆ కమిటీ సభ్యులు సమర్పించిన నివేదిక 'పై హింసాత్మక ధోరణి వేయి పడగల విషసర్పమై రాయలసీమ ప్రాంతపు అన్ని గ్రామాలలో తన విషబీజాలను నాటింది. ముఠా నాయకులు సమాజంలోని అన్ని పార్శ్వాలపై పట్టు బిగించి సంపదను, సామాజిక హోదాను పొందడమే గాక, కిందిస్థాయి ఉద్యోగులపై పట్టు బిగించారు. తమ పనుల సాధనకై మొదట ఆ ఉద్యోగులకు భీతి కలిగించడం కాగా, రెండవ దశలో ముఠాలు రాజకీయేకరణ పొంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులుగా అవతారమెత్తారు'. ఫలితం బలవంతపు వసూళ్లు, అక్రమ మైనింగ్, ప్రభుత్వ టెండర్లను దౌర్జన్యంతో స్వంతం చేసుకోవడం, దొంగసారా వ్యాపారం, మట్కా, జూదాన్ని ప్రోత్సహించడం, బాంబుల తయారీ, అమ్మకం, భూ ఆక్రమణలు. ఇవన్నీ నాయకుల ఆదాయ వనరులు.

అయితే ఇప్పటికీ నాయకుల స్వభావాల్లో వచ్చిన మార్పేమీ లేదు గాని, రూపంలో మార్పులొచ్చాయి. వారే నేడు ఎంఎల్ఎలు, ఎంపిలు, మంత్రులయ్యారు. అన్ని ప్రాజాస్వామ్య సంస్థలను చేజిక్కించుకున్నారు. గతంలో తమ సాయుధ ముఠాలతో జరిపించే కార్యక్రమాలన్నీ నేడు అధికారికంగా, ప్రభుత్వ రక్షక భటులతో జరుపుతున్నారు. వ్యతిరేకులను, క్షమించండి, ఇక్కడ సీమ నాయకులకు వ్యతిరేకులుండరు, కేవలం శత్రువులే ఉంటారు. భిన్నాభిప్రాయం గలవాళ్లను తప్పుడు కేసులు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పడం, జైలు పాలు చేయడం, అయినా మొండికేసిన వాళ్లను ఖతం చేయించడం పరిపాటి. ఎన్నికల్లో సాధ్యమయ్యేంత వరకు ఎవ్వరూ ప్రత్యర్థి లేకుండా చేయడం, ఇది, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం వరకు సాధ్యమయ్యింది. తాము ఓడిపోతామనే భయం ఉంటే, ఏ స్వతంత్ర అభ్యర్థినో హత్య చేయించి ఎన్నికలను వాయిదా వేయించడం ఇక్కడ పరిపాటే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక ఈ ముఠా నాయకులు, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలలో చేరి, రాజకీయ ముసుగును తగిలించుకొని గౌరవనీయులుగా చలామణీ అవుతున్నారు. ప్రజల నుండి వీరెంత దూరమయ్యారంటే, ఏ రాజకీయ నాయకుడు బయటకు వెళ్లాలన్నా వారి వెంట ప్రభుత్వం నియమించిన అంగరక్షకుడు గాకుండా, స్వంత సాయుధ రక్షకులుండాల్సిందే. ప్రజల పేదరికాన్ని, కులాన్ని, తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ప్రభుత్వ నిధులు అన్నీ వీరి కనుసన్నలలోనే పంచబడుతాయి. నిత్య దరిద్రంతో బాధపడే ప్రజానీకం, ప్రభుత్వం అందజేసే నిధుల కోసం వీరి పంచన చేరాల్సిందే. ప్రాంత రాజకీయ (ముఠా) నాయకున్ని ఆశ్రయించకపోతే, ఇంటి స్థలాలు, రుణం మంజూరు కాదు కదా చివరకు పచ్చకార్డూ లభించదు.

పై విధమైన అప్రజాస్వామిక వాతావరణంలో, సామాన్య ప్రజలే కాదు, మేధావులనబడే వారు కూడా గొంతెత్తి అరిచే పరిస్థితిని కోల్పోయారు. రాయలసీమ కరువు, ప్రజల దుస్థితికి చలించి కథలు, నవలలు, కవితలు రాసినా, ఆ దుస్థితికి రచయితలు నిందించేది ప్రకృతినే తప్ప నాయకుల్ని కాదు. అలా తరతరాలుగా అణచివేయబడ్డ ప్రజలు, నిర్లక్ష్యం చేయబడిన ప్రాంతం తమ దుస్థితికి పాలకులే అని గుర్తించడానికి చాలా సమయం పడుతుంది కూడా. ఇక్కడ ముందు పేర్కొన్నట్లు రైతాంగ పోరాటాలు లేవు. ప్రజాస్వామిక ఉద్యమాలు లేవు. అపుడపుడు పీలగా నిరసన గొంతు వినిపించినా, దాన్ని కొని వేయడమో, నొక్కి వేయడమో జరుగుతుంది.

ఇక పేదలలో అత్యంత పేద అన్నట్లు, వెనుకబడిన ప్రాంతంలో, పూర్తిగా క్షామ పీడిత ప్రాంతం అనంతపురం జిల్లా. ఆ జిల్లా నుండి ముఖ్యమంత్రి, రాష్ట్రపతి, మరెందరో మంత్రులు వచ్చారు, పోయారు., కాని ఒరగబెట్టిందేమీ లేదు. ఇంకా విచిత్రమైనదేమిటంటే, గాలి జనార్దనరెడ్డికి బంగారు బాతయిన గనులు అనంతపురం జిల్లాలో ఉండగా, దానికి సంబంధించిన కర్మాగారం కడపలో నెలకొల్పడం. దాని గురించి గొంతెత్తిన రాయకీయ నాయకుడుగాని, విద్యావంతులు గాని ఎవ్వరూ లేరు. అనంతపురం జిల్లా కేవలం తుంగభద్ర జలాలపై ఆధార పడుతుంది. రకరకాల కారణాల వల్ల తుంగభద్ర నుండి జిల్లాకు కేటాయించిన నీరులో సగం కూడా రావడం లేదనేది చేదు సత్యం. ఇప్పుడున్న కాలువకు సమాంతర కాలువ నిర్మించడమే అనంతపురం జిల్లా వాసులు, వారి వాటా తుంగభద్ర పొందేందుకు ఏకైక మార్గమని ఎంతో మంది ఇంజనీర్లు చెప్పినా పట్టించుకున్న నాయకుడు లేడు. 'సమైక్యాంధ్ర' జపం చేస్తూ, రాయపాటికి, లగడపాటికి ఊడిగం చేసే ఈ నాయకులు తమ ప్రాంత పరిస్థితులను, ప్రయోజనాలను పట్టించుకుంటారనే నమ్మకం ప్రజలు కోల్పోయారు. రాయలసీమ ప్రాంతానికి ఏకైక జలవనరు క్రిష్ణా నది. ఇప్పుడు అందుతున్న నీరు ఇక్కడి ప్రాంత అవసరాలకు ఏ మాత్రం చాలదని అందరికీ తెలుసు. తెలిసీ, ప్రజల్ని మభ్యపెడుతూ, తనకు వచ్చిన కాంట్రాక్టులు, తద్వారా తమ కుటుంబం లబ్ధి పొందేందుకు అటు దక్షిణ తెలంగాణ, ఇటు రాయలసీమ మిగులు జలాలపై ఆధారపడే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు రాజశేఖరరెడ్డి. తగినంత నీరులేదు, ఎత్తిపోతలకవసరమైన విద్యుచ్ఛక్తి లేదు గాని, కాలువ మాత్రం తవ్వారు. కాంట్రాక్టర్లు, ఆయన కుటుంబం లబ్ధి పొందారు.

ఈ నేపథ్యంలో సమైక్యవాదులకు మేం వేసే ప్రశ్న, అందరం కలిసి ఉండాలంటున్నారు కదా, అలాంటప్పుడు తమతో ఉన్న ఇతరుల అవసరాలు తీర్చాలి గదా. అలాంటప్పుడు, బ్రిజేష్ కుమార్ కమిటీ

ఆంధ్రప్రదేశ్‌కు అదనంగా కేటాయించిన 190 టిఎంసి నికర జలాల మొత్తాన్ని రాయలసీమ, దక్షిణ తెలంగాణలో నిర్మితమవుతున్న నూతన ప్రాజెక్టులకు మాత్రమే వినియోగించడానికి లగడపాటి, రాయపాటి, కావూరిలు అంగీకరిస్తారా? తమ తోటి సోదరులైన దక్షిణ తెలంగాణ, రాయలసీమ రైతాంగానికి కనీసం ఒక పంటకైన నీరును కేటాయించేందుకు, డెల్టా సాగు స్థిరీకరణకు, పరితపిస్తూ, నాగార్జునసాగర్, కృష్ణా డెల్టాల కింద మూడు పంటలు పండించుకొనే కోస్తాంధ్ర సంపన్న రైతాంగం తాము కేవలం రెండు పంటలకే, అవసరమైతే ఒక పంటకే పరిమితమవడానికి సిద్ధంగా ఉన్నారా? కృష్ణా నదీ జలాల వినియోగం విషయంలో శ్రీబాగ్ ఒడంబడిక అమలుకు కోస్తాంధ్ర సంపన్న రైతాంగం, లగడపాటి, ఇతర అన్ని పార్టీల రాజకీయ నాయకులు సిద్ధమేనా? వారి దగ్గర పై ప్రశ్నలకు జవాబుల్లేవు.

సమైక్యాంధ్రలో రాయలసీమ అనుభవించిన నిర్లక్ష్యాన్ని పరిశీలిస్తే భవిష్యత్‌లో కూడా రాయలసీమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు. 'రామన్నకు తిరిగి వీరమెక్కించడానికి రక్తమోడ్చిన అనంతపురం జిల్లా వాసులకు కన్నీరే మిగిల్చాడు. చివరకు 1981లో అఖిలపక్ష కమిటీ కూడా కృష్ణా జలాల పంపిణీ విషయంలో రాయలసీమకు అన్యాయమే చేసింది. నదీ పరీవాహక ప్రాంత ప్రకారం సీమకందవలసిన 155 టిఎంసి నీటికి బదులుగా కేవలం 122 టిఎంసిలని మాత్రమే విదిల్చింది. అదీ బ్రిటిష్ పాలనలో కెసి కెనాల్‌కు కేటాయించబడ్డ 40 టిఎంసిలు, ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ముందే కేటాయించబడ్డ 62 టిఎంసిల తుంగభద్ర నీటిని కలుపుకొని కేటాయించినదీ. అదే కోస్తా ప్రాంతానికి (కృష్ణా పరీవాహక ప్రాంతంలో కేవలం 13.11 శాతం కలిగినది) వాస్తవంగా కేటాయించవలసినది 99 టిఎంసిల నీరు కాగా వారికి కేటాయించినది 377 టిఎంసిలు. బచావత్ కమిటీ ముందు రాయలసీమ క్షామపీడిత ప్రాంతమని, వెనుకబడ్డ ప్రాంతమని, అందువల్ల ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది జలాలలో ప్రాధాన్యతనివ్వాలని వాదించిన ప్రభుత్వం, తీరా ప్రాంతాలవారీగా నీటిని కేటాయించినప్పుడు మాత్రం సీమకు మొండిచేయి చూపింది. ఈ విషయంలో కోస్తా ప్రాంతవు అభ్యుదయవాదులమనే వారి వాదన ఎంత అప్రజాస్వామికమైందో చూద్దాం. అంతర్జాతీయ చట్టాలు, నియమాల ప్రకారం రైపరియన్ హక్కులుంటాయని, అందువల్ల అప్పటికే నీటి సౌకర్యాలను అనుభవిస్తున్న వారికి ఇబ్బంది కలుగజేయకూడదని, అందువల్ల సాగర్, కృష్ణా డెల్టాలకు ప్రాధాన్యతనివ్వాలని వారి వాదన. తాము ముందు నుండీ ముప్పూటల మెక్కుతున్నామని, కనుక తమకు ఏ మాత్రం ఇబ్బంది కలుగజేయకూడదని, రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రజలు తిండిలేక మాడి చచ్చినా ఫర్వాలేదని వారి సూత్రీకరణ. కనీసం మానవతాదృష్టిలేని ఈ వైఖరి కలిగి ఉన్న వారితో, తెలంగాణ, రాయలసీమ వాసులు ఎందుకు కలిసి ఉండాలో అర్థం కాని విషయం.

దేశంలోనూ, రాష్ట్రంలోనూ అన్ని ప్రాంతాల ప్రజలకు నీరు అవసరమని, ఉన్న జల సంపదను, వారి కనీస మౌలిక అవసరాలకు వినియోగించాకే, మిగులు జలాలను పునః పంపిణీ చేయాలనే న్యాయబద్ధమైన డిమాండ్ సమైక్యాంధ్ర వాదుల చెవికెక్కదు. కోస్తాంధ్ర ప్రాంతంలో వర్షపాతం ఎక్కువ, భూగర్భజలాలు ఎక్కువ. అదీగాక, వారు సాగునీరు తక్కువ కావడం వల్ల గాక, డ్రైనేజ్ సమస్యతో బాధపడుతున్నారనే విషయం అందరికీ తెలుసు. అలాంటప్పుడు, వారు భూగర్భ జలాలను కనీసం ఒక పంటకైనా వినియోగించుకుంటే, ఆ మిగులు నీరును, అవసరమైన ఇతర ప్రాంతాలకు తరలించవచ్చు. వారు దానికి సిద్ధంగా లేరు. అన్నీ వసతులు తామే అనుభవించాలి, తమ తోటివారు పస్తులుండాలి అనే సిద్ధాంతాన్ని ఇంకెంత మాత్రం సహించే స్థితిలో సీమవాసులు లేరు. అసలు నీటి పంపిణీ ప్రాతిపదిక మారాలని రాయలసీమ విద్యావంతుల వేదిక డిమాండ్ చేస్తోంది. 1) ప్రాంతాల వారీగా వర్షపాతపు నిష్పత్తి; 2) భూమి స్వభావం; 3) జనాభా; 4) తాగు, సాగు నీటి అవసరాల బట్టి నీటి వనరులను పంపిణీ చేయాలి. నీటి వనరులు లేని చోటికి నీటిని అందించాలి తప్ప, వర్షపాతం తక్కువ, ఎత్తైన ప్రాంతాల పేరుతో, ప్రాంతాలను వివక్షతకు గురి చేయకూడదు. అలా అయితే బొగ్గు ఎక్కువ దొరికే తెలంగాణ ప్రాంతంలోనే థర్మల్ స్టేషన్లు ఉండాల్సి ఉంటుంది. అపారమైన ఖనిజ సంపద ఉన్న రాయలసీమ జిల్లాలకే ఖనిజ సంపద పరిమితం చేయాల్సి ఉంటుంది. తెలంగాణ బొగ్గును వివిధ ప్రాంతాలకు మళ్లించి థర్మల్ విద్యుత్‌ను అందించే ప్రభుత్వాలు, ఆ పద్ధతిలోనే దక్షిణ తెలంగాణ, రాయలసీమలకు జలవనరులనందించాల్సి ఉంది. రాయలసీమ వాసులు తమకు ప్రత్యేకంగా వేరే ప్రాంతం నుండి నీరు అందించమనడం లేదు, తమకు కృష్ణా జలాలలో న్యాయమైన వాటానందివ్వాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో గతంలో తమకిచ్చిన హామీలను అమలు పరచాలంటున్నారు.

వలసవాదులవలె, ప్రకృతికి ప్రాంతాల పట్ల పక్షపాత వైఖరి లేదు. అందుకే, జలవనరులు తక్కువ ఉన్న రాయలసీమ అశేష ఖనిజ సంపదకు నిలయంగా ఉంది. అంతర్జాతీయ విలువ గల ఎర్రచెందనం, సున్నపురాయి, బాక్సైట్, అనేక రకాల ఖనిజాలకు ఆలవాలం రాయలసీమ. ఈ ప్రకృతి సంపదను ప్రజల ప్రయోజనాలకనుగుణంగా వినియోగించుకుంటే, రాయలసీమ రాష్ట్రం దేశంలోనే అత్యంత సంపన్నమైన రాష్ట్రంగా రూపుదిద్దుకుంటుంది. అందుకు చిత్తశుద్ధి ఉన్న పాలకులు కావాలి. చిత్తశుద్ధి ఉన్న వారెవరైనా ఉన్నా సమైక్య రాష్ట్రంలో ఈ ప్రాంతపు ప్రతినిధులు కేవలం 52 మంది మాత్రమే కాబట్టి కోస్తాంధ్ర ప్రాంత అంగ, అర్థబలం ముందు నిలబడలేరనే వీరి మాట చెల్లదని చరిత్ర చెబుతున్న వాస్తవం.

ఇటు రాష్ట్ర ప్రభుత్వమే గాక, కేంద్ర ప్రభుత్వమూ రాయలసీమ పట్ల చిన్నచూపే చూసింది. కొత్త రైలు మార్గాలటుంచి, గతంలో ఉన్న రైళ్లను దారి మళ్లించారు. చెన్నై – అహమ్మదాబాద్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్ గతంలో రేణిగుంట, కడప, గుంతకల్, ఆదోని మీదుగా వెళ్లేది. ఇప్పుడది విజయవాడ ద్వారా వెళ్లనుంది. అదే విధంగా గతంలో ముంబై – త్రివేండ్రం నేత్రావతి ఎక్స్‌ప్రెస్, ఆదోని, గుంతకల్, ధర్మవరం మీదుగా వెళ్లేది. ఆ రైలునే రద్దు చేశారు. ఇక బెంగళూరు – పాట్నా సంఘమిత్రను రైలు రాయలసీమ ద్వారా అనంతపురం, కర్నూల్, హైదరాబాద్, ఖాజీపేట ద్వారా నడిపితే (బెంగళూరు – ఖాజీపేట కేవలం 760 కిలోమీటర్లు) తక్కువ దూరం, తక్కువ ఖర్చులతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేది. అయితే రాయలసీమ ప్రజలకు ఉపయోగపడుతుందేమోననే భయంతో దాన్ని చెన్నై, విజయవాడ ద్వారా నడుపుతున్నారు. దాంతో కేవలం రాయలసీమ ప్రాంత ప్రజలే గాక, మహబూబ్‌నగర్ జిల్లా వాసులు రైల్వే సౌకర్యం కోల్పోయారు. పాలకవర్గాలు రాయలసీమ, దక్షిణ తెలంగాణపై చూపిస్తున్న వివక్షకు మరో ఉదాహరణ పండగ సీజన్లో

హైదరాబాద్ నుండి కాకినాడ, విశాఖకు ప్రత్యేక రైళ్లు నడుపుతారు తప్ప, హైదరాబాద్ నుండి తిరుపతికి, చిత్తూర్‌కు ప్రత్యేక రైళ్లు నడుపరు. అంటే హైదరాబాద్‌లో అనేక సంస్థలలో పనిచేసేవారు ఎక్కువ కోస్తాంధ్రులనా, లేక రాయలసీమ వాసుల పట్ల నిర్లక్ష్యమా? ఉదాహరణకు చిత్తూరు నుండి హైదరాబాద్‌కు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో స్లీపర్ కోచ్‌లు సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తే అయ్యే ఛార్జి రు.295. అదే ఆర్‌టిసి బస్ (సూపర్ లగ్జరి)లో ఛార్జి రు. 583. పండగల సమయంలో ప్రయాణికులను దోపిడీ చేసేందుకు ప్రభుత్వం నడిపే స్పెషల్ బస్సుల్లో ఛార్జీ రు.839. అంటే రాయలసీమ వాసిగా పుట్టినందుకు, ఆ ప్రయాణికుడు దాదాపు మూడు రెట్లు ఛార్జీలు భరించి అసౌకర్య ప్రయాణం చేయాలి.

వీరు దళారీలకు దళారీలు, బానిసలకు బానిసలు. అందువల్ల రాష్ట్రాలు విడిపోతే లోక్‌సభలో మన ప్రాతినిధ్యం తగ్గిపోతుందని, అందువల్ల మన రాష్ట్రానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ నిధులు రాబట్టలేమనే వాదనలో ఏ మాత్రం పసలేదని తెలిసిపోయింది. వరద, కరువు బాధితులకు నష్టపరిహారం, వరి ధాన్యానికి గిట్టుబాటు ధర, విద్యుచ్ఛక్తి కొరతతో సంక్షోభంలో పడిన పరిశ్రమలు, దానివల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులు, వీరికి అవసరమైన విద్యుత్, గ్యాస్ కేటాయింపు విషయంలో మన ప్రజా ప్రతినిధులు సాధించింది శూన్యం. ఈనాడు యుపిఎ ప్రభుత్వం పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల దయాదాక్షిణ్యాలతో నడుస్తున్నదనే విషయం గణాంకాలు చెబుతున్నాయి. అయినా మన ఎంపిలు అమ్మ చేతి కీలు బొమ్మలు. అధికారానికి, ఆదాయాలకు దాసులు. పొరుగున ఉన్న తమిళనాడు ఎంపిల నుండి లేశమాత్రం గుణపాఠం నేర్వని అవకాశవాదులు. ఇంకా వీళ్లను నమ్మడం అంటే 'తిరిగి కుందేటి కొమ్ము' సాధించడమే.

రాయలసీమ వ్యథలు, కన్నీటి గాథలు, ఎన్నిసార్లు మననం చేసుకున్నా, వ్యక్తీకరించినా పిడికెడు సానుభూతి లభిస్తుందేమోగాని, మరే ఫలితం ఉండదు. రాయలసీమ ప్రత్యేక రాష్ట్రంగా మాత్రమే జలవనరులలో తన న్యాయమైన వాటా సాధించుకోగలదు. తన సహజ వనరులను, తన ప్రాంత అభివృద్ధికి వినియోగించుకోగలదు. కొత్త రాజధాని ఏర్పాటుతో కొన్ని లక్షల మందికి పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉపాధి కలుగుతుంది. కేంద్రం నుండి రాయలసీమకే ప్రత్యేక నిధులందుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, అధ్యయన కేంద్రాలు, ఒక ప్రత్యేక రాష్ట్రంగా రాయలసీమ ఏర్పరుచుకోగలదు. ఇక అవకాశ వాదులు, సమైక్యవాదులు ప్రచారం చేస్తున్నట్టుగా రాయలసీమ చిన్న రాష్ట్రం కాబోదు. దేశంలోని 13 రాష్ట్రాలకన్నా పెద్ద రాష్ట్రమవుతుంది. పైన చెప్పినట్టుగా ఖనిజ సంపదకు, అటవీ సంపదకు ఆలవాలమైన సీమ ప్రాంతంలో ప్రకృతి వనరులకు కొదవలేదు కూడా.

అంతేకాదు, ప్రత్యేక రాష్ట్రంగా రాయలసీమ అభివృద్ధికి ప్రత్యామ్నాయ ప్రణాళిక అవసరం. నదీ జలాల కొరత ఉంది కాబట్టి, ఇక్కడ కాలువల వ్యవసాయానికి ప్రాధాన్యత తగ్గించి, కుంటల, లింక్ చెరువుల వ్యవసాయానికి ప్రాధాన్యతనివ్వాలి. నేటి పాలకవర్గం చెరువుల మరమ్మత్తులను పూర్తిగా విస్మరించి, తమకు, తమ అనుయాయులైన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. అదీ మిగులు జలాలపైనే. అందుకే రాయలసీమ ప్రాంతంలో 1960-61 నాటికి చెరువుల కింద 49.7 శాతం భూమి సాగవుతుంటే, అది 1990-2000 నాటికి 9.4 శాతానికి దిగజారింది. సరే ప్రత్యామ్నాయంగా కాలువల కింద వ్యవసాయం పెరిగిందా అంటే, అదీ లేదు. (1960-61లో 22.7 శాతం; 1990-2000కు 20.2 శాతం) ఫలితంగా బావుల, బోరుల వ్యవసాయం పెరిగి (27.5 శాతం నుంచి 70.4 శాతానికి) భూగర్భ జలాలెండిపోయి, నేడు రైతులకు కన్నీరే మిగిలింది. అందువల్ల వరద సమయంలో అదనపు నీటిని వినియోగించుకొనేందుకు తగినన్ని జలాశయాలు, చెరువులు, చిన్న చిన్న కుంటల నిర్మాణం అవసరం. వర్షం లేని సమయంలో అవి కనీసం పశువులకు, మనుషులకు తాగునీటికైనా ఉపయోగపడడమే గాక, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడతాయి. అదే విధంగా ఇక్కడే లభ్యమవుతున్న ఖనిజ సంపదను, వెలికితీసి, శుద్ధి చేసేందుకవసరమైన కర్మాగారాలు నెలకొల్పి లక్షలాది మందికి ఉపాధి కల్పించవచ్చు. హైదరాబాద్ నగరం లేకపోతే సర్వం కోల్పోతామనే భయాందోళనలు అర్థరహితమైనవి. హైదరాబాద్ ఎక్కడికీ పోదు. అక్కడి ప్రైవేట్ పరిశ్రమలలో, విద్యాసంస్థలలో ఏ ప్రాంతం వారైనా ఉద్యోగాలు చేయవచ్చు, విద్యనభ్యసించవచ్చు (ఇప్పుడు రాయలసీమ ప్రాంతం నుండి వందలాది మంది బెంగళూరు, మద్రాస్ లాంటి నగరాలలో పనిచేస్తున్నారు కదా!) ఇక కృష్ణా జలాల విషయంలో కూడా, ఒక రాష్ట్రంగా తన వాటా పొందడం కష్టం కాదు. సమైక్య రాష్ట్రంలో సీమపేరు చెప్పి, కోస్తా ప్రాంతం లబ్ధిపొందుతున్నది. ఇకపై అలా జరగదు. జరగనివ్వకూడదు.

ప్రత్యేక రాష్ట్రమైనంత మాత్రాన, పాలకవర్గ స్వభావం మారుతుందనే భ్రమలు 'రాయలసీమ విద్యావంతుల వేదిక'కు లేవు. వర్గరీత్యా, ఇప్పటి పాలకవర్గాలే ప్రత్యేక రాష్ట్రంలో పాలనలోకి వస్తాయి కూడా. అయితే, ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు ప్రజలకు చేరువలో ఉంటాయి కాబట్టి, వాటిపై ఒత్తిడి తెచ్చి పనులు సాధించుకోవడం సులభమవుతుంది. మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండే అవకాశం ఉంటుంది. మన రాష్ట్ర కార్యాలయాల్లో, విశ్వ విద్యాలయాల్లో సీమ ప్రాంతపు విద్యావంతులకే ఉద్యోగావకాశాలు ఉంటాయి. నేడున్న పరిస్థితులు సీమ ప్రాంతం వారికన్నా, కోస్తా ప్రాంతం వారు అంగబలం, అర్థబలం ఉన్నవారు కాబట్టి సీమ ప్రాంతంలోని ఉద్యోగాలు కోస్తావారు చేజిక్కించుకుంటున్నారు. (ఉదాహరణకు, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడపలో రిజర్వేషన్లకు కేటాయించిన అధ్యాపక పోస్టులను కోస్తా ప్రాంతపు దళితులే చేజిక్కించుకోవడం గమనార్హం. సీమలో విద్యార్హతలు గల దళితులు లేరా!) ప్రత్యేక రాయలసీమ తక్షణ డిమాండ్ అయినప్పటికీ, ప్రజాస్వామ్య రాయలసీమ ఏర్పాటు రాయలసీమ విద్యావంతుల వేదిక లక్ష్యం. ఆ దిశగా ఇంతవరకు సంపదలో, అధికారంలో తమ వాటా పొందని సామాజిక వర్గాలతో కలిసి పనిచేసేందుకు వేదిక తన సంసిద్ధత వ్యక్తం చేస్తోంది.

చివరగా, రాయలసీమ వాస్తవంగా కూడా 'రతనాల సీమనే' కాని శతాబ్దాలుగా ఆర్థిక, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాలలో వివక్షతకు గురై నేడు తనదైన గుర్తింపునే కోల్పోయే పరిస్థితులలో ఉంది. రాయలసీమకు పూర్వ వైభవం చేకూర్చాలంటే, ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం మినహా మరో దారిలేదు. మా ఉద్యమానికి తెలంగాణ ఉద్యమం ఉత్ప్రేరకం కూడా.

(రచయిత రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు) వీ

సమైక్యాంధ్ర ఒక ప్రతీఘాతక ధోరణి

తెలంగాణ విషయంలో కేంద్రం మొదటి నుంచీ నాన్చుడు ధోరణిని అవలంబిస్తోందనీ, సమైక్యాంధ్ర నినాదంతో కొద్దిమంది సీమాంధ్ర పెట్టుబడిదారులు తెస్తున్న ఒత్తిడికి తలొగ్గి వ్యవహరిస్తోందనీ అంటున్నారు పల్నాటి శ్రీరాములు

తెలంగాణ ఉద్యమం కీలకదశకు చేరుకుందని భావిస్తున్న తరుణంలో అఖిలపక్ష సమావేశంలో హోంమంత్రి షిండే చెప్పినట్లుగా నెల రోజుల్లో తెలంగాణ సమస్యకి పరిష్కారం లభిస్తుందని అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. ఈ పరిస్థితుల్లో, మరోసారి సీమాంధ్ర పెట్టుబడిదారుల లాబీయింగ్‌కి తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై ప్రకటన చేయకుండా దగా చేసింది. శ్రీకృష్ణ కమిటీ పేరుతో, అఖిల పక్షం పేరుతో, ఏకాభిప్రాయ సాధన పేరుతో ప్రతిసారీ తెలంగాణ ప్రజల్ని మోసం చేస్తూనే ఉంది. ఐదు దశాబ్దాలకి పైగా కొనసాగుతున్న తెలంగాణ చారిత్రక పోరాటాన్ని అపహాస్యం చేస్తూ తమ నిరంకుశ స్వభావాన్ని కాంగ్రెస్ పాలకులు చాటుతూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితులలో తెలంగాణ ఉద్యమ శక్తులు తమ పోరాటాలను, వ్యూహాలను తగిన విధంగా మార్చుకుంటూ ముందుకు సాగాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రజల ప్రాంతీయ శత్రువు, సీమాంధ్ర ప్రజల సామాజిక శత్రువైన సీమాంధ్ర పెట్టుబడిదారులకి వ్యతిరేకంగా 'ఉమ్మడి శత్రువుకి వ్యతిరేకంగా ఉమ్మడి ఉద్యమం' జరగాలి. తెలంగాణ, సామాజిక ఆంధ్ర ఉద్యమ శక్తుల మధ్య సమన్వయంతో కూడిన ఆచరణాత్మక కార్యక్రమాల రూపకల్పన జరగాలి. అలాంటి మహత్తర ఉద్యమం ద్వారానే జగమొండిలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఏర్పాటును సాకారం చేసుకోగలం.

గత యాభై ఏళ్లకి పైగా తెలంగాణని కబ్జా చేసి, ప్రజలపై, వనరులపై పెత్తనం చెలాయిస్తున్న సీమాంధ్ర సంపన్న వర్గాల యాజమాన్యం కింద బానిసలుగా బతకడానికి మేం సిద్ధంగా లేమంటూ తెలంగాణ ప్రజలు ఉద్యమిస్తున్నారు. మా భూములు, మా నీళ్లు, మా ఉద్యోగాలు మాకే చెందాలని, మా నేలపై మాకు స్వయం పాలన కావాలని వీరోచితంగా పోరాడుతున్నారు. ఎప్పుడు ఊడిపోతాయో తెలియని పదవులను వదులు కోవడానికి దగాకోరు రాజకీయ నాయకులు జంకుతుంటే, విద్యార్థి, యువకులు తమ ప్రాణాలని తృణప్రాయంగా ఉద్యమం కోసం అర్పిస్తున్నారు. తెలంగాణ పోరాటంలో అణగారిన కులాలకి చెందిన మట్టి మనుషులే చోదక శక్తులుగా నిలబడి ఉద్యమిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఇకపై ద్రోహానికి, వంచనకి తావులేదని, సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యానికి ఇక చావు తప్పదని దండోరా వేస్తున్నారు.

అలాంటి ప్రజాస్వామిక, న్యాయమైన, చారిత్రాత్మక తెలంగాణ పోరాటానికి వ్యతిరేకంగా పిడికెడు సీమాంధ్ర పెట్టుబడిదారులు సమైక్యాంధ్ర జపం చేస్తూ గగ్గోలు పెడుతున్నారు. వీరి దృష్టిలో రాష్ట్ర విభజన అంటే ఆస్తుల పంపకం మాత్రమే. వీరికి ప్రజల ఆకాంక్షలు, మనోభావాలతో సంబంధం లేదు. భాష, చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి తదితర రంగాల్లో తీవ్రమైన అవమానాలు, అవహేళనలు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల బాధ, వ్యధ వీరికి పరిశీలనాంశాలు కావు. తమ అక్రమ ఆస్తుల పరిరక్షణ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తమ పెత్తనం కొనసాగాలనే దుష్టతలంపుతోనే సమైక్యాంధ్ర నాటకాన్ని రక్తి కట్టిస్తున్నారు.

సీమాంధ్ర పెట్టుబడిదారులు కేవలం హైదరాబాద్‌లోని తమ ఆస్తులను కాపాడుకోవాలనే తాపత్రయంతోనే లేరు, ఎందుకంటే ఇప్పుడు 'సమైక్యంగా' రాష్ట్రాన్ని దోచుకుంటున్నవారు, రేపు రాష్ట్రం విడిపోతే 'అంతర్ రాష్ట్ర ఆర్థిక దోపిడీదారులు'గా అవతారం ఎత్తుతారు తప్ప దోపిడీ మాత్రం ఆగదు. కానీ రాష్ట్ర విభజన పట్ల వారిని వెంటాడుతున్న భయమేమిటంటే ఎక్కడ తమ రాజకీయ అధికారానికి తూట్లు పడుతుందోనని బెంబేలెత్తు తున్నారు. తెలంగాణ రాష్ట్రం విడిపోతే సీమాంధ్రలో రెడ్లు రాజకీయంగా బలహీన పడతారు. తెలంగాణలో కమ్మ ప్రాబల్యం పడిపోతుంది. రెండు రాష్ట్రాల్లో దళిత, బహుజనులు, పూలె, అంబేద్కర్ స్ఫూర్తితో, రాజకీయా ధికారంలో తమ వాటా కోసం ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతారు. ఈ పరిణామం ఊహించుకుంటేనే సీమాంధ్ర అగ్రకుల పెట్టుబడిదారుల గుండెల్లో గుబులు పుడుతుంది. చిన్న రాష్ట్రాల ఏర్పాటు కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం మాత్రమే కాదని, అధికార వికేంద్రీకరణ జరిగి ప్రజాస్వామ్యం ప్రజలకు చేరువవుతుందని, తద్వారా సామాజిక న్యాయం లభిస్తుందని డా. బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన మాటలు ఎక్కడ నిజమవుతాయోననే కలవరపాటే అగ్రకుల సంపన్న వర్గాల సమైక్యవాద కుట్రకి ప్రధాన కారణమయింది.

సీమాంధ్ర పెట్టుబడిదారులు తమ వ్యాపార ప్రయోజనాల కోసం, తమ సామాజిక, రాజకీయ పెత్తనం కాపాడుకోవడం కోసం చేస్తున్న సమైక్యాంధ్ర నాటకానికి ప్రజల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్ష లాంటి ముసుగులు తొడిగి మోసం చేస్తున్నారు. రాష్ట్రం విడిపోతే మనకి తాగునీరు, సాగునీరు, అందదని, ఉద్యోగాలు కోల్పోతామని, కరెంట్ సమస్యలు తీవ్రమవుతాయని, నక్సలిజం పెరిగిపోయి శాంతిభద్రతలు క్షీణిస్తాయని కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారు. కానీ సీమాంధ్రలోని సాధారణ ప్రజలెవ్వరూ వీరి మాటలను పట్టించుకోవడం లేదు. వీరు చెప్పే మాటలను నమ్మడం లేదు కాబట్టే, సమైక్యాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామ్యం కావడం లేదు. ప్రారంభంలో కొంతమంది విద్యార్థులు వీరి భ్రమలలో పడినప్పటికీ ప్రస్తుతం నిజనిజాలు తెలుసుకొని సమైక్యాంధ్ర వాదులతో తెగతెంపులు చేసుకున్నారు. దీంతో వారి కార్యక్షేత్రమంతా కాన్వెంట్ పిల్లలు, కార్పొరేట్ కాలేజీలపైనే కేంద్రీకృతమయింది. పెట్టుబడిదారుల కనుసన్నలలో నడిచే సీమాంధ్ర మీడియా, లేని ఉద్యమాన్ని ఉన్నట్లుగా చూపిస్తూ తమ పాత్రని యథావిధిగా పోషిస్తూనే ఉంది.

ఎంతమంది ఎన్ని కుట్రలు పన్నినా, సీమాంధ్ర ప్రాంతంలో సామాన్య ప్రజలు స్పష్టంగానే ఉన్నారు. వారిలో రాష్ట్ర విభజన పట్ల వ్యతిరేకత లేకపోగా సానుకూలత వ్యక్తం అవుతోంది. ప్రత్యేక ఆంధ్ర ఏర్పడితే సముద్రపు తీర ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమలు ఏర్పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, నిమ్స్ లాంటి ఆసుపత్రి నిర్మాణం ద్వారా మెరుగైన వైద్య సౌకర్యాలు, హైకోర్టు రావడం ద్వారా సత్వర న్యాయం లభిస్తుందనీ, అన్నిటికంటే పరిపాలనా వ్యవహారాల్లో తమ భాగస్వామ్యం పెరుగుతుందనే భరోసా ప్రజల్లో ఉంది. ఇక్కడ జీవనదులున్నాయి, గనులున్నాయి, ఖనిజ నిక్షేపాలున్నాయి, అపారమైన సంపద, మానవ వనరులున్నాయి. అయినా దారిద్ర్యం వెంటాడుతోంది. సమైక్య రాష్ట్రంలో ఈ ప్రాంతం ఎందుకు అభివృద్ధి చెందలేదు. సీమాంధ్ర పెట్టుబడిదారులు ఒక్క హైదరాబాద్ చుట్టూ కారు చౌకగా భూములు కొని, అక్కడ పెట్టుబడులు పెట్టి దాన్ని అభివృద్ధి చేశారు తప్ప, మనల్ని పట్టించుకోలేదు. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా మోసం చేశారు. కాబట్టి మనం మన ప్రాంత ప్రగతి కోసం ప్రత్యేకాంధ్రని కోరుకోవడం తప్ప మరో మార్గం లేదంటున్నారు.

కోస్తాంధ్ర, రాయలసీమ కమ్మ, రెడ్డి పెట్టుబడిదారులు సృష్టించిన డబ్బు సంచుల కృత్రిమ ఉద్యమమే 'సమైక్యాంధ్ర!' అని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. కేవలం తెలంగాణకి వ్యతిరేకంగా వచ్చిన 'రియాక్షనరీ' ఉద్యమంగానే సమైక్యాంధ్ర నాటకాన్ని బహుజనులు చూస్తున్నారు. అగ్రకుల రాజకీయ వినాయకులు, కాంట్రాక్టర్లు, ఫైనాన్స్, సినిమా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసం చేసే గోలగానే సామాన్య ప్రజలు భావిస్తున్నారు.

మనదంతా తెలుగు జాతి అని, విడిపోతే పడిపోతామని, కాబట్టి ఒక భాష మాట్లాడే వారికి ఒక రాష్ట్రమే ఉండాలని వాదించే సమైక్య వాదులని, హిందీ మాట్లాడేవారు అనేక రాష్ట్రాల్లో ఉండగా, తెలుగు వారు ఎందుకుండకూడదో చెప్పాలని నిలదీస్తే సమాధానం లేదు. సరే వారన్నట్లు ఒక భాష మాట్లాడేవారికి ఒక రాష్ట్రం ప్రకారం, ఈ దేశంలో ఉన్న వందలాది మంది గిరిజన తెగలకి ప్రత్యేక భాష ఉంది, వారందరికీ ప్రత్యేక రాష్ట్రాలు ఇవ్వగలరా అని మనం ప్రశ్నిస్తే, సమైక్యవాదులు తెల్ల ముఖం వేస్తున్నారు.

సమైక్యాంధ్ర అనేది, పార్టీలను కాలదన్నిన కమ్మ, రెడ్డి సంపన్నవర్గాల కలయిక. కులాలకతీతంగా భూస్వామ్య, పెట్టుబడిదారుల మిలాఖత్. అసలు సమైక్యాంధ్ర అనేది ఒక ఉద్యమం కాదు. ఒక ధోరణి. దానికి తాత్విక, సాంస్కృతిక, సామాజిక పునాది లేదు. అది ఒక పేకమేడ. తెలంగాణ ధూం, ధాం లాగా, ఒక ఆటా-పాటా గానీ, సాహిత్యంగానీ సమైక్యాంధ్రకి లేవు. కానీ తెలంగాణకి మద్దతుగా, ప్రత్యేకాంధ్రని కోరుతూ సీమాంధ్ర కవులు 'కావడి కుండలు' కవితా సంకలనం తీసుకొచ్చారు. బహుజన కెరటాలు, ఎంఆర్‌పిఎస్, సామాజిక ఆంధ్ర ఉద్యమ సంస్థలు అనేక ప్రత్యేక సంచికలు, కరపత్రాలు, పుస్తకాలు, పాటల సిడిలను వెలువరించాయి. గద్దర్, గోరటి వెంకన్న, మందకృష్ణ మాదిగ, జూపాక సుభద్ర, బెల్లయ్య నాయక్, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి ఉద్యమ నేతలను ఆహ్వానించి ఒంగోలు, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. సీమాంధ్రలో శ్రీకృష్ణ కమిటీ పర్యటించిన ప్రాంతాల్లో రాష్ట్ర విభజన కోరుతూ పలు నివేదికలు సమర్పించడం జరిగింది. పలు టీవీ ఛానళ్లు నిర్వహించిన చర్చా వేదికల్లో సీమాంధ్ర పెట్టుబడిదారులకు ఎదురుగా నిలిచి వారికి ముచ్చెమటలు పట్టించే విధంగా సామాజికాంధ్ర ఉద్యమకారులు తమ వాగ్ధాటిని వినిపించారు. సామాజిక ఆంధ్ర ఉద్యమ ప్రభంజనానికి భయపడిన సమైక్యవాదులు, పోలీసులతో కుమ్మక్కై, సామాజిక ఆంధ్ర ఉద్యమకారులపై మావోయిస్టు ముద్రవేసి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించి జైల్లో పెట్టించారు. అనేక చోట్ల మీటింగ్‌లకి పర్మిషన్లు నిరాకరించడం, మీటింగ్‌ల కోసం ఫంక్షన్ హాళ్లు ఇచ్చిన వారిని బెదిరించడం లాంటి చర్యలకి కూడ సీమాంధ్ర పెట్టుబడిదారులు పాల్పడ్డారు. ఇక్కడ ఉండి తెలంగాణకి మద్దతు ఇస్తున్న వామపక్ష, విప్లవ పార్టీల కంటే ఎక్కువగా సీమాంధ్ర ప్రాంతంలో దళిత సంఘాలు, కవులు, రచయితలు, కళాకారులు తెలంగాణకి సంఘీభావం ప్రకటిస్తూ, సామాజిక ఆంధ్ర ఉద్యమభేరి మోగించా రనడంలో అతిశయోక్తి లేదు. 'అన్నదమ్ముల్లా విడిపోదాం - ఆత్మీయుల్లా కలిసుందాం' అంటూ ఒంగోలుకు చెందిన దళిత కవి కోయి కోటేశ్వరరావు ఇచ్చిన పిలుపు, నేడు రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమ నినాదంగా మారిందంటే, తెలుగాణ పోరాటానికి సీమాంధ్ర దళితుల మద్దతు ఏ రీతిగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కారంచేడు, చుండూరు, వేంపెంట, లక్ష్మింపేటలలో దళితుల్ని ముక్కలు, ముక్కలుగా నరికినోళ్లు, రాష్ట్రం ముక్కలైతే భరించలే మంటున్నారు. పోలీస్ ఆకృత్యాలకి గురైన వాకపల్లి గిరిజన మహిళల శోకం గురించి కన్నెత్తి చూడని ఈ కమ్మ, రెడ్డి, నాయక్, నాయికీమణులు, రాష్ట్ర విభజన జరిగితే తెలుగుతల్లి పడే గర్భశోకం తట్టుకోలేమంటున్నారు. గంగ పుత్రుల గుండెల్లో తుపాకీ గుళ్లు దూసుకు పోయినపుడు, చేనేతలు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు, క్రైస్తవ, ముస్లిం హక్కులను కాలరాస్తూ వారిపై దాడులు జరిగినప్పుడు సీమ కుట్టినట్లైనా స్పందిచని సీమాంధ్ర రాజకీయ నాయకులు, రాష్ట్రం విడగొడితే రాజీనామాలు చేస్తామని దొంగాట ఆడుతున్నారు. విడిపోతే పడిపోతాం - కలిసుంటే కలదు సుఖం అంటూ నీతివాక్యాలు వల్లిస్తున్నారు. సమైక్యత పేరుతో కమ్మ, రెడ్డి పెట్టుబడిదారులు చేసే గగ్గోలు అంతా విడిపోతే తమ ఆధిపత్యం కూలిపోతుందని, పోగేసుకున్న ఆస్తులకు ఇబ్బంది వస్తుందనే కలవరపాటు తప్ప మరేమీ కాదు. వీరి ఆంతర్యం అణగారిన కులాలకి అర్థమైపోయింది. రాబందులు రంగేసుకొని రామ చిలుక పలుకులు పలుకుతున్నాయని, బహుజనులంతా గ్రహించారు. నూటికి 15 మంది చేసే అగ్రకుల, సంపన్న వర్గాల అప్రజాస్వామిక గోలతో, నూటికి 85 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ ప్రజలకు సంబంధం లేదని తెగేసి చెపుతున్నారు. తెలంగాణలోనైనా, ఆంధ్రాలోనైనా మనల్ని దోపిడీ, పీడనలకి గురిచేస్తున్న శత్రువు ఒక్కరేనని, వారే సీమాంధ్ర కమ్మ, రెడ్డి పెట్టుబడిదారులని, పీడిత ప్రజలు ఎలుగెత్తి చాటుతున్నారు.

ఆంధ్రా, తెలంగాణల్లో పూలే, అంబేద్కర్ వారసులు, కొమురం భీం, కాన్షీరాం వారసులు, కుసమ ధర్మన్న, భాగ్యరెడ్డివర్మ వారసులు, కొమరయ్య, కోటేశు వారసులు, మా రోజు వీరన్న వారసులు, అయిలమ్మ, ఆలీసమ్మ వారసులు ఐక్యమవ్వాల్సిన సమయం ఆసన్నమయింది.

తమ ధన బలంతో, ఆధిపత్య అధికార బలంతో కేంద్ర పాలకులను మభ్యపెట్టి, కాలయాపన ద్వారా తెలంగాణ ధర్మ పోరాటానికి అడ్డంకులు సృష్టిస్తున్నామని సంబరపడే సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆటలు కట్టించేందుకు తెలంగాణ - ఆంధ్రా ఉద్యమ శక్తులు ఏకం కావాలి.

(రచయిత 'బహుజన కెరటాలు' వ్యవస్థాపకుడు,
సామాజిక ఆంధ్ర జెఏసి కన్వీనర్) వీ

ఉత్తరాంధ్ర సమస్యలు - సమైక్యవాదుల వైఖరి

ఉత్తరాంధ్ర నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా తమ స్వార్థ ప్రయోజనాల కోసమే సమైక్యాంధ్ర నినాదంతో అక్కడి ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను రెచ్చగొడుతున్నారని అంటున్నారు పి. కృష్ణారావు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల నుంచి ప్రజల చూపు మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 27-29 వరకు తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలను జరుపతలపెట్టిందన్న విషయం ప్రజలకి అర్థం అయిపోయింది. అదే సమయంలో డిసెంబర్ 28 నాడు కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే తెలంగాణ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి, నెలరోజులలోపు తెలంగాణ విషయాన్ని తేల్చుతామని ప్రకటించడం జరిగింది. ఈ ప్రకటన వచ్చిన తరువాత సీమాంధ్రలోని భూస్వామ్య, పెట్టుబడిదారులు ముఖ్యంగా సీమాంధ్రకు చెందిన కాంగ్రెస్ మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర పార్టీలలోని కొందరు నాయకులు కలిసి మళ్లీ సమైక్యాంధ్ర నినాదం అందుకున్నారు. అందులో భాగంగా విశ్వవిద్యాలయ విద్యార్థులను రెచ్చగొట్టడం ప్రారంభించారు. ఈ తంతు అంతా మనం డిసెంబర్ 28 తరువాత నిత్యం మీడియాలో చూస్తూనే ఉన్నాం. అయితే ఈ వ్యాసంలో ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరుగుతున్న వాస్తవిక పరిస్థితులను వివరించడానికే పరిమితం చేస్తున్నాం.

ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో రెండు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఒకటి ఆంధ్ర విశ్వవిద్యాలయం కాగా, రెండవది శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్లలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం. ఈ రెండు విశ్వవిద్యాలయాలలో గల విద్యార్థి జెఎసిలను అక్కడ గల ఆయా విశ్వవిద్యాలయ ఆచార్యులు కొందరు మొదటి నుంచి రెచ్చగొట్టి ఉద్యమాన్ని నడుపుతున్నారు. వీరి ప్రభావం వాటి అనుబంధ డిగ్రీ కళాశాలలపైన కూడా పడింది. వీరే వీధులలోకి వచ్చి మానవహారాలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఇక రాజకీయ జెఎసిల పేరుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన చోటామోటా నాయకులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పాలకవర్గ పార్టీలకు అనుయాయంగా ఉంటున్న కొంతమంది న్యాయవాదులు ఉత్తరాంధ్ర జిల్లాలలో విధుల బహిష్కరణ చేశారు. ఈ రెచ్చగొట్టి పెట్టడం కార్యక్రమాలకు వెనుక విశాఖ జిల్లాకి చెందిన కాంగ్రెస్ మంత్రి గంటా శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా కాంగ్రెస్ మంత్రి, పిసిసి అధ్యక్షులు బొత్స సత్యనారాయణ, శ్రీకాకుళం జిల్లా మంత్రి ధర్మాన ప్రసాదరావు మొదలైన గణమంతా ఉన్నారు. అయితే వీరి కార్యక్రమాలలో కాంగ్రెస్ కార్యకర్తలు, వారి నుంచి ప్రయోజనం పొందిన ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తప్ప, సామాన్య రైతుకూలీలు, విద్యార్థి, మేధావివర్గాలకు చెందిన వారు, కార్మికులు పాల్గొనడం లేదు.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సమైక్యాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమైక్యవాదులు ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం గురించి గానీ, అభివృద్ధి పేరుతో బహుళజాతి సంస్థలు చేస్తున్న దోపిడీ, విధ్వంసం గురించి గానీ వ్యతిరేకించడం లేదు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు వ్యతిరేకిస్తున్నా అవి నామమాత్రపు చర్యలుగానే కనిపిస్తున్నాయి తప్ప ప్రజల జీవితాలను విధ్వంసం చేసే పరిశ్రమల స్థాపనను నిలిపివేయడం గానీ, అందుకోసం జరుగుతున్న భూసేకరణ జిఓలను రద్దు చేయించడం గానీ చేయడం లేదు. అందుకు ఉదాహరణగా సోంపేట, కాకరాపల్లిలలో గత రెండు మూడు సంవత్సరాల నుంచి అక్కడ ప్రజలు పర్యావరణ విధ్వంసానికి కారణమైన థర్మల్ విద్యుత్ కేంద్రాలను నిలివి వేయాలనీ, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన భూసేకరణ ఉత్తర్వులను రద్దు చేయాలనీ ఆందోళనలు చేస్తున్నారు. ఆ పోరాటంలో ఆరుగురు రైతాంగ కార్యకర్తలు అమరులైన తరువాత కూడా ప్రజలకు అండగా వీరు నిలబడడం లేదు. ఇంత జరిగినా కూడా కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు శ్రీకాకుళం జిల్లాను పరిశ్రమల ప్రయోగ కేంద్రంగా మార్చడానికి ట్రైమేక్స్ పేరుతో తీరప్రాంతంలోని ఇసుకను తరలించుకొని పోవడానికి, ప్రాజెక్టులను నెలకొల్పడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అదే విధంగా రణస్థలం మండలం కొవ్వాడ మత్స్యలేశంలో అణువిద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడానికి పనులను వేగవంతం చేస్తుంది. వీటిని వ్యతిరేకిస్తూ అక్కడ ప్రజలు ఆందోళనలను తీవ్రతరం చేస్తున్నారు. అయినప్పటికీ జిల్లా మంత్రులకు, ఎంఎల్ఎ, ఎంపిలకు చీమకుట్టినట్టుగా కూడా లేదు.

ఇక విజయనగరం జిల్లాలో కూడా థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ఊపందుకుంది. ఆ జిల్లాలోని ప్రజలు కూడా వీటిని వ్యతిరేకిస్తున్నారు. విశాఖ జిల్లాలో మత్స్యకారులను నష్టపరిచే గంగవరం పోర్టు నిర్మాణం గానీ, విశాఖ ఏజెన్సీలో ఆదివాసులను నిరాశ్రయులను చేసే బాక్సైట్ తవ్వకాలను గానీ అక్కడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ఈ జిల్లాల్లోని సమైక్యవాదులకు వీటి గురించి పట్టింపు లేదు. లక్ష్మింపేటలోని దళితుల ఊచకోత సంఘటన బిసి అగ్రకుల దురహంకారాన్ని తెలియజేస్తోంది. అక్కడి మంత్రి దళిత కులానికి చెందిన వాడైనప్పటికీ దళిత పక్షపాతిగా వ్యవహరించడం లేదు. దీనిని దళితులు నిరసిస్తున్నారు. ఇక ఏజెన్సీలో ఆదివాసులు దీర్ఘకాలంగా నిత్యం మలేరియా, డెంగ్యూ, అతిసారా మొదలయిన వ్యాధులకు గురై వందలాది మంది చనిపోతున్నా వైద్య సౌకర్యాలు మెరుగుపడడం లేదు. ఇక ఉత్తరాంధ్రలో తాగునీరు, సాగునీరు సమస్య తీవ్రంగానే ఉంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కోస్తాజిల్లాలకు, విజయవాడ, హైదరాబాద్, ముంబాయి వంటి నగరాలకు వలసలు విపరీతంగా జరుగుతున్నాయి. ఇన్ని ప్రధాన

లోక్‌పాల్‌తో అవినీతి ఆపగలమా?

అవినీతి నిర్మూలనకు చట్టాలు పరిష్కారం చూపించలేవని చరిత్ర చెపుతుందనీ, వ్యవస్థ మార్పు రాకుండా అవినీతి నిర్మూలన సాధ్యం కాదనీఅంటున్నారు **ఎన్. యాకయ్య, డా. సంకినేని వెంకటయ్య**

దేశంలో ఇప్పుడు అవినీతి వ్యవస్థీకృతమైన నిత్యకృత్యమైన వ్యవహారం. లంచం ఇవ్వడం.. తీసుకోవడం మాత్రమే అవినీతి కాదు. బ్లాక్ న్యాయ నిఘంటువు ప్రకారం.. లంచం ఏ రూపంలో జరిగినా నేరమే. లంచం డబ్బుల రూపంలోగానీ లేదా బహుమతుల రూపంలో గానీ ఉంటుంది. ఒక పనికి ప్రతిఫలంగా ఆస్తి రాసివ్వడం, కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం, ఓటు ద్వారాగానీ లేదా ఇతర విధాలుగా సహాయం చేస్తానని మాటివ్వడం కూడ లంచం పరిధిలోకి వస్తాయి.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచే కుంభకోణాల పర్వం మొదలైంది. 1948లో లండన్ జీప్ స్కాండల్ బయటపడింది. మరుసటి సంవత్సరమే కేంద్ర పరిశ్రమల శాఖ తొలి మంత్రి రావు శివ బహదూర్ సింగ్ (అర్జున్ సింగ్ తండ్రి) వజ్రాల మైనింగ్ లీజు కట్టబెట్టేందుకు రు. 25,000 లంచం తీసుకుని మూడేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. 1958లో ఎల్ఐసి స్కాంను ఇందిరాగాంధీ భర్త ఫిరోజ్‌గాంధీ బయట పెట్టాడు. ఈ కుంభకోణంతో అప్పటి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి టిటి కృష్ణమాచారి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎచ్ఎం పటేల్, ఎల్ఐసి చైర్మన్ ఎల్ఎస్ వైద్యనాథన్‌తో పాటు మరికొందరికి సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. కేంద్ర మంత్రుల స్థాయిలో ఇలాంటి అవినీతి ఆరోపణలు రావడం, కొందరిపై నేరం రుజువు కావడంతో జైలుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ యంత్రాంగంలో పెరుగుతున్న అవినీతిపై విస్తృత చర్చ జరగడంతో ఎం.పి. సంతానం అధ్యక్షతన ఓ కమిటీ వేశారు. ఈ కమిటీ సూచనల మేరకు కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) ఏర్పాటు చేశారు. ఇది కేవలం అవినీతి నిర్మూలనకు సలహాలిచ్చే సంస్థ మాత్రమే. 1970 తర్వాత కేంద్ర మొదటి పాలన సంస్కరణ సంఘం సిఫార్సుల మేరకు కొన్ని రాష్ట్రాలు లోకాయుక్తను ఏర్పాటు చేశాయి. పాలన సంస్కరణల సంఘం లోక్‌పాల్ ఏర్పాటుకు కూడ అప్పట్లోనే సిఫార్సు చేసింది. అవినీతిలో కూరుకుపోయిన ఇండియాలాంటి దేశానికి లోక్‌పాల్ లాంటి స్వతంత్ర విచారణ వ్యవస్థ అవసరం తప్పనిసరని భావించింది. అయితే ఈ వ్యవస్థ మన దేశానికి మాత్రమే కొత్త కాదు. ప్రపంచంలోని అనేక దేశాల్లో లోక్‌పాల్‌తో సమానమైన వ్యవస్థలు ఉనికిలో ఉన్నాయి. బ్రిటన్, ఆస్ట్రియా, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్, నెదర్లాండ్స్, పోర్చుగల్, స్పెయిన్, న్యూజిలాండ్‌లాంటి దేశాల్లోనూ ఇలాంటి వ్యవస్థలు ఉన్నాయి.

అవినీతి నిర్మూలనకు ఉద్దేశించిన లోక్‌పాల్ గురించి అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి అశోక్‌కుమార్ సేన్ 1960లో పార్లమెంట్‌లో

సమస్యలతో సతమతమవుతున్న ఉత్తరాంధ్ర ప్రజలను పట్టించుకోని సమైక్యవాద నాయకులు వారి స్వప్రయోజనాల కోసం, భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గప్రయోజనం కోసం సమైక్యాంధ్ర నినాదంతో ప్రజలను రెచ్చగొడుతున్నారు.

ఇదే కాంగ్రెస్ నాయకులతో సంబంధాలు కలిగి ఉన్న ఎన్‌జిఒ నాయకుల ప్రోద్బలంతో కొంతమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు అక్కడక్కడ నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. జనవరి 28 తరువాత కేంద్ర ప్రభుత్వ వైఖరి తేటతెల్లం అయిన తరువాత ఎన్‌జిఓ నాయకుల ఊపు తగ్గింది. ఇక రాష్ట్ర, కేంద్ర పార్టీలయిన బిజెపి, సిపిఐ నాయకులు హైదరాబాద్‌లోను, ఢిల్లీలోను తెలంగాణ అనుకూల ప్రకటనలు ఇస్తున్నా ఇక్కడ మాత్రం ఈ రెండు పార్టీల నాయకులు నిమ్మకి నీరెత్తినట్లుగా ఉంటున్నారు. విప్లవకర వామపక్ష ప్రజాతంత్ర సంఘాలు, హక్కుల సంఘాలు, దళిత సంఘాలు, డిటిఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘం మొత్తం 15 ప్రజాసంఘాలతో ఫిబ్రవరి 3 నాడు శ్రీకాకుళం పట్టణంలో రౌండు టేబుల్ సమావేశం నిర్వహించి, తెలంగాణ ప్రజల పోరాటానికి మద్దతు తెలియజేశాయి. ఫిబ్రవరి 10న అదే శ్రీకాకుళం పట్టణంలో జిల్లా సదస్సులో రాష్ట్ర నాయకులు కా. జె.వి. చలపతిరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. కృష్ణ, డిటిఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డా.ఎం.గంగాధర్ మాట్లాడారు. మీడియాలో సదస్సు వార్తలు ప్రముఖంగా వచ్చాబడ్డాయి. ఫిబ్రవరి 16న కాంగ్రెస్ మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంపిలతో సహా కలిసి సమైక్యాంధ్ర పేరుతో శ్రీకాకుళంలో బహిరంగ సభ పెట్టడానికి రాజకీయ జెఎసి సన్నాహాలు చేస్తున్నదన్న వార్తలు ఈ వ్యాసం రాసే నాటికి మీడియాలో వస్తున్నాయి.

ఏదేమైనా సామాన్య ప్రజలు వారి దైనందిన సమస్యలతో సతమతమై వేటినీ పట్టించుకోవడం లేదు. మధ్యతరగతికి చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, న్యాయవాదులు, పత్రికా విలేకర్లు మొదలైన వారి మధ్య కొంత చర్చ జరుగుతోంది. ఫిబ్రవరి 10 వరకు ఏకపక్షంగా జరిగిన చర్చలు ప్రజాసంఘాల ఐక్యవేదిక కరపత్రం, సదస్సుతో తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల పట్ల కొంత సానుకూలత శ్రీకాకుళం జిల్లాలో రాగలదని భావిస్తున్నాం. ఇటువంటి ప్రయత్నం విశాఖ, విజయనగరం జిల్లాలో కూడా జరిగితే నైతికంగా తెలంగాణ ప్రజలకు ఉత్తరాంధ్ర ప్రజలు, ప్రజాస్వామికవాదులు మద్దతు పలికినట్లు అవుతుందని ఆశిద్దాం.

(రచయిత డిటిఎఫ్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి) వీ

ప్రతిపాదించారు. ఆ తర్వాత 1968లో అప్పటి న్యాయశాఖ మంత్రి శాంతిభూషణ్ పార్లమెంట్‌లో జన్‌లోక్‌పాల్ బిల్లు ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి దేశ రాజకీయాల్లో ఈ బిల్లు తరచూ చర్చకు వస్తోంది. 1971, 77, 85, 89, 96, 98, 2001లో కూడ లోక్‌సభ మెట్లెక్కింది. 2011లో లోక్‌సభ ఆమోదం పొందినా రాజ్యసభ ఆమోదం పొందలేక పోయింది. 2011 ఏప్రిల్‌లో జనలోక్‌పాల్ డ్రాఫ్టింగ్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. అందులో ఆర్థిక శాఖ మంత్రి పి. చిదంబరం చైర్మన్‌గా, మాజీ న్యాయశాఖ మంత్రి శాంతిభూషణ్ కోచైర్మన్‌గా, సభ్యులుగా కేంద్ర మంత్రులు సుశీల్‌కుమార్ షిండే, కపిల్ సిబాల్, వీరప్ప మొయిలీ, సల్మాన్‌ఖుర్షీద్, సామాజిక కార్యకర్త అన్నాహజారే, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్‌భూషణ్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సంతోష్‌హెగ్డే, ఆర్‌టిఐ కార్యకర్త అరవింద్ కేజ్రీవాల్ ఉన్నారు. ఈ కమిటీ లోక్‌పాల్ ముసాయిదా బిల్లు రూపొందించాక రాజ్యసభ సెలెక్ట్ కమిటీ మొత్తం 16 సిఫార్సులు చేయగా అందులో 14 సిఫార్సులను కేంద్ర కమిటీ ఆమోదించింది. ప్రధాని, న్యాయ వ్యవస్థలను లోక్‌పాల్ పరిధిలోకి తేవాలని, సిబిఐకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని అన్నా హజారే ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. వీటికి అంగీకరించని కేంద్ర ప్రభుత్వం మరికొన్ని సవరణలు చేసింది.

సవరించిన లోక్‌పాల్ బిల్లులో ముఖ్యాంశాలు

1. లోక్‌పాల్ ప్యానల్‌లో మొత్తం తొమ్మిది మంది సభ్యులు ఉంటారు. వీరిని ప్రధాని, స్పీకర్, భారత ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నేత, న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ఎన్నుకుంటుంది. ప్యానల్‌కు రాష్ట్రపతి ఆమోదం తప్పనిసరి. లోక్‌పాల్ ప్యానల్‌లో రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న వ్యక్తులకు చోటులేదు.

లోక్‌పాల్‌లోని సభ్యుల నియామకంపై రాజకీయ పార్టీల ప్రభావం ఉంటుందని ఈ కమిటీని చూస్తేనే అర్థమవుతోంది. సభ్యుల నియామక ప్రక్రియలో ప్రభుత్వానికి ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా నియంత్రణ ఉండడం లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు మౌలిక ప్రయోజనాన్ని దెబ్బతీస్తుంది.

2. లోక్‌పాల్ సిఫార్సు చేసే కేసుల దర్యాప్తునకు సిబిసి ప్రత్యేక ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలి. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) సూచనల మేరకు దీనికి డైరెక్టర్‌ను నియమించాలి. లోక్‌పాల్ సిఫార్సు మేరకు సిబిఐ దర్యాప్తు చేపట్టే కేసుల్లో తగినంత సిబ్బందిని, సరిపడ నిధులను సమకూర్చాలి. ప్రభుత్వ ప్రమేయం లేకుండానే లోక్‌పాల్ సిబిఐకి కేసులు అప్పగించవచ్చు.

ఇందులో చివరి అంశం తప్ప మిగతా అంశాలన్ని మళ్లీ కేంద్ర ప్రభుత్వంతోనే ముడిపడి ఉన్నాయి. ఇప్పటికే సిబిఐకి స్వయం ప్రతిపత్తి లేకపోవడం వల్లే రాజకీయ అవినీతిని వెలికితీయడంలో విఫలమవు తోందనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. 'కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' అని, తన మాట వినని వారిపై కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రయోగించే అస్త్రమని పేరున్న సిబిఐ లోక్‌పాల్ అప్పగించే కేసులను నిష్పక్షపాతంగా ఏ విధంగా దర్యాప్తు చేయగలదనే సందేహాలు తలెత్తుతున్నాయి.

3. లోకాయుక్త, లోక్‌పాల్‌ల ఏర్పాటులో రాష్ట్రాలకే స్వేచ్ఛ ఉంటుంది. లోక్‌పాల్ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోపు వీటిని చట్టం ద్వారా చేయాలి. లోక్‌పాల్ పరిధిలోకి ప్రధాని కార్యాలయం (పిఎంఒ) కూడా వస్తుంది. అయితే జాతీయ భద్రత, విదేశాంగ అంశాలకు మినహాయింపు ఉంటుంది.

మొదటి మూడు విషయాలు ఎలా ఉన్నా జాతీయ భద్రత, విదేశాంగ అంశాలకు మినహాయింపు ఇవ్వడం ఏ రకంగా సముచితం కాదు. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా వెలుగు చూసిన జీపుల కొనుగోలు కుంభకోణం (1948లో రెండు వేల జీపులకు ఆర్డర్ ఇవ్వమని ప్రభుత్వం ఆయనకు నిధులు అందజేస్తే 155 జీపులు మాత్రమే ఇండియాకు వచ్చాయి) లో లండన్‌లో భారత్ హైకమిషనర్‌గా పనిచేసిన వికె కృష్ణ మీనన్‌దే ప్రధానపాత్ర. అప్పటి నుంచి ఇప్పటి వరకు భారత విదేశాంగ శాఖ సామ్రాజ్యవాద దేశాల, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను నెరవేర్చే యంత్రాంగంగా పనిచేస్తోంది. నూతన పారిశ్రామిక విధానాలు దేశంలో అమల్లోకి వచ్చాక, ప్రపంచీకరణ వేగవంతమయ్యాక విదేశాంగ శాఖ పాత్ర మరింత విస్తృతమైంది. బహుళజాతి కంపెనీలతో ఎంఒయులు కుదుర్చుకోవడం, ఇక్కడి జాతి సంపదను వారికి అప్పగించే కుట్రలో ఈ శాఖ ప్రతినిధుల పని తక్కువేమి కాదు. అలాంటి శాఖను లోక్‌పాల్ నుంచి మినహాయించడానికి మించిన దౌర్భాగ్యం మరొకటి లేదు. అలాగే జాతీయ భద్రత పేరిట లెక్కలు అవసరం లేకుండా కోట్లాది రూపాయల నిధులను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ నిధుల వ్యయానికి సంబంధించి ఎలాంటి లెక్కలు చూపాల్సిన అవసరం లేదు.

4. లోక్‌పాల్ బిల్లు నుంచి సైన్యం, నావికాదళం, వైమానిక దళం, కోస్ట్ గార్డులకు మినహాయింపు.

ఇప్పటికే భారత రాజకీయాల్లో రక్షణ శాఖలో జరిగిన బోఫోర్స్ కుంభకోణాన్ని దేశ ప్రజలు ఇంకా మరిచిపోనేలేదు. ఆ తర్వాత ఎన్‌డిఎ హయాంలోనూ ఇలాంటి సంఘటనలు వెలుగు చూశాయి. అయినా లోక్‌పాల్ ముసాయిదా బిల్లులో ఈ శాఖను మినహాయించడం గమనార్హం. బిల్లుకు కేంద్ర కేబినేట్ సవరణలు చేశాక సరిగ్గా పదిహేను రోజులకే దేశంలో వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణం వెలుగు చూసింది. మాజీ వైమానిక దళాధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎస్‌పి త్యాగి ఇటలీకి చెందిన ముడుపుల మురికికూపంలో కూరుకుపోయినట్లు వార్తలొచ్చాయి. 2005లో ఇటలీ ప్రధాని కార్లో అజెగ్లియో మన దేశంలో పర్యటించి నప్పుడు ఆయన బృందంలో హెలిక్యాప్టర్లు తయారు చేసే 'ఫిన్‌మెకానికా' కంపెనీ ప్రతినిధులు కూడ వచ్చారు. అమెరికన్ ఆయుధ కంపెనీల మాదిరిగానే ఫిన్‌మెకానికా ప్రతినిధులు కూడ అస్త్రం ప్రయోగించారు. దళారులను రంగంలోకి దింపి త్యాగికి డబ్బు, అమ్మాయిలను ఎర చూపి డీల్ కుదుర్చుకున్నారు. దేశ బడ్జెట్‌లో 30 నుంచి 40 శాతం ఏటా రక్షణ రంగానికి కేటాయిస్తున్న విషయం తెలిసిందే. సైన్యం, నావికాదళం, వైమానిక దళం, కోస్ట్‌గార్డులపై లక్షల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం ఆయా శాఖలపై వచ్చే అవినీతి ఆరోపణలపై విచారణకు అంగీకరించక పోవడాన్ని ఏమనుకోవాలి?

5. ప్రభుత్వం నుంచి నిధులు పొందే స్వచ్ఛంద సంస్థలు లోక్‌పాల్ పరిధిలోకి వస్తాయి. లోక్‌పాల్ విచారణ ఎదుర్కొంటున్న అధికారి

ప్రాథమిక దశలో తన వాదన వినిపించుకునే అవకాశం ఉంది. లోక్‌పాల్ కేసులను దర్యాప్తు చేసే సిబిఐ అధికారి బదిలీ విషయంలో లోక్‌పాల్ ప్యానల్‌కు ఎలాంటి అధికారాలు లేవు.

అయితే వ్యవస్థీకృతమైన అవినీతిని నిర్మూలించడానికి లోక్‌పాల్ చట్టం మంత్రం దండమేమి కాదు. భారత పురాణేతిహాసాల్లో అనేక గాథల్లో శాప వృత్తాంతాలున్నాయి. ప్రతి శాపానికి దాని నుంచి విముక్తి పొందే మార్గం తప్పనిసరి ఉన్నట్లే మన చట్టంలోనూ చేసిన నేరాల నుంచి తప్పించుకునేందుకు అనేక లొసుగులు ఉన్నాయి. ప్రభుత్వం సవరణలు చేసిన లోక్‌పాల్ కూడా అందుకు మినహాయింపేమీ కాదు. వరకట్న దురాచారంపై పార్లమెంటే వరకట్న నిషేధ చట్టం తీసుకొచ్చింది. కానీ దేశంలో 99 శాతం పెళ్లిళ్లు కట్నం ప్రస్తావన లేకుండా జరగడం లేదు. ఈ రోజు అవినీతి విషయంలోనూ అంతే. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లితే పైసలివ్వనిదే పనికాదనే విషయం ఎవరినడిగినా చెపుతారు. ఇందులో బాధితుడు, నిందితుడు ఇద్దరూ ముట్టచెప్పాల్సిందే. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 2010లో వెలువరించిన సర్వే వివరాల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో 80 శాతం పనులు డబ్బులు తీసుకునే జరుగుతున్నాయి. భారతదేశంలోని రాజకీయ కుబేరులు, పారిశ్రామిక వేత్తలు దాచుకున్న నల్లధనం అక్షరాల డెబ్బై లక్షల కోట్లు. ప్రపంచంలో ఉన్న నల్లధనం కన్నా ఇది ఎక్కువ.

ప్రపంచబ్యాంకు మాజీ ఉద్యోగి, ఇప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కేంద్ర ఆర్థికమంత్రిగా పనిచేసిన సమయంలో 1992లో నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు అమల్లోకి వచ్చాయి. ఈ విధానాల ఫలితంగా వేగవంతమైన ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ దుష్ఫలితమే అవినీతి, కుంభకోణాలు. అప్పటి నుంచే దేశంలోని సహజ సంపదలను విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీలు కొల్లగొట్టే విధానాలకు ప్రభుత్వమే చట్టబద్ధంగా ద్వారాలు తెరిచింది. పార్లమెంట్ సాక్షిగా ఆమోద ముద్రలు వేసింది. గనులు, 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఈ కుంభకోణాల్లో లక్షల కోట్ల రూపాయలు చేతులు మారాయి. కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రుల భాగస్వామ్యమున్న కామన్‌వెల్త్ గేమ్స్, ఆదర్శ్ హౌజింగ్ సొసైటీ, కర్నాటక భూముల కుంభకోణం లాంటి భారీ కుంభకోణాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఈ పదేళ్లలో అవినీతి లక్షల కోట్లలో జరగగా, దానికి వ్యతిరేకంగా కూడా అదే స్థాయిలో చర్చ జరిగింది. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు అవినీతికి వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారు. రాజకీయ నాయకుల విచ్చలవిడి అవినీతి, వైట్‌కాలర్ నేరాలు ఎక్కువై పోయాయి. పార్లమెంటరీ రాజకీయాల్లో ఉన్న ప్రతిపార్టీ ఏదో ఒక రూపంలో అవినీతి రొంపిలో కూరుకుపోయినవే.

దేశంలో జరిగే ప్రతి ఎంఓయు వెనక ఓ కుంభకోణం దాగి ఉంది. మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల స్థాయిలో అవినీతి ఉంది. చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, ఆంధ్రప్రదేశ్ మాజీ సిఎం వైఎస్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్, జార్ఖండ్ ముఖ్యమంత్రి మధుకోడా, శిబూసోరేన్, అర్జున్‌ముండా కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప తదితరులంతా ఈ దశాబ్ద కాలంలో విచ్చలవిడిగా మైనింగ్‌కు అనుమతులు ఇచ్చి, కమిషన్లు దిగమింగి ఎన్నో బడా సంస్థలతో ఎంఒయులు చేసుకున్నవారే. ఈ నేపథ్యంలో అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమానికి మధ్యతరగతి ప్రజలు జేజేలు పలికారు.

దేశంలో అవినీతి ఊడలు దిగిన వటవృక్షంలా మారింది. దీనిని పెకలించడం అంత సులువైన పనేమి కాదు. ఇప్పటికే అవినీతి నిర్మూలనకు చేసిన చట్టాలు ఎన్ని ఉన్నా వాటిని అమలు చేసే, చేయించే యంత్రాంగం దోపిడీ వర్గాల చేతుల్లో ఉండడంతో ఈ దుస్థితి దాపురించింది. అవినీతి అనేది కొందరు చెడ్డవాళ్ల లేదా దురాశాపరుల ఆచరణకు సంబంధించిన సమస్య కాదనేది తొలుత గుర్తించాల్సిన అంశం. లాభాలే లక్ష్యంగా పనిచేసే పెట్టుబడిదారీ ప్రధాన అవలక్షణమే అవినీతి. సమాజంలో అవినీతి, దోపిడీ సమూలంగా అంతం కావడమనేది వ్యవస్థ మార్పుతో ముడిపడి ఉన్నఅంశం. మన దేశంలో 1988లో అవినీతి నిరోధక చట్టం అమల్లోకి వచ్చింది. దీని ద్వారా ఏర్పాటు చేసిన అవినీతి నిరోధక విభాగం (ఎసిబి) కేవలం విఆర్‌ఒలు, తహసీల్దారు, ఎఇ, డిఇ స్థాయి అధికారులను మాత్రమే పట్టుకుని ఏడాదికి పదుల సంఖ్యలో దాడులు చేసి చేతులు దులిపేసు కుంటోంది. రాష్ట్ర స్థాయిలో ఇది కూడా ఒక సిబిఐలాగానే రాజకీయ కక్షలను తీర్చుకునేందుకు సాధనంగా పనిచేస్తోంది. అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను పదిలంగా ఉనికిలో ఉంచి, కొన్ని సంస్కరణలతో కూడిన చట్టాలు తెస్తే అవినీతి అంతమైపోదు. నిజానికి వెలుగులోకి వచ్చిన కుంభకోణాల కంటే బయటికి రానివే ఎక్కువగా ఉన్నాయి. బాక్సైట్, ఐరన్‌ఓర్, గ్యాస్ నిక్షేపాలు, సున్నపురాయి తదితర సహజ వనరులను, దేశ ఉమ్మడి సంపదను దోచుకెళుతున్న బహుళజాతి కంపెనీల దోపిడీని,అమెరికాలాంటి సామ్రాజ్యవాదదేశాల ఒత్తిళ్లను ప్రశ్నించకుండా అవినీతి పోవాలని కోరుకోవడం, మాట్లాడడం అర్ధ సత్యమే అవుతుంది. అవినీతి, వర్గ సమాజం నాణేనికి బొమ్మా బొరుసూ లాంటివి. ఒక దాని గురించి చెప్పకుండా మరొక దానిని గురించి మాట్లాడడం హాస్యాస్పదమే అవుతుంది. అందుకే దోపిడీ మూలాలను తెలుసుకోవాలి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలి.

(రచయితలు రీసెర్చ్ స్కాలర్; కాంట్రాక్ట్ లెక్చరర్, కాకతీయ యూనివర్సిటీ)

వధువు కావలెను

ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి (1981)

ఎంఎ; బిఇడి; బిఇ సిఇ; డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ & ఇంజినీరింగ్; డిప్లొమా ఇన్ హ్యూమన్ రైట్స్

ఎత్తు : 5.1; (కంటిచూపు తక్కువ ఉంటుంది)

ఉద్యోగం : ప్రభుత్వ ఉపాధ్యాయుడు; జీతం : రు. 22,650

గ్రామం భూంపల్లి, మం. మీర్‌దొడ్డి, మెదక్ - 502 102

తండ్రి పేరు : బాలక్రిష్ణారెడ్డి

రెడ్డి కులానికి చెందిన అమ్మాయి, కనీసం ఇంటర్మీడియట్ చదివి, సామాజిక స్పృహ కలిగి ఉండాలి. కట్నం అవసరం లేదు.

ఆసక్తి ఉన్నవాళ్లు సంప్రదించవలసిన ఫోన్ నం. 9908240768; ఇమెయిల్ : muthanagari@yahoo.com

Advt.

సమాజ స్వభావం - సామాజిక మార్పు

మళ్లీ ఒకసారి తలెత్తుతున్న ఉత్పత్తి విధాన చర్చలో భాగంగా సామాజిక చరిత్ర నియమాలను విశ్లేషించిన చారిత్రక భౌతిక వాద నేపథ్యంలో సమాజం గురించీ, మార్పు గురించీ వివరిస్తున్నారు ఎన్. వేణుగోపాల్

ప్రస్తుత సమాజం బాగులేదని, జనజీవనం సరిగా లేదని, జనజీవన సమస్యలు పరిష్కామయ్యే దారి కనబడడం లేదని చాల మంది అనుకుంటూ ఉంటారు. ఈ సమాజం మారాలని కూడ ఎందరో అంటారు. ఈ సమాజం మారక తప్పదని దాదాపు ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. కాని ఆ మార్పు ఎక్కడ ఎప్పుడు ఎలా జరగాలనే విషయంలో తేడాలు ఉంటాయి. మారిన తర్వాత తమ స్థితి గురించి ఆలోచనలలో తేడాలు ఉంటాయి. ఆ మార్పు ప్రక్రియలో తమ పాత్ర గురించి తేడాలు ఉంటాయి. ఈ తేడాలు ఎలా ఉన్నా ప్రస్తుత సమాజం నివాసయోగ్యంగా లేదని, ఇది మారక తప్పదని, ఎప్పటికో ఒకప్పటికి మారితీరుతుందని దాదాపుగా అందరూ అంగీకరిస్తారు. మరి సామాజిక మార్పు అంటే ఏమిటి? మార్పు గురించి ఆలోచనలు అందరికీ ఉన్నప్పటికీ ఆ ఆలోచనల్లో శాస్త్రీయమైన, సమగ్రమైన, ఆచరణ సాధ్యమైన ఆలోచనలకు మాత్రమే ఆ మార్పును తీసుకురాగలిగే, ఆ మార్పుకు నాయకత్వం వహించే, ఆ మార్పును నిలబెట్టగలిగే శక్తి సామర్థ్యాలు ఉంటాయి.

మరి సమాజం గురించీ, సామాజిక మార్పు గురించీ ఆలోచనలు శాస్త్రీయమైనవో కావో, సమగ్రమైనవో కావో, ఆచరణసాధ్యమైనవో కావో గుర్తించడం ఎలా? ఆ ఆలోచనలు శాస్త్రీయమైనవీ, సమగ్రమైనవీ, ఆచరణసాధ్యమైనవీ అవునో కాదో గుర్తించడానికి కనీసం నాలుగు ప్రాతిపదికలు ఉన్నాయి. ఒకటి, సమాజం అంటే, సామాజిక మార్పు అంటే వారి నిర్వచనం ఏమిటి? రెండు, సామాజిక మార్పు ఎక్కడ, ఏ తలంలో జరగవలసి ఉందని వారు అనుకుంటున్నారు? మూడు, ఆ మార్పు ఎప్పుడు సాధ్యమవుతుందని అనుకుంటున్నారు? నాలుగు, ఆ మార్పు ఏ వ్యూహాలతో, ఏ చోదకశక్తులతో వస్తుందని అనుకుంటున్నారు? ఈ నాలుగు ప్రశ్నలకు జవాబులు చెప్పే క్రమంలోనే ఆయా అవగాహనల సమగ్రత, శాస్త్రీయత, ఆచరణ సాధ్యతలతో పాటు ఇతరేతర సామాజిక అంశాలన్నీ చర్చకు వస్తాయి.

సమాజ స్వభావం అసలు మొదటి ప్రశ్న సమాజం అంటే ఏమిటనేది. సమాజం అంటే కొందరు మనుషులా? కొందరంటే ఎందరు? సమాజం అంటే భౌగోళిక ప్రాంతమా? నైసర్గిక అంశాలా? రాజకీయాలా? పాలనా విధానాలా? సంస్కృతా? జీవన విధానాలా? తాత్విక భావాలా? నైతిక ప్రవర్తనా? మతభావనలా? కుల అంతరాలా? చాల మంది దృష్టిలో సమాజం అంటే వీటిలో ఏదో ఒకటి, లేదా వీటిలో కొన్ని. ఆ ఒక్క అంశమో, ఆ కొన్ని అంశాలో మారడమే, మార్చడమే సామాజిక మార్పు అని వాళ్లు అనుకుంటారు. అలా వేరువేరుగా అనుకోవడంవల్లనే సామాజిక మార్పు గురించి చాల దృక్పథాలు ఉన్నాయి.

ఉదాహరణకు మనుషులను మారిస్తే సమాజం మారుతుందని, కనుక మనుషులకు విద్యా శిక్షణ ఇచ్చి, మంచీ మర్యాదా నీతీ సత్ప్రవర్తనా నేర్పి, హృదయ పరివర్తన కలిగిస్తే సమాజం మారుతుందని భావించే గాంధేయ నైతిక దృక్పథం గురించి అందరికీ తెలుసు. రాజకీయాలలో మంచి రాజకీయాలు ప్రవేశపెడితే, ఎన్నికలలో మంచివారిని గెలిపిస్తే, మంచి ప్రభుత్వం ఏర్పడి సమాజం మారుతుందని మరికొందరు అనుకుంటారు. ఒక ప్రాంతపు భౌగోళిక లక్షణాలే సమాజం బాగుండ డానికి కారణమని మరికొందరు అనుకుంటారు. ఆదర్శవంతమైన జీవన విధానాన్ని ప్రతిఒక్కరూ అనుభవిస్తే, అసూయా ద్వేషాలు వదిలేస్తే, ఉన్న స్థితిని విధిలిఖితమని అంగీకరిస్తే సమాజం బాగుంటుందని మరికొందరు అనుకుంటారు. కులమతాలు, ప్రాంతీయ భావనలు రద్దయితే సమాజం బాగుపడుతుందని కొందరు అనుకుంటారు. ఇతర మతాలు, కులాలు లేకపోతే సమాజం బాగుపడుతుందని మరికొందరు అనుకుంటారు. అందరికీ అన్నీ ఇచ్చే ప్రజాస్వామ్యం వల్ల అరాచకం పెరిగి సమాజం ఇలా ఉందనీ, నియంతృత్వ పాలన వస్తే సమాజం బాగుపడుతుందనీ కొందరు అనుకుంటారు. ఇలా డజన్లకొద్దీ అవగాహనలను గుర్తించవచ్చు.

ఇవేవీ సమాజాన్ని సరిగ్గా, సమగ్రంగా అర్థం చేసుకున్న దృక్పథాలు కావు. అవి సూచించే పరిష్కారాలు సమాజాన్ని సమూలంగా మార్చ జాలవు. వారు ప్రతిపాదిస్తున్న రంగాలలోని మార్పులు ఆయా రంగాలకు పరిమితమైనవి మాత్రమే. అవి కూడ పైపై పూతలు మాత్రమే గనుక వాటికి మన్నికా ఉండదు. నిజమైన అర్థంలో ఆ మార్పులు తీసుకు రావడమూ సాధ్యం కాదు, ఏదో ఒకస్థాయిలో తీసుకురాగలిగినా అవి దీర్ఘకాలం, సుస్థిరంగా మనజాలవు. ఇవాళ మనదేశంలోనే చూస్తే పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నిటికీ ఇటువంటిదే ఏదో ఒక దృక్పథం ఉన్నట్టు అర్థమవుతుంది. ఆ రాజకీయ పక్షాలన్నీ కూడ మెరుగైన సమాజాన్ని తేవడమే తమ లక్ష్యమని చెప్పుకుంటాయి గాని, వాటి దృక్పథంలోని అసమగ్రత వల్ల ఆ లక్ష్యం ఎప్పటికీ నెరవేరదు. అంతే కాక సమాజం యథాస్థితిలో ఉండడం ద్వారానే ఆ రాజకీయపక్షాల ప్రయోజనాలు నెరవేరుతాయి గనుక, వారు ప్రకటించే లక్ష్యంలో చిత్తశుద్ధి కూడ ఉండదు.

ఇక తమను తాము మార్క్సిస్టులుగా భావించుకునే, పిలుచుకునే రాజకీయ పార్టీలు కూడ సమాజం గురించి సరైన, సమగ్రమైన దృక్పథం వదిలిపెట్టి ప్రవర్తిస్తున్నాయి. సమాజాన్ని సమగ్రంగా అర్థం చేసుకుని, మౌలికంగా మార్చాలనే ఆలోచన విరమించుకున్నాయి. పార్లమెంటరీ రాజకీయాల భ్రమలో, ప్రభుత్వం మారితే సమాజం మారుతుందనే అవగాహనలో పడి వోట్లు, సీట్లు, పొత్తులు, అధికారంలో వాటాల వలయంలో పడిపోయాయి.

కాని నిజమైన మార్క్సిస్టు దృక్పథం సమాజాన్ని ఇలా పైపైన, ముక్కలుముక్కలుగా అర్థం చేసుకోదు. సమాజం అంటే మనుషులు సమష్టిగా ప్రకృతితో కలిసి, ప్రకృతితో పోరాడుతూ సాగించే ఉత్పత్తి,

పునరుత్పత్తి ప్రక్రియల, మానవసంబంధాల సమాహారం అని మార్క్సిజం నిర్వచిస్తుంది. ఈ నిర్వచనం ఎంత సమగ్రమైనదంటే దానిలో మనుషుల పాత్రా ఉంది, ప్రకృతి పాత్రా ఉంది. ప్రకృతిని ఉపయోగించుకుని మనిషి మనుగడకు అవసరమైన ఉత్పత్తి సాగించడమూ ఉంది, మనుషులు నిరంతరాయంగా పునరుత్పత్తి కావడమూ ఉంది. ఆ మనుషుల మధ్య సామూహికత వల్ల సంబంధాలు నెలకొనడమూ ఉంది. ఆ సంబంధాలలో ఐక్యతా, ఘర్షణా ఉన్నాయని, ఘర్షణే సమాజ చలనానికి చోదకశక్తి అని, సమాజం నిరంతరం మార్పుకు లోనవుతున్నదని అవగాహన ఉంది.

మనుషులు లేకుండా సమాజం గురించి ఆలోచించడం అసాధ్యం. నిత్య జీవిత ఆహారోత్పత్తి, ఇతర జీవన అవసరాల ఉత్పత్తి లేకుండా మనుషుల మనుగడ సాధ్యం కాదు. ఆ ఉత్పత్తి ఏ ఒక్క మనిషయినా ఒంటరిగా సాగించడం కుదరదు. అందువల్ల మనుషులు సామూహికంగా, సామాజికంగా ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనవలసి వస్తుంది. అందువల్ల ఆ మనుషులు నిత్య సంబంధాలలో ఉంటారు. ఉత్పత్తి ప్రక్రియలో మిగులు ఏర్పడి, ఆ మిగులును కైవసం చేసుకునే వర్గం ఏర్పడింది. అది ఉత్పత్తి సాధనాల మీద కూడ యాజమాన్యం సంపాదించింది. అప్పుడిక సమాజం తప్పనిసరిగా వర్గ సమాజంగా మారిపోయింది. కనుక మనుషుల మధ్య సంబంధాలు అట్టడుగున వర్గ సంబంధాలుగా ఉంటాయి. సామాజిక సంబంధాలు ఎన్ని రూపాలలో వ్యక్తమయినా, వాటిలో ఎన్ని రకాల అసమానతలు, వక్రీకరణలు ఉన్నా వాటన్నిటికీ మూలమైనది ఈ ఉత్పత్తి ప్రక్రియలో ఏర్పడే అసమ, వర్గ సంబంధమే. అందువల్ల సమాజాన్ని, సమాజంలోని సంబంధాలను, ఆ సంబంధాల అసమానతలను అర్థం చేసుకోవాలంటే, సమాజాన్ని మార్చాలనుకుంటే అంతిమంగా ఉత్పత్తి విధానంలోకి, వర్గ సంబంధాలలోకి, ఆ ఉత్పత్తినీ, వర్గ అసమానతనూ బలోపేతం చేసే ఉపరితల అంశాలలోకీ వెళ్లక తప్పదు.

సమాజ స్వభావాన్ని ఇలా సమగ్రంగా అర్థం చేసుకున్నప్పుడు సమాజం మనుగడలో ఉండడానికి అత్యవసరమైన ఉత్పత్తి ఎలా జరుగుతున్నదో, ఆ ఉత్పత్తి తక్షణ సమాజ అవసరాల కన్న ఎక్కువ మిగులును ఎలా సృష్టిస్తున్నదో, ఆ ఉత్పత్తి సాధనాలు ఎవరి యాజమాన్యంలో ఉన్నాయో, ఆ సాధనాలను ఉపయోగించి ఎవరు శ్రమ చేస్తున్నారో, శ్రామికుల నుంచి యజమానులకు మిగులును చేరవేసే పద్ధతులేమిటో, ఆ రెండు వర్గాల మధ్య ఉత్పత్తి సంబంధాలు, మొత్తంగా సమాజంలో సామాజిక సంబంధాలు ఏయే వ్యక్తీకరణలు పొందుతున్నాయో, శ్రామికుల ఉత్పత్తిని యజమానుల బొక్కసాలకు చేరవేసే పద్ధతులను సమర్థించే, బలోపేతం చేసే ఉపరితల అంశాలేమిటో మొదలైన ప్రశ్నలన్నిటికీ జవాబులు దొరుకుతాయి.

ఈ ప్రశ్నలూ జవాబులూ లేకుండా సమాజం గురించి ఆలోచిస్తున్నామనీ, సమాజం కోసం పనిచేస్తున్నామనీ ఎవరు అనుకున్నా అది పాక్షికమే. అందువల్లనే మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచించేవాళ్లకు కాక ఇతరులకు సమాజం గురించి పాక్షిక అవగాహన మాత్రమే ఉంటుందని అనాలి. వాళ్లు ఏనుగు ఏడుగురు గుడ్డివాళ్ల లాగ సమాజంలో ఏదో ఒక కనబడే భాగాన్ని పట్టుకుని అదే సమాజం అనుకుని, దాన్ని సంస్కరించే 'సామాజిక' కార్యక్రమాలు సాగిస్తుంటారు. వాళ్లు అనుకునేది నిజంగా మొత్తం సమాజం కాదు గనుక వాళ్లు తమ పని ఎంత చిత్తశుద్ధితో చేసినా, ఎంత కష్టపడి పనిచేసినా అంతిమ సారాంశం ఏమీ ఉండదు.

సమాజం గురించి ఇటువంటి నిర్వచనం ఇచ్చుకున్నప్పుడు, అందులో ఉత్పత్తి శక్తులు (ఉత్పత్తి సాధనాలు, సాంకేతిక విధానాలు, అవి ఉపయోగించే ప్రజలు), ఉత్పత్తి సంబంధాలు (ఆస్తి సంబంధాలు, సామాజిక సంబంధాలు), ఉపరితల అంశాలు (రాజకీయ, న్యాయ, కళా, సాంస్కృతిక, మత, నైతిక అంశాలు) అనే మూడు భాగాలు ఉన్నాయని స్థూలమైన అర్థంలో విశ్లేషణా సౌలభ్యం కోసం చెప్పుకోవచ్చు. ఈ మొత్తాన్నీ ఒక్కమాటలో గ్రహించడానికి సామాజిక-ఆర్థిక నిర్మితి అనే పారిభాషిక పదం కూడ ఉంది. ఈ సామాజిక-ఆర్థిక నిర్మితిలో కీలకమైన, నిర్ణాయకమైన భాగానికి ఉత్పత్తి వ్యవస్థ లేదా ఉత్పత్తి విధానం అనే పారిభాషిక పదం ఉంది. అయితే ఉపరితల అంశాలకు ప్రభావశీలమైన పాత్ర లేదని, అవి నిష్క్రియాపరమైనవని అర్థం కాదు. కాని ఉత్పత్తి విధానం సమాజ మనుగడకు అనివార్యమైన, నిరంతర అభివృద్ధి క్రమంలో ఉన్న పునాది అంశంగా ఉంటుంది గనుక అంతిమ పరిశీలనలో సమాజ గమనంలో ఉత్పత్తి విధానానికే నిర్ణాయక పాత్ర ఉంటుంది. అందువల్ల సామాజిక పరివర్తన అంటే స్థూలంగా ఉత్పత్తి విధానంలో పరివర్తన అనే అర్థం.

సామాజిక పరివర్తన

సమాజాన్ని అలా అర్థం చేసుకున్నప్పుడు సామాజిక పరివర్తన అంటే ఉత్పత్తి శక్తులకూ ఉత్పత్తి సంబంధాలకూ మధ్య వైరుధ్యం పరిష్కారమై సమాజం కొత్త ఉత్పత్తి శక్తులలోకి, కొత్త ఉత్పత్తి సంబంధాలలోకి పరివర్తన చెందడం అని చెప్పుకోవాలి. ఇది అలవోకగా, యాంత్రికంగా జరిగిపోయే మార్పు కాదు. ఉత్పత్తి సంబంధాలలో భాగంగా ఏర్పడిన రెండు వర్గాల మధ్య (ఉత్పత్తి సాగించే అసంఖ్యాక శ్రామిక ప్రజల వర్గం, ఉత్పత్తి సాధనాల యజమానులుగా ఆ ఉత్పత్తి ఫలితాలను తమ హక్కుభుక్తం చేసుకునే వర్గం) ఘర్షణ ద్వారా, పోరాటం ద్వారా మాత్రమే ఆ మార్పు జరుగుతుంది. మరి ఈ వర్గపోరాటాన్నీ, సమాజ పరిణామ క్రమాన్నీ, చరిత్రనూ నిర్దేశించే చలనసూత్రాలు ఏమైనా ఉన్నాయా? లేక సామాజిక మార్పులు యాదృచ్ఛికంగా, అసంకల్పితంగా జరిగిపోతున్నాయా? చరిత్రకు స్పష్టమైన, అనివార్యమైన భౌతిక చలన నియమాలు ఉన్నాయని గుర్తించి వాటిని వెలికితీయడమే మార్క్స్ బోధనల విశిష్టత. ఎ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ (1859) ముందుమాటలో తన అధ్యయనం, అన్వేషణ తనను ఈ నిర్ధారణకు ఎలా తీసుకువచ్చాయో మార్క్స్ చాల అద్భుతంగా వివరించాడు:

'చట్టపరమైన సంబంధాలను గానీ, రాజకీయ రూపాలను గానీ వాటంతటవే అర్థం చేసుకోలేమనీ, సాధారణ మానవ మేధో అభివృద్ధి అనబడేదాని ఆధారంగా కూడ అర్థం చేసుకోలేమనీ నిర్ధారణకు నా అన్వేషణ నన్ను చేర్చింది. చట్టపరమైన సంబంధాలూ రాజకీయ రూపాలూ కూడ భౌతిక జీవన పరిస్థితులలోనే పుట్టుకువస్తాయని నిర్ధారణకు నేను వచ్చాను. ఈ భౌతిక జీవన పరిస్థితులు అనే మొత్తాన్ని పద్దెనిమిదో శతాబ్దపు ఇంగ్లిష్, ఫ్రెంచ్ ఆలోచనాపరులను అనుసరిస్తూ హెగెల్ కూడ 'పౌరసమాజం' అనే పదం కింద చుట్ట చుట్టాడు. ఐతే ఈ పౌరసమాజ శరీరాన్ని విప్పి చూడడం రాజకీయార్థ శాస్త్రంలోనే జరగాలి. అలా నా రాజకీయార్థ శాస్త్ర అధ్యయనం పారిస్‌లో ప్రారంభించాను. ఎం గిజో జారీ చేసిన బహిష్కరణ ఉత్తర్వుల వల్ల అక్కడి నుంచి బ్రస్సెల్స్‌కు వెళ్లి, అక్కడ కొనసాగించాను. అలా నేను ఒక సాధారణ నిర్ధారణకు చేరాను. ఒకసారి గ్రహించినతర్వాత నా

మొత్తం అధ్యయనాలకు మార్గదర్శక సూత్రంగా మారిన ఆ నిర్ధారణ సారాంశాన్ని ఇలా చెప్పవచ్చు.

తమ మనుగడకు అవసరమైన సాధనాలను సామాజికంగా ఉత్పత్తి చేసుకునే క్రమంలో మనుషులు అత్యవసరమైన, నిర్దిష్టమైన సంబంధాలలో ప్రవేశిస్తారు. అవి వారి సంకల్పం నుంచి స్వతంత్రంగా ఉంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాలు వారి భౌతిక ఉత్పత్తి శక్తుల నిర్దిష్ట అభివృద్ధి దశకు తగినవిగా ఉంటాయి. ఈ ఉత్పత్తి సంబంధాల సమాహారమే సమాజపు ఆర్థిక నిర్మాణంగా ఉంటుంది. ఈ నిజమైన పునాది మీద చట్ట, రాజకీయ ఉపరితలం నిర్మాణం అవుతుంది. దానికి సరిపోయినట్టుగానే నిర్దిష్ట సామాజిక చైతన్య రూపాలు ఉంటాయి. ఈ భౌతిక జీవితపు ఉత్పత్తి విధానమే సామాజిక, రాజకీయ, మేధో జీవితపు సాధారణ క్రమాన్ని నిర్దేశిస్తుంది. మనుషుల అస్తిత్వాన్ని నిర్ణయించేది వారి చైతన్యం కాదు, వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సమాజపు భౌతిక ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందే క్రమంలో ఒక నిర్దిష్ట దశలో అవి అప్పటికి ఉనికిలో ఉన్న ఉత్పత్తి సంబంధాలతో వైరుధ్యంలోకి వస్తాయి. ఉనికిలో ఉన్న ఉత్పత్తి సంబంధాలు అనే మాటను చట్టపరమైన మాటల్లో చెప్పాలంటే ఆస్తి సంబంధాలు అనాలి. ఉత్పత్తి శక్తులు అప్పటివరకూ ఈ ఆస్తి సంబంధాల చట్రంలోనే పనిచేసి ఉంటాయి. అప్పటి వరకూ ఉత్పత్తి శక్తుల అభివృద్ధి రూపాలుగా పనిచేసిన ఈ సంబంధాలు అప్పుడు వాటికి సంకెళ్లుగా మారుతాయి. అప్పుడు ఒక సామాజిక విప్లవ యుగం ప్రారంభమవుతుంది. ఆర్థిక పునాదిలోని మార్పులు త్వరలోనో, ఆలస్యంగానో మహా ఉపరితలం యావత్తూ పరివర్తన చెందడానికి దారితీస్తాయి.

ఇటువంటి పరివర్తనలను అధ్యయనం చేసేటప్పుడు ఎప్పుడైనా ఉత్పత్తికి చెందిన ఆర్థిక పరిస్థితుల భౌతిక పరివర్తననూ, చట్ట, రాజకీయ, కళాత్మక, తాత్విక – ఒక్క మాటలో, భావజాల రూపాల పరివర్తననూ వేరు చేసి చూడడం అవసరం. వీటిలో భౌతిక పరివర్తనను ప్రకృతిశాస్త్రం లో లాగ కచ్చితంగా నిర్ణయించవచ్చు. ప్రజలు భావజాల రూపాలలో ఈ ఘర్షణ గురించి చైతన్యాన్ని పొంది దాన్ని ఓడిస్తారు. తన గురించి తానేమి అనుకుంటున్నాడనే దాన్ని బట్టి ఒక వ్యక్తి పట్ల తీర్పు ఎలా చెప్పలేమో, సరిగ్గా అలాగే ఒక పరివర్తనా దశను దాని చైతన్యాన్ని బట్టి అంచనా వేయలేము. దానికి భిన్నంగా ఈ చైతన్యాన్ని భౌతిక జీవిత వైరుధ్యాల నుంచి వివరించవలసి ఉంటుంది. సామాజిక ఉత్పత్తి శక్తులకూ ఉత్పత్తి సంబంధాలకూ మధ్య ఉన్న ఘర్షణ నుంచి వివరించవలసి ఉంటుంది. ఇంతవరకు ఏ సాంఘిక వ్యవస్థ కూడ దానిలో అవకాశం ఉన్న మేరకు ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందేవరకూ విధ్వంసమై పోలేదు. పాత సమాజ చట్రంలోనే తమ ఉనికికి అవసరమైన భౌతిక పరిస్థితులు పరిపక్వమయ్యేవరకూ ఏ కొత్త ఉన్నత ఉత్పత్తి సంబంధాలు కూడ పాత ఉత్పత్తి సంబంధాలను తోసివేయలేదు.

అందువల్ల మానవజాతి అనివార్యంగా తాను పరిష్కరించగలిగిన కర్తవ్యాలనే తన ముందు పెట్టుకుంటుంది. ఎందుకంటే నిశితంగా పరిశీలిస్తే, పరిష్కారానికి తగిన భౌతిక పరిస్థితులు ఉన్నప్పుడు లేదా రూపొందుతున్నప్పుడు మాత్రమే ఒక సమస్య ముందుకు వస్తుంది. స్థూల దృష్టిలో చెప్పాలంటే సమాజ ఆర్థికాభివృద్ధి పురోగతిని ఆసియాటిక్, ప్రాచీన, భూస్వామ్య, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాల యుగాలుగా చెప్పవచ్చు. బూర్జువా ఉత్పత్తి విధానమే సామాజిక ఉత్పత్తి ప్రక్రియలో చిట్టచివరి శత్రుపూరిత రూపం. ఇక్కడ శత్రుత్వం అంటే వ్యక్తిగత శత్రుత్వం అనే అర్థంలో కాదు, వ్యక్తి ఉన్న సామాజిక అస్తిత్వ పరిస్థితుల వల్ల తలెత్తే శత్రుత్వం. అయితే, బూర్జువా సమాజంలో అభివృద్ధి అయ్యే ఉత్పత్తి శక్తులు ఈ వైరుధ్య పరిష్కారానికి తగిన భౌతిక పరిస్థితులను కూడ సృష్టిస్తాయి. తద్వారా, ఈ సామాజిక నిర్మాణంతో మానవ సమాజ చరిత్రపూర్వదశ ముగింపుకు వస్తుంది...

మార్క్స్ సమాధి దగ్గర ఇచ్చిన ఉపన్యాసం (1883) లో ఎంగెల్స్ ఈ అవగాహననే మరో మాటల్లో చెప్పాడు: 'సేంద్రియ ప్రకృతి అభివృద్ధి నియమాన్ని డార్విన్ కనిపెట్టినట్టుగానే మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని మార్క్స్ కనిపెట్టాడు. భావజాలం తామరతంపరగా పెరిగిపోయినందువల్ల ఇంతకాలం మరుగున పడిపోయిన ఒక సాధారణ వాస్తవాన్ని ఆయన కనిపెట్టాడు. అది, మానవజాతి రాజకీయాలనైనా, విజ్ఞానశాస్త్రాన్నైనా, కళలనైనా, మతాన్నైనా, వగైరా దేన్నైనా సాగించడాని కన్న ముందు తినవలసి ఉంటుంది, తాగవలసి ఉంటుంది, గూడూ గుడ్డా కలిగి ఉండవలసి ఉంటుంది. అందువల్ల ఒక ప్రత్యేక యుగంలో, ఒక ప్రత్యేక ప్రజా సమూహం సాధించిన తక్షణ భౌతిక జీవన సాధనాల ఉత్పత్తి, తత్ఫలితపు ఆర్థికాభివృద్ధి స్థాయి ఒక పునాదిని కల్పిస్తాయి. ఆ పునాది మీదనే తత్సంబంధిత ప్రజల రాజ్యాంగ వ్యవస్థలు, చట్టపరమైన భావనలు, కళ, చివరికి మత భావనలు లేచి నిలుస్తాయి. అందువల్ల వీటిని వివరించడం ఆ పునాది వెలుగులో జరగవలసిందే తప్ప, ఇప్పటివరకూ జరిగినట్టుగా వీటి ఆధారంగా పునాదిని వివరించడం కాదు.

చరిత్ర పట్ల భౌతిక వాద దృక్పథం అనే ఈ భావన మార్క్స్ – ఎంగెల్స్ ల రచనల్లో తొలిరోజుల్లోని జర్మన్ ఐడియాలజీ (1845-46) నుంచి చనిపోవడానికి కొద్దిరోజుల ముందు రాసిన ఉత్తరాల వరకూ ఎన్నో చోట్ల కనబడుతుంది. ఈ చరిత్ర పట్ల భౌతికవాద దృక్పథాన్ని ఎంగెల్స్ స్వతంత్రంగానే నిర్ధారించాడని మార్క్స్ రాశాడు. మార్క్స్ ఎంగెల్స్ ఇద్దరూ కలిసీ, విడివిడిగా కూడ ఈ భావనను విస్తరించారు, అభివృద్ధి చేశారు. ఎంగెల్స్ తన 'ఆంటీ డూరింగ్' లో భాగమైన 'సోషలిజం: ఉటోపియన్ అండ్ సైంటిఫిక్' అధ్యాయం 1892లో విడి పుస్తకంగా అచ్చయినప్పుడు రాసిన ముందుమాటలో చారిత్రక భౌతికవాదం అనే మాట కూడ వాడాడు. చారిత్రక భౌతికవాదం సమాజ స్వభావం గురించీ, సమాజ పరివర్తన గురించీ, ఆ పరివర్తన చలన నియమాల గురించీ చెప్పే శాస్త్రం.

చారిత్రక భౌతిక వాదం గడిచిన నూట యాభై సంవత్సరాలకు పైగా చరిత్ర పట్ల భౌతిక వాద దృక్పథం అనే పేరుతోనూ, చారిత్రక భౌతికవాదం అనే పేరుతోనూ సమాజ పరివర్తన చలన నియమాల మీద, చరిత్ర పరిణామం మీద ఎంతో చర్చ జరుగుతున్నది. వందలాది సైద్ధాంతిక రచనలు, సిద్ధాంత అన్వయాలు, వాద వివాదాల పుస్తకాలు వెలువడ్డాయి. మౌలిక మార్క్సిస్టు రచనలకు విభిన్నమైన వ్యాఖ్యానాలు, పరస్పర విరుద్ధమైన అర్థాలు చెప్పడం, తమ తాత్విక, రాజకీయ వైఖరులను సమర్థించుకోవడానికి తగినట్టుగా మౌలిక భావనలను మార్చడం వంటి ఎన్నో గందరగోళాలు కూడ జరిగాయి. చారిత్రక భౌతికవాదంపై సోవియట్ యూనియన్ నుంచి వెలువడిన డజన్ల కొద్దీ పుస్తకాలలో తొలిరోజుల్లో యాంత్రిక వ్యాఖ్యానాలు ఉండగా, 1950ల తర్వాత వర్గ సామరస్య, విప్లవేతర సామాజిక పరివర్తనా ధోరణులు నిండిపోయాయి. యూరప్, అమెరికాలలో ఎంతో మంది మార్క్సియన్, మార్క్సిస్ట్ మేధావులు చారిత్రక భౌతికవాదం మీద చాల చర్చచేశారు. ఈ విస్తారమైన సాహిత్యంలో దాదాపుగా ప్రతి ఒక్క రచనలోనూ ఆమోదించ దగినవీ, అమోదించలేనివీ, చర్చించవలసినవీ ఎన్నో అభిప్రాయా లున్నాయి. భారతదేశంలో కూడ ఉత్పత్తి విధానం గురించి జరిగిన

చర్చలలో చారిత్రక భౌతికవాద అవగాహనల అన్వయం జరిగింది.

ఆ చర్చను అలా ఉంచి, మళ్లీ ఒకసారి మౌలికాంశాలలోకి వెళ్తే, స్థూల దృష్టితో చూసినప్పుడు సమాజపు ఆర్థికాభివృద్ధి క్రమంలో ఆసియాటిక్, ప్రాచీన, భూస్వామ్య, ఆధునిక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాల వరుస యుగ విభజనను మార్క్స్ 1859లో సూత్రీకరించాడు. ఇది అనివార్యమైన వరుస కాదనీ, ఆయా దేశాలలో వైవిధ్యం ఉండవచ్చుననీ కూడ ఆయనే సూచించాడు. 'ఇది ప్రతి సమాజం మీదా రుద్దిన విధి లిఖితం లాంటి సర్వసాధారణ చారిత్రక-తాత్విక సిద్ధాంతం కాదు' అని ఆయనే 1877లో అన్నాడు. స్థూలచిత్రం యథాతథంగా ఉంటూనే పెట్టుబడిదారీ పూర్వ సామాజిక ఆర్థిక నిర్మితుల మీద ఆయన ఆలోచనలు మారుతూ, అభివృద్ధి చెందుతూ వచ్చాయి. జె వి స్టాలిన్ హిస్టరీ ఆఫ్ ది సిపిఎస్ యు (బి) - ఎ షార్ట్ కోర్స్‌లో గతితార్కిక, చారిత్రక భౌతికవాదం అని ఒక అధ్యాయం రాసినప్పుడు మార్క్స్ చెప్పిన వరుస నుంచి 'ఆసియాటిక్ సమాజం' తొలగించి, ఆదిమ కమ్యూనిజం, బానిస సమాజం, భూస్వామ్య సమాజం, పెట్టుబడిదారీ సమాజం, సోషలిజం అనే ఐదు దశలు ఉన్నాయని అన్నాడు. సోవియట్ యూనియన్ నుంచీ, ఇతర దేశాల నుంచీ విరివిగా వెలువడిన గతితార్కిక చారిత్రక భౌతికవాద పాఠ్య పుస్తకాల వల్ల ఈ ఐదు దశల యుగవిభజనకు సార్వత్రిక ఆమోదం, ప్రచారం లభించాయి.

కాని ఈ ఐదు దశల యుగవిభజనను యాంత్రికంగా అనుసరించడం వల్ల వివిధ దేశాల ప్రత్యేకతలను గుర్తించకుండా మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణ నష్టపోయాయని వ్యాఖ్యానించిన మార్క్సిస్ట్ మేధావులు ఎందరో ఉన్నారు. ఈ యుగవిభజనను యాంత్రికంగా అన్వయించిన ఎస్ ఎ డాంగే భారత చరిత్రలో లేని బానిస సమాజాన్ని వెతకడానికి ప్రయత్నించారు. డి డి కొశాంబి ఆ ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తూనే, చారిత్రక భౌతిక వాద దృక్పథాన్ని మాత్రం తప్పనిసరిగా పాటించాలని అన్నారు. భారత సమాజంలో భూస్వామ్య విధానం ఎప్పుడు ఎలా ప్రారంభమయిందనే విషయంలో కూడ మార్క్సిస్టు సామాజిక శాస్త్రవేత్తల మధ్యనే తీవ్రమైన భిన్నాభిప్రాయాలున్నాయి. మార్క్స్ సూచించిన ఆసియాటిక్ సమాజ భావనను స్టాలిన్, అధికారిక చారిత్రక భౌతికవాద పాఠ్యపుస్తకాలు పట్టించుకోకపోయినా, దాని గురించి మార్క్సిస్టు మేధావుల మధ్య చాల చర్చ జరిగింది, జరుగుతోంది. ఆసియాటిక్ సమాజం భావనను మార్క్స్ వదులుకున్నాడని వాదించేవారూ, అలా వదులుకోలేదని ఆయన మరణానికి ముందు రాసిన రచనలవరకూ ఆధారాలు చూపెట్టేవారూ మార్క్సిస్టు శిబిరంలోనే ఉన్నారు.

అలాగే పైన చెప్పినట్టు చారిత్రక భౌతికవాదం ఎన్నో వివాదాలకు, భిన్న వ్యాఖ్యానాలకు, చర్చోపచర్చలకు దారి తీసింది. వేల పేజీలకు విస్తరించిన సాగిన ఆ చర్చనంతా ఇక్కడ వివరించడానికి, విశ్లేషించడానికి సాధ్యం కాదు గాని, ప్రస్తుత చర్చతో సంబంధం ఉన్న కొన్ని అంశాలు, వాదనలు చూస్తే సరిపోతుంది.

ఐదు ఉత్పత్తి విధానాలు వరుసగా ఒకదాని తర్వాత ఒకటి వస్తాయా, మధ్యలో సంధి దశలు ఉంటాయా, భిన్నమైన కలగలుపులు ఉంటాయా, యూరప్ అనుభవం నుంచి చేసిన ఈ సూత్రీకరణ ఇతర సమాజాలకు యథాతథంగా వర్తిస్తుందా, ఇవి మజిలీలా దశలా అని చర్చ జరిగింది. ఎంతో మంది అర్థశాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు మార్క్సిస్టు ప్రభావంలోను, భిన్నంగాను కూడ మధ్యంతర దశలను, మిశ్రమ దశలను, అసలు ఈ ఐదు దశలతో పోలికలేని భిన్న సమాజాల ఉదాహరణలను సూచించారు. భూస్వామ్య, రాచరిక పాలనలోని రష్యా పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలోకి వెళ్లడం లేదని వాదించిన నరోద్నిక్కుల మీద విమర్శగా లెనిన్ రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అయిందని రుజువు చేస్తూ 1899లోనే సిద్ధాంత గ్రంథం రాశాడు. మొత్తం మీద యూరప్ లో భూస్వామ్య విధానం నుంచి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన జరిగినట్టుగానే, ఇతర సమాజాలన్నిటిలో కూడ ఈ పరివర్తనా క్రమం ఉంటుందనే అభిప్రాయం బలపడింది. యూరప్ లో భూస్వామ్యం నుంచి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన ఎలా జరిగిందనే ప్రశ్నపై మార్క్సిస్ట్ సామాజిక శాస్త్రవేత్తల మధ్యనే తీవ్రమైన భిన్నాభిప్రాయాలతో, (మారిస్) డాబ్ - (పాల్) స్వీజీ చర్చ, (రాబర్ట్) బ్రెన్నర్ చర్చ అని ప్రఖ్యాతమైన సుదీర్ఘ చర్చలు 1950ల లోను, 1970లలోను జరిగాయి. భూస్వామ్య సమాజాలు పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందిన తర్వాతనే సోషలిజానికి వెళ్లే అవకాశం ఉంటుందనీ, ఒక ఉత్పత్తి విధానంలో అభివృద్ధికి ఉన్న అవకాశాలన్నీ పూర్తయ్యేవరకూ మరొక ఉత్పత్తి విధానం రావడం సాధ్యం కాదనీ యాంత్రిక వాదనలు ఈ చర్చకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరించాయి. సోవియట్ యూనియన్ పతనం తర్వాత, చైనాలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రయత్నాలు మొదలయిన తర్వాత, అసలు రష్యా, చైనాలలో పెట్టుబడిదారీ విధానం పరిపక్వం కాకముందే సోషలిస్టు విప్లవం రావడం, వచ్చిందనుకోవడం తప్పు అని, ఆ తప్పును ఇప్పుడు చరిత్ర సవరిస్తున్నదని వాదిస్తున్నవాళ్లూ ఉన్నారు.

ఉత్పత్తి విధానాలు ఒకటి తర్వాత మరొకటిగా, యూరప్‌లో భూస్వామ్య విధానం నుంచి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన సాగినట్టుగా అన్నిచోట్లా జరగనక్కరలేదని, వలస, అర్ధవలస, అర్ధభూస్వామ్య ఉత్పత్తివిధానాల నుంచి సోషలిజానికి పరివర్తన సాగించవచ్చునని, కాకపోతే మధ్యంతరంగా ఒక నూతన ప్రజాస్వామిక దశ ఉంటుందని మరొక ఆలోచన ఉంది. పెట్టుబడిదారీవర్గం తొలిదశలో ప్రగతిశీలంగా ఉండి, భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించిందని, కాని ఆ తర్వాత అది భూస్వామ్యంతో మిలాఖత్తు కావడం మొదలుపెట్టిందని, అందువల్ల ఇకనుంచి భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక విప్లవానికి కూడ కార్మికవర్గమే నాయకత్వం వహించవలసి ఉంటుందని లెనిన్ చేసిన సూత్రీకరణను మావో మరింత అభివృద్ధి చేశాడు. అసలు పెట్టుబడిదారీ విధానం ద్రవ్యపెట్టుబడిగా, సామ్రాజ్యవాదంగా ఎదిగిన తర్వాత మరెక్కడా స్వతంత్ర పెట్టుబడిదారీ విధానం పుట్టిపెరిగి తనకు పోటీ రావడాన్ని అనుమతించదని, అందువల్ల సామ్రాజ్యవాద దశలో పెట్టుబడిదారీ పరివర్తన వక్రంగా మాత్రమే జరుగుతుందని ఒక వాదన ఉంది. ఒక దేశంలో ఆ దేశానికే చెందిన స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గం పుట్టుకువచ్చి, తన హోమ్ మార్కెట్ (దేశీయ మార్కెట్, స్థానిక మార్కెట్) మీద ఆధిపత్యం కోసం సామ్రాజ్యవాద పెట్టుబడితో పోరాడే అవకాశం తగ్గిపోతుందని, ఆ దేశీయ పెట్టుబడిదారీ వర్గం దళారీగా మారిపోయి హోమ్ మార్కెట్ ను పంచుకునే ప్రయత్నం చేస్తుందని ఒక వాదన ఉంది. సామ్రాజ్యవాద దశలో పెట్టుబడి తాను ప్రవేశించిన సమాజాలలో మద్దతు కోసం పెట్టుబడిదారీ పూర్వ, భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలతో, ఉపరితల అంశాలతో జత కడుతుందని, తొలిరోజులలాగ భూస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడదని మరొక సూత్రీకరణ ఉంది.

(మిగతా వచ్చే సంచికలో)

(రచయిత వీక్షణం సంపాదకులు)

వీ

నొక్కబడిన నా గొంతు వినండి

సుప్రీంకోర్టులో తన తరఫున వాదించిన న్యాయవాది సుశీల్ కుమార్‌కు 2004 సెప్టెంబర్‌లో రాసిన ఉత్తరంలో తనను ఆ కేసులో ఎలా ఇరికించారో వివరిస్తున్నారు మహమ్మద్ అఫ్జల్ గురు

మీరు నా కేసు చేపట్టి నా తరఫున వాదించడానికి పూనుకున్నందుకు ధన్యవాదాలు. మీకు నేనెంతో రుణపడి ఉంటాను. ఈ కేసు మొదలయి నప్పటి నుంచీ కూడ నన్ను నిర్లక్ష్యం చేశారు. ప్రచార సాధనాల ముందు గాని, న్యాయస్థానంలో గాని నాకు నిజం చెప్పే అవకాశమే ఇవ్వలేదు. ప్రత్యేక న్యాయస్థానంలో మూడుసార్లు కోరినప్పటికీ నాకు న్యాయవాదిని ఇవ్వలేదు. హైకోర్టులో ఒక మానవ హక్కుల న్యాయవాది ఉరితీత ద్వారా కాక విషపు ఇంజక్షన్ ద్వారా చంపమని నేను కోరుకున్నానని తప్పుడు సమాచారం ఇచ్చాడు. ఆ న్యాయవాదితో నేనామాట ఎప్పుడూ చెప్పలేదు. ఆ న్యాయవాదిని నేను గాని, నా కుటుంబం గాని నియమించలేదు. నా నిస్సహాయత వల్ల, సరైన న్యాయవాదిని కుదుర్చుకోలేని నా అశక్తత వల్ల ఆయన నాకు న్యాయవాదిగా వచ్చాడు. ఉన్నత భద్రతా చెరసాలలో ఉండడంతో ఆ న్యాయవాదితో సమాచార సంబంధం లేక నేను ఆయనను మార్చుకోలేకపోయాను. ఆయన నా మాటలుగా చెప్పినవి నావి కావని హైకోర్టుకు చెప్పలేకపోయాను. అసలు నా మాటలుగా ఆయన ఆ మాటలు చెప్పాడని నాకు హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతనే తెలిసింది.

పార్లమెంటుపై దాడి కేసులో నన్ను కశ్మీర్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇరికించింది. ఢిల్లీలో ప్రత్యేక కోర్టు, ఎస్‌టిఎఫ్‌తో మిలాఖత్తయిన స్పెషల్ పోలీసుల కథనం మీద ఆధారపడి నాకు మరణశిక్ష విధించింది. ప్రత్యేక కోర్టు ప్రచార సాధనాల ప్రభావంలో పడింది. స్పెషల్ పోలీస్ ఎసిపి రాజ్‌బీర్ సింగ్ నిర్బంధంతో, బెదిరింపులతో చేయని నేరం చేశానని నాచేత ఒప్పించాడు. నాకు అటువంటి బెదిరింపులు ఉన్నాయని ప్రత్యేక కోర్టు ముందు టివి ఇంటర్వ్యూవర్ (ఆజ్ తక్‌కు చెందిన షమ్స్ తాహిర్) కూడ నిర్ధారించారు.

నన్ను శ్రీనగర్ బస్ స్టాండ్‌లో అరెస్టు చేసి ఎస్‌టిఎఫ్ హెడ్ క్వార్టర్స్‌కు తీసుకుపోయారు. అక్కడి నుంచి స్పెషల్ పోలీసులు, ఎస్‌టిఎఫ్ ఢిల్లీకి తీసుకువచ్చారు. శ్రీనగర్ లో పరంపురా పోలీస్ స్టేషన్‌లో నా వస్తువులన్నీ లాక్కున్నారు. కొట్టారు. నేను ఎవరికయినా నిజం చెపితే నా భార్య, కుటుంబం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని బెదిరించారు. నా తమ్ముడు హిలాల్ అహ్మద్ గురును వారంట్ లేకుండానే పోలీసు కస్టడీకి తీసుకువచ్చి రెండు మూడు నెలలు ఉంచుకున్నారు. ఈ సంగతి నాకు ఎసిపి రాజ్‌బీర్ సింగ్ చెప్పాడు. వాళ్లు చెప్పినట్టు వింటే నా కుటుంబానికి ఏ హానీ జరగదని స్పెషల్ పోలీసులు చెప్పారు. అలా చేస్తే నా కేసును బలహీనం చేస్తామని, కొంతకాలం తర్వాత నేను విడుదల కావచ్చునని కూడ చెప్పారు.

నా కుటుంబ భద్రతకే నేను అత్యంత ప్రాముఖ్యత ఇస్తాను. గత ఏడు సంవత్సరాలలో ఎస్‌టిఎఫ్ వాళ్లు ఎంత మంది కశ్మీరీ యువకులను చంపారో, ఎంత మంది యువకులను కస్టడీలో చంపి మాయం చేశారో నాకు తెలుసు. ఎన్నో చిత్రహింసలకు, కస్టడీ హత్యలకు నేను సజీవ, ప్రత్యక్ష సాక్షిని. స్వయంగా నేనే ఎస్‌టిఎఫ్ భయబీభత్సాలకు, చిత్రహింసలకు బాధితుడిని. జెకెఎల్‌ఎఫ్‌కు చెందిన లొంగిపోయిన మిలిటెంట్‌గా నన్ను సైన్యం, బిఎస్‌ఎఫ్, ఎస్‌టిఎఫ్ వంటి భద్రతా బలగాలు ఎప్పుడూ వేధిస్తూ, బెదిరిస్తూ, చెప్పరాని వేదనలకు గురి చేశాయి. ఎస్‌టిఎఫ్ అనేది రాష్ట్ర ప్రభుత్వ పోషణలో నడిచే జవాబుదారీ తనంలేని ద్రోహుల అసంఘటిత బృందం. వాళ్లు కశ్మీర్‌లో ఎక్కడైనా పగలూ రాత్రీ ఏ సమయమైనా ఏ ఇంట్లోకైనా, ఏ కుటుంబంలోకైనా జొరబడతారు. ఎవరినైనా ఎస్‌టిఎఫ్ వాళ్లు తీసుకుపోతే ఇక ఆ కుటుంబం మృతదేహం ఇంటికి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూడడమే మిగులుతుంది. అంతే తప్ప ఆ వ్యక్తి ఆచూకీ ఎవరికీ తెలియదు. అలా ఆరువేల మంది యువకులు అదృశ్యమైపోయారు.

ఈ పరిస్థితులలో, ఈ భయానక వాతావరణంలో నాలాంటి వ్యక్తులం ఎస్‌టిఎఫ్ చేతుల్లో ఎప్పుడైనా ఏ చెత్త పని చేయడానికైనా సిద్ధంగా ఉంటాం. కేవలం బతికి ఉండడం కోసం. డబ్బున్నవాళ్లయితే అటువంటి చెత్త పనులు చేయకుండా డబ్బు ఇచ్చి తప్పించుకోగలరు. డబ్బులు ఇవ్వలేని నాలాంటివాళ్లు ఆ పనులు చేయకతప్పదు. నేను సోపూర్ లో మందులు, వైద్య పరికరాలు అమ్మే వ్యాపారంలో ఉన్నప్పుడు, పరంపురా పోలీసుస్టేషన్ లో పోలీసు నేను తప్పుడు మందులు అమ్ముతున్నానని పట్టుకుంటానని బెదిరించి ఐదువేల రూపాయలు లాక్కున్నాడు. అతనే ఇప్పుడు ప్రత్యేక కోర్టులో పోలీసు సాక్షిగా వచ్చి నాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. అతను నాకు పార్లమెంటుపై దాడి కన్న ముందే తెలుసు. కోర్టు గదిలో అతను నాతో నా కుటుంబం బాగానే ఉందని కశ్మీరీలో చెప్పాడు. అది నాకు పరోక్ష బెదిరింపు అన్నమాట. అది బెదిరింపు అని ప్రత్యేక కోర్టు గుర్తించలేదు. నేనతణ్ని కచ్చితంగా నిలదీసి ఉండేవాడినే కాని, అతనా మాట సరిగ్గా కోర్టులో అతని సాక్ష్యం నమోదు చేయబోయే ముందు చెప్పాడు. విచారణ జరిగినన్ని రోజులూ నేను నిస్సహాయ ప్రేక్షకుడిగా నిలబడిపోయాను. సాక్షులు, పోలీసులు, న్యాయమూర్తి కూడ నాకు వ్యతిరేకంగా గట్టి శక్తిగా నిలబడ్డారు. నా భద్రత, నా కుటుంబ భద్రత, క్షేమం ఆలోచనతో నేను నిస్సహాయంగా, దిగ్భ్రాంతితో, గందరగోళంలో ఉండిపోయాను. నా కుటుంబాన్ని రక్షించుకోగలిగాను, కాపాడుకోగలిగాను. అందుకే నేనివాళ ఉరికంబం నీడలో ఉన్నాను.

లొంగిపోయిన మిలిటెంట్‌గా నాకు ప్రభుత్వ ఉద్యోగం రాలేదు గనుక 1997-98లో కమిషన్ పద్ధతిలో మందులు, వైద్య పరికరాలు అమ్మే వ్యాపారం మొదలుపెట్టాను. లొంగిపోయిన మిలిటెంట్లకు ఉద్యోగాలు ఇవ్వరు. వారు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్‌పిఓ) గానో, ఎస్‌టిఎఫ్‌లోనో,

లేదా భద్రతా దళాల, పోలీసుల కనుసన్నల్లో మెలిగే ద్రోహులుగానో బతకవలసి ఉంటుంది. ప్రతిరోజూ మిలిటెంట్ల చేతుల్లో ఎస్‌పిఓలు హతమవుతూ ఉంటారు. ఆ పరిస్థితుల్లో నేను నా కమిషన్ వ్యాపారం మొదలుపెట్టాను. నెలకు నాలుగైదు వేల రూపాయలు సంపాదిస్తుండే వాణ్ని. కాని ఎస్‌టిఎఫ్‌కు సహకరించని లొంగిపోయిన మిలిటెంట్లను ఎస్‌పిఓలు ఎప్పుడూ వేధిస్తూ ఉండేవారు. 1998-2000 నుంచి కూడ స్థానిక ఎస్‌పిఓకు నేను ఎప్పుడడిగితే అప్పుడు మూడు వందలు, ఐదు వందలు ఇవ్వవలసి ఉండేది. అలా ఇవ్వకపోతే అతను నా వ్యాపారం సాగనివ్వడు. నన్ను భద్రతా బలగాల దగ్గరికి తీసుకుపోతాడు. ఎస్‌పిఓలు పై అధికారులకు కూడ వాటా ఇవ్వవలసి ఉంటుందని ఒక ఎస్‌పిఓనాకొక రోజు చెప్పాడు. నేను కష్టపడి పనిచేసేవాణ్ని గనుక నా వ్యాపారం బాగా పుంజుకుంది. అప్పటికి నేను స్కూటర్ కొనుక్కొని రెండు నెలలు అయి ఉండదు. ఒకరోజు నేను నా స్కూటర్ మీద వెళ్తుండగా ఉదయం పది గంటల సమయంలో ఎస్‌టిఎఫ్ వాళ్లు నన్ను ఒక బుల్లెట్ ప్రూఫ్ జీప్‌లోకి తోసి పల్ హల్లన్ క్యాంపుకు తీసుకుపోయారు. అక్కడ డిఎస్‌పి వినయ్ గుప్తా నన్ను చిత్రహింసలు పెట్టాడు. కరెంట్ షాక్ ఇచ్చాడు. నన్ను మంచుగడ్డలాంటి చల్లటి నీళ్లలో పడేశాడు. పెట్రోల్, మిరపకాయ లాంటి అన్ని చిత్రహింసా సాధనాలు వాడాడు. నాదగ్గర ఆయుధా లున్నాయని ఒప్పుకొమ్మని కొట్టాడు. సాయంత్రానికి ఇనస్పెక్టర్ ఫరూఖ్ నా దగ్గరికి వచ్చి ఒక లక్ష రూపాయలిస్తే డిఎస్‌పి నన్ను వదిలేస్తాడని, లేకపోతే చంపేస్తాడని అన్నాడు. అక్కడి నుంచి నన్ను హమ్ హమా ఎస్‌టిఎఫ్ క్యాంపుకు తీసుకుపోయారు. అక్కడ డిఎస్‌పి ద్రవీందర్ సింగ్ కూడ నన్ను చిత్రహింసలు పెట్టాడు. అక్కడ టార్చర్ ఇనస్పెక్టర్ అని పిలిచే శాంతిసింగ్ నా బట్టలు విప్పదీసి మూడు గంటల పాటు ఫోన్‌లో ఆదేశాలు వింటూ, నీళ్లు తాగిస్తూ కరెంటు షాకులు పెడుతూ పోయాడు. చిట్టచివరికి నేను లక్ష రూపాయలు ఇవ్వడానికి ఒప్పుకున్నాను. నా భార్య వంటి మీద ఉన్న బంగారం అమ్మితే ఎనభై వేలే వచ్చాయని నా కుటుంబం పట్టుకువచ్చింది. దానితో పోలీసులు నా స్కూటర్ కూడ లాక్కున్నారు. అది ఇరవై నాలుగు వేలకు కొని అప్పటికి రెండు మూడు నెలలే అయింది. అలా లక్ష రూపాయలు చేజిక్కింతర్వాతనే వాళ్లు నన్ను వదిలేశారు. కాని నేనప్పటికే పూర్తిగా చితికిపోయాను.

ఆ హమ్ హమా ఎస్‌టిఎఫ్ క్యాంపులోనే నేను తారిఖ్ అనే మరొక బాధితుడిని చూశాను. నేను ఎప్పుడైనా ఎస్‌టిఎఫ్ వాళ్లు చెప్పినట్టు చేయాలని, లేకపోతే ఎప్పటికీ వాళ్లు ఇలాగే వేధిస్తుంటారని, ఎప్పటికీ సాధారణ జీవితం గడపలేనని చెప్పాడు. నా జీవితంలో మలుపు తిప్పిన సంఘటన అది. నేను తారిఖ్ చెప్పినట్టు నడుచుకోవాలని నిర్ణయించు కున్నాను.

అంతకు ముందు 1990-96 మధ్య నేను ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ వేరువేరు కోచింగ్ సెంటర్లలో, ఇళ్లలో ట్యూషన్లు చెప్పుకుంటూ సంపాదించుకునేవాణ్ని. నాకు ఢిల్లీ బాగానే తెలుసు. ఈ సంగతి బడ్‌గామ్ ఎస్ఎస్‌పి అషాఖ్ హుసేన్ బావమరది అల్తాఫ్ హుసేన్ కు తెలిసింది. ఈ అల్తాఫ్ హుసేనే నన్ను పట్టుకుపోయినప్పుడు డిఎస్‌పి ద్రవీందర్ సింగ్ కూ నా కుటుంబానికీ మధ్య మధ్యవర్తిగా పనిచేశాడు. పన్నెండో తరగతి, పదో తరగతి చదువుతున్న తన పిల్లలిద్దరికీ ట్యూషన్ చెప్పమని అల్తాఫ్ నన్ను అడిగాడు. మిలిటెంట్ల భయం వల్ల వాళ్లిద్దరూ బయటికి వెళ్లడం లేదని, ఇంటికి వచ్చి ట్యూషన్ చెప్పమని అడిగాడు. అలా అల్తాఫ్ కుటుంబం నేనూ సన్నిహితులమయ్యాం.

ఒకరోజు అల్తాఫ్ నన్ను ద్రవీందర్ సింగ్ దగ్గరికి తీసుకువెళ్లాడు. తనకు ఒక చిన్నపని చేసి పెట్టాలని, నాకు ఢిల్లీ బాగా తెలుసు గనుక ఒక మనిషిని ఢిల్లీ తీసుకువెళ్లి ఒక ఇల్లు అద్దెకు కుదిర్చి పెట్టాలని ద్రవీంధర్ సింగ్ నన్ను అడిగాడు. ఆ మనిషిని నేను అంతకు ముందెప్పుడూ చూడలేదు గాని అతను కశ్మీరీ అయితే కాదు. కశ్మీరీ మాట్లాడడం లేదు. ద్రవీందర్ సింగ్ చెప్పినట్టు చేయడం తప్ప నాకు మరొక దారి లేదు. నేనా మనిషిని ఢిల్లీ తీసుకువెళ్లాను. ఒక రోజు అతను కారు కొనుక్కుంటానంటే నేను అతనితో పాటు కరోల్ బాగ్ వెళ్లాను. అక్కడ అతను కార్ కొన్నాడు. అతను ఢిల్లీలో చాల మందిని కలుస్తుండేవాడు. అతని పేరు మహమ్మద్. అతనికీ నాకూ ద్రవీందర్ సింగ్ ఫోన్ చేస్తుండేవాడు. ఒకరోజు మహమ్మద్ నేను కశ్మీర్ వెళ్లిపోవచ్చునని చెప్పాడు. అది తన కానుక అంటూ నాకు 35000 రూపాయలిచ్చాడు. నాకు ఒంటరి జీవితం అసంతృప్తిగా ఉండింది. అప్పటికి వారం కిందనే నేను ఢిల్లీలోనే కుటుంబంతో సహ ఉండాలని నిర్ణయించుకుని ఇంద్ర విహార్‌లో ఒక గది అద్దెకు తీసుకున్నాను. ఆ అద్దెగది తాళం చెవి ఇల్లుగలావిడకు ఇచ్చి ఈద్ తర్వాత వస్తానని చెప్పాను. పార్లమెంటుపై దాడి తర్వాత డిసెంబర్ 14 సాయంత్రం పరిస్థితి ఆందోళనకరంగా ఉండింది. నేను శ్రీనగర్‌లో తారిఖ్‌కు ఫోన్ చేశాను. ఢిల్లీనుంచి ఎప్పుడు వచ్చావు అని ఆయన అడిగాడు. ఒక గంట కిందనే వచ్చానని చెప్పాను. మర్నాడు ఉదయం నేను సోపూర్ వెళ్లడానికి బస్‌స్టాండ్‌కు వెళ్లగా శ్రీనగర్ పోలీసులు నన్ను అక్కడ పట్టుకుని పరంపురా పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోయారు. అక్కడ ఎస్‌టిఎఫ్ వాళ్లతో పాటు తారిఖ్ కూడ ఉన్నాడు. వాళ్లు నా జేబులో ఉన్న రు. 35000 తీసుకున్నారు. కొట్టారు. ఎస్‌టిఎఫ్ ప్రధాన కార్యాలయానికి తీసుకు పోయారు. అక్కడినుంచి ఢిల్లీ తీసుకువచ్చారు. కళ్లకు గంతలు కట్టారు. స్పెషల్ పోలీస్ టార్చర్ సెల్ లో పెట్టారు.

ఆ స్పెషల్ సెల్ కస్టడీలో నేను నాకు తెలిసినవన్నీ చెప్పాను. మహమ్మద్ వగైరా వివరాలన్నీ చెప్పాను. కాని నేను, షౌకత్, షౌకత్ భార్య నవ్ జోత్ (అఫ్సాన్), జీలాని నలుగురమూ పార్లమెంటుపై దాడి వెనుక ఉన్నామని ఒప్పుకొమ్మని పోలీసులు బెదిరించారు. ఒప్పుకోకపోతే నా కుటుంబానికి హాని చేస్తామన్నారు. అప్పటికే మా తమ్ముడు హిలాల్ అహ్మద్ గురు ఎస్‌టిఎఫ్ కస్టడీలో ఉన్నాడన్నారు. వాళ్లు చెప్పినట్టు వినకపోతే మొత్తం కుటుంబాన్ని ఎత్తుకువస్తామన్నారు. వాళ్లు ఎంత బలవంతపెట్టినా నేను ఆ ముగ్గురితో సంబంధం ఉందని ఒప్పుకోలేదు. అలా చేయలేనని చెప్పాను. అప్పుడు వాళ్లు జీలానీకి సంబంధం లేదని కూడ చెప్పగూడదన్నారు.

కొన్ని రోజుల తర్వాత నన్ను చేతులకు బేడీలతో మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఎన్‌డిటివి, ఆజ్ తక్, జీ న్యూస్, సహారా టివి వగైరా అందరూ ఉన్నారు. ఎసిపి రాజ్‌బీర్ సింగ్ కూడ ఉన్నాడు. విలేకరులలో ఒకరైన షామ్స్ తాహిర్ పార్లమెంటు దాడిలో జీలానీ పాత్ర ఏమిటని అడిగాడు. జీలానీకి ఏమీ సంబంధం లేదని అన్నాను. ఆ మాట వినగానే రాజ్‌బీర్ సింగ్ తన కుర్చీ లోంచి లేచి నన్ను తిట్టడం మొదలుపెట్టాడు. జీలానీ గురించి పెదవి విప్పవద్దని నీకు చెప్పలేదా అని అరిచాడు. ఇదంతా ఆ మీడియా వ్యక్తులందరి ముందే జరిగింది. రాజ్‌బీర్ సింగ్ ప్రవర్తన వల్ల నేను ఎంత నిస్సహాయ స్థితిలో ఉన్నానో మీడియా వారికి అర్థమై ఉంటుంది. కనీసం అఫ్జల్ చెపుతున్న మాటలు ఒత్తిడితో, బెదిరింపుతో చెపుతున్నాడని అర్థమై ఉంటుంది. జీలానీ గురించి ప్రశ్న-

న్యాయం కోసం విన్నపం

పార్లమెంట్ మీద దాడిలో తన భర్త ప్రమేయం లేదనీ, ఆయనను తీవ్ర చిత్రహింసలకు గురిచేసి, భయానికి గురిచేసి ఈ దాడిలో ఇరికించారనీ అంటున్నారు తబస్సుమ్ గురు

నా పేరు తబస్సుమ్ గురు. భారత పార్లమెంటు మీద 2001 డిసెంబర్ 13న జరిగిన దాడికి కుట్రచేశాడనే ఆరోపణను ఎదుర్కొంటున్న మహమ్మద్ అఫ్జల్ గురు భార్యను. అఫ్జల్ కు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్ఎన్ ధింగ్రా మరణశిక్ష విదించారు. ఆ శిక్షను ఢిల్లీలోని గౌరవ హైకోర్టు ధృవీకరించింది. ఇప్పుడు ఆ కేసు గౌరవ భారత సుప్రీంకోర్టు ముందు ఉంది.

పార్లమెంటు మీద జరిగిన దాడిని దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఖండించారు. అది ఒక తీవ్రవాద చర్య అని, దాన్ని తప్పనిసరిగా ఖండించవలసిందేనని నేనూ ఒప్పుకుంటాను. అయితే, అటువంటి ఘోరమైన నేరం ఆరోపించబడిన నిందితులకు కూడ శిక్ష విధించేముందు సక్రమమైన విచారణ జరగాలి. వారి వాదనను పూర్తిగా వినాలి. కాని నా భర్త వాదన ఏమిటో ఎవరూ వినలేదు. ఏ న్యాయస్థానంలోనూ తనకు సరైన ప్రాతినిధ్యం దొరకలేదు.

అందువల్ల మా కథ వినమనీ, న్యాయం జరిగిందో లేదో మీకు మీరే తేల్చుకొమ్మనీ మీ అందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. అఫ్జల్ కథ, నా కథ ఎంతో మంది కశ్మీరీ యువజంటల కథ లాంటిదే. మా కథ మా ప్రజలు ఎదుర్కొంటున్న విషాదానికి ఒక ఉదాహరణ.

ఆ కాలపు వేలాది మంది యువకుల లాగనే, అఫ్జల్ కూడ 1990లో జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్ఎఫ్) నాయకత్వంలోని ఉద్యమంలోకి ఆకర్షితుడయ్యాడు. శిక్షణ కోసం పాకిస్తాన్ వెళ్లి అక్కడ కొంతకాలం ఉన్నాడు. కాని అక్కడ వేరువేరు బృందాల మధ్య విభేదాలు చూసి విసిగిపోయాడు. పాకిస్తాన్ అనుకూల బృందాలకు సహకరించ దలచుకోలేదు. అందువల్ల అక్కడ మూడు నెలలు ఉన్నా, శిక్షణ పొందకుండానే కశ్మీర్‌కు తిరిగివచ్చాడు. ఆ తర్వాత చదువుకోవడానికి ఢిల్లీ వెళ్లిపోయాడు. ఉద్యమంలో చేరే సమయానికి ఎంబిబిఎస్ చదువుతుండేవాడు, ఆ చదువు కొనసాగించాలని తనకు కోరిక ఉండేది.

అఫ్జల్ సాధారణ జీవితంలోకి రాదలచుకున్నాడు. ఆ ఉద్దేశంతోనే బిఎస్ఎఫ్‌కు లొంగిపోయాడు. ఇంకో ఇద్దరు కూడ లొంగిపోయేలా చూస్తేనే లొంగిపోయినట్టు ధృవీకరణ పత్రం ఇస్తామని బిఎస్ఎఫ్ కమాండెంట్ అన్నాడు. అలా మరో ఇద్దరు లొంగిపోయిన తర్వాతనే అఫ్జల్‌కు లొంగిపోయిన మిలిటెంట్ అనే కాగితం ఇచ్చారు. కశ్మీర్‌లో లొంగిపోయిన మిలిటెంట్‌గా బతకడం చాల కష్టం. అయినా సరే, కశ్మీర్‌లోనే మామూలుగా బతకాలని అఫ్జల్ అనుకున్నాడు. అలా 1997లో మందులు, వైద్య పరికరాలు అమ్మే చిన్న వ్యాపారం మొదలు పెట్టాడు. ఆ మరుసటి సంవత్సరమే మా పెళ్లి అయింది. అప్పటికి తనకు 28 ఏళ్లు, నాకు 18 ఏళ్లు.

అప్పుడు మేం కశ్మీర్‌లోనే ఉండేవాళ్లం. భారత భద్రతా బలగాలు అఫ్జల్‌ను నిరంతరం వేధిస్తూ ఉండేవి. మిలిటెంట్లుగా తాము అనుమానిస్తున్నవాళ్ల మీద నిఘా పెట్టమని, వారి సమాచారం అందించమని అఫ్జల్‌ను అడుగుతుండేవారు. రాష్ట్రీయ రైఫిల్స్ 22 విభాగానికి చెందిన మేజర్ రామ్ మోహన్ రాయ్ అఫ్జల్‌ను చిత్రహింసలు పెట్టాడు. మర్మావయవాలకు కరెంటు షాక్ ఇచ్చాడు. అవమానించాడు, వేధించాడు. భారత భద్రతా దళాలు అఫ్జల్‌ను ఎప్పుడంటే అప్పుడు తమ క్యాంపులకు తీసుకుపోయి చిత్రహింసలు పెడుతుండేవి. తన నుంచి ఏదో ఒక సమాచారం రాబట్టాలని చూస్తుండేవారు. ఒక రాత్రి సైనికులు మా ఇంటికి వచ్చి మా అందరినీ తిట్టి, అఫ్జల్‌ను క్యాంపుకు తీసుకు

జవాబులను తీసేయాలని, వాటిని బయటపెట్టవద్దని రాజ్‌బీర్ సింగ్ వాళ్లకు చెప్పాడు. కుటుంబ సభ్యులతో మాట్లాడతావా అని ఆ సాయంత్రం రాజ్‌బీర్ సింగ్ నన్నడిగాడు. నేను సరేనన్నాను. నా భార్యకు ఫోన్ కలిపారు. నేను తనతో మాట్లాడి ఫోన్ పెట్టెయ్యగానే, నా భార్య, కుటుంబ సభ్యులు జీవించి ఉండాలంటే ప్రతి విషయంలోను పోలీసులు చెప్పినట్టు వినాలని అన్నాడు. తర్వాత నన్ను పోలీసులు ఢిల్లీలో ఎన్నో చోట్లకు తీసుకుపోయారు. మహమ్మద్ ఎక్కడెక్కడో ఏవేవో కొన్నాడని ఆ స్థలాలన్నీ నన్ను తిప్పారు. నన్ను కశ్మీర్ తీసుకుపోయారు. అక్కడ ఏమీ చేయకుండానే మళ్లీ వెనక్కి తీసుకువచ్చారు. నా చేత కనీసం రెండు మూడు వందల తెల్ల కాగితాల మీద సంతకాలు పెట్టించుకున్నారు.

ఈ జరిగిన కథంతా చెప్పడానికి ప్రత్యేకకోర్టులో నాకు అవకాశమే ఇవ్వలేదు. నేను చెప్పుకునేది ఏమైనా ఉంటే కేసు చివరిలో చెప్పుకో వచ్చునని జడ్జి అన్నాడు గాని చివరికి నా వాంగ్మూలం రికార్డ్ చేయలేదు. న్యాయస్థానంలో ఏమి విచారణ చేశారో నాకు తెలియదు. నా ఫోన్ లో ఉన్న నంబర్లన్నీ జాగ్రత్తగా చూస్తే అవన్నీ ఎస్‌టిఎఫ్ అధికారులవేనని తెలిసి ఉండేవి.

ఇప్పుడు సుప్రీంకోర్టయినా నా నిస్సహాయతను, నేను గడిపిన భయానక స్థితిని అర్థం చేసుకుంటుందని ఆశిస్తున్నాను. ఈ నేరంలో ఎస్‌టిఎఫ్ నన్నొక బలిపశువును చేసింది. ఈ నేరం చేసిందీ దర్శకత్వం వహించిందీ ఎస్‌టిఎఫ్, ఇంకా నాకు తెలియని ఎందరో. ఈ వ్యవహారంలో స్పెషల్ పోలీసులకు కచ్చితమైన పాత్ర ఉంది. ఎందుకంటే ఎప్పుడూ వాళ్లు నన్ను నోరు మూసుకుని ఉండమన్నారు. అలా బలవంతాన అమలయిన నా నిశ్శబ్దం ఇప్పటికైనా వినబడుతుందని నా ఆశ. న్యాయం జరుగుతుందని నా ఆశ. నా కేసును వాదిస్తున్నందుకు మీకు మరొకసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు. సత్యానిదే జయం.

(ఔట్ లుక్ వారపత్రిక అక్టోబర్ 21, 2004 సంచిక నుంచి) వీ

పోయారు. ఇంకోసారి తనను పల్‌హాల్లన్‌పట్టన్‌లోని ఎస్‌టిఎఫ్ క్యాంపుకు తీసుకుపోయారు. తర్వాత కొన్నిరోజులకు తనను హమ్‌హామా ఎస్‌టిఎఫ్ క్యాంపుకు తీసుకుపోయారు. ఆ క్యాంపులో డిఎస్‌పిలు వినయ్ గుప్తా, దరిందర్ సింగ్ లక్ష రూపాయలు ఇమ్మని అడిగారు. మేమేమీ ఉన్నవాళ్లం కాదు. నా పెళ్లి సమయంలో పెట్టిన కాస్త బంగారంతో సహా ఉన్నదంతా ఊడ్చి అమ్మి ఆ డబ్బులు కట్టి అఫ్జల్‌ను చిత్రహింసల బారిన పడకుండా విడిపించుకున్నాం.

అఫ్జల్‌ను మంచుగడ్డలాంటి నీటిలో ముంచారు. మలద్వారం నుంచి లోపలికి పెట్రోల్ పోశారు. శాంతి సింగ్ అనే అధికారి అఫ్జల్‌ను నగ్నంగా తలకిందులుగా వేలాడదీశాడు. నగ్నంగా చల్లనీళ్లలో ముంచాడు. పురుషాంగానికి కరెంట్ షాక్ పెట్టాడు. ఆ చిత్రహింసల నుంచి తేరుకోవడానికి చాలరోజులు చికిత్స చేయించుకోవలసి వచ్చింది.

అఫ్జల్ ఏవో మిలిటెంట్ కార్యక్రమాలలో పాల్గొన్నాడు గనుకనే, ఆ సమాచారం రాబట్టడానికే భద్రతాబలగాలు ఈ చిత్రహింసలు చేశాయని మీరు అనుకోవచ్చు. కాని మీరు కశ్మీర్‌లో ఉన్న పరిస్థితి అర్థం చేసుకోవాలి. ప్రతి మనిషికీ, స్త్రీకీ పురుషునికీ చిన్నపిల్లలకూ కూడ వారు ఉద్యమంలో పాల్గొనకపోయినా ఉద్యమం గురించి ఎంతో కొంత సమాచారం తెలిసి ఉంటుంది. ఆ సమాచారాన్నిరాబట్టడం కోసం భద్రతా బలగాలు అన్నతమ్ముల మధ్య, భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులకూ పిల్లలకూ మధ్య చిచ్చుపెడతాయి. ఒకరిమీదికి ఒకరిని ఉసిగొలుపుతాయి. ఒకరి మీద చెప్పమని మరొకరిని అడుగుతాయి. అఫ్జల్ ఎవరి జోలికీ పోకుండా ప్రశాంతంగా బతుకుదామనుకున్నాడు గాని ఎస్‌టిఎఫ్ అందుకు ఒప్పుకోలేదు.

కశ్మీర్‌లో ఎస్‌టిఎఫ్ అనేది ఒక భయంకరమైన దళం అని, అది ప్రజల నుంచి డబ్బులు దండుకోవడానికి ఎన్ని ఘోరాలైనా చేసేదని కూడ మీరు అర్థం చేసుకోవాలి. ఆ దళం ఎంత దుర్మార్గమైనదంటే ముఫ్తీ మహమ్మద్ సయీద్ ముఖ్యమంత్రి కావడానికి ముందు, ఎస్‌టిఎఫ్‌ను రద్దు చేస్తానని ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేశాడు. మనుషులను పట్టుకుపోయి చంపడం, పాశవికమైన, అమానుషమైన చిత్రహింసలు పెట్టడం వంటి పనులతో ఎస్‌టిఎఫ్ మానవహక్కుల ఉల్లంఘనలకు పేరు పొందింది. ఈ పరిస్థితులలో అఫ్జల్ ఇంటినీ, కుటుంబాన్నీ వదిలి ఢిల్లీకి వెళ్లవలసి వచ్చింది. ఆయన అక్కడ బతకడానికి నానా ఇబ్బందులు పడ్డాడు. నన్నూ, మా నాలుగేళ్ల కొడుకు గాలిబ్‌నూ ఢిల్లీ తీసుకువెళ్లాలని అనుకున్నాడు. అందరిలాగనే మేం కూడ ప్రశాంతంగా పిల్లలను పెంచి పెద్దచేస్తూ, వారికి మంచి చదువు చెప్పిస్తూ, వారు మంచి మనుషులుగా ఎదుగుతుంటే సంతోషిస్తూ ఉండాలనుకున్నాం. మా కల చెదిరిపోయింది. ఎస్‌టిఎఫ్ మళ్లీ ఒకసారి నా భర్తను ఢిల్లీలో లోబరచుకుంది.

మహమ్మద్ అనే వ్యక్తిని కశ్మీర్ నుంచి ఢిల్లీ తీసుకుపోవాలని ఎస్‌టిఎఫ్ అఫ్జల్‌ను ఆదేశించింది. తను ఎస్‌టిఎఫ్ క్యాంపులోనే మహమ్మద్‌ను, తారిఖ్ అనే మరో వ్యక్తిని కలిశాడు. వాళ్లిద్దరి గురించీ అఫ్జల్‌కు ఏమీ తెలియదు. తనతో ఆ పని ఎందుకు చేయిస్తున్నారో కూడ తెలియదు. అఫ్జల్ ఇదంతా కోర్టులో చెప్పాడు. కాని కోర్టు మాత్రం తను చెప్పిన దానిలో మహమ్మద్‌ను ఢిల్లీ తీసుకువెళ్లానన్న సగాన్ని నమ్మింది. ఎస్‌టిఎఫ్ చెపితేనే తీసుకువెళ్లాననే సగాన్ని వదిలేసింది.

కిందికోర్టులో అఫ్జల్ తరఫున వాదించడానికి న్యాయవాది లేడు. కోర్టే ఒక న్యాయవాదిని నియమించింది గాని అతను అఫ్జల్ ను ఎన్నడూ కలవలేదు. అతను అఫ్జల్ తరఫున ప్రాసిక్యూషన్ సాక్షులను ప్రశ్నించలేదు. అతను మతతత్వం ఉన్న మనిషి. అఫ్జల్ మీద ద్వేషం చూపించాడు. ఆ న్యాయవాది తనకు అక్కరలేదని అఫ్జల్ న్యాయమూర్తి ధింగ్రాకు చెప్పినప్పుడు, న్యాయమూర్తి ఆ మాట పట్టించుకోనే లేదు. నిజం చెప్పాలంటే విచారణ జరిగిన న్యాయస్థానంలో అఫ్జల్ తరఫున వాదనలు వినలేదు. అఫ్జల్ ఏదైనా చెప్పాలని ప్రయత్నించిన ప్రతిసారీ న్యాయమూర్తి ఆ మాటలను పెడచెవిన పెట్టాడు. ఆ న్యాయమూర్తి తన మతతత్వ భావాలను కోర్టు హాలులో బహిరంగంగానే వెలిబుచ్చాడు.

హైకోర్టులో ఒక మానవ హక్కుల న్యాయవాది అఫ్జల్ తరఫున వాదిస్తానని ముందుకు వచ్చాడు. నా భర్తా ఒప్పుకున్నాడు. కాని ఆ న్యాయవాది అఫ్జల్ తరఫున వాదించేబదులు, తనను ఉరి తీయవద్దని, విషపు ఇంజెక్షన్‌తో చంపేయమని అఫ్జల్ అభ్యర్థించాడని తప్పుడు దరఖాస్తు దాఖలు చేశాడు. నా భర్త అటువంటి అభ్యర్థన ఎప్పుడూ చేయలేదు. చనిపోవాలని కోరుకోలేదు. తాను నేరం చేయలేదనీ, తనను ఎస్‌టిఎఫ్ ఇరికించిందనీ ఆయన ఎప్పుడూ వాదిస్తూ వచ్చాడు. ఆ న్యాయవాది అభ్యర్థన విని నా భర్త దిగ్భ్రాంతి చెందాడు. కాని హై సెక్యూరిటీ జైలులో నిర్బంధితుడిగా ఆయనకు తన న్యాయవాదిని మార్చుకునే, తన మాట బైటికి చెప్పే అవకాశమే లేదు. హైకోర్టు తీర్పు వచ్చిన తర్వాతనే ఆ న్యాయవాది చెప్పిన మాట గురించి అఫ్జల్‌కు తెలిసింది. అందువల్ల సుప్రీంకోర్టు అప్పీలులో తనకు ఆ న్యాయవాది వద్దని అఫ్జల్ చెప్పాడు. నాకు ఢిల్లీలో తెలిసినవారెవరూ లేరు గనుక నేను మరొక న్యాయవాదిని కుదర్చలేకపోయాను. చివరికి జీలానీ కోసం ఏర్పడిన డిఫెన్స్ కమిటీకి అఫ్జలే ఉత్తరం రాశాడు. ఆ డిఫెన్స్ కమిటీ అఫ్జల్ తరఫున సీనియర్ న్యాయవాది సుశీల్ కుమార్ వాదించడానికి సహకరించింది. అయితే సాక్ష్యాధారాల విచారణ సుప్రీం కోర్టు బాధ్యత కాదు గనుక, ఇక్కడ కూడ ఏం జరుగుతుందో నాకు తెలియదు.

నా భర్త మరణశిక్ష ఖరారు కాకుండా చూడమని, తన మీద విచారణ సక్రమంగా జరిగేలా చూడమని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. న్యాయస్థానంలో తనవైపు నుంచి సరైన వాదనలు వినిపించకుండా, తన తరఫున న్యాయవాది లేకుండా ఒక తోటి మనిషి మరణశిక్ష పాలై ఉరికంబం ఎక్కబోతుంటే చూస్తూ మౌనంగా ఉంటే మీ అంతరాత్మ ఒప్పుకుంటుందా? విచారణ మొదలు కాకముందే పోలీసులు అఫ్జల్‌ను బెదిరించి మీడియా ముందర తప్పుడు ఒప్పుదల చెప్పించారు. వాళ్లు ఆయనను అవమానించారు, కొట్టారు, చిత్రహింసలు పెట్టారు, నోట్లో మూత్రం పోశారు. ఇవన్నీ బహిరంగంగా చెప్పడానికే నాకు సిగ్గుగా ఉంది కాని పరిస్థితులవల్ల చెప్పవలసి వస్తోంది. ఇవన్నీ కాగితం మీద పెట్టడానికి నేను చాల ధైర్యం కూడదీసుకోవలసి వచ్చింది. కాని ఇప్పుడు ఆరు సంవత్సరాల వయసున్న మా కొడుకు కోసం నేనీ పని చేస్తున్నాను.

నా భర్తకు జరిగిన అన్యాయం గురించి మీరు గొంతెత్తుతారా? నా తరఫున మాట్లాడతారా? నేను నా భర్త బతుకు కోసం, నా కొడుకు తండ్రి బతుకు కోసం పోరాడుతున్నానని మీకు అనిపించవచ్చు. కాని నేను ఒక కశ్మీరీ స్త్రీగా మాట్లాడుతున్నాను. భారత ప్రజాస్వామ్యం మీద నమ్మకం పోగొట్టుకుంటున్న కశ్మీరీగా మాట్లాడుతున్నాను. కశ్మీరీ ముస్లింల పట్ల న్యాయంగా ప్రవర్తించే శక్తి భారత ప్రజాస్వామ్యానికి లేదేమోనని నమ్మకం పోగొట్టుకుంటున్న కశ్మీరీగా మాట్లాడుతున్నాను.

(అఫ్జల్ కేసు సుప్రీం కోర్టు విచారణకు వచ్చిన సందర్భంలో సెప్టెంబర్ 2004లో తబస్సుమ్ గురు రాసిన లేఖ. దీని ఇంగ్లిష్ అనువాదం ఔట్ లుక్ అక్టోబర్ 21, 2004 లో అచ్చయింది.) వీ

భారత ప్రజాస్వామ్యానికి మచ్చ

అఫ్జల్ గురును చంపడంలో భారత ప్రజాస్వామ్యపు వ్యవస్థలన్నీ అక్రమంగా, అమానుషంగా వ్యవహరించాయని వివరిస్తున్నారు అరుంధతీ రాయ్

ఢిల్లీలో శనివారం నాడు వసంతం తన రాకను ప్రకటించింది. సూర్యోదయం అయింది. చట్టం తన పని తాను చేసుకుపోయింది. ఉదయపు ఫలహారానికన్నముందే ప్రభుత్వం అఫ్జల్ గురును రహస్యంగా ఉరి తీసింది. అఫ్జల్ గురు భారత పార్లమెంటుపై 2001 డిసెంబర్‌లో జరిగిన దాడిలో ప్రధాన నిందితుడు. అతను 12 సంవత్సరాలుగా ఒంటరి నిర్బంధంలో గడుపుతున్న ఢిల్లీలోని తీహార్ జైల్లోనే అతని మృతదేహాన్ని ఖననం చేశారు. అతని భార్యకు గాని, కొడుకుకు గాని ఆ సమాచారం కూడ తెలపలేదు. 'కుటుంబానికి సమాచారాన్ని అధికారులు స్పీడ్ పోస్ట్ ద్వారా, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తెలిపారు. వారికది అందిందా లేదా తెలుసుకొమ్మని జమ్మూ కశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ను కోరాం' అని హోం కార్యదర్శి పత్రికలకు చెప్పాడు. అయినా అదేమంత పెద్ద విషయమని?! వాళ్లు కేవలం మరొక కశ్మీరీ తీవ్రవాది కుటుంబం, అంతే గదా!

ఒక అసాధారణ ఐక్యతా క్షణంలో భారత జాతి, లేదా కనీసం దాని ప్రధాన రాజకీయ పార్టీలు – కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) – ఒక్క చోటికి చేరి చట్టబద్ధ పాలన విజయోత్సవం జరుపుకున్నాయి. ('ఆలస్యం' గురించీ, 'సందర్భం' గురించీ కొన్ని గొణుగుళ్లు మినహాయిస్తే). టివి స్టుడియోల నుంచి ప్రత్యక్ష ప్రసారాలు, తమ సహజమైన ఆవేశపూరిత ఉద్వేగంతోనూ, వాస్తవాల పట్ల పట్టులేనితనంతోనూ 'ప్రజాస్వామ్య విజయం' గురించి ఉప్పొంగిపోయాయి. మితవాద హిందూ జాతీయవాదులు ఉరితీత ఉత్సవం జరిపి మిఠాయిలు పంచిపెట్టారు. ఢిల్లీలో నిరసన జరపడానికి కూడిన కశ్మీరీలను (యువతుల మీద ప్రత్యేక శ్రద్ధపెట్టి) కొట్టారు. గురు చచ్చిపోయినప్పటికీ స్టుడియోలలో వ్యాఖ్యాతలూ, వీధుల్లో గూండాలూ, మందలుగా వేటాడే పిరికిపందల్లాగ, తమ ధైర్యాన్ని కూడగట్టుకోవడానికి ఒకరికొకరు తోడు నిలిచారు. బహుశా వారి అంతరంగాల్లో లోలోపల భయంకరమైన తప్పిదమేదో చేస్తున్నామని తెలిసి సహకరించుకుంటూ ఉండి ఉంటారు.

వాస్తవాలు ఏమిటి? 2001 డిసెంబర్ 13న ఐదుగురు సాయుధులు బాంబు అమర్చుకున్న కారులో భారత పార్లమెంటు గేట్లను దాటి లోపల ప్రవేశించారు. ఆ కారును అడ్డుకున్నప్పుడు వారు కారులోంచి బైటికి దూకి కాల్పులు జరిపి ఎనిమిది మంది భద్రతా సిబ్బందిని, ఒక తోటమాలిని చంపేశారు. ఆ తర్వాత జరిగిన ఎదురుబొదురు కాల్పుల్లో ఆ ఐదుగురు ఆగంతకులూ చంపేయబడ్డారు. పోలీసు కస్టడీలో బలవంతాన చెప్పించబడిన వేరువేరు ఒప్పుదల కథనాలలో ఒకదానిలో అఫ్జల్‌గురు ఆ ఐదుగురి పేర్లు మహమ్మద్, రాణా, రజా, హంజా, హైదర్ అని చెప్పాడు. వాళ్ల గురించి మనకు తెలిసినదంతా అంతే. వాళ్ల పూర్తి పేర్లు కూడ మనకు తెలియవు. అప్పుడు భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉండిన ఎల్‌కె అద్వానీ 'వాళ్లు పాకిస్తానీలలాగ కనిపించారు' అన్నాడు. (పాకిస్తానీలు ఎలా ఉంటారో ఆయనకు తెలుసన్నమాట. అంతేనా? స్వయంగా ఆయన సింధీ కదా!) అఫ్జల్ గురు కస్టడీలో ఇచ్చిన ఒప్పుదల (అందులో 'పొరపాట్లు' 'సంవిధాన రక్షణల ఉల్లంఘనలు' ఉన్నాయని అంటూ ఆ ఒప్పుదలను ఆ తర్వాత సుప్రీంకోర్టు కొట్టివేసింది) మీద మాత్రమే ఆధారపడి భారత ప్రభుత్వం పాకిస్తాన్ నుంచి తన రాయబారిని వెనక్కు పిలిచింది. పాకిస్తాన్ సరిహద్దుపై ఐదులక్షల మంది సైనికులను మోహరించింది. అణుయుద్ధం రాబోతున్నదని వినిపించింది. విదేశీ రాయబార కార్యాలయాలు పర్యాటకులకు హెచ్చరికలు జారీ చేశాయి. ఢిల్లీ నుంచి తమ సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు పంపించాయి. ఆ ఉద్రిక్తత కొన్ని నెలల పాటు సాగింది. భారత దేశం వేలాది కోట్ల రూపాయలు నష్టపోయింది.

తీవ్రవాదులను చట్టవ్యతిరేకంగా' చంపే ఎన్‌కౌంటర్ హత్యలకు పేరుపొందిన ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ 24 గంటలలోపే ఈ కేసును ఛేదించానని ప్రకటించింది. దాడికి 'పథక రచయిత' ప్రొఫెసర్ ఎస్ ఎ ఆర్ జీలానీని ఢిల్లీలో, షౌకత్ గురు, అతని సన్నిహిత బంధువు అఫ్జల్ గురులను శ్రీనగర్‌లో డిసెంబర్ 15న అరెస్టు చేశారు. ఆ తర్వాత షౌకత్ భార్య అఫ్సాన్ గురును కూడ అరెస్టు చేశారు. పోలీసులు చెప్పిన ఈ కథనాన్ని భారత ప్రచార సాధనాలు ఉత్సాహంగా ప్రచారం చేశాయి. 'తీవ్రవాద పథక కేంద్రం ఢిల్లీ యూనివర్సిటీ లెక్చరర్', 'ఫిదాయీలను నడిపించిన వార్సిటీ ఆచార్యుడు', 'ఖాళీ సమయాల్లో తీవ్రవాదం పై పాఠాలు చెప్పిన ఆచార్యుడు' లాంటి పతాక శీర్షికలు వెలువడ్డాయి. జీ టివి అనే జాతీయ ప్రసార సాధనం డిసెంబర్ 13 అనే డాక్యుడ్రామాను ప్రసారం చేసింది. 'పోలీసు అభియోగపత్రంపై ఆధారపడిన సత్యం' తో ఆ డాక్యుడ్రామాను పునర్నిర్మించానని చెప్పుకుంది. (పోలీసులు చెప్పేదే సత్యమైతే ఇక న్యాయస్థానాలెందుకు?) అప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజపాయి, అద్వానీ బహిరంగంగా ఈ సినిమాను ప్రశంసించారు. ప్రసారంతో న్యాయమూర్తులు ప్రభావితులు కారని చెపుతూ సుప్రీం కోర్టు ఆ సినిమా ప్రసారాన్ని వాయిదా వేయడానికి నిరాకరించింది. జీలానీ, అఫ్జల్, షౌకత్‌లకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరణశిక్ష విధించడానికి కొద్దిరోజుల ముందే ఆ ప్రసారం జరిగింది. ఆ తర్వాత హైకోర్టు జీలానీ, షౌకత్ గురులను నిర్దోషులుగా తేల్చింది. ఆ తీర్పును సుప్రీంకోర్టు ఆమోదించింది. కాని 2005 ఆగస్ట్ 5న ఇచ్చిన తీర్పులో అఫ్జల్‌గురుకు మూడు యావజ్జీవ శిక్షలు, రెండు మరణశిక్షలు విధించింది.

మరణశిక్షను వెంటనే అమలు చేయాలని బిజెపి పిలుపునిచ్చింది. ఆ పార్టీ ఎన్నికల నినాదాలలో ఒకటి దేశ్ అభీ షర్మిందా హై, అఫ్జల్ అభీ జిందా హై, ప్రాస సరిపోయిన ఈ నినాదానికి అర్థం 'అఫ్జల్

ఇంకా జీవించి ఉన్నాడు మన దేశం సిగ్గుతో తల వంచుకోవాలి'అని. మెల్లమెల్లగా ఊపందుకుంటున్న నిరసన గుసగుసలను అడ్డుకోవడానికి ప్రచార సాధనాలలో ఒక కొత్త ప్రచారం మొదలయింది. ప్రస్తుత బిజెపి ఎంపి, అప్పుడు పయనీర్ పత్రికకు సంపాదకుడు చందన్ మిత్రా 'పార్లమెంటు భవనం మీద 2001 డిసెంబర్ 13న దాడి చేసిన తీవ్రవాదులలో ఒకడు అఫ్జల్ గురు. భద్రతా సిబ్బంది మీద మొట్టమొదట కాల్పులు ప్రారంభించిందీ, చనిపోయిన ఆరుగురిలో ముగ్గురిని చంపిందీ అతడే' అని రాశాడు. చివరికి పోలీసు ఛార్జిషీట్ కూడ అఫ్జల్ మీద ఆ నేరం ఆరోపించలేదు. సందర్భ సాక్ష్యం మాత్రమే ఉందని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. 'చాల కుట్రలలోలాగనే నేరస్వభావం గల కుట్ర జరిగిందనేందుకు ఆధారాలేమీ లేవు, ఉండే అవకాశం లేదు' అని అంది. కాని, దిగ్భ్రాంతికరంగా, 'ఎన్నో' మరణాలకు దారితీసిన ఈ సంఘటన మొత్తం జాతిని కదిలించింది. ఈ నేరస్తుడికి మరణశిక్ష విధించకపోతే సమాజపు సామూహిక మనోభావాలు సంతృప్తి చెందవు' అని రాసింది.

పార్లమెంటుపై దాడి కేసులో మన సామూహిక మనోభావాలు ఎలా ఎవరు తయారు చేశారు? అవి పత్రికలలో మనకు కనబడిన వాస్తవాల నుంచి తయారయ్యాయా? టివిలో మనం చూసిన సినిమాల నుంచి తయారయ్యాయా?

చట్టబద్ధ పాలన గురించి ఉత్సవాలు చేసుకునే ముందు ఒక్కసారి ఏం జరిగిందో చూద్దాం. చట్టబద్ధ పాలన గురించి ఉత్సవాలు జరుపుతున్నవారు భారత కోర్టులు జీలానీని నిర్దోషిగా విడుదల చేసి, అఫ్జల్‌కు శిక్ష విధించాయనే వాస్తవమే విచారణ స్వేచ్ఛగా, సక్రమంగా జరిగిందనడానికి రుజువు అంటున్నారు. అది నిజమేనా?

ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ 2002 మేలో మొదలయింది. అప్పటికి ప్రపంచమింకా 9/11 దాడుల తర్వాత చెలరేగిన ఉన్మాదం నుంచి తేరుకోలేదు. అమెరికా ప్రభుత్వం అఫ్ఘనిస్తాన్ లో 'విజయం' సాధించానని అకాలంగా వీరాలాపాలు పలుకుతోంది. గుజరాత్ లో పోలీసుల, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో హిందూ గూండా దళాలు ఫిబ్రవరిలో మొదలుపెట్టి ముస్లింల మీద సాగిస్తున్న హత్యాకాండ ఇంకా అక్కడక్కడ సాగుతూనే ఉంది. గాలిలో మతవిద్వేషం వ్యాపించి ఉంది. ఇక పార్లమెంటుపై దాడి కేసులో చట్టం తనపని తాను చేసుకుపోతోంది. ఒక క్రిమినల్ కేసులో అత్యంత కీలకమైన సమయంలో, అంటే సాక్ష్యాధారాలు ప్రవేశపెడుతున్నప్పుడు, సాక్షులను ప్రశ్నిస్తున్నప్పుడు, వాదనలకు ప్రాతిపదికలను నిర్మిస్తున్నప్పుడు, హై సెక్యూరిటీ జైలులో ఒంటరి కొట్లో ఉన్న అఫ్జల్‌కు న్యాయవాది లేడు. (హైకోర్టులో, సుప్రీం కోర్టులో కేవలం చట్టపరమైన అంశాలు మాత్రమే వాదించవచ్చుగాని, కొత్త సాక్ష్యాలను ప్రవేశపెట్టడానికి వీలులేదు.) కోర్టు నియమించిన జూనియర్ న్యాయవాది తన కక్షిదారును జైలులో ఒక్కసారయినా కలవలేదు. గురుకు అనుకూలంగా ఒక్క సాక్షినైనా ప్రవేశపెట్టలేదు. ప్రాసిక్యూషన్ సాక్షులను ఒక్కరినైనా క్రాస్ ఎగ్జామినేషన్ చేయలేదు. ఈ పరిస్థితిని మార్చడానికి తానేమీ చేయలేనని న్యాయమూర్తి అన్నాడు.

అంటే ఈ కేసు ఆది నుంచీ తప్పుదారిన నడిచింది. ఎన్నెన్నో ఉదాహరణలున్నాయి గాని కొన్ని చూడండి: గురుకు వ్యతిరేకంగా ప్రమాదకరమైన రెండు సాక్ష్యాధారాలు, ఆయనను అరెస్టు చేసినప్పుడు ఆయన దగ్గర జప్తు చేశామంటున్న సెల్‌ఫోన్, లాప్‌టాప్. అటువంటి సాక్ష్యాధారాలను వెంటనే సీలు చేయాలి. కాని ఈ రెంటినీ సీలు చేయలేదు. అరెస్ట్ తర్వాత ఆ హార్డ్‌డిస్క్‌ను తెరవడం జరిగిందని విచారణలో బయటపడింది. ఆ హార్డ్‌డిస్క్‌లో కేవలం పార్లమెంటులో ప్రవేశించడానికి 'తీవ్రవాదులు' వినియోగించిన హోం మంత్రిత్వ శాఖ నకిలీ అనుమతి పత్రాలు, నకిలీ గుర్తింపు పత్రాలు, పార్లమెంటు భవనం మీద జీ టివి వీడియో క్లిప్ మాత్రమే ఉన్నాయి. అంటే గురు అత్యంత ప్రమాదకరమైన సమాచారం మాత్రమే ఉంచి మిగిలినవన్నీ తొలగించేశాడని పోలీసులు చెప్పదలచారన్నమాట. కేసులోని నిందితులందరినీ కలిపే కీలకమైన సిమ్‌కార్డ్‌ను గురుకు 2001 డిసెంబర్ 4న అమ్మానని ఒక పోలీసు సాక్షి చెప్పాడు. కాని స్వయంగా ప్రాసిక్యూషనే సమర్పించిన కాల్ రికార్డుల ప్రకారం ఆ సిమ్ కార్డ్ 2001 నవంబర్ 6 నుంచి వినియోగంలో ఉందని తేలింది.

పోలీసులు అఫ్జల్‌ను ఎలా పట్టుకున్నారు? తమను జీలానీ తీసుకుపోయాడని వాళ్లు చెప్పారు. కాని కోర్టు రికార్డుల ప్రకారమే జీలానీని పట్టుకోవడానికి ముందే అఫ్జల్‌ను అరెస్ట్ చేశామనే మెసేజ్ ఉంది. ఇది 'వస్తుగత వైరుధ్యం' అన్న హైకోర్టు దాన్ని అక్కడే వదిలేసింది. అరెస్టు మెమో మీద ఢిల్లీలో జీలానీ సోదరుడు బిస్మిల్లా సంతకం చేసినట్టు ఉంది. కాని జప్తు మెమోల మీద జమ్ము కశ్మీర్ పోలీసులు ఇద్దరు సంతకాలు చేశారు. ఆ ఇద్దరిలో ఒకరు లొంగిపోయిన 'తీవ్రవాది' అఫ్జల్‌ను గతంలో వేధించినవారు.

ఇలా చెపుతూ పోతే ఈ అబద్ధాల, కల్పిత సాక్ష్యాధారాల కుప్పకు అంతం లేదు. కోర్టులు వీటిని గుర్తించాయి. కాని ఆ అబద్ధాలు సృష్టించినందుకు పోలీసులను కోర్టులు ఏమీ అనలేదు. చిన్న మందలింపు, అంతే.

పార్లమెంటుపై దాడి రహస్యాన్ని ఛేదించాలనే ఆసక్తి ఉన్నవారెవరైనా దొరికిన సాక్ష్యాధారాల కీకారణ్యాన్ని విప్పవలసి ఉంటుంది. కాని ఏ ఒక్కరూ ఆ పని చేయలేదు. అంటే ఆ కుట్ర వెనుక ఉన్న నిజమైన పథక రచయితలు ఎప్పటికీ గుర్తించబడకుండా, విచారణకు గురి కాకుండా ఉండాలని జాగ్రత్త తీసుకున్నారన్నమాట.

గురుకు జరిగిన నిజమైన కథ, విషాదం ఎంత పెద్దదంటే దాన్ని ఒక కోర్టుగదిలో ఆపడం కూడ సాధ్యం కాదు. ఆ నిజమైన కథ వినాలంటే మనం కశ్మీర్ లోయలోకి వెళ్లాలి. అణుయుద్ధానికి దారితీయగల వనరుకు, ప్రపంచంలోకెల్లా అతి ఎక్కువగా సైనికీకరణ జరిగిన ప్రాంతానికి వెళ్లాలి. ఐదు లక్షల మంది భారత సైనికులు, ప్రతి నలుగురు పౌరులకు ఒక సైనికుడు, ఎక్కడ పడితే అక్కడ సైనిక శిబిరాలు, అబు ఘ్రేబ్ ను కూడ చిన్నబుచ్చే చిత్రహింసా గృహాలు కలిసి కశ్మీరీ ప్రజలకు లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఇస్తున్నాయి. స్వయం నిర్ణయాధికార పోరాటం క్రియాశీల రూపం ధరించిన 1990ల నాటి నుంచి అక్కడ 68,000 మంది చంపేయబడ్డారు, పది వేల మంది మాయమైపోయారు. కనీసం ఒక లక్షమంది చిత్రహింసలకు గురయ్యారు.

అఫ్జల్‌గురు హత్యను ఈ విషాదం నుంచి వేరు చేసేదేమంటే, చెరసాలల కొట్లలో చనిపోయిన ఆ పదులవేల మంది కన్న భిన్నంగా ఆయన జీవితమూ మరణమూ కూడ పట్టపగటి వెలుగులో, కళ్లు మిరుమిట్లుగొలిపే వెలుగులో జరిగాయి. భారత ప్రజాస్వామ్యపు సకల సంస్థలూ ఆ మనిషిని చంపడంలో తమ తమ పాత్రలు పోషించాయి.

ఇప్పుడిక ఆయనను ఉరితీశారు గనుక మన సామూహిక మనోభావాలు సంతృప్తి చెందాయని ఆశిస్తాను. ఔనా? లేక మనం తాగుతున్న నెత్తుటి కప్ ఇంకా సగమే నిండిందా?

(అఫ్జల్ గురును ఉరి తీసిన మర్నాడు, లండన్ నుంచి వెలువడే ది గార్డియన్ దినపత్రికలో ఫిబ్రవరి 10, 2013న అచ్చయింది) వీ

సిరియాలో అమెరికా జోక్యం

పశ్చిమాసియాలో సంపన్న చమురు ఉత్పత్తి దేశమైన సిరియా సామ్రాజ్యవాద కుట్రల వల్ల ఎట్లా అతలా కుతలమై పోతున్నదో వివరిస్తున్నారు ఎ. నర్సింహారెడ్డి

పశ్చిమాసియాలో చమురు ఉన్న సంపన్నమైన చిన్న అరబ్ దేశం సిరియా. ఇది భౌగోళికంగా కీలకమైన స్థానంలో ఉంది. దీని జనాభా సుమారు 2 కోట్లు. ఈ ప్రాంతం అమెరికా, ఇజ్రాయిల్‌ల ఆధిపత్యానికి ఆటంకంగా ఉంది. లిబియాలో గడాఫీ ప్రభుత్వాన్ని కూల్చినట్లుగానే సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి నాటో కూటమి స్థానికులను సాయుధ తిరుగుబాటుకి ప్రోత్సహిస్తోంది. 2011 మార్చి 15 నుంచి సిరియా అగ్నిగుండంగా మారింది. దేశంలో తీవ్రమైన అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. వేలాది మంది చనిపోయారు. గాయపడ్డవారు చనిపోయిన వారికంటే ఎక్కువే. ఐదు లక్షల మంది పొరుగుదేశాలకు శరణార్థులుగా తరలి వెళ్లారని అంచనా. కొంతకాలంగా సున్నీ సౌదీ అరేబియా, షియా ఇరాన్‌ల మధ్య కొనసాగుతున్న సంఘర్షణ సిరియాలో యుద్ధజ్వాలను రగిలించడంలో సఫలీకృతమైంది. సిరియాలో మైనారిటీ అలావీలకు చెందిన అస్సాద్ ఆధిపత్యంపై మెజారిటీ సున్నీలు అసంతృప్తితో భగ్గుమంటున్నారు. సిరియాలో బలమైన పునాదులున్న ముస్లిం బ్రదర్‌హుడ్ అంతా సున్నీల కనుసన్నల్లోనే కొనసాగుతోంది. తిరుగుబాటు ఉద్యమానికి వీరి శక్తియుక్తులే ఇంధనమవుతున్నాయి. ఈ సందర్భంలోనే సిరియాలో అంతర్యుద్ధం, సామ్రాజ్యవాద దేశాల జోక్యం పెరిగింది. స్వతంత్ర విధానాన్ని అనుసరిస్తున్న సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చడం కోసం తమ బద్ధవ్యతిరేకి అల్‌ఖైదాను అమెరికా, దాని పశ్చిమ మిత్రదేశాలు ప్రోత్సహిస్తున్నాయి. సిరియాలో అల్‌ఖైదా బలంగా పాతుకుపోవడం చర్చనీయాంశం అయింది.

సిరియా చరిత్ర

సిరియా జనాభాలో 74 శాతం మంది సున్నీలు (అత్యధికులు సున్నీ అరబ్బులు, కుర్దులు, సర్కాసియన్లు, తుర్క్‌మన్లు కూడా ఉన్నారు) కావడం విశేషం. 12 శాతం అలావి, షియా (అత్యధికంగా అరబ్బులు), పదిశాతం క్రిస్టియన్లు (అరబ్ క్రిస్టియన్లు, అస్సిరియన్లు, ఆర్మీనియన్లు), మూడు శాతం ద్రుజే (కొన్నిసార్లు షియా ఇస్లాంలో భాగంగా భావించడం జరుగుతుంది) జాతీయులు ఉన్నారు. మొత్తంగా జనాభాలో 87 శాతం ముస్లింలే. సిరియన్ జనాభాలో మెజారిటీ అరబ్బులదే. ఆంగ్లంలో సిరియా పేరును గతంలో లెవెంట్ అని పిలిచే వారు. అరబిక్‌లో దీనిని షామ్ అని పిలుస్తారు. సిరియా చరిత్రలో ఎన్నో పురాతన రాచరికాలు, చక్రవర్తులు ఉన్నారు. క్రీ.పూ. మూడవ సహస్రాబ్దిలో ఎబ్లాన్ నాగరికత విలసిల్లిన దేశంగా ప్రఖ్యాతిగాంచింది. అస్సిరియన్లు, రోమన్లు, క్రూసేడర్లు నిర్మించిన అనేక అద్భుత కట్టడాలు ఇక్కడ ఉన్నాయి. ఇవి సిరియాకు పర్యాటక రంగంలో కీలకమైన ఆదాయ వనరుగా ఉన్నాయి. ఇస్లామిక్ యుగంలో దీని రాజధాని డమాస్కస్ ప్రపంచంలో నిరంతరంగా ప్రజలు నివాసమున్న అత్యంత పురాతన నగరంగా పేరుపొందింది. ప్రస్తుత సిరియాకున్న ప్రధాన వనరు చమురు, వ్యవసాయం.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1946లో ఫ్రెంచ్ వలస పాలన నుంచి సిరియా విముక్తిపొంది రిపబ్లిక్‌గా ఆవిర్భవించింది. అయినప్పటికీ దేశంలో స్థిరమైన పాలన ఎప్పుడు కొనసాగలేదు. ఎక్కువకాలం రాజకీయ అనిశ్చితే కొనసాగింది. మధ్యలో అప్పుడప్పుడు శాంతియుత పరిస్థితులు నెలకొన్నా అవి తాత్కాలికమే. 1963లో జరిగిన సైనిక తిరుగుబాటుతో బాత్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి 2011 వరకు సిరియాలో అత్యవసర పాలన కొనసాగుతూ వచ్చింది. పౌరులకు కల్పించిన అనేక రాజ్యాంగ రక్షణ చర్యలు నిలుపుదల చేయడం జరిగింది. 1970లో హాఫీజ్ అల్ అస్సాద్ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. తనను తాను అధ్యక్షునిగా ప్రకటించుకున్నారు. దేశవ్యాప్తంగా 1982లో ఇస్లామిస్ట్ తీవ్రవాదం చెలరేగింది. హామా పట్టణంలో ముస్లిం బ్రదర్‌హుడ్‌తో పాటు సున్నీ ఇస్లామిస్ట్ తెగకు చెందినవారు నిరసనలు తెలపగా, దానిని అణచివేసేందుకు హాఫీజ్ అస్సాద్ ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో వేలాది మందిని సైన్యం ఊచకోత కోసింది. హామా ఊచకోతగా ఇది చరిత్రలో నిలిచిపోయింది. అప్పటి నుండి ఇప్పటివరకు అస్సాద్‌ల నియంతృత్వ పాలన కొనసాగుతున్నది. బాతిస్టు పాలన కాలంలో పాలక శ్రేయోవర్గం ఒకటి రూపొంది తన పాలనాధికారాన్ని సుస్థిరం చేసుకుంది. దేశంలో బాత్‌పార్టీ ఒక్కటే ఏకైక పార్టీగా ఉంటూ వచ్చింది.

1998 పీపుల్స్ అసెంబ్లీ ఎన్నికల దరిమిలా హింసాకాండ చెలరేగింది. అనంతరం 1999లోనూ లటకియా పట్టణంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ఘటనలు హాఫీజ్ అల్ అస్సాద్‌కు, ఆయన సోదరుడు రిఫాత్ మధ్య విభేదాలకు ఆజ్యం పోసింది. ఇవి హింసాత్మక రూపం దాల్చి సిరియా పోలీసులు, రిఫాత్ మద్దతుదారులకు మధ్య కాల్పులకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో వందలాది మంది మరణించారు. ఆ తరువాత ఏడాదికి అనారోగ్యం వల్ల హాఫీజ్ అల్ అస్సాద్ చనిపోయారు. దీంతో ఆయన కుమారుడు 2000లో బషర్ అల్ అస్సాద్ దేశ అధ్యక్షునిగా పగ్గాలు చేపట్టి ఇప్పటికీ కొనసాగుతున్నారు. సిరియా పౌరులు రెఫరెండం ద్వారా అధ్యక్షున్ని ఎన్నుకోవడం తప్ప బహుళ పార్టీ ఎన్నికలు అనేవి సిరియాలో లేకుండా పోయాయి.

బాత్ పార్టీ ఐదు దశాబ్దాల పాలనలో సిరియాలో తీవ్ర స్థాయిలో నిరుద్యోగం నెలకొంది. నిరుద్యోగుల్లో 75 శాతం మందికి పైగా పనికోసం దీర్ఘకాలం వేచి ఉండాల్సిన దుస్థితి ఉంది. ఇక ప్రజల సగటు జీవన ప్రమాణాలు ఘోరంగా ఉన్నాయి. మానవ హక్కులు దాదాపు మృగ్యం. సైనిక దళాలకు విస్తృతాధికారులున్నాయి. ఎవరినైనా అరెస్ట్ చేయడానికి, నిర్బంధంలో ఉంచడానికి సైన్యానికి అధికారాలున్నాయి. ఇజ్రాయిల్‌తో ఎడతెగని వైరాన్ని ఇందుకు సాకుగా సిరియా ప్రభుత్వం

చూపుతోంది. 1970లో హాఫీజ్ అల్ అస్సాద్ పగ్గాలు చేపట్టింది మొదలు, సిరియా సమాజంపై పూర్తి స్థాయిలో నియంత్రణ సాధించారు. తన ప్రత్యర్థులను నియంత్రించేందుకు ఎంతకైనా తెగించేవారు. ఊచకోతలకు వెనుకాడేవారు కాదని ఆయనకు పేరు పడింది. ఆయన మరణాంతరం 2000లో పగ్గాలు చేపట్టిన బషర్ అల్ అస్సాద్ సైతం తండ్రి బాటలోనే కొనసాగారు. ప్రజాస్వామ్య సంస్కరణలు ప్రవేశపెడతానన్న బషర్ హామీ నీటి మూటయింది. ఆయన హయాంలో మానవ హక్కులు శూన్యం. రాజకీయ పార్టీలపైనా నిషేధం కొనసాగించారు. సిరియాను ఏకపార్టీ వ్యవస్థగా మార్చారు. స్వేచ్ఛాయుత ఎన్నికలు ఎండమావిగానే మిగిలాయి.

2000 అనంతరం ప్రజాస్వామిక ఎన్నికల కోసం డిమాండ్ చేస్తూ 'డమాస్కస్ స్ప్రింగ్' పేరిట విస్తృత, సామాజిక ఉద్యమం తలెత్తింది. అయితే ఈ ఉద్యమాన్ని అస్సాద్ అణచివేశారు. సిరియా కుర్దిష్ ప్రాంతాల్లో 2004లో చెలరేగిన అల్లర్లను సైతం అస్సాద్ అణచివేశారు. అయితే బషర్‌కు వ్యతిరేకంగా 2005లో 'డమాస్కస్ డిక్లరేషన్' పేరిట విపక్ష నేతలు ఉద్యమం లేవనెత్తారు. దీనిని సైతం అస్సాద్ సమర్థవంతంగా అణచివేశారు. అస్సాద్ కుటుంబం మైనారిటీ అలవైట్ తెగకు చెందినవారు. సిరియా జనాభాలో వీరి సంఖ్య 12 శాతం మాత్రమే, ఫలితంగా దేశంలోని అత్యధిక సంఖ్యాకులైన సున్నీ తెగవారిలో అసంతృప్తి చెలరేగకుండా తగిన పకడ్బందీ చర్యలను ఆయన తీసుకున్నారు. ఇందులో భాగంగా తన కుటుంబ సభ్యులను ఆర్మీలోని వివిధ విభాగాల్లో నియమించారు. ఆయన చిన్న సోదరుడు మహెర్ అల్ అస్సాద్ ఆర్మీ నాలుగో ఆర్మ్‌డ్ డివిజన్‌కు అధిపతిగా వ్యవహరిస్తుండగా.. ఆయన బావ అస్సెఫ్ షౌకత్ రక్షణశాఖ ఉప మంత్రిగా వ్యవహరించారు.

అరబ్బు నేలపై అంతో ఇంతో సామ్రాజ్య వ్యతిరేక స్వభావం కలిగిన దేశాలను ఒకటొక్కటిగా అమెరికా తుదముట్టిస్తూ పోతున్నది. అమెరికాను ఎదిరించి నిలిచిన పశ్చిమాసియాలోని బలమైన అరబ్బు దేశాలలో చివరిది సిరియా. ఏక ధ్రువ ప్రపంచంలో అమెరికా ప్రత్యర్థి దుర్గాలను ఎంచుకుని మరీ బరితెగించి కూలగొట్టడం దాని నైజం. కమ్యూనిస్టు ఉద్యమాలు ప్రపంచమంతా చెలరేగినప్పుడు, అరబ్బు దేశాలలో బాతిస్టు ఉద్యమం వచ్చింది. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ అరబ్బు జాతీయ వాద పతాకం కింద ప్రజలు సంఘటితమయ్యారు. లౌకిక విధానాలను ఆచరించారు. అస్సాద్ ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు షియా, సున్నీ విభేదాలను రెచ్చగొట్టడం, షరియత్‌ను అమలు జరపాలనే మితవాద ఇస్లామిక్ శక్తులు, ఉగ్రవాదులను రంగంలోకి దించిన పశ్చిమ దేశాల ఎత్తుగడలు ఫలిస్తే తమ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతుందని అసాద్‌ను వ్యతిరేకించే పార్టీలు కూడా భయపడ్డాయి. అందువలన అలాంటివారి చేతిలోకి సిరియా వెళ్లకూడదని అవి కోరుకున్నాయి. అటువంటి బాతిస్టు ఉద్యమాలకు కంచుకోటలుగా నిలిచిన దేశాలలో సిరియా ఒకటి. ఇప్పటికీ పశ్చిమాసియాలో పాలస్తీనియన్ల న్యాయమైన కోర్కెలకు మద్దతిస్తూ, వారికి ఆవాసం కల్పిస్తున్న దేశాల్లో సిరియా ఒకటి. ఇజ్రాయిల్ సిరియాకు చెందిన గోలన్ దిబ్బలను ఆక్రమించుకుంది. ఇజ్రాయిల్ ఆధిపత్య దోరణులను సిరియా వ్యతిరేకిస్తున్నది. ఇజ్రాయిల్‌ను వ్యతిరేకించడం అమెరికాకు సిరియాపై కోపం రావడానికి ఒక కారణం. అరబ్బు దేశాల సౌహార్ధృత్వంతో ఈజిప్టు, ఇరాక్‌లతో సన్నిహితంగా ఉంటూ గట్టి పునాదులు వేసుకుంది. ఈజిప్టుతో, ఇరాక్‌తో సాన్నిహిత్యం ఒకే దేశంగా ఏర్పడే స్థాయికి పోయింది. అయితే ఇదంతా గతం! ఇప్పుడున్న సిరియా ప్రభుత్వం అంత గొప్పదేమీ కాదు.

సిరియాలో అంతర్యుద్ధం

సిరియాలోని దారా రాష్ట్రంలో 2011 మార్చి నుండి స్థానిక డిమాండ్లపై ప్రజలు, ఆందోళన ప్రారంభించారు. 1963 నుండి అమలులో ఉన్న అత్యవసర ఉత్తర్వులను తొలగించాలన్న డిమాండుతో సిరియా అట్టుడికిపోతోంది. అన్ని దేశాలలాగే సిరియా ప్రభుత్వం దేశాన్ని స్వేచ్ఛ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వైపు నడిపే చర్యలు చేపట్టింది. పర్యవసానంగా ప్రజల జీవనస్థితి దిగజారిపోవడం ప్రారంభించింది. పేద ప్రజలకిచ్చే సబ్సిడీలపైన ప్రభుత్వం కోత విధించింది. సిరియాలో వ్యవసాయమే ప్రధానమైన వనరు. దేశ ప్రజల్లో 17 శాతం ఈ రంగంపై ఆధారపడి బతుకుతున్నారు. దీని ద్వారా దేశానికి 22 శాతం జిడిపి వస్తుంది. విదేశీ పెట్టుబడులపై ప్రభుత్వ అజమాయిషీ ఎత్తివేయడంతో దేశీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. నిరుద్యోగం పెరిగింది. యువజనులు ఉపాధి కొరకు ఆందోళనకు దిగారు. ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. దేశంలో తలెత్తిన అసమానతలు, ప్రపంచ ఆర్థిక సంక్షోభం వెరసి ప్రజా జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి.

సిరియా ప్రభుత్వం మొదట్లో ప్రజా ఆందోళన తీవ్రతను శాంతి భద్రతల సమస్యగానే పరిగణించి చర్యలు తీసుకుంది. పోలీసులు చాలా క్రూరంగా వ్యవహరించి పశుబలంతో ప్రజా ఆందోళనలను అణచివేయడానికి ప్రయత్నించారు. వేలాదిమంది నిరసనకారులను ప్రభుత్వం జైళ్లల్లో పెట్టింది. ప్రభుత్వం ఇంతటి దమనకాండకు దిగినా ఉద్యమం చల్లారలేదు. మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రభుత్వ పాశవిక చర్య దానికే ఎదురు తిరిగింది. మరింత మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. విధిలేక అత్యవసర నిబంధనలను 2012 ఏప్రిల్ 19న తొలగించింది. కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే విషయమై గత ఫిబ్రవరిలో ఒక రెఫరెండాన్ని ప్రభుత్వం నిర్వహించింది. దేశ రాజకీయ వ్యవస్థ బహుళత్వంతో కూడి ఉంటుందని, అధికారమనేది ఓటింగ్ ద్వారా సంక్రమిస్తుందని రాజ్యాంగ సవరణ చేయడం జరిగింది. ఈ కొత్త రాజ్యాంగానికి అనుకూలంగా సిరియన్లు 2012 ఫిబ్రవరి 26న ఓటు చేశారు. దీనికి అనుగుణంగా మే నెలలో పార్లమెంటరీ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అనంతరం మహమ్మద్ జిహద్ అల్ లహమ్ సిరియా పార్లమెంటు కొత్త స్పీకర్‌గా ఎన్నికయ్యారు. దేశంలో రాజకీయ సంస్కరణలు, భద్రత, జ్యుడీషియల్ సంస్కరణలు, ఆర్థిక సంస్కరణలు, సామాజిక విధానాలు, పాలనా యంత్రాంగాన్ని పటిష్టం చేయడం వంటి అంశాలపై ఒక సమగ్ర విధానాన్ని అమలు చేయనున్నట్లు సిరియా ప్రధానమంత్రి అదెల్ సఫర్ గత ఏప్రిల్ 30న ప్రకటించారు. మరోవైపు అస్సాద్ సబ్సిడీలకు పెద్దపీట వేస్తూ కార్యాచరణ ప్రకటించారు. అయినా ప్రజలు ఆందోళన పథం నుండి పక్కకు మళ్లలేదు. దేశవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగడంతో సిరియా మంత్రివర్గం రాజీనామా చేసింది. ప్రభుత్వం ఆందోళనలను అణచివేయడం కొనసాగిస్తూనే ఉంది. దేశాధ్యక్షుడు బషర్ అస్సాద్ నిరంకుశ చర్యలతో ఆందోళనలు అన్ని నగరాలకు వ్యాపించాయి.

బషర్ అల్ అస్సాద్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి 'సిరియన్ నేషనల్ కౌన్సిల్' పతాకం కింద పోరాడుతున్నాయి. ప్రభుత్వ దళాలు దమనకాండకు దిగాయి. లక్షలాదిమంది పౌరులు సిరియా సరిహద్దులు దాటి ఇరాక్, ఇరాన్ తదితర దేశాలకు వలస వెళ్తున్నారు. అదను చూస్తున్న సామ్రాజ్యవాదులు మీడియా సహాయంతో సిరియాలో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారు. ప్రజలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడంలో తమ ఆధునిక పరిజ్ఞానాన్నంతటినీ ఉపయోగించారు. వదంతులు, అసత్యాలు ప్రచారం చేశారు.

అతిశయోక్తులు, అర్ధసత్యాలతో కథలు అల్లి ప్రజలను అస్సాద్‌కు వ్యతిరేకంగా ఉసిగొల్పారు. ఈ క్రమంలోనే హౌలా అనేచోట జరిగిన ఊచకోతలో అనేకమంది పిల్లలతో సహా వందలాది మంది ప్రజలు చనిపోయారు. ఈ ఘాతుకానికి తిరుగుబాటు గ్రూపులే కారణమని ప్రభుత్వం, ప్రభుత్వమే కారణమని ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపించు కున్నాయి. అయితే ప్రతిపక్ష దళాలు కూడా సైనికులతో సహా అనేకమంది ప్రజలను చంపేశాయన్నది వాస్తవం. సిరియా రాజధాని డమాస్కస్‌లో 2012 జూలై 18న భద్రతా దళాల ప్రధాన కార్యాలయంపై జరిగిన ఆత్మాహుతి బాంబుదాడుల్లో రక్షణమంత్రితో సహా మరో ఇద్దరు ప్రముఖ నేతలు మరణించారు. మృతుల్లో రక్షణమంత్రిగా పదవిని నిర్వహించిన అస్సెఫ్ షౌకత్ అధ్యక్షుడు బషర్ అస్సాద్‌కు బావమరిది అవుతారు. జూలై 18వ తేదీ ఒక్కరోజునే 2000 మంది హతులయ్యారు.

ఉత్తర సిరియాలో సద్దుమణిగిన ఉద్యమం కాస్తా సరిహద్దుల నుండి ఆయుధాలు సరఫరా కావడంతో మళ్లీ భీకరంగా తలెత్తింది. తిరుగుబాటు సైనికులకు అమెరికా డాలర్లలో జీతాలు ఇవ్వడానికి సౌదీ అరేబియా హామీ ఇవ్వడంతో ప్రజల పక్షాన కొంతమంది సైనికులు, 2011 ఆగస్ట్ 23న ఉద్యమకారులు సమైక్యమై 'ఫ్రీ సిరియన్ ఆర్మీ'ని ఆవిర్భవింప చేశారు. అంతవరకు సాగిన శాంతియుత ఉద్యమం విదేశీ జోక్యంతో రక్తసిక్తమయిన అంతర్యుద్ధానికి తెరలేపినట్టయింది. అంతర్యుద్ధంతో దేశంలోని పట్టణాలు యుద్ధక్షేత్రాలుగా మారాయి. ప్రభుత్వ దళాలు, తిరుగుబాటు దళాలకు మధ్య భీకరయుద్ధం నడుస్తున్నది. సిరియాను పాలిస్తున్న బాత్‌పార్టీ నేత, దేశ అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ పదవీచ్యుతుడిని చేయడం లక్ష్యంగా సాగుతున్న ఈ అంతర్యుద్ధానికి అమెరికా తదితర నాటో దేశాలు అండగా నిలువడంతో పోరాటం పరాకాష్టకు చేరింది. దీంతో అమాయక ప్రజలు సమిధలుగా మారుతున్నారు. దేశ రాజధాని డమాస్కస్‌లో సైతం భారీపోరు కొనసాగుతోంది. సిరియాలో శాంతి నెలకొనేలా చూడడంలో అంతర్జాతీయ సమాజం విఫలమైంది. 'కోఫీ అన్నన్ శాంతి పథకం'లో భాగంగా సిరియా వచ్చిన పరిశీలకుల శాంతి బృందం రాజధాని డమాస్కస్‌లోని హోటళ్లను విడిచి బయట తిరుగలేకపోయారు. కాల్పుల విరమణ ప్రయత్నాలు చేసేందుకు అనువైన వాతావరణం సిరియాలో లేదని ఆ బృందం పేర్కొంది. మరోవైపు సిరియా సంక్షోభ నివారణపై ఒక ఒప్పందాన్ని ఆమోదించేలా చూడడంలో ఐక్యరాజ్య సమితి కృతకృత్యురాలు కాలేకపోయింది. ఉభయ పక్షాలు కాల్పులు విరమించాలన్న కోఫీ అన్నన్ శాంతి పథకాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ప్రభుత్వ, తిరుగుబాటుదారుల మధ్య సయోధ్య కుదర్చడంలో విఫలమైన నేపథ్యంలో కోఫి అన్నన్ తన పదవికి రాజీనామా చేశారు.

సిరియా విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న పాత్ర గర్హనీయంగా ఉంది. అమెరికా, నాటో కూటమి అడుగులకు మడుగు లొత్తుతూ సిరియాను ఒక విఫల రాజ్యంగా చూపేందుకు ప్రయత్నిస్తోంది. సిరియాలో చట్టబద్ధపాలన లేదని ఐక్యరాజ్యసమితి ద్వారా చెప్పించేందుకు కుట్ర జరుగుతోంది. తిరుగుబాటుదార్లు చెబుతున్న కథనాలనే ఐరాస వల్లెవేయటమే దీనికి తిరుగులేని నిదర్శనం. రష్యా, చైనా తమ వీటో హక్కుతో తీర్మాణం చేయకుండా అడ్డుకుంటున్నాయి. అమెరికా నుండి ఎంతగా ఒత్తిడి వస్తున్నప్పటికీ అస్సద్ ప్రభుత్వం లొంగిపోయేందుకు నిరాకరిస్తోంది. ప్రతిపక్ష పోరాట దళాలపై గణనీయమైన విజయాలు సాధిస్తోంది. అలెప్పో మరో బెంఘాజీ కావడం లేదు. పరస్పరం సహకరించుకునేందుకు ఇరాన్ – సిరియా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఫ్రీ సిరియన్ ఆర్మీ (ఎఫ్ఎస్ఎ)కు స్టింగర్ క్షిపణులు పంపడాన్ని టర్కీ కొనసాగిస్తే, కుర్దిష్ తిరుగుబాటు దళాలకు ఎస్ఎ – 8 విమాన విధ్వంసక క్షిపణులను సరఫరా చేస్తానని ఇరాన్ హెచ్చరించింది. కొన్ని మాజీ మిత్ర దేశాల మాదిరిగా చైనా, రష్యా ఆ దేశంతో మైత్రిని వదులుకోలేదు. మిత్ర దేశాలు అండగా నిలవడంతో అమెరికా, నాటోతో ఆఫ్ఘనిస్తాన్‌కు ఎదురైన పరిస్థితి రాకుండా నివారించేందుకు ఇప్పటికి సిరియాకు అవకాశముంది.

సిరియాలో సామ్రాజ్యవాదుల జోక్యం

అగ్రరాజ్యాల వాణిజ్య ఆధిపత్యవర్గ అహంకార జ్వాలల మధ్య సిరియా రోజురోజుకు రావణకాష్టంలా రాజుకొంటోంది. పరాయి జోక్యం ఇందులో పనికిరాదని పైకి చెబుతూ రష్యా, చైనా దేశాలు ఒకవైపు, అమెరికా దాని మిత్ర దేశాలు మరోవైపు నిలుచుని సిరియా మంటలతో చలికాచుకొంటున్నాయి. సోవియట్ యూనియన్ ప్రపంచ చరిత్ర నుంచి శూన్యం కావడం, చైనా విధానాలలో మార్క్సిజం కన్నా సామ్రాజ్యవాదులతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి పెరగడంతో అమెరికా ప్రపంచ ఆధిపత్య వ్యూహానికి సత్తువ బాగా పెంచినట్టయింది. అందుకే తన డేగ కళ్లతో ప్రపంచంలో ఎక్కడ ఏ బలహీనత ఏ దేశంలో కనిపించినా అది అక్కడ వాలిపోతోంది. అమెరికా, యూరప్ దేశాల ఉమ్మడి రణ వ్యూహంతో లిబియాలో గడాఫి ప్రభుత్వం పతనమైన తరువాత ఇక సిరియాకు అటువంటి గతి తప్పదని ముందుగా ఊహించిందే. అమెరికా హుకుంలకు తలవంచని సిరియాలో ప్రభుత్వ మార్పు తీసుకురావడానికి నాటో భాగస్వామి అయిన టర్కీని స్థావరంగా చేసుకొని అంతర్యుద్ధాన్ని ప్రోత్సహిస్తోంది. లిబియా మాదిరిగా సిరియాను తన గుప్పెట్లో ఇముడ్చుకోడానికి శాంతి పునరుద్దరణ యత్నం పేరుతో అమెరికా కొంగ జపం చేస్తూ దొంగమంత్రం పఠిస్తోంది. మరోవైపు ఇరాన్‌ను దెబ్బ తీయాలన్నా, దాని సైనిక శక్తిని, అణుకార్యక్రమాన్ని నీరుగార్చాలన్నా అస్సాద్ ప్రభుత్వాన్ని కూల్చడం తప్పదని తలపోస్తున్న సౌదీ ఇటీవల సైనిక ఎత్తుగడలకు పూనుకొంటోంది.

సిరియా అధ్యక్షుడు బషర్ అస్సాద్‌కు పరోక్షంగా రష్యా, చైనాలు మద్దతు ఇస్తుండగా, అస్సాద్‌ను ఎలాగైన గద్దెదించాలన్న కాంక్షతో అమెరికా, దాని మిత్రదేశాలు (నాటో) డేగకళ్లతో నిరీక్షిస్తున్నాయి. ప్రజాస్వామ్య పంథాను పెడదారి పట్టించి, నియంతృత్వాన్ని వంట పట్టించుకుని, తిరుగుబాటు 'అరబ్ వసంతం' ప్రజా పోరాటాన్ని, తన ఉక్కు పదఘట్టనలతో అణచివేస్తున్న అమెరికా, బషర్ అస్సాద్‌ను నిరోధించడానికి చివరికి ఐక్యరాజ్య సమితిని రంగంలోకి దింపక తప్పలేదు. అయితే ట్యూనీషియా, ఈజిప్టు, లిబియాల్లో మాదిరి సిరియాలో తమ తొత్తులను ప్రతిష్టించటం అమెరికాకు అంత తేలిక కాదు. అస్సాద్ నియంతృత్వ పాలనకు చరమాంకం పాడాలని ఐక్యరాజ్య సమితి ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో 2012 ఫిబ్రవరి 4న భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి పూర్తి మద్దతు లభించలేదు. అమెరికా, దాని మిత్రదేశాలకు దన్నుగా భారతదేశంతో సహా 11 దేశాలు మద్దతుగా ఓటు వేశాయి. దక్షిణాఫ్రికా, పాకిస్తాన్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. రష్యా, చైనా దేశాలు వ్యతిరేకించాయి. దీంతో తీర్మానం వీగిపోయింది. సిరియాపై అమెరికా పన్నాగాలను ఎప్పటికప్పుడు రష్యా పసిగడుతూ దానికి ధీటుగానే ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. అమెరికా, రష్యాలు ఈ విధంగా తెర వెనుక నుండి రణతంత్రం నడిపించడానికి ప్రధాన కారణం వ్యాపార ప్రయోజనాలు మాత్రమే. రష్యా, చైనాల వ్యాపార సామ్రాజ్యంలో సిరియాకు భాగస్వామ్యం ఉంది.

సిరియాలో అస్సాద్ సర్కారును కూలదోయాలన్న కృతనిశ్చయంతో

ఉన్న అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు దేశంలోని తిరుగుబాటు దళాలకు తమవంతు సాయాన్ని అందజేస్తున్నాయి. ముఖ్యంగా సిరియాపై కారాలు మిరియాలు నూరుతున్న ఇజ్రాయిల్‌తో పాటు సౌదీ అరేబియా తదితర దేశాల ద్వారా సిరియాలోని తిరుగుబాటుదారులకు డబ్బు, ఆయుధాలు, అంతర్జాతీయ సహకారాన్ని అందిస్తున్నాయి. తిరుగుబాటు దళాలలో ప్రధాన శక్తిగా ఉన్న ఫ్రీ సిరియన్ ఆర్మీ (ఫ్రీఎస్ఏ) మెజారిటీ సున్నీలతో, అల్‌ఖైదా మిలిటెంట్లతో ఏర్పడింది. టర్కీని స్థావరంగా చేసుకుని తిరుగుబాటుదారులు కొనసాగిస్తున్న సాయుధ విప్లవానికి అమెరికా, నాటోదేశాలు పూర్తి మద్దతును అందజేస్తున్నాయి. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో తిరుగుబాటుదారులు కమాండ్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడానికి టర్కీ ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనికి ఆర్థిక వనరులను, అత్యాధునిక ఆయుధ సంపత్తిని అమెరికా గూఢాచార సంస్థ సిఐఎ సమకూర్చుతోంది అనేది బహిరంగ రహస్యం. సిరియా ఘర్షణలను జాతుల మధ్య ప్రచ్ఛన్నయుద్ధంగా అభివర్ణించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా, టర్కీ, ఖతార్‌లు సిరియాలోని సున్నీల సారథ్యంలోని విపక్షానికి మద్దతు ఇస్తుండగా, ఇరాన్, ఇరాక్, లెబనాన్‌లోని హిజ్బుల్లా సిరియాలోని అలవైట్ సారథ్యంలోని అస్సాద్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నాయి. సున్ని-షియా హింసాకాండ లెబనాన్, ఇరాక్, పాకిస్తాన్, ఇలా అన్ని ముస్లిం దేశాలకు పాకుతోంది. మరోవైపు వామపక్ష వాదులమని చెప్పకునే కొన్ని కుహనా గ్రూపులు (అమెరికాలోని ఇంటర్నేషనల్ సోషలిస్టు ఆర్గనైజేషన్, బ్రిటన్‌లోని సోషలిస్టు వర్కర్స్ పార్టీ, ఫ్రాన్స్‌లోని యాంటీ కేపటలిస్టు పార్టీ) వంటివి సిరియాలో అస్సాద్ వ్యతిరేక సాయుధ మూకలను ఎగదోసే చర్యలకు పూనుకుంటున్నాయి.

సిరియాలోని అలెప్పోలో పట్టుబడిన సైనికులను సాయుధ తిరుగుబాటుదారులు సామూహికంగా ఉరితీయించారు. ఆ వీడియోలను టీవీ చానెళ్లలో చూపించి ప్రజల్లో ఒక రకమైన భయానక వాతావరణాన్ని సృష్టించారు. టర్కీ, సౌదీ అరేబియా, ఖతార్‌లలోని మితవాద ప్రభుత్వాలు అమెరికా ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఆఫ్ఘనిస్తాన్, బోస్నియా, చెచెన్యా, లిబియాల్లో కిరాయికి పనిచేసిన దొంగలు, నేరగాళ్లను సిరియాకు తరలించి విముక్తి సైన్యం పేరుతో పశ్చిమ దేశాలు, వాటి అడుగుజాడల్లో నడిచే అరబ్‌లీగ్ దేశాలు విధ్వంస కాండను సృష్టిస్తున్నాయి. ఇదంతా మధ్య ప్రాచ్యంలో తన పట్టును మరింత పెంచుకునేందుకు, తద్వారా ఇరాన్ చమురు సంపదలను కొల్లగొట్టేందుకే అని వేరే చెప్పనవసరం లేదు. సిరియాలో ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమం ప్రజాస్వామ్యం కోసం జరిగే పోరాటం కానే కాదు, అదొక ప్రతీఘాత యుద్ధం. గత ఏడాది ఈజిప్టు, ట్యూనీషియాలలో అమెరికా బలపరిచిన నియంతలపై అక్కడి ప్రజలు తిరుగుబాటు చేసి పదవీచ్యుతులను చేశాయి. సిరియాలో దీనికి పూర్తి భిన్నంగా అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్‌ను కూలదోసి, తన తొత్తు ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించాలని అమెరికా, ఇతర పశ్చిమ దేశాల పన్నాగం.

టర్కీలోని అదానను కేంద్రంగా చేసుకుని అమెరికా సిరియా వ్యతిరేక కార్యకలాపాలను గత కొన్ని మాసాలుగా సాగిస్తున్నది. సిరియా ఉత్తర సరిహద్దుకు కేవలం 60 మైళ్ల దూరంలో అమెరికా మిలిటరీ, గూఢాచార స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. ఇక్కడి నుంచే ఆయుధాలు, విదేశీ కిరాయి సైనికులను సిరియాకు అది పంపిస్తుంది. సిరియాలోని 'తిరుగుబాటు' సాయుధ మూకలకు అవసరమైన అన్ని రకాల సరఫరాలకు ఇప్పుడు ఇదొక కీలక రహదారిగా మారింది. సిరియా ప్రభుత్వ దళాల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ ఎలా ముందుకెళ్లాలో తిరుగుబాటు సాయుధ మూకలకు సిఐఎ సూచనలిస్తుంది. సిరియా తిరుగుబాటుదారులకు అటు అమెరికా దురాక్రమణలోని ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాలోని అమెరికన్ తొత్తు ప్రభుత్వాలతో పాటు అల్జీరియా, చెచెన్యా, పాకిస్తాన్ వంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు వచ్చిపడుతున్నాయి. జనవరి 30న సిరియా మిలిటరీ పరిశోధనా కేంద్రంపై ఇజ్రాయిల్ వైమానిక దళం దారుణంగా దాడి చేసింది. అంతర్గతంగా విదేశీ ప్రేరేపిత ఉగ్రవాదులను ఎదుర్కొంటున్న అస్సాద్‌ను యుద్ధంలోకి లాగడం ద్వారా బలహీన పరచాలని చూస్తున్నారు. పశ్చిమాసియాలో ఇజ్రాయిల్‌ను అమెరికా తమ పావుగా ప్రయోగిస్తోంది.

అస్సాద్ ప్రభుత్వాన్ని కూల్చడం కోసం చివరికి అల్‌ఖైదా వంటి శక్తుల సహాయాన్ని కూడా అమెరికా తీసుకుంటుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో అల్‌ఖైదాపై యుద్ధం ప్రకటించానని చెప్పినా అమెరికా సిరియా దగ్గరికొచ్చేసరికి అవే శక్తులతో చేతులు కలిపింది. సిరియాలో తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏ గడ్డి కరవడానికైనా అమెరికా సిద్ధపడుతుంది. ఎందుకంటే సిరియాను తన ఆధీనంలోకి తెచ్చుకోవడం ద్వారా ఇరాన్‌పై యుద్ధానికి అవసరమైన భూమిక సిద్ధం చేసుకోవాలన్నది అమెరికా పథకం. అందులో భాగంగానే సిరియా రసాయనిక ఆయుధాలను భారీగా నిల్వ చేసిందని, దీనిపై తాము ప్రత్యక్ష చర్యకు దిగుతామని ఒబామా చేస్తున్న హూంకరింపులు ఆయన యుద్ధోన్మాదానికి అద్దం పడుతున్నాయి. ఈ విధంగా చమురు సంపన్నమైన మధ్యప్రాచ్యంపై పూర్తి ఆధిపత్యం చలాయించాలని అమెరికా చూస్తోంది. సిరియాలో మానవతావాద జోక్యం పేరుతో ఆ దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ప్రభుత్వం రసాయనిక ఆయుధాలను ప్రయోగిస్తోందనే దుష్ప్రచారం మీడియా ప్రారంభించింది. సిరియాలో నాలుగు రకాల జీవ రసాయనాలు ఉన్నట్లు అమెరికాలోని గ్లోబల్ సెక్యూర్టీ వెబ్‌సైట్ ఒకటి ప్రకటించింది. దీనిని సాకుగా తీసుకుని తీవ్ర పరిణామాలను ఎదుర్కోవల్సి వస్తుందని పశ్చిమ దేశాలు హెచ్చరించడం ప్రారంభించాయి. సిరియా ప్రభుత్వం ఎంతగా ఖండిస్తున్నప్పటికీ నాటో జోక్యాన్ని సమర్థించేందుకు, ప్రజల అభిప్రాయాన్ని మలచేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఒబామా యత్నాలకు, ఆలోచనలకు బ్రిటిష్ ప్రధాని డేవిడ్ కెమరూన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకొయిస్ హోలండే తమ మద్దతు తెలిపారు.

సిరియా సంక్షోభంలో అనేక దేశాల ప్రమేయముంది. ఆయుధ సరఫరాదారులు, రాజకీయ కార్యకలాపాలు నిర్వహించేవారి పాత్ర ఇప్పటికే స్పష్టమైంది. టర్కీ మితిమీరి దూకుడుగా వ్యవహరిస్తోంది. సిరియా జాతీయ మండలి (దీన్ని ఇస్తాంబుల్ కౌన్సిల్‌గా పిలుస్తారు), ఫ్రీ సిరియన్ ఆర్మీకి ఆయుధాలు అందించింది. టర్కీ దక్షిణ సరిహద్దు ప్రాంతం, ముఖ్యంగా హతాయ్ రాష్ట్రం విదేశీ ఉగ్రవాదుల అక్రమ ప్రవేశానికి రహదారిగా మారింది. టర్కీ సైన్యం ఎఫ్ఎస్ఏకు శిక్షణ ఇచ్చి ఆయుధాలను అందించింది. తిరుగుబాటుదారులకు టర్కీ బహిరంగంగా సహాయం అందించడం మాత్రమే కాకుండా వ్యవస్థాగతమైన స్థావరాన్ని కల్పిస్తోంది. సిరియాలో యుద్ధం చేసేందుకు టర్కీ ప్రభుత్వానికి పార్లమెంటు అనుమతి కూడా ఇచ్చింది. టర్కీ చేస్తున్న విజ్ఞప్తులకు ప్రతిస్పందిస్తూ సిరియా సరిహద్దు వెంబడి పేట్రియాట్ క్షిపణులను మోహరించేందుకు నాటో సన్నాహాలు చేస్తోంది. అమెరికా అధికార యంత్రాంగం రాష్ట్రాల మిలిటరీ కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేయడంలో సహాయం అందించడంతోపాటు వాటి ద్వారా ఆయుధాలు సరఫరా చేస్తున్నట్లు పశ్చిమ దేశాల మీడియాలో వార్తలు వచ్చాయి. ఫ్రీ సిరియన్ ఆర్మీకి అమెరికా నుంచి స్టింగర్ క్షిపణులు టర్కీ ద్వారా అందినట్లు ఎన్‌బిసి న్యూస్ పేర్కొంది.

మధ్య ప్రాచ్యం, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తమ ప్రభావాన్ని

పాదుకొల్పేందుకు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాద శక్తుల మధ్య గల క్రూరమైన పోటీ ఉద్రిక్తతలను పెంచుతోంది. ఈ ప్రాంతంలో యుద్ధ వాతావరణ పరిస్థితులను సృష్టిస్తోంది. సిరియా ప్రభుత్వ వ్యతిరేకులకు ఆయుధాలు, ఉగ్రవాదులు, కిరాయి మూకలను సరఫరా చేస్తున్న దేశాలే దొంగే.. దొంగ అని అరచిన చందంగా సాయుధ సంఘర్షణలను నివారించాలనే శాంతి అజెండా కింద ఐక్యరాజ్య సమితిలో పాశ్చాత్య దేశాలు మరో తీర్మానాన్ని ప్రతిపాదించాయి. సాధారణంగా ఇటువంటి సందర్భాలలో సంఘర్షణకు బాధ్యులైన పక్షాలు, వాటి చర్యలన్నింటినీ ఖండిస్తే అదొక తీరు. అదేమీ లేకపోగా ఏకపక్షంగా ప్రభుత్వాన్ని తప్పు పట్టడమే గాక ఐరాస నిబంధనలకు విరుద్ధంగా దేశాధ్యక్షుడు రాజీనామా చేయాలనటం, సిరియాపై చర్యలు తీసుకో నందుకు భద్రతా మండలిని తప్పు పట్టడం, సిరియాతో దౌత్య సంబంధాలు రద్దు చేసుకోవాలని తీర్మానంలో చేర్చడం అన్యాయం, అక్రమం, అనుచితం. అందుకే పన్నెండు దేశాలు తీర్మాణాన్ని వ్యతిరేకించగా 33 దేశాలు ఓటింగ్‌ను బహిష్కరించాయి. ఓటింగ్‌కు దూరంగా భారత్ ఉండడం విశేషం. ఇటీవల టెహ్రాన్‌లో జరిగిన అలీనోద్యమ శిఖరాగ్ర సమావేశంలో సిరియా ఘర్షణలు తీవ్ర విభేదాలకు దారితీశాయి. సిరియాను ఆక్రమిస్తామని టర్కీ ప్రకటిస్తే, చూస్తూ ఊరుకోమని ఇరాన్ హెచ్చరించింది. భారత్ మాత్రం అంతర్గత సమస్యలో విదేశీ జోక్యం తగదని హితవు పలికింది. ఇరాక్‌లో అమెరికా సైనికులు ఇంకా ఉన్నా, అమెరికా మద్దతుతోనే ఇరాక్ ప్రభుత్వం కొనసాగుతున్నా ఐరాస జనరల్ అసెంబ్లీ సిరియా ప్రభుత్వాన్ని ఖండిస్తూ చేసిన తీర్మాణానికి ఇరాక్ మద్దతు తెలుపలేదు. ఇరాక్ ప్రభుత్వంలో మెజారిటీ షియాలే. చివరగా సిరియా సంక్షోభాన్ని పరిష్కరించాలని అలీనోద్యమ సదస్సు పిలుపునివ్వడం కొంతమేరకు.

అమెరికా, ఫ్రాన్స్, నాటో మిత్రపక్షాలు, ఇస్లామిస్ట్ ఉగ్రవాదులు ఒక జట్టుగా పనిచేస్తుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది. అల్‌ఖైదా అనుబంధ సంస్థ అయిన జబాత్ - అల్ - నూస్రా ఇందులో అత్యంత క్రూరమైందిగా పేరుగాంచింది. తిరుగుబాటు దళాల్లో అది బలమైన శక్తిగా ఆవిర్భవించింది. ఆ సంస్థకు చెందిన ఆత్మాహుతి బాంబర్ దళాలు డమాస్కస్‌లో బస్సులను, కార్లను చివరికి పాఠశాలల్లోని శిబిరాలను పేల్చివేశాయి, 29 మంది విద్యార్థులతో సహా వందలాది మంది పౌరులు మరణించారు. జాబాత్ అల్ - నూస్రా తన పోరాట దళాలను విదేశాల నుంచి నియమిస్తోంది. లిబియా, పాకిస్తాన్, ఇరాక్, లెబనాన్, సౌదీ అరేబియా, తుర్కుమెనిస్తాన్, చెచెన్యాల్లోని కిరాయి సైనికుల నుంచి వీరిని ఎంపిక చేస్తోంది. అందువల్లనే అది తీవ్ర స్థాయిల్లో హింసాకాండకు పాల్పడగలుగుతోంది. ప్రభుత్వాన్ని మార్చడం మాత్రమే కాకుండా దేశంలో లౌకికవాద రాజకీయ వ్యవస్థను మార్చడం ద్వారా ఇస్లామిస్ట్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం తమ లక్ష్యంగా అది ప్రకటించింది. లిబియాలో అమెరికా ఉసిగొల్పిన ఉగ్రవాదులే సిరియాలో నేడు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు ముస్లిం దేశాలలో గల సున్ని, షియా మత సంస్థల మధ్య గల వివాదాలను రెచ్చగొట్టి విభజించి పాలించు అనే నీతిని అమెరికా చక్కగా ఆచరిస్తున్నది. ఈ రెండు మత సంస్థల మధ్యగల విభేదాలను ఉపయోగించుకొని అరబ్ లీగ్ దేశాలలో మెజారిటీని, ఇస్లామిక్ దేశాల సంస్థల మెజారిటీని తనకు సానుకూలంగా తిప్పుకుంది. అమెరికా, అరబ్‌లీగ్, ఇస్లామిక్ దేశాలలోని సంస్థలతో సిరియాకి వ్యతిరేకంగా తీర్మాణం చేయించగల్గింది. సిరియాలో ఏర్పడిన ప్రతిపక్ష మండలిని ప్రజలకు ప్రతినిధిగా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలతో పాటు అమెరికా అరబ్ మిత్ర దేశాలు గుర్తిస్తున్నట్లు ప్రకటించాయి. దీన్ని రష్యా, చైనా దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. 2012 జూన్ 30న జెనీవాలో కుదిరిన ఒప్పంద పరిధిలో సిరియా సమస్యకు పరిష్కారాన్ని సాధించేందుకు కృషి ప్రారంభించాలని ఐరాస-అరబ్‌లీగ్ ప్రత్యేక ప్రతినిధి లఖ్దర్ బ్రహీమీ చెప్పారు.

ముగింపు

సిరియా ప్రభుత్వ దళాల చేతిలో తిరుగుబాటు దారులు చావుదెబ్బలు తినడంతో పాటు వివిధ కిరాయి బృందాలు సంస్థల మధ్య విభేదాలు చోటు చేసుకుంటుండడంతో పశ్చిమ దేశాలు అసహనంతో ఉన్నాయి. సిరియా ప్రభుత్వం ఊహించిన దాని కన్నా బలంగా కనబడుతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే లిబియాలో మాదిరిగా స్వయంగా దాడులు జరపాలని అమెరికా భావిస్తున్నది. సిరియాలో బషర్ అస్సాద్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత లేదని కాదు. అయితే ఆయా దేశాలలో ప్రజాస్వామిక ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకునే అవకాశం అక్కడి ప్రజలకే ఉండాలనేది అంతర్జాతీయ న్యాయ సూత్రం. ఒక దేశ అంతర్గత విషయాల్లో మరోదేశం జోక్యం చేసుకోవడం ప్రమాదకరమని జెనివా ఒప్పందం పేర్కొంది. అమెరికా కూటమి అరబ్బు దేశాలలో ప్రజాస్వామ్యం పేరిట జోక్యం చేసుకొని ప్రభుత్వాలను కూలగొట్టిన బూచిని చూపించి బషర్ అస్సాద్ వంటి నియంతలు తమ స్థానాలను పదిల పరచుకుంటున్నా రన్నది కూడా నిజమే. ఏది ఏమైనా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడు కోవాల్సింది ఆయా దేశాల ప్రజలే. సిరియాలో తిరుగుబాటు దారులకు విదేశీ జోక్యానికి సిరియన్ల మద్దతు లేదన్నది సుస్పష్టం. తిరుగుబాటు దారులను ఎదుర్కొని నియంత బషర్ అస్సాద్‌ను పదవి నుంచి తొలగించే హక్కు సిరియన్ ప్రజల సొంతం. బషర్ ప్రభుత్వం కూలిపోతే బాధపడ వల్సిందేమిలేదు. కాని ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, ఈజిప్టు, లిబియా దేశాల అనుభవాలను చూసిన తర్వాత సిరియా పరిణామాలు ఎట్లా ఉంటాయో అనేదే ప్రజాస్వామికవాదులను, శాంతి కాముకులను కలిచివేస్తున్న ఆందోళన.

సిరియాలో సమైక్యతను భగ్నం చేసి దానిని దెబ్బతీసేందుకు సామ్రాజ్యవాద శక్తులు నిరంతరం వేర్పాటువాద ఆందోళనలను, సంకుచితమైన ఉద్యమాలను రెచ్చగొడుతున్నాయి. ఇరాక్‌తో సహా ఇది ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో జరిగింది. మధ్య ప్రాచ్య ప్రాంతంలో మతపరంగా, జాతుల గుర్తింపుపరంగా సంప్రదాయసిద్ధంగా అవిభక్తంగా ఉన్న సిరియాలో ప్రస్తుతం ఇదే జరుగుతోంది. సిరియాలో ప్రస్తుతం జరుగుతున్న తిరుగుబాటు దాడుల్లో బాధితులు షియాలు, అల్వాయిలు. సున్నీ, సలాఫీ తెగలకు చెందిన ఇస్లామిస్టుల దాడులకు వీరు గురవు తున్నారు. సిరియా తిరుగుబాటు దళాలు పెద్ద ఎత్తున సిరియా క్రైస్తవులపై దాడులు జరుపుతున్నాయి. జాతులపరంగా జరుగుతున్న ఈ దాడులు, సృష్టిస్తున్న చీలికలు ఏ ఉద్యమ ప్రజాస్వామ్య స్ఫూర్తినైనా దెబ్బతీస్తాయి.

సిరియాలో జరుగుతున్న పోరాటం చమురు నిల్వలపై పెత్తనం చెలాయించేందుకు జరుగుతున్న పోరాటంగా భావించవచ్చు. ఇరాక్, లిబియాల్లో కూడా ఇదే జరిగింది. సంక్షుభితమైన అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా సహజ వనరులను దోపిడీ చేసే తన విషపూరిత కార్యక్రమాన్ని ఉధృతం చేస్తోంది. ఈ వేటను అమెరికా, దాని మిత్ర దేశాల రాజకీయ, సైనిక దుస్సాహసాల నుంచి వేరు చేసి చూడకూడదు. అందువలన సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు, ప్రపంచ శాంతి ఉద్యమకారులు సిరియా విషయంలో మరింత చురుకైన పాత్ర నిర్వహించాలి. సిరియాపై సామ్రాజ్యవాద జోక్యాన్ని, దాడిని సూత్రబద్ధంగా వ్యతిరేకించాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వి

ప్రజలపై పెరుగుతున్న రాజ్యహింస

***దేశంలోని సహజ వనరులను బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టడం కోసం దేశ ప్రజలపైనే భారత పాలకులు గ్రీన్‌హంట్ పేరుతో చేస్తున్న యుద్ధాన్ని అడ్డుకోవడానికి ప్రజలు ఉద్యమించాలంటున్నారు* కిరణ్**

దేశీయ పాలక వర్గాలైన భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలు తమ సామ్రాజ్యవాద ప్రభువుల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పీడిత వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విప్లవోద్యమాన్ని, ప్రజా ఉద్యమాలన్నింటినీ సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో రెండవ గ్రీన్‌హంట్ ఆపరేషన్ జరుపుతున్నారు. ఎల్ఐసి(లో ఇంటెన్సిటీ కాన్ఫ్లిక్ట్) పథకంలో భాగంగా జరుగుతున్న దాడే ఇది. దోపిడి వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజా ప్రతిఘటనను, ప్రజా ఉద్యమాలను అణచడానికి చేస్తున్న యుద్ధమే ఇది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలక వర్గాలు దేశ సంపదలను బహుళజాతి కంపెనీలకు, బడా నిరంకుశ పెట్టుబడిదారులకు కట్టబెట్టడం కోసం ప్రజలను ముఖ్యంగా ఆదివాసులను తమ జల్, జంగల్, జమీన్‌ల నుండి బేదఖల్ చేయడం కోసం సాగుతున్న దుర్మార్గమైన అన్యాయమైన యుద్ధం ఇది.

ప్రస్తుత బూటకపు ప్రజాస్వామ్యాన్ని, కుళ్లిన పార్లమెంటరీ వ్యవస్థను నెత్తికెత్తుకున్న పార్లమెంటరీ పార్టీలన్నీ ప్రజలకు వ్యతిరేకంగా ఒక్కతాటిపై నిలబడి ఈ అన్యాయమైన యుద్ధాన్ని సమర్థిస్తున్నాయి. దేశంలోని ఖనిజ, ప్రకృతి సంపదలను దోచుకునే ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తున్న ప్రతిచోట, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలన్నిటా ఈ రోజు బడా కార్పొరేట్ కంపెనీలు, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ ప్రయోజనాలను, కాపాడేందుకు అంకితమైన రాజ్యం, పోలీసు బలగాలు, క్రూరమైన అన్ని రకాల ఇంటలిజెన్స్ విభాగాలు మోహరించాయి.

ఈ యుద్ధం అత్యంత బలమైన రాజ్యం, దాని సాయుధ బలగాలతో, పీడితులు, బలహీనులు అయిన ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న యుద్ధం. అత్యంత అసమాన శక్తుల మధ్య యుద్ధం. ఈ అన్యాయమైన యుద్ధానికి మొదటి లక్ష్యం ఖనిజ సంపదలతో నిండిన దండకారణ్యం లోని అబూజ్‌మాడ్, రెండవది దండకారణ్య సరిహద్దు జిల్లా ఖమ్మం. అందుకే 2012 జూలై నుండి ఇప్పటి వరకు ఎడతెరిపి లేకుండా సరిహద్దు గ్రామాలలో ముఖ్యంగా భద్రాచలం డివిజన్ పరిధిలోని అటు చివర వాజేడు మొదలుకొని వెంకటాపూర్, చర్ల, దుమ్ముగూడెం, చింతూరు మండలాలలోని ఆదివాసి గ్రామాలపై 10 సార్లు రాత్రికి రాత్రి చుట్టుముట్టి దాడులు చేయడం దొరికిన వారిని చితక బాదడం, పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టి నయానా భయానా లొంగదీసుకోవడం, వినకపోతే అనేక తప్పుడు కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపడం, వేధించడం పరిపాటి అయింది. ప్రతి గ్రామం నుండి ఇద్దరు చొప్పున ప్రతిరోజు స్టేషన్‌కు హాజరు కావాలని, కొన్ని సందర్భాలలో గ్రామాల్లోని యువతీ యువకులందరూ స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టాలని కండిషన్స్ పెడుతూ పోలీసులు ప్రజలను అనేక ఇబ్బందులకు, వేదింపులకు గురిచేస్తున్నారు. వీటన్నింటి కారణంగా ప్రజలు తమ వ్యవసాయ పనులను సరిగ్గా చేసుకోలేక, అరెస్టులు జరిగితే పూర్తిగా వ్యవసాయాన్ని నష్టపోతూ అనేక కష్ట నష్టాలకు గురైతున్నారు. ఇంటి వద్ద ఏదైనా పని ఉండి కండిషన్స్‌కు హాజరు కాకపోతే మీరు మావోయిస్టు దళాన్ని కలిసేందుకు వెళ్లారని రకరకాల పద్ధతుల్లో టార్చర్ చేస్తున్నారు.

సివిక్ ప్రోగ్రాంల పేరుతో నేరుగా పోలీసులు, ఎస్ఐ మొదలుకొని ఒఎస్‌డి, డిఎస్‌పిల వరకు గ్రామాల్లోకి వస్తూ, దఫదఫాలుగా ప్రజలందర్నీ ఒక దగ్గరికి చేర్చి పార్టీకి వ్యతిరేకంగా సిద్ధాంతాలు చెపుతున్నారు. దళాలకు ఎవరు సహకరించకూడదని కౌన్సిలింగ్ ఇస్తున్నారు. దళానికి ఎలాంటి చిన్న వస్తువు అందించినా కఠిన చర్యలు ఉంటాయని బెదిరిస్తున్నారు. మేము ఉన్నాం, ప్రభుత్వం ఎన్నో సంస్కరణ లు చేపడుతుంది, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం, యువతి, యువకులు ఉపయోగించుకోవాలంటున్నారు. ముఖ్యంగా మావోయిస్టుల సమాచారం మాకు అందించాలని మీకు అన్ని రకాల సదుపాయాలు అందిస్తామని ఆశ చూపుతున్నారు. రహస్యంగా కొంత మంది లంపెన్ సెక్షన్‌కు చెందిన యువకులకు డబ్బు ఆశ చూపించి ఇన్‌ఫార్మర్స్‌గా మార్చుకుంటూ రహస్యంగా ఉద్యమ ప్రాంత గ్రామాలలో సెటిల్ చేస్తున్నారు.

యువతను ఆకర్షించడం కోసం వాలీబాల్స్, నెట్లు, క్రికెట్ కిట్లు ఇంకా కొన్ని చిన్న చితకా ఐటమ్స్ ఇస్తూ, కల్లబొల్లి మాటలు చెపుతూ తమ వైపు తిప్పుకోవడానికి తీవ్రమైన ప్రయత్నాలే చేస్తున్నారు. పోలీసు డిపార్టుమెంటులో చేరాలని ప్రోత్సహిస్తున్నారు. రకరకాల పద్ధతులలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను పెంచుకోవడానికి ఇన్‌ఫార్మర్లను, పారాటీచర్లుగా, అంగన్ వాడిలుగా, హోంగార్డ్స్‌గా ఉపాధి హామీ పథకం సూపర్‌వైజర్లుగా కొన్ని ప్రాంతాలలో సెటిల్ చేస్తున్నారు. దేశంలోని అన్ని రకాల ఇంటలిజెన్స్ సంస్థలు, ముఖ్యంగా ఎస్ఐబి ఇప్పుడు భద్రాచలం కేంద్రంగా తిష్టవేసి కూర్చున్నాయి.

అటు దోపిడి వర్గ పాలకులు, ఇటు వారి సేవకులైన పోలీసులంతా భద్రాచలాన్ని కేంద్రంగా చేసుకొని తమ దోపిడికి, అలాగే సాయుధ ఆపరేషన్స్‌కు అనుగుణంగా ఉండేలా ముందుగా రోడ్ల నిర్మాణం పైన కేంద్రీకరించారు. ఇందుకోసం అనేక వందల కోట్లు గుమ్మరిస్తూ ప్రజా ధనాన్ని మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారు. 50 ఇండ్లు ఉన్న ప్రతి మారు మూల గ్రామానికి తారురోడ్డు వేయాలని, నిధులు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తరువాత మావోయిస్టులకు ఎలాంటి సప్లయిలు అందకూడదనే సాకుతో సాధారణ ప్రజలకు సైతం ఎలాంటి సరుకులు అందకుండా అడ్డుకుంటున్నారు. ముఖ్యంగా పోలీసులు ప్రజల

కనిపించే యథార్థాలు

నూతన ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయంలో వచ్చిన మార్పులు రైతుల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయనీ, గత్యంతరం లేని పరిస్థితులలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ అంటున్నారు డా. ఎం. శ్రీకాంత్‌రెడ్డి

'నా జీవిత కాలంలో భారతదేశంలో ఇంతటి దారుణ వ్యవసాయ సంక్షోభం చూడలేదు' అని హరిత విప్లవ పితామహునిగా ప్రశంసలందుకొన్న ప్రస్తుత జాతీయ రైతు కమిషన్ చైర్మన్ డా.స్వామినాథన్ చేసిన వ్యాఖ్యలు మన పాలకులకు మేల్కొలుపు. కేవలం ఊక దంపుడు ఉపన్యాసాలతో, కంటి తుడుపు ప్యాకేజిలతో రెండవ హరిత విప్లవం తీసుకువస్తామని ప్రగల్భాలు పలికే ప్రభుత్వాలకు కనువిప్పు. విదర్భ రైతులు ఆత్మహత్యల పరంపరలో మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రైతు సర్వే కింద గ్రామీణ వాస్తవాలను ప్రస్ఫుటం చేసింది. 17 లక్షల మంది రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి కనీస జీవన సదుపాయాలు కూడ కరువై జీవిస్తున్నారని, వీరిలో 50 శాతం, సంవత్సరాల తరబడి పంటలు విఫలమై కనీస దిగుబడిరాని పరిస్థితుల్లో, పంటలకు కావలసిన ఎరువులు, ఇతర ఉత్పాదకాలు కొనలేని పరిస్థితుల్లో తమ జీవన భృతి అయిన వ్యవసాయం కొనసాగించలేక ఎటూ పాలుపోని పరిస్థితుల్లో బతుకు భారమై ప్రభుత్వ సహాయం కొరకు ఎదురు చూపులు చూస్తున్నారని వెల్లడించింది. వీరిలో మూడు లక్షల రైతు కుటుంబాలు తమ ఎదిగిన కుమార్తెల వివాహం కూడ చేయలేని ఆర్థిక పరిస్థితుల్లో సామూహిక వివాహాల వైపు మొగ్గు చూపిస్తున్నారని వెల్లడించింది.

మన రాష్ట్రంలో కూడ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారి ఆత్మహత్యలు నానాటికి పెరగడం ఆందోళన కలిగిస్తున్న విషయం. ఆంధ్రప్రదేశ్‌లో 2001లో 1500 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడగా 2010 కల్లా ఈ సంఖ్య 2525కి పెరిగింది. ఇందులో కౌలు రైతులు, వ్యవసాయ కూలీల సంఖ్య కలవలేదు. ఏదో ఒక ఏడాది పంట నష్టం జరిగినంత మాత్రాన రైతు ఆత్మహత్య వైపు మొగ్గుచూపడు. కొన్ని సంవత్సరాల నుండి పంటల వైఫల్యం వల్ల పెరిగే రుణభారం, పెరిగే ఒత్తిళ్ళు రైతును, కౌలుదార్లను ఆత్మహత్యల వైపు పురిగొలుపుతున్నాయి. పండిన పంటకు గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడం రైతుల ఆత్యహత్యకు ముఖ్య కారణంగా చూపిస్తున్నా, రైతును కుంగదీసే అంశాలు ఇంకా చాలా ఉన్నాయి అని చెప్పవచ్చు.

పదేళ్ల క్రితం వరకు రైతు తమకు కావలసిన అన్ని రకాల పంటలను పండించి, తన ఇంటికి కావలసిన అన్ని రకాల దినుసులను వాడుకోగా మిగిలిన ఆహార దినుసులను విక్రయించడం జరుగుతుండేది. కాల

సాధారణ జీవితంలోనూ జోక్యం చేసుకుంటూ అభివృద్ధి ముసుగులో విధ్వంసం సృష్టిస్తూ పల్లెలను, గ్రామాలను వల్లకాడు చేస్తున్నారు.

వీటన్నింటి వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్దో గొప్పో ఉన్న భూమిని సాగుచేసినా పంట చేతుల్లోకి రాకముందే దళారులు, దోపిడిదారులు గద్దల్లా తన్నుకు పోతున్నారు. ఎన్నో కష్ట నష్టాలకు గురవుతున్న ప్రజలకు పోలీసు వేధింపులు అదనపు కష్టాలు కలిగిస్తున్నాయి. పేద అమాయక ప్రజలపై ఇంతటి అమానుషం, అరాచకం జరుగుతున్నా గత నలభై సంవత్సరాలుగా వేర్లు పాతుకున్న నయా రివిజనిస్టు పార్టీలైన సిపిఎం, సిపిఐలు కూడ కిమ్మనకుండా పాలక వర్గాల పక్షాన చేరి ఆ పార్టీలకు సహకరిస్తూ విప్లవోద్యమానికి తూట్లు పొడిచే విధంగా కడుపులో చల్ల కదలకుండా ఉండే ధోరణిని అవలంభిస్తున్నాయి. అధికార పార్టీ ఎంఎల్ఎలు, ఎంపిలుగా ఉండి, ఆదివాసి నాయకులై కేంద్ర మంత్రి పదవులు అనుభవిస్తూ, జరుగుతున్న ఈ బీభత్సంపైన ఏనాడూ పల్లెత్తు మాట కూడా మాట్లాడక పోవడం అంటే వీళ్ళు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గపు పాలసీలను అమలు చేయడంలో భాగంగానే అని అర్థమవుతుంది.

ఎంఎల్ఎలు, మంత్రులు ప్రజా ద్రోహులుగా, ప్రజా వ్యతిరేకులుగా, ఆదివాసి వ్యతిరేకులుగా నిలబడ్డారు. వీళ్ల బండారాన్ని బైట పెట్టాలి. వీళ్ల ద్రోహాన్ని, అవినీతిని, లంచగొండితనాన్ని ఫైనాన్స్ అక్రమ పెట్టుబడులను, అక్రమాస్తులను బహిర్గతం చేయాలి. వీళ్లు తిన్న ప్రజల సొమ్మును కక్కించాలి.

ప్రజలే చరిత్ర నిర్మాతలనే సత్యం చరిత్రలో అనేకసార్లు రుజువైంది. మన సార్వభౌమత్వాన్ని, ప్రకృతి సహజ సంపదలను, వనరులను, ఇప్పటి వరకు పోరాడి సాధించుకున్న విజయాలను, భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రజలు మిలిటెంట్‌గా పోరాడాల్సిందే. ప్రజలకు అండగా కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు కలిసికట్టుగా సమైక్య ప్రజా ఉద్యమాలను చేపట్టాలి. జల్, జంగల్, జమీన్ కోసం పోరాడాలి. అడవులను పరిరక్షించుకోవాలి. ఆపరేషన్ గ్రీన్‌హంట్ రెండవ దశను వెంటనే ఆపమని డిమాండ్ చేయాలి. ఉద్యమ ప్రాంతాలలో మోహరించిన అన్ని రకాల బలగాలను వెనక్కి పంపాలని, గ్రామాలపైన, ప్రజలపైన దాడులు, అరెస్టులు, వేధింపులు ఆపాలని, యుఎపిఎ(చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం), ఎఎఫ్ఎస్‌పిఎ(సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం), రాజద్రోహం తదితర ఫాసిస్టు చట్టాలను రద్దు చేయాలని. న్యాయమైన ప్రజా ఉద్యమాలన్నిటిని అణచివేసే ఉద్దేశంతో ముందుకు తెస్తున్న ఫాసిస్టు ఎన్‌సిటిసి (జాతీయ ఉగ్రవాద వ్యతిరేక కేంద్రం) ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పోరాడాలి.

(రచయిత సామాజిక ఉద్యమ కార్యకర్త)

క్రమంలో సంప్రదాయ పంటలైన పెసర, కంది, నువ్వులు, అవిసెలు, జొన్నలు, సజ్జలు, ఆముదాలు వంటి పంటల విస్తీర్ణం నానాటికి తగ్గి ప్రస్తుతం ఎటు చూసినా వాణిజ్య పంటలైన పత్తి, వరి, మొక్కజొన్న పంటల విస్తీర్ణం పెరగడం మూడు ప్రాంతాల్లో గమనించవచ్చు. ఎకరం వరి పంటకు కావలసిన నీటితో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో తృణ ధాన్యాలను పండించవచ్చు. పంటల మార్పిడి లేకుండా ప్రతి సంవత్సరం ఒకే విధమైన పంటల సాగు వల్ల భూసారం క్షీణించి, ఏ సారం లేని వ్యవసాయ భూమి భవిష్యత్తులో వ్యవసాయాన్ని, వ్యవసాయంపై ఆధారపడే వారిని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది అని మనం గ్రహించాలి. అధిక నీటిని, భూసారాన్ని గ్రహించే పంటల వల్ల భూగర్భ జలాలు పడిపోయి బావులపై ఆధారపడ్డ రైతు సాగు నీటికై అధిక పెట్టుబడి పెట్టి అప్పుల పాలవడం గమనించవచ్చు. మిశ్రమ పంటల సాగు, పంట మార్పిడి వల్ల రైతు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడమేకాక, భూసారాన్ని అభివృద్ధి చేయగలుగుతాడు.

ప్రపంచీకరణ వలన ఆహార పంటల ధరలు పడిపోతూ, వాణిజ్య పంటల ధరలు పెరగడం వలన రైతు ఆహారేతర పంటల వైపు మొగ్గు చూపడం కనిపిస్తుంది. నీటి పారుదల పెరగడం, రసాయన ఎరువుల వాడకం పెరగడం, అధిక దిగుబడి వంగడాల లభ్యత, అదేవిధంగా ఆహారేతర పంటలతో పోలిస్తే హెక్టారుకు దిగుబడి పెరగడం రైతును వాణిజ్య పంటల వైపు ప్రోత్సహించింది.

హరిత విప్లవ ఆవిర్భావ సందర్భంగా అంతకు ముందు కాలంతో పోలిస్తే సన్నకారు, చిన్నకారు, మధ్యమిక రైతు వ్యవసాయంలో కొంత పెట్టుబడి పెట్టడం వల్ల, కొత్త సాంకేతిక పరిజ్ఞానం వారి అందుబాటులోకి రావడం వల్ల రైతాంగం మధ్య వ్యత్యాసాలు తగ్గిన మాట వాస్తవం. అయితే 1990 దశకం వరకు ఉత్పత్తి, సాగు విస్తీర్ణం అదేవిధంగా పంట గిట్టుబాటు ధరలు పెరుగుతూ వచ్చాయి. కానీ ఆ తరువాత వాణిజ్య పంట అయిన పత్తి, చెరుకు, మిర్చి వంటి పంటల ధరలు తగ్గినా అనేక పంటల ఉత్పత్తి, విస్తీర్ణం పెరగడం గమనించ వచ్చు. వ్యవసాయదారులు ఈ వాణిజ్య పంటల ఉచ్చులో పడి ప్రపంచీకరణ నేపథ్యంలో స్వేచ్ఛా మార్కెట్ ధరల అస్తవ్యస్తత వల్ల కోలుకోలేని స్థితిలోకి నెట్టబడుతున్నారు. కొంత మంది కుహనా ఆర్థికవేత్తలు మాత్రం దీనికి చిన్న కమతాల సేద్యం లాభ సాటి కాదన్న కారణం చూపుతూ ప్రభుత్వ విధానాలను తప్పుదోవ పట్టిస్తూ వ్యవసాయాన్ని కూడ ప్రైవేటీకరంచే ప్రయత్నంలో ఉండడం కనిపిస్తుంది. కానీ పెద్ద కమతాల కన్నా చిన్న కమతాలలోనే మంచి దిగుబడులు సాధించవచ్చని ఎన్నో పరిశోధనలో నిరూపితమై పర్యావరణ వైవిధ్యాన్ని కాపాడుకొంటూ బహుళ ప్రజానీకానికి బతుకు తెరువు చూపిస్తున్న వాస్తవాన్ని విస్మరిస్తే మనం క్షమించరాని తప్పు చేసినవారమవుతాం.

చిన్న, సన్నకారు రైతులు అనేక ఒడిదుడుకులకు లోనవుతున్న ఈ దశలో వాస్తవానికి ప్రభుత్వం రైతుకు అన్ని విధాలా అండగా ఉండాలి కాని, దానికి విరుద్ధంగా ప్రభుత్వం సంస్థాగత సహకారం దశల వారీగా తగ్గించడం వల్ల రైతులు నిలదొక్కుకొనే పరిస్థితుల్లో లేక మళ్లీ మళ్లీ బహుళ జాతి సంస్థల దోపిడీకి గురికావలసి వచ్చింది.

హరిత విప్లవం సాధారణ రైతు జీవితంలో పెను మార్పులను తీసుకొని వచ్చింది. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, కూలీ ఖర్చులు ఆధునిక వ్యవసాయంలో విపరీతంగా పెరిగిపోయి వ్యవసాయం ఖరీదైన వ్యవహారంగా మారింది. పొలాన్ని చదును చేయడం దగ్గర నుండి నాణ్యమైన విత్తనాల కొనుగోలు, ఎరువుల లభ్యత, సాగునీటి సరఫరాలలో అడుగడుగునా రైతు కష్టాలనే ఎదుర్కొని జీవనం సాగిస్తున్నాడు. రైతు సమస్యలపై సరైన అవగాహన లేని విధాన రూపకర్తలు, వ్యవసాయ ఉత్పత్తులను సరైన సమయంలో తగిన మార్కెటింగ్ సదుపాయం కల్పించలేక పోవడం, వ్యవసాయ సబ్సిడీలను విత్తన కంపెనీలకు, ఎరువుల పరిశ్రమలకు అందించి రైతు పరిస్థితి ఆగమ్యగోచరం చేస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో నిలకడయిన పంటల విధానాన్ని ప్రోత్సహించడంలో, భూసార పరిరక్షణ ఆవశ్యకతను రైతులకు వివరించడంలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది.

పట్టిక 1: నీటి వసతి లభ్యమైన సాగు భూమి విస్తీర్ణం, వివిధ పంట పోషకాల వినియోగం

		దశాబ్దకాలం	భారత్	అభివృద్ధి చెందుతున్న దేశాలు	అభివృద్ధి చెందిన దేశాలు
1.	వ్యవసాయ భూమి, వ్యవసాయదారుల నిష్పత్తి (హెక్టార్లలో / ఒకొక్కరికి)	1996 2006	0.31 0.29	0.95 0.81	15.37 20.25
2.	నీటి వసతిగల సాగుభూమి శాతం (మొత్తం వ్యవసాయ భూమిలో)	1997 2007	32.4 33.8	33.7 34.7	11.5 16.7
3.	వివిధ పంట పోషకాల వినియోగం (కిలోలు / హెక్టారుకి)	1995 2008	81.7 121.4	124.7 166.6	86.3 76.9

పై పట్టికను గమనించినట్లయితే గడచిన దశాబ్ద కాలంలో మన దేశం తలసరి సాగు భూమి లభ్యత 0.31 హెక్టార్ల నుండి 0.29 హెక్టార్లకు తగ్గడం అదేవిధంగా వివిధ పంటల పోషకాల వినియోగం హెక్టారుకు 81.7 కిలోల నుండి 121.4 కిలోలకు పరగడం గమనిస్తే వ్యవసాయ వ్యయం గత దశాబ్ద కాలంలో ఏవిధంగా పెరిగిందో గ్రహించవచ్చు. అదే కాలంలో అభివృద్ధి చెందిన దేశాల సాగు భూమిలో పెరుగుదల, పోషకాల వినియోగం, తగ్గుదల ఈ దేశాల రైతుకు లాభించిందని చెప్పగలం.

పై కాలంలోనే సాగు నీటి లభ్యత గల భూ వసతి తగిన విధంగా అభివృద్ధి చెందకపోవడం గమనార్హం. చిన్న నీటి వనరులు, సహజ వనరులను ఉపేక్షించడం, సాగునీటికై ముఖ్యంగా భూగర్భ జలాలపై ఆధారపడడం వ్యవసాయాన్ని అధిక వ్యయ ప్రయాసలకు గురి చేస్తున్నాయి. మన రాష్ట్రంలో వ్యవసాయ సాగు భూమిలో కేవలం 39 శాతానికి మాత్రమే నీటి వసతి లభ్యత ఉంది. ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లో 27 శాతం, 17 శాతం భూమి మాత్రమే సాగు నీటి వసతి కలిగి ఈ ప్రాంత రైతుల్ని భూగర్భ జలాలపై అధిక వ్యయం చేయవలసిన పరిస్థితుల్ని కల్పిస్తుంది.

మనదేశంలో, రాష్ట్రంలో నిర్వహించిన వివిధ వ్యవసాయ ఆర్థిక సర్వేలలో రుణ లభ్యత గురించి విస్తారంగా చర్చించడం జరిగింది. మన రాష్ట్రంలో కేవలం 30 శాతం వ్యవసాయ రుణాలు మాత్రమే

పట్టిక 2 : రుణగ్రస్తమైన వ్యవసాయ కుటుంబాలు (కమతాల వారీగా)

క్ర. సం.	కమతం విస్తీర్ణం (హెక్టార్లలో)	రుణగ్రస్త కుటుంబాలు (లక్షల్లో)	మొత్తం వ్యవసాయ కుటుంబాల్లో రుణగ్రస్త కుటుంబాల శాతం	ఒక్కొక్క రుణగ్రస్త కుటుంబ తలసరి రుణభారం (రూపాయలలో)
1.	0.01 కంటే తక్కువ	5.71	1.3	6121
2.	0.01 నుండి 0.40	130.11	30.0	6545
3.	0.41 నుండి 1.00	129.21	29.8	8623
4.	1.01 నుండి 2.00	81.90	18.8	13762
5.	2.01 నుండి 4.00	54.41	12.5	23456
6.	4.01 నుండి 10.00	27.73	6.4	42532
7.	10 కంటే ఎక్కువ విస్తీరణం	5.15	1.2	76232

బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుండి లభ్యమవుతున్నాయి. మిగతా రుణం కోసం కర్షకులు వడ్డీ వ్యాపారులను, దళారులను, ఎరువులు, క్రిమిసంహారక విక్రయ డీలర్లను ఆశ్రయించక తప్పని పరిస్థితి. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణమని చెప్పవచ్చు. గత సంవత్సరం ఎంతో ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన కౌలు రైతుల రుణ అర్హత కార్డుల జారీ అభాసు పాలవడం తెలిసిందే. కేవలం 3 శాతం కౌలు రైతులకు మాత్రమే సంస్థాగత రుణాలు బ్యాంకులు అందించగలిగాయి. రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల, వడ్డీ వ్యాపారుల నుండి రైతులు అప్పులు తీసుకొని, వారి వేధింపులకు గురై ఆత్మహత్యలు చేసుకొన్న సంఘటనలు కోకొల్లలు.

వ్యవసాయ రంగానికి మనదేశంలో సంస్థాగత రుణ లభ్యత విశ్లేషించినట్లయితే పెద్ద కమతాలలో 31 శాతం కమతాలు రుణం తీసుకోగా, చిన్న కమతాల్లో కేవలం 17.41 శాతం కమతాలకు మాత్రమే లభించింది. 85 శాతం గల చిన్న కమతాలకు (2 హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణం గల కమతాలు) 1990 కోట్ల రుణం లభించగా, 15 శాతమే గల పెద్ద కమతాలకు (2 హెక్టార్ల నుండి 10 హెక్టార్లపై గల కమతాలు) 2207 కోట్లు దక్కడం గమనార్హం. ఈ విధంగా సన్న, చిన్న కారు రైతులు తమ సాగు అవసరాల నిమిత్తం ప్రైవేటు రుణంపై ఆధారపడి రుణ గ్రస్తమవడం గమనించవచ్చు. కాని క్లుప్తంగా చూసినట్లయితే అన్ని కమతాలు వ్యవసాయదారులకి కేవలం 30 శాతం మాత్రమే సంస్థాగత రుణం లభించడం విశేషం.

ఆర్థిక విధానాల సరళీకరణ ఫలితంగా ప్రాథమిక రంగమైన వ్యవసాయ రంగం ప్రాధాన్యతను కోల్పోసాగింది. ప్రభుత్వ పరమైన ప్రోత్సాహకాలు, ఆర్థికపరమైన వెసులుబాటు ఈ రంగంపై క్రమక్రమంగా తగ్గిపోవడం వల్ల బ్యాంకులు రైతుల ఆర్థిక అవసరాల అనుగుణంగా వ్యవసాయ రుణాలను మంజూరు చేయకపోవడం, గ్రామీణ బ్యాంకు శాఖలను కుదించడం, ప్రభుత్వ విధానంగా మారింది. అదే విధంగా వ్యవసాయదారుల అవసరాలు తీర్చడానికి ఏర్పడిన ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్‌లు క్రమక్రమంగా ప్రైవేటీకరించడం, మూతబడడం లేదా బలహీనం కావడం కూడ ఈ దశాబ్ద కాలంలో గమనించవచ్చు.

రైతుకు నిత్యం అందుబాటులో ఉండి సత్వర సహాయం అందించ వలసిన వ్యవసాయ విస్తరణ రంగ సేవల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, అదే విధంగా సహకార రంగం, వ్యవసాయదారులకు విస్తరణ సేవలు, అదేవిధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించవలసి ఉంటుంది. తగినంత సాంకేతిక సిబ్బంది, ఆర్థిక సామర్థ్యం లేక ఈ సంస్థలు రైతుల అవసరాలను తీర్చలేక చతికిలపడుతుంటే, ఈ విస్తరణ సేవలను కూడ ప్రైవేటీకరణ చేయాలని ప్రభుత్వం తహతహలాడడం గమనించవచ్చు. సహకార సంస్థలను బలహీనం చేయడం, మార్కెటింగ్ వ్యవస్థ మొత్తాన్ని ప్రైవేటీకరించాలని ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సూచనలను పాటించ దానికి చేస్తున్న ప్రయత్నాలు, దేశ రైతు భవితవ్యాన్ని పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టడానికి చూపిస్తున్న ఉత్సాహం, దేశ ఆహార భద్రతకు ఆశ నిపాతం లాంటివి. మొక్కుబడి సేవలందించడం ద్వారా వ్యవసాయ రంగంలో అభివృద్ధిని సాధించలేం. వ్యవసాయ విస్తరణ సిబ్బందిని, శాస్త్ర సాంకేతిక నిపుణులను తగిన సంఖ్యలో నియమించడం ద్వారా మాత్రమే రైతుకు నాణ్యమైన క్షేత్ర సలహాలను అందించి భూసారాన్ని, పర్యావరణాన్ని కాపాడుకొంటూ ప్రజల ఆహార అవసరాలను తీర్చగలమని పాలకులు గ్రహించాలి.

భూసార పరీక్షల ఆధారంగా నియమిత ఎరువుల వినియోగంతో, నేల ఆరోగ్యం కాపాడడంతో పాటు పంటల ఉత్పత్తిని, ఉత్పాదకతను ఇతోధికంగా పెంచగలుగుతాం. రైతు చైతన్య సదస్సుల ద్వారా కొంత వరకు రైతన్నలకు అవగాహన కల్పించినప్పటికీ, అందరు రైతులకు నేల భూసార ఆవశ్యకతను వివరించాల్సిన అవసరం ఉంది. పలుచోట్ల వ్యవసాయ అధికారులు మట్టి నమూనాలను పరీక్షించకుండానే దుర్వినియోగం చేశారనే అభియోగం ఉంది. వ్యవసాయ శాఖ ఏటా మొక్కుబడిగా భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా కాకుండా ఆదర్శ రైతుల ద్వారా వివిధ పంటల్లో పోషకాల ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన పెంపొందించాల్సిన సమయం వచ్చింది. అదేవిధంగా ఆదర్శ రైతుల ఎంపిక పారదర్శకంగా, ముఖ్యంగా రైతు కమిషన్ సిఫార్సుల మేరకు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా వ్యవసాయ విస్తరణ సిబ్బందిని గణనీయంగా పెంచకుండా ఆదర్శ రైతుల వ్యవస్థతో క్షేత్రస్థాయిలో రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వగలమని అనుకొంటే సేద్యం మరింత క్లిష్ట సమస్యల్లో చిక్కుకోవడం తథ్యం.

(రచయిత సీనియర్ సైంటిస్ట్,
ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం)

ఎర్రచందనం దోపిడీ - కూలీల హత్య

సామాన్య ప్రజలకు జీవనాధారం లేకుండా చేసి, అసలు దొంగలను వదిలి, జీవిక కోసం పనిచేస్తున్న వారిని దొంగలుగా చిత్రించి హత్య చేస్తున్న రాజ్య స్వభావాన్ని వివరిస్తున్నారు ఎం.కె. కుమార్

ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనం చెట్లు అతి సమృద్ధిగా తిరుపతి శేషాచలం అడవుల్లో ఉన్నాయి. ఇవి దాదాపుగా 70 కిలో మీటర్ల పరిధిలో చిత్తూరు, కడప జిల్లాలలో విస్తరించి ఉన్నాయి. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), అటవీశాఖవారు ఎర్ర చందనం చెట్లను తిరుమల కొండల్లో పెద్దఎత్తున నాటారు. వీటి మొత్తం విలువ దాదాపు లక్ష కోట్లు ఉంటుందని ఒక అంచనా. ఎర్రచందనం మాఫియా తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలోని శేషాచలం అడవులను టార్గెట్ చేసుకొని దందా నడిపిస్తుంది. గత 30 ఏళ్లుగా ఈ దందా కొనసాగుతున్నా పెద్దగా ప్రభుత్వంగానీ, పోలీసులుగానీ పట్టించు కోలేదు. కారణం వీటి నరికివేత తక్కువ మోతాదులో ఉండడం, సాధ్యమైనంత గుట్టుగా వ్యవహారం నడవడం, అంతర్జాతీయ మార్కెటులో గిరాకీ తక్కువ ఉండడం. అంతేకాకుండా ఎర్ర చందనం వృక్ష సంపద అంతరించే అవకాశం తక్కువగా ఉంటుంది. ఎందుకంటే చెట్టు నరికిన మొదలు నుండి మళ్లీ చిగురు తొడిగే స్వభావం ఎర్ర చందనం చెట్లకు ఉంటుంది. దీనికి పది నుంచి ఇరవై సంవత్సరాలు పడుతుంది.

2001 నుండి 2012 నవంబర్ వరకు 245 ఎర్ర చందనం చెట్ల అక్రమ నరికివేత, రవాణా కేసులు నమోదు అయినాయి. ఇప్పటి వరకు 1315 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రు. 40 కోట్ల విలువైన ఎర్ర చందనాన్ని ఒక్క నవంబరు నెలలోనే పట్టుకున్నారు. ఇప్పటివరకు పోలీసులు 200 కోట్ల విలువైన ఎర్ర చందన దుంగలను అక్రమ రవాణా కాకుండా పట్టుకున్నారు. గత 20 సంవత్సరాలలో రు. 2500 కోట్ల ఎర్రచందనం సరిహద్దులు దాటి మార్కెట్లోకి వెళ్లిందని గణాంకాలు చెపుతున్నాయి. 2012లో పోలీసులు 114 కేసులు నమోదు చేసి, 684 మందిని అరెస్టు చేసి జైళ్లకు తరలించారు.

ఎర్రచందనం మాఫియాలో అటవీ అధికారులు, పోలీసులు, ప్రతిపక్ష, పాలకవర్గ రాజకీయ నాయకులు, స్మగ్లర్లు ఉన్నారు. వీరంతా తెరవెనుక నుండి యంత్రాంగం నడిపిస్తుంటారు. సుమారు 50 నుండి 100 మంది కూలీలను అడవులలోకి పంపి కిలో ఎర్ర చందనానికి రు. 250 చొప్పున చెల్లిస్తామని హామీ ఇస్తారు. సగటున రోజుకి ఒక కూలీ రు. 2000 నుండి రు. 4000 వరకు సంపాదిస్తాడు. వారిని అరెస్టు చేసిన రెండు రోజుల్లో కోర్టుల నుండి బయటకు తమ ఖర్చులతో తీసుకు వస్తారు. ఎర్రచందనం తరలెళ్లే సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు, గ్రేహౌండ్స్, ఎస్‌టిఎఫ్ దళాలను అడవుల్లో కూంబింగ్‌కు పంపించడం ద్వారా ఆంధ్ర ప్రాంతపు కూలీలు క్రమంగా భయపడి ఎర్రచందనం చెట్ల నరికివేతకు వెళ్లడం మానుకున్నారు. దీనికి కారణం కోటీశ్వరులుగా మారిన తెలుగు స్మగ్లర్లు అప్పటికే రాజకీయాలలో పలు పైస్థాయి పదవుల్లో కీలకంగా ఉంటూ తాత్కాలికంగా స్మగ్లింగ్ ఆపివేశారు.

చిత్తూరు జిల్లాలో రాజకీయ నాయకులకు నిధులు ఈ స్మగ్లింగ్ ద్వారానే 80 శాతం వస్తాయి. రాజకీయ నాయకులు గతంలో 50 శాతం స్మగ్లర్లే. రాష్ట్రంలో 5160 చదరపు కిలో మీటర్ల మేర ఆక్రమించి ఉన్న ఎర్ర చందన వృక్ష సంపదకి జపాన్, చైనా, అరబ్, మలేషియా దేశాల్లో మంచి గిరాకీ ఉంది. అది అక్కడి వారికి స్టేటస్ సింబల్‌గా ఉంది. చైనా సంస్కృతిలో ఇది మిళితమై ఉండడం వల్ల దీన్ని జిటీన్ అని వారు పిలుస్తారు. ఎర్రచందనం నుండి వయాగ్రా తరహాలో టెరోసిబ్లిన్ అనే ఉత్ప్రేరకాన్ని తయారు చేసి వారు శృంగార ఔషదంగా అమ్ముతున్నారు. మన దేశంలో కిలో రు. 20 వేలు ఉంటే, ఇతర దేశాల్లో రు. లక్షకు పైగా ఉంది.

స్మగ్లర్లు సముద్ర మార్గంలోనూ, బర్మా, నేపాల్ రోడ్ మార్గాల్లోనూ నిత్యవసర సరుకుల ఎగుమతితో పాటు అక్రమంగా ఎర్రచందనాన్ని ఎగుమతి చేస్తున్నారు. చెన్నై నౌకాశ్రయంలో ఈ ఏడాది మార్చ్‌లో 22 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీ అధికారుల ప్రమేయం వల్ల స్మగ్లింగ్ యథేచ్ఛగా జరుగుతుంది. 230 కేసులకు ఎఫ్ఐఆర్ దాఖలు చేసినా 2007 నుండి ఇప్పటి వరకు చార్జి షీటు వేయలేదు. అటవీ ప్రాంతాలలో స్మగ్లర్లు ఈ మధ్యన తమను అరెస్టు చేసిన దానికి ప్రతీకారంగా ఒంటరిగా ప్రయాణించిన అటవీ అధికారిని తీవ్రంగా కొట్టారు. అంతేకాకుండా సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి తమ్ముడి అధ్వర్యంలో ఎర్రచందనం స్మగ్లింగు యథేచ్ఛగా సాగుతుంది. వైఎస్ఆర్ సిపి నాయకుడు, మాజీ కాంగ్రెస్ మంత్రి వర్గీయులనందరిని ప్రభుత్వం అరెస్టులు చేసి వారిని మళ్లీ స్మగ్లింగ్ చేయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో సదరు మాజీమంత్రి ఎంఎల్ఏ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ నుండి బయటకు వచ్చారు. రాజకీయ, స్మగ్లింగ్ అపవిత్ర కలయిక వల్ల ఎర్రచందనం నరికివేత సాఫీగా జరుగుతోంది. ఈ మాఫియాలో ఆధిపత్యం కోసం పోరాటం, పంపకాల్లో తేడావల్ల వాళ్లే పోలీసులకు సమాచారమిచ్చి, పైచేయి కోసం తాపత్రయ పడుతున్నారు. దీనితో తెలుగుదేశం పార్టీ, వై.ఎస్.ఆర్.సి.పి లలోని చిన్న స్థాయి స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేయడంతో రాజకీయరంగం జిల్లాల్లో వేడెక్కింది. దీంతో స్వయనా సిఎం జోక్యం చేసుకొని అన్ని పార్టీల నాయకులను మందలించి తాత్కాలికంగా స్మగ్లింగ్ ఆపివేయాలని హితోపదేశం చేశారు. దీంతో పోలీసులు స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపారు. అయినా ఇప్పటి వరకు వేలల్లో అరెస్టు చేసినా కేసుల్లో అందరూ కూలీలేగాని, ఒక్క స్మగ్లరు లేదు. స్మగ్లర్లు ఎవరనేది బహిరంగ సత్యమైనా పోలీసులు ఒక్కరిని అరెస్టు చేయరు. దీంతో కూలీలు తమ జీవనోపాధి కోసం వచ్చి, పోలీసుల చేతుల్లో తీవ్ర హింసకు గురవుతున్నారు. మన రాష్ట్ర తెలుగు కూలీలకు విషయాలు అర్థమవడం వల్ల స్మగ్లింగ్‌లో పాల్గొనడం లేదు. ఇప్పుడు తమిళ స్మగ్లర్లు, కూలీలు పెద్ద ఎత్తున ఎర్రచందన అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

2012 జూన్ 1న చిత్తూరు జిల్లా, చంద్రగిరి మండలం, శంకరయ్యపల్లి కాలూరు క్రాస్ వద్ద ఒక రైతు పొలంలో తెల్లవారు జామున ఎర్రచందనం కూలీని పోలీసులు చంపేశారు. నుదురు, ముక్కు మధ్య పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తూటాను పేల్చడంతో పెద్ద రంధ్రం

ఏర్పడింది. మృతుని శరీరంపై గాయాలున్నాయి. అటవీ ప్రాంతంలోని ఎర్రచందనం చెట్లకు సంఘటన ప్రాంతానికి 3 కిలో మీటర్ల దూరం ఉంది. పోలీసులు తమ సహజమైన కట్టుకథను వినిపించారు. ఎర్ర చందనం దుంగలను తీసుకొని పోతున్న కూలీలను దూరం నుండే కేకలు వేస్తూ అడ్డుకోబోయామని, వారు రాళ్లతో, రాడ్లతో, గొడ్డళ్లతో, రంపాలతో దాడులు చేయడంతో ఆత్మరక్షణార్థం కాల్పులు జరిపామని చెప్పారు. అయితే సంఘటన స్థలంలో లుంగీ, గొడ్డలి, చపాతీ తప్పితే మిగిలిన వారి ఆనవాళ్లు లేవు. ఒక్క పోలీసుకు గాయం కాలేదు. ఈ రోజు వరకు చనిపోయిన వ్యక్తి పేరు, అడ్రసు పోలీసులు ప్రకటించలేదు. పోస్టుమార్టమ్ చేసి దహనం చేసేశారు.

2012 డిసెంబర్ 1న భాకరపేట, చామల అటవీ ప్రాంతంలో కరివేపాకు కొన వద్ద స్పెషల్ టాస్క్ పోలీసులు సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంతో మురుగేశన్(40) అనే ఎర్రచందనం కూలీని ఛాతిలో కాల్చి చంపేశారు. మరో కూలీ భాగ్యరాజ్(35) తొడను ముందు వైపు నుండి కాల్చడం వల్ల తీవ్ర గాయమై రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణపాయ స్థితిలో ఉన్నాడు. వీళ్లు తమిళనాడులోని, విల్లుపురం జిల్లా, కరమందార్తై గ్రామానికి చెందినవారు. వీరిద్దరికి తెలుగు రాదు. తమిళ భాష మాత్రమే వచ్చు. గాయపడిన భాగ్యరాజ్ తాము కూలీకి కక్కుర్తిపడి, తాము నివసించే ప్రాంతంలో పనులు లేక చెట్లు నరికివేతకు 30 మందిమి వచ్చామని, పోలీసులు ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా తాము లొంగిపోతామన్నా వినకుండా కాల్పులు జరిపారని, దీనితో అందరూ తప్పించుకొని పోగా మేమిద్దరం పోలీసుల కాల్పులకు గురికావలసి వచ్చిందని చెప్పాడు. అంతేకాకుండా మేము భయంతో చేతులు ఎత్తామని, అయినా పోలీసులు కనికరించలేదని ఆవేదన చెందాడు. పోలీసులు దీన్ని ఖండిస్తూ, తాము హెచ్చరించినా వినకుండా మాపై రాళ్లు విసిరితే, రక్షణ కోసం కాల్చవలసి వచ్చిందని, ఈ పోరులో ముగ్గురు పోలీసులకు గాయాలైనాయని, గీరుకొని పోయిన గుర్తులను మీడియాకు చూపించారు. ఎస్పి మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే ఎవరికైనా ఇదే గతిపడుతుందని, ఎర్రచందన వనం ప్రాంతాలలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని, ప్రకటించాడు. గాయపడిన ఎర్ర చందనం కూలీ భాగ్యరాజ్ తమను ఎవరు పంపించారో చెపుతూనే ఉన్నాడు. అయిన ఆ దిశగా పోలీసుల చర్యలు లేవు. ఎర్రచందనం అరికట్టాలంటే అసలు కారకులైన స్మగ్లర్లను వీరు అరెస్టు చేయలేరు. అందుకే కూలీలను చంపితే భయపడి ఎవరు కూలీకి రారని, దీనితో స్మగ్లింగ్ ఆగిపోతుందని పోలీసుల ఎత్తుగడ.

తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై, వేలూరు జిల్లాలలో అమిరి నిధి అనే దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ అడవిలో జవాదిహిల్స్‌గా పిలిచే కొండల మధ్య 50 నుంచి 200 వరకు ఇళ్లున్న గ్రామాలున్నాయి. వీరు పోడు వ్యవసాయం చేసుకుంటూ, అటవీ ప్రాంతంలో ఆహార సేకరణ ద్వారా జీవనం పొందుతూ ఉంటారు. వీరు అడవిలోని చెట్ల కొమ్మలను వంటచెరుకుగా వాడుతుంటారు. వీరందరికి భూములు లేకపోయినా అటవీ భూముల్లో చిన్నపాటి వ్యవసాయం చేసుకుంటూ మిగిలిన రోజులలో వ్యవసాయ కూలీలుగా ఉంటారు. వీరంతా గుడిసెలలోనే ఉంటారు. వీరికి డబ్బు ఆశ చూపి స్మగ్లర్లు ఎర్రచందనం దొంగలుగా చేశారు. మొదట్లో నిరాకరించినా 150 రోజుల్లో రు. లక్ష వరకు సంపాదించిన గ్రామస్తులను చూసి చావుకు సైతం వెనుకాడక చెట్ల నరికివేతకు ఒప్పుకుంటున్నారు. వీరి సగటు వార్షిక ఆదాయం రు. 70000 లోపలే ఉంటుంది. చానమత్తూరే, జమునా మరత్తూర్, కోయతోర్, వీరప్పమూర్, కోమటేరు, ఏల్లంబట్టు, కావలూర్ తదితర గ్రామాల ప్రజలు 50 నుంచి 100 మంది చొప్పున బృందాలుగా ఏర్పడి ఎర్ర చందనం చెట్లను నరకడానికి అడ్వాన్సులు తీసుకొని, పని ముగిసిన తర్వాత పూర్తి మొత్తం తీసుకుంటారు. వీరందరిని యాత్రికుల మాదిరి ఆర్.టి.సి. బస్సుల్లో తరలిస్తారు. అటవీ ప్రాంత మార్గ గ్రామాలలో దిగి తమ పని ప్రదేశంలోకి వెళ్తారు. అక్కడ వారికి పనిముట్లు, బియ్యం తదితర సామాగ్రి అందుతుంది. మూడు నుండి నాలుగు రోజులు కొండ చరియల్లోనే ఉండి వంట వండుకుని చెట్లని నరికి దుంగలను రోడ్డు సరిహద్దులో వదిలేస్తారు.

ఈ గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ స్థాయి పథకాలు పాక్షికంగా అందుతున్నాయి. ఊర్లల్లో ఇప్పుడిప్పుడే మిద్దెలు వస్తున్నాయి. ఊర్లకు రోడ్డు సదుపాయం, బస్సు సౌకర్యం ఉంది. ఇవి కూడా వీరప్పన్‌ను పట్టుకునే క్రమంలో ప్రభుత్వం పోలీసుల కోసం ఏర్పాటు చేసింది. గ్రామాలలో ఒకరిద్దరు వడ్డీ వ్యాపారులు ఉన్నారు. భూ సంస్కరణలలో లోపాల వల్ల భూములు అందరికి లేకపోవడం, ఏటావాలు ఉన్న అధిక ఉత్పత్తిని సాధించే సాంకేతికత, జ్ఞానం అందుబాటులో లేకపోవడం వల్ల ఉత్పత్తిని సరుకుగా మార్చలేకపోవడం వల్ల భూస్వామ్య దశలోనే ఉన్నారు. ఇక్కడే ఆహార సేకరణ ద్వారా బతుకుతున్న దళితులింకా శ్రమ ఆధారిత సమాజంలో ఉన్నారు. ఊర్లలోకి వచ్చిన టి.వి.లు, డిష్‌లు, కూల్‌డ్రింక్స్, సెల్ ఫోన్లు, పెట్టుబడి ఉపరితల నేపథ్యాన్ని గుర్తుకు తెస్తుంది. ఈ గ్రామ వ్యవస్థను పరిశీలించితే పేద రైతులు, వ్యవసాయ కూలీలు, వడ్డీ వ్యాపారులు , భూస్వాములు కనిపిస్తారు. అభివృద్ధి పేరిట స్కూళ్లు, రోడ్లు, కొంత మందికి బర్రెలు ఉండడం కనిపిస్తుంది. ఎర్రచందనం కూలీలుగా రూపాంతరం చెందిన వాళ్లలో పేదరైతులు, దళితులు, వ్యవసాయ కూలీలు కనిపిస్తారు. శ్రమ శక్తిని స్వేచ్ఛగా అమ్ముకునే పెట్టుబడి సమాజపు స్థితి ఇక్కడ ఉంది. నిర్బంధ కూలీ లేకపోయినా ఊరు, ఊరే బృందంగా చెట్ల నరికి వేతకు బయలుదేరిన సందర్భాలున్నాయి. దీనికి ఫ్యూడల్ సంప్రదాయపు గ్రామ పెద్దల మాటల మీద ఊరు నిలబడడం కనిపిస్తుంది. వీరి ఆర్థిక అవసరాలను ఆసరగా చేసుకొని వీరికి ఆశచూపి స్మగ్లర్లు తమ దందా నడిపిస్తున్నారు. సహజంగానే ఊర్లో ఒక దళారీ మొదట గ్రామ పెద్దని డబ్బుతో, సారాయితో కొనేస్తారు. తర్వాత ఆట మొదలవుతుంది. వ్యవసాయంలో సంక్షోభం, గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడం, వలసకు పట్టణాలు దూరంగా ఉండడం, వీరప్పన్ హయాంలో జరిగిన స్మగ్లింగ్‌లో పరిచయం, అనుభవం ఉండడం, వీరిని ఎర్ర చందన కూలీలుగా మార్చివేసింది. భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థల అభివృద్ధి మధ్య ఘర్షణ మెజారిటీ ప్రజానీకాన్ని కూలీలుగా, శ్రమశక్తిని అమ్ముకునే కార్మికులుగా మార్చివేయడం, వీరికి పనులు కలిపించడంలో వ్యవస్థ విఫలం అవడం వల్ల, వీరికున్న సంప్రదాయక నైపుణ్యానికి వినియోగం లేకపోవడం వల్ల, జీవనాధారం కోసం వీరు ఎర్రచందనం కూలీలుగా మారి, తమ జీవితాలను పెనం మీద నుండి పొయ్యిలోకి తీసుకువచ్చారు. వ్యవస్థే తన నుండి మిగులు మనుషులను గెంటివేస్తూ, దొంగలుగా మారుస్తూ, వ్యవస్థే వీరిని చంపుతుంది.

ఎర్ర చందనం కూలీలు పోలీసుల బారిన పడకుండా ఉండాలంటే వీరు ఈ పని ఆపాలి. ఈ పని ఆపాలంటే, వారి ప్రాంతాలలో వారికి పని కల్పించాలి. ఇది ఆర్థిక సామాజిక సమస్య. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచించకుండా, అసలు సూత్ర దారులను అరెస్టు చేయకుండా కూలీలను చంపడం వల్ల స్మగ్లింగ్ ఆగదు. ఈ రెండు పోలీసు హత్యలు జరిగిన తర్వాత కూడా పోలీసులు రు. 20 కోట్ల ఎర్ర చందనాన్ని సీజ్ చేశారు.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

ఓపెన్ కాస్టుల వల్ల ఎవరికి లాభం?

ఓపెన్‌కాస్టు బొగ్గుగనులకు అనుమతుల వల్ల ఉత్తర తెలంగాణ ప్రాంతంలో జరగనున్న విధ్వంసాన్ని వివరిస్తున్నారు

కొండపాక శ్రీలత

బొగ్గు గనుల తవ్వకాలకై సింగరేణి యాజమాన్యం ఉత్తర తెలంగాణ జిల్లాలోని గోదావరి నది తీర ప్రాంతాల గ్రామాలనూ, పట్టణాలనూ, పల్లెలను విధ్వంసం చేయడానికి ప్రణాళికలనూ రూపొందించి, ఓపెన్ కాస్టుల రూపంలో అమలు చేస్తున్నది. అధిక ఉత్పత్తి- అధిక లాభాల పేరుతో సింగరేణి యాజమాన్యం చేపడుతున్న ఈ విధ్వంసానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నది. ఫలితంగా స్థానిక ప్రజలు పంట భూములను, నివాసాలను, బతుకు దెరువును కోల్పోయి, జీవించే హక్కును కోల్పోతున్నారు. గాలి, నీరు, నేల ప్రజల జన్మహక్కు. అందుకే ఓపెన్ కాస్టు ప్రాజెక్టుల ప్రణాళికలను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున పోరాటానికి ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

సింగరేణి బొగ్గు గనులు ఈ ప్రాంతానికి ఒకనాడు నిజంగానే అభివృద్ధిని తీసుకొచ్చాయి. సాగునీటి వసతి కరువై, వ్యవసాయంలో పెట్టుబడి అధిక మొత్తంలో పెట్టినా చావలేక, బతుకుతున్న తెలంగాణ జిల్లాల పేద రైతులకు సింగరేణి బొగ్గు గనులు ప్రత్యామ్నాయ జీవన మార్గాన్ని చూపాయి. ఈ తరుణంలో వేలాది మంది బడుగు వర్గాల రైతు బిడ్డలు బొగ్గుగని కార్మికులైనారు. ఇల్లందు, కొత్తగూడెం, మణుగూరు, గోదావరిఖని, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, భూపాలపల్లి వంటి పట్టణాలు వెలిశాయి. ఈ పరిణామాలు పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధిని చూపించి, పల్లెల్లో దొరకని చదువు గని కార్మికుల పిల్లలకు ఇక్కడ దొరికింది. కొందరు వారసత్వంగా తండ్రుల స్థానంలో పనులు పొందుతూ సంతృప్తి చెందగా, మరికొందరు ఉన్నత చదువులు చదివి బయటికి వెళ్లి మరింత బాగుపడ్డారు. ఇంతవరకు కొంత సమతుల్యతతో కూడిన అభివృద్ధిగా భావించవచ్చు.

బొగ్గు గనుల తవ్వకాలు అండర్‌గ్రౌండ్ పద్ధతిలో సాగినందున చుట్టూ పక్కల ఉన్న గ్రామాల వ్యవసాయంపై పడిన దుష్ప్రభావం కూడా తక్కువగానే ఉంది. ఒక్క రామగుండంలోనే గాక ఇతర ప్రాంతాల్లో కూడ బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పబడి ఉంటే స్థానిక ప్రజలకు మరింత మేలు జరిగి ఉండేది. ఖనిజ సంపద, నీరు, చదునైన నేలలతో ఎన్నో పరిశ్రమల స్థాపనకు భౌగోళికంగా ఎంతో అనువుగా ఉన్నప్పటికీ తెలంగాణ ప్రాంత వివక్షలో భాగంగానే ఇక్కడి పారిశ్రామికీకరణ నిర్లక్ష్యం చేయబడింది. పాలకులకు మొదటి నుండి ఇక్కడి బొగ్గును కొల్లగొట్టుకు పోవడమే ధ్యేయంగా మారినందున ఇక్కడ జరగాల్సినంత అభివృద్ధి కూడా జరగలేదు.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని బొగ్గు గనుల నుండి ఉత్పత్తి అవుతున్న బొగ్గు 80 శాతం స్థానికేతరంగా ఉన్న పరిశ్రమలకే తరలిపోతుండగా స్థానికంగా ఉన్న పవర్ ప్రాజెక్టులకు 20 శాతం బొగ్గు మాత్రమే వినియోగం అవుతున్నది. ఉత్పత్తి అయిన విద్యుత్ మాత్రం ఇతర రాష్ట్రాలకే వెళ్తోంది. ఈ ప్రక్రియ తతంగమంతటిలో నష్టపోతున్నది మాత్రం బొగ్గు ఖనిజాన్ని తమ భూముల్లో కలిగి ఉన్న ఉత్తర తెలంగాణ రైతాంగమే. నూతన పారిశ్రామిక విధానాల తర్వాత సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల స్థితిగతులు దిగజారాయి. బొగ్గు కలిగిన గ్రామాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. సమతుల్యంగా జరగాల్సిన అభివృద్ధిని ధ్వంసం చేస్తూ, వేగంగా బొగ్గును తవ్వితీసే ఆలోచన సింగరేణి యాజమాన్యంలోనూ, వారి వెనుక ఉన్న ప్రభుత్వాలలోనూ మొలకెత్తింది. దానికి తగిన విధాన రచన చేసి నడిపించగలిగే ఐఏఎస్ అధికారులు సింగరేణి సంస్థకు ఛైర్మన్‌గా, డైరెక్టర్లుగా పదవులు చేపట్టారు. కార్మికుల హక్కులు అణచివేసి కార్మికుల చట్టాలను, ఒప్పందాలను బేఖాతరు చేసి అధిక లాభాలను చూపిస్తున్నారు. అదే సమయంలో బొగ్గు దొరికే ప్రాంతాలలో ఉండే గ్రామాలను నాశనం చేసే బొగ్గు గనుల విస్తరణ – ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల తవ్వకాలను చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ డోర్లి నుండి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల గుండా పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి వరకు గోదావరి నది తీర గ్రామాలలో దాదాపు 70 ఓపెన్ కాస్ట్ గనులను నెలకొల్పాలన్నది బొగ్గు గనుల విస్తరణ ప్రణాళిక వేత్తల సంకల్పం. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాలోని కేశిపేట, శ్రవణపల్లి, ఇందారం, కరీంనగర్ జిల్లాలోని ఖమ్మం పల్లి, తాడిచర్ల, మహదేవ్‌పూర్, వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, పెద్దాపురం వంటి గ్రామాలలో భూసేకరణకు ప్రయత్నాలు ప్రభుత్వం చేపట్టింది.

ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల వల్ల సమీప గ్రామాలలో భూగర్భ జలాలు అడుగంటడం, చెరువులు ఇంకిపోయి వ్యవసాయం కుంటు పడడం, భారీ బ్లాస్టింగ్ వల్ల ఎగసిపడే దుమ్ము, ధూళి, ప్రకంపనల వల్ల వ్యవసాయం, గ్రామాల రోడ్లు పాడవడం, భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కానీ, నష్టపరిహారం కానీ పూర్తిస్థాయిలో అందకపోవడం వంటి సమస్యలకు స్థానిక ప్రజలు గురవుతున్నారు. పర్యావరణం పూర్తి స్థాయిలో దెబ్బతింటోంది.

మానవ మనుగడకు అన్ని రకాలుగా చేటును సమకూర్చే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ తవ్వకాలకే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ, ప్రజాభీష్టాన్ని కాల రాస్తున్నది. ఒక గ్రామంలో ప్రారంభమైన ఓపెన్ కాస్ట్, మొత్తం ఉత్తర తెలంగాణలోని గోదావరి తీర గ్రామాలన్నింటినీ మింగుతుంది. ప్రాజెక్ట్ తవ్వకాలు ముగిసిన పిదప గనిలో ఇసుకను, మట్టిని నింపి పూడుస్తామని సింగరేణి అధికారులు చెప్పుతున్నారు. కాని భూమట్టానికి మూడు మీటర్ల లోతు వరకు జరిపే ఈ తవ్వకాల వల్ల ఏర్పడిన బొందని నింపడం సాధ్యం కాని పని. దేశంలో ఎక్కడా తిరిగి మట్టిని నింపిన దాఖలాలు లేవు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గోదావరి నది తీర ప్రాంతాల గ్రామాలు వ్యవసాయ జనావాసాలతో నిండి ఉన్నాయి. నిరుపయోగమైన స్థలం అంటూ ఏదీ లేనందున ఈ ప్రాంతంలో ఎక్కడ ఓపెన్‌కాస్ట్

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్

డంపింగ్ యార్డుల వల్ల పర్యావరణం, భూమీ, నీరూ కలుషితమవుతున్నాయనీ, కాంట్రాక్టర్ల ప్రయోజనాలను కాకుండా ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వీటిని ఎత్తివేయాలనీ అంటున్నారు దామరపల్లి నర్సింహ్మారెడ్డి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు 2000 సంవత్సరంలో ఏర్పడింది. ఈ యార్డ్ రంగారెడ్డి జిల్లా, కీసర మండలం, జవహర్‌నగర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్నది. ఇది మరో నల్గొండ ఫ్లోరోసిస్ ప్రాంతంగా మారింది. చుట్టు పక్కల ప్రదేశాలన్నీ కాలుష్యమయంగా మారడంతో అనేక మంది తీవ్ర అనారోగ్యాలపాలై వంద సంవత్సరాలు బతకాల్సిన వారు నలభై ఏండ్లు నిండకుండానే మరణిస్తున్నారు. కీసర మండల పరిధిలోని సుమారు 52 చెరువులు, 205 బోరు బావులు కాలుష్య కారకాలుగా మారాయి. భూగర్భ జలాలన్నీ కలుషితమైనాయి. వాయు కాలుష్యం వలన ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

నగరంలో ప్రతిరోజూ 4,000 మెట్రిక్ టన్నుల చెత్త ఇల్లు ఇల్లు తిరిగి సేకరిస్తున్నారు. భాగ్యనగరం చెత్తంతా జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో లారీలతో తెచ్చి పారపోస్తున్నారు. హైదరాబాద్‌కు కేవలం 13 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. 6000 ఎకరాల భూమి జవహర్‌నగర్, కీసర, బండ్లగూడ, దమ్మాయిగూడ, ఆహ్మద్‌గూడ, చీర్యాల, కుందన్‌పల్లి, యాద్గార్‌పల్లి, నాగారం తదితర గ్రామాలు చెత్త ముప్పు బాధిత ప్రాంతాలే. యాద్గార్‌పల్లి, రాజీవ్ కార్మికనగర్, సిఆర్‌పిఎఫ్ కాలనీలతో పాటు మరో 35 గ్రామాల ప్రజలు, సుమారు మూడులక్షల జనాభాపై ఈ డంపింగ్ ప్రాణాంతకంగా మారింది. ప్రజలు ఎన్ని ఆందోళనలు చేసినా పాలకులకు మాత్రం పట్టడం లేదు. రాంకి ఎన్విరో ఇంజనీరింగ్ లిమిటెడ్ (రీల్) ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలనే ప్రజల డిమాండ్ ప్రభుత్వానికి వినిపించడం లేదు. మురికిలో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకుండానే వేధింపులకు దిగుతోంది రాంకి యజమాన్యం. డంపింగ్ యార్డు కోసం 350 ఎకరాలు కేటాయించింది ప్రభుత్వం. వీటిలో వారానికి ఒకసారి చనిపోయిన మృతదేహాలను, వ్యర్థాలను వదలడంతో ప్రజలు భరించలేని దుర్గంధ వాసన వెలువడుతుంది. కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సిపిసిబి) వారిచ్చిన నిబంధనల ప్రకారం 4000 మెట్రిక్ టన్నుల చెత్తను డిస్పోజ్ చేయగలిగే టెక్నాలజీ కూడా రాంకి కంపెనీ దగ్గర లేదు. అయినా 25 సంవత్సరాలు కాంట్రాక్టును ప్రభుత్వం కట్టబెట్టింది. దీన్ని బట్టి చూస్తే కాంట్రాక్టర్ మీద ఉన్న ప్రేమ ప్రజల పట్ల లేదని అర్ధమవుతుంది. కేంద్రం ప్రతిపాదించిన నియమ నిబంధనలను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రాంకి కంపెనీ గాలికొదిలేసి ప్రకృతి పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తోంది. కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమల నుంచి వడేసిన వ్యర్థాలను, దవాఖానాల వేస్ట్‌లు, విష పదార్థాలు ప్రతి రోజు టన్నుల కొద్ది వ్యర్థాలను జవహర్ నగర్ డపింగ్ యార్డ్‌లో లారీలలో తెచ్చి వదిలేస్తున్నారు. చెత్త కాగితాలు ఏరుకునే పిల్లలు, పెద్దలు, కూలీలు చెత్త కుప్పల్లో కూరుకుపోయి శవాలై తేలుతుంటారు. సాయంత్రం కెమికల్ చల్లి మంటలు పెడుతుంటారు. అర్ధ రాత్రి వేళలో పెద్ద పెద్ద మంటలు లేస్తాయి. వర్షం పడితే చాలు దుర్వాసన వ్యాపించడంతో చుట్టూ 10 కిలోమీటర్ల వరకు వచ్చే వాసన భరించలేం. చెరువులోని చేపలు, కప్పలు, వానపాములు చనిపోయాయి. నీళ్లు పనికి రాకుండాపోయాయి. ఇవి తాగిన ప్రజలకు అనేక వ్యాధులు ప్రబలుతున్నాయి. చర్మ వ్యాధులు, క్యాన్సర్లు ప్రాణాంతకంగా మారాయి. ప్రాణాంతకంగా మారిన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలి.

ముఖ్యంగా ప్రజలు రోగాల బారినపడి అంటువ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, మలేరియా, డెంగ్యూ, దగ్గు, దమ్ము, ఊపిరితిత్తుల వ్యాధులతో పాటు, పుట్టుకతోనే అంకవైకల్యం, మూగ, చెవిటితో పుడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పొగ వాసనతో భరించలేని దుర్వాసన వ్యాప్తిస్తుంది. నరాల బలహీనతలు, కంటి చూపు కొల్పోవడం, వెంట్రుకలు ఊడిపోవడం వంటి ప్రధాన సమస్యలు ప్రజల్ని వెంటాడుతున్నాయి.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌కు అజ్యం పోసింది చంద్రబాబే. ప్రజలు మాత్రం నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. కాలుష్యం పొగ బాధను భరించలేక రాజీవ్ గృహకల్పను వదిలేసి, అడ్డికి పావుసేరుకు అమ్ముకొని పోతున్నారు. రంగారెడ్డి జిల్లా అధికారులకు వినతి పత్రాలు, ఆందోళనలు, నిరసనలు చేయని రోజంటూ లేదు. ఎంతో మంది ప్రజాసంఘాల నాయకులతో సహా ఇక్కడి ప్రజలు

తలపెట్టినా మానవ విధ్వంసం తప్పదు.

బొగ్గు గనుల తవ్వకాలు అండర్ గ్రౌండ్ పద్ధతిలో కొనసాగితే వేల సంఖ్యలో స్థానికులకు ఉద్యోగాలు దొరికేవి. కాని ఓపెన్ కాస్ట్ పద్ధతిలో ఉద్యోగాలూ తక్కువే. దాదాపు 70 శాతం పనుల నిర్వహణ కాంట్రాక్టర్లే నిర్వహిస్తున్నందున వారికి సంబంధించిన కాంట్రాక్టు కార్మికులనే తెచ్చుకుంటారు. స్థానిక గ్రామాల ప్రజలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వరు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి స్థానిక ప్రజల బాగోగులు పట్టవు. వారికి కావాల్సింది వార్షిక వృద్ధిరేటు, ఆదాయ వ్యయాల లెక్కల్లో అధిక ఉత్పత్తిని, అధిక లాభాల్ని చూపడం తప్ప వేరే దృష్టి లేదు.

అభివృద్ధి అంటే సహజ వనరులను మూకుమ్మడిగా పెట్టుబడిదారులకు అప్పగించడం ప్రభుత్వ పాలకుల నిర్వచనం. ప్రజలకొరకు, ప్రజల భూముల రక్షణ కొరకు, జీవించే హక్కు కొరకు బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌ల రద్దుకై ఉద్యమిద్దాం.

(రచయిత చైతన్య మహిళా సంఘం కార్యకర్త)

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. రాజీవ్ గృహకల్పవాసులు చెత్త డంపింగ్‌యార్డ్‌ను ఎత్తివేయాలంటూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినా సమస్యకు పరిష్కారం దొరకలేదు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని కీసర బహిరంగ సభలో డంపింగ్ యార్డ్ బాధితులు నిలదీశారు. స్థానిక ఎం.ఎల్.ఎ. అయిన కిచ్చెనగారి లక్ష్మారెడ్డి ఎన్నికల్లో గెలిచిన వెంటనే డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేస్తామని చెప్పి జవహర్‌నగర్ ఓట్లతో గెలుపొందిన తరువాత డంపింగ్ సమస్యను మరిచిపోయారు. అహ్మద్‌గూడ ప్రజలు లారీలను ఎక్కడిక్కడ నిలిపివేసి వారంరోజుల పాటు లారీలను రానివ్వకుండా అడ్డుకున్నారు. హుటాహుటిన రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ బాధితు లను, ఆందోళనకారులను పరామర్శించి వారంరోజుల్లో ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంతవరకు నెరవేరలేదు. ప్రజలు ఒకవైపు ఉంటే, రాజకీయ నాయకులు, అధికారులు మరొకవైపు ఉంటారు.

మరో విషయం చెప్పాలంటే రాంకి కాంట్రాక్టర్ అసత్య ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. చెత్త నుంచి విద్యుత్తును తయారు చేస్తే ఎలాంటి దుర్వాసన రాదని విద్యుత్ ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలుకుతున్నారు. 500 కోట్ల రూపాయలకు రాంకి కాంట్రాక్టర్‌కే కట్టబెట్టడం వెనుక మతలబు ఏమిటి? పర్సెంటేజీలకు కక్కుర్తిపడి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు. జవహర్‌నగర్ కీసర మండలంలో వివిధ గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డును ఎత్తివేయాల్సిందేనని, దీనిని ఎత్తివేయకుంటే ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమేనని ప్రభుత్వంతో కరాఖండిగా చెప్పేశారు. మూడు లక్షల ప్రజలను వదిలి కేవలం ప్రభుత్వం కాంట్రాక్టర్లకే కొమ్ము కాస్తుంది.

డంపింగ్‌యార్డ్ నుంచి విడుదలవుతున్న నీరును తాగడంతో పాడి పశువులు గేదెలు మరణిస్తున్నాయి. ఇక్కడి పంటలన్ని చెడిపోయాయి. భూములు సుమారు 10 వేల ఎకరాల భూమి పనికి రాకుండా పోయింది. వేలాదిమంది రైతులు కూలీలుగా మారారు. కలుషితమైన నీరు తాగడం తో వ్యాధులకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జవహర్ నగర్‌లో నివసించేది పేద బడుగు బలహీన వర్గాల ప్రజలే. తాటికల్లు, ఈతకల్లు కలుషితంగా మారింది. కాలిపోయిన చెత్తలో కూరుకపోయి ఇప్పటి వరకు చెత్త ఏరుకొని బతికే వాళ్లు ఐదుగురు మరణించారు. వారికి ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్ట పరిహారం అందలేదు. వారి పిల్లలు అనాథలుగా మిగిలారు. ప్రజల ఆందోళనలు ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. రోజు వారీగా సుమారు 450 చెత్త లారీలు డంపింగ్ చేస్తాయి. రోజురోజుకు చెత్త సమస్య జటిలమవు తోంది. దీంతో అనేక గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం.

2000 సంవత్సరానికి కంటె ముందు జవహర్‌నగర్ చుట్టూ కొండలు, గుట్టలు, అడవి, చెట్లు ఉండేవి. ప్రకృతి ఒడిలో పక్షుల రావాలు కిలకిలలాడేవి. చెత్త డంపింగ్ యార్డు మూడు లక్షల మందికి, 56 గ్రామాలకు జీవన్మరణ సమస్యగా మారింది. వాతావరణం విషంగా మారింది. 80 శాతం భూములు పనికి రాకుండా పోయినాయి. భూగర్భ జలాలు అన్ని కలుషితంగా, పచ్చగా మారిపోయినవి. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో ఇక్కడి ప్రజలు చావు బతుకుల మధ్య తెల్లార్తోంది. చెత్త డంపింగ్‌ను ఇక్కడి నుంచి దూర ప్రాంతాలకు తరలించి శాశ్వత పరిష్కారం ప్రభుత్వం కనుక్కోవాలి. లేని పక్షంలో ప్రజా ఆందోళనలు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రజల డిమాండ్లను ప్రభుత్వాలు గౌరవించాల్సిందే. ఉద్యోగాల ఎరతో ప్రజాందోళనలను ఆపలేరు.

(రచయిత సీనియర్ పాత్రికేయులు) వీ

వీక్షణం రచయితలకు సూచనలు

పది సంవత్సరాలలో, నూట ముప్పై తొమ్మిది సంచికలలో వీక్షణం రెండు వేలకు పైన వ్యాసాలు, రచనలు ప్రచురించింది. వీటిలో నిడివిలోనూ, వస్తువులోనూ, చెప్పిన పద్ధతిలోనూ, సుబోధకతలోనూ చాల వైవిధ్యం ఉంది. ఈ వైవిధ్యాన్నంతా గౌరవిస్తూనే, పత్రికలో అచ్చయ్యే వ్యాసాలను ప్రామాణికం చేయడానికి రచయితలు ఈ కింది సూచనలు పాటిస్తే బాగుంటుందని భావిస్తున్నాం.

- రచన మరీ చిన్నది (ఒక పేజీ కన్న తక్కువ) కాకుండానూ, మరీ పెద్దది (ఐదు పేజీల పైన) కాకుండానూ ఉంటే బాగుంటుంది. రచన ఐదు పేజీలకు మించితే రెండు మూడు సంచికలలో వేయవలసి వస్తుంది గనుక రచయిత అభిప్రాయం పాఠకులకు అందడం కష్టమవుతుంది. మూడు-నాలుగు పేజీల రచన (1800 - 2500 పదాలు) వీక్షణం కు సరిగ్గా సరిపోతుంది.
- చేతిరాతతో పంపేవారయితే వీలయినంత కుదురుగా, చదవడానికి వీలుగా, పంక్తుల మధ్య ఖాళీ వదులుతూ, కాగితానికి ఒకవైపునే రాసి పంపాలి. కంపోజ్ చేసి పంపేవారయితే, డబుల్ లైన్ స్పేసింగ్ లో కాగితానికి ఒకవైపునే అచ్చువేసి పంపాలి. యూనికోడ్‌లో గాని, పేజ్ మేకర్‌లో గాని కంపోజ్ చేసేవారు సాఫ్ట్ కాపీ సి.డి. ద్వారాగాని, ఇ మెయిల్ లోగాని పంపితే మంచిది.
- రచయితలు తప్పనిసరిగా తమ రచన ఫొటో కాపీ తమ దగ్గర ఉంచుకోవాలి.
- రచనతో పాటు తప్పనిసరిగా రచయిత సంక్షిప్త పరిచయం, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వగైరా వివరాలు పంపాలి.
- వీక్షణం కార్యాలయానికి రచన అందిన వెంటనే అందినట్టుగా రచయితలకు సమాచారం పంపుతాం. రెండువారాలలోగా ఆ రచనను ప్రచురణకు స్వీకరిస్తున్నదీ లేనిదీ తెలుపుతాం. తక్షణ ప్రాముఖ్యత ఉన్న అంశం మీద రచన అయితే రెండు-మూడు నెలల లోపు అచ్చువేస్తాం. సాధారణ రచనలు అచ్చువేయడానికి ఆరు నెలల వరకూ పట్టవచ్చు.
- మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణం కు పంపగూడదు.
- దీర్ఘకాలిక తాత్విక, రాజకీయార్థిక, సామాజిక అంశాల మీద మాత్రమే కాక, సమకాలీన రాజకీయార్థిక, సామాజిక పరిణామాలపైన కూడ రచనలు పంపాలని రచయితలకు విజ్ఞప్తి. ఆ విషయం మీదనే మరొకరు రాసినా, అన్ని దృక్పథాల రచనలు అచ్చు వేయడం వీక్షణం ఉద్దేశ్యం. క్షేత్ర పరిశోధనా నివేదికలు, విధానాల అమలు తీరుతెన్నులు, ప్రజాజీవితంలో మార్పులు, వివిధ దృక్కోణాలు, విభిన్న సామాజిక శాస్త్ర పరిశీలనాంశాలు వీక్షణంలో ప్రాధాన్య ప్రచురణాంశాలు. సాహిత్య రంగానికి సంబంధించిన రచనలకు వీక్షణంలో చోటు కల్పించడం సాధ్యం కాదు.
- రచయిత అభిప్రాయాలను మార్చడం ఎప్పుడూ జరగదు. కాని నిడివి దృష్ట్యాగాని, సాంకేతిక కారణాల దృష్ట్యాగాని రచనలు కుదించే, మార్చే పరిస్థితి రావచ్చు. ఇలా ఎడిట్ చేయడానికి రచయితలు ఆమోదించాలి.

వేగుచుక్క - చేగువేరా

- బి.వి.ఎన్. స్వామి



చే - ఏ ప్రైమేట్

ప్రచురణ : సాహితీ మిత్రులు
112 పేజీలు, 1/8 డెమీ, రు: 50,
ప్రతులకు: సాహితీ మిత్రులు,
విశ్వేశ్వరరావు, 28-10-26/1,
అరండల్‌పేట, విజయవాడ - 520 002

మార్కెట్ విరోధిగా కాలర్ ఎగరేసిన చేగువేరా (చే)ను మార్కెట్ విలువైన మాడల్‌గా ప్రాజెక్ట్ చేయడం ఒక ట్రెండ్. ఏ సమూహాలైతే చే గురించి తెలుసుకోవాల్సి ఉందో, వాటికే చే స్ఫృహను అందించాల్సిన బాధ్యతను నెత్తికెత్తుకున్న సాహితీ మిత్రుల ప్రయాస 'చే ఎ ప్రైమేట్'గా మారి పాఠకుల చేతుల్లో ఉంది.

కేర్‌నాట్ బాడీ లాంగ్వేజ్ గల అతని ఆహార్యం ఆకర్షణీయం. తిరుగుబాటుకు ఒక సింబల్‌గా నిలిచిన చే పట్ల గల ఆరాధనను మల్టీకలర్స్‌లో మిక్స్ చేసి ప్రపంచ పరివ్యాప్తం చేయడం వల్ల పదహారణాల వ్యాపారమైంది. దానికి భిన్నంగా చే సిద్ధాంతాన్ని, మూలాలను బ్లాక్ అండ్ వైట్‌లో ప్రజలకు చూపించడం వల్ల తత్వం బోధపడింది. 1928 జూన్ 14 నుండి 2004 వరకు ఆయా సంవత్సరాలలో గల ప్రధాన ఘట్టాలను పేర్కొంటూ, విషయానికి తగిన ఫొటోలను జతచేయడం పాఠకుడికి ఆసక్తి కొల్పుతుంది. విస్తృత పఠకుడైన గువేరా విప్లవ యోధుడిగా రాటుదేలిన క్రమం ఇందులో కళ్లకు కడుతుంది. 'వీరోచిత గెరిల్లా యోధుడిగా' పేర్కొంటూ అల్బర్ట్ కోర్డాడియాజ్ తీసిన ఫొటోను ప్రపంచం కళ్లకద్దుకుంది. విస్తృత పర్యటనలే చేను క్యాస్ట్రోకు, విప్లవానికి అనుసంధించాయి.

1959లో చేగువేరా భారతదేశాన్ని సందర్శించాడు. ఆ సమయంలో అతడు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎంతో విలువైనవి. ముఖ్యంగా భూమి పంపిణీకి సంబంధించి ఆసక్తికరమైన వివరాలు తెలిపాడు. డైరెక్టర్‌గా క్యూబాలో భూ సంస్కరణలను అమలు చేస్తూ అందులో భాగంగా అమెరికన్ కంపెనీల వ్యాపారాలను, వాటి ఆధీనంలో ఉన్న వ్యవసాయ ఎస్టేట్‌లను స్వాధీనం చేసుకున్నాడు. తుపాను లాంటి ఈ చర్య వల్ల దున్నేవాడికి భూమి దక్కింది. భారతదేశంలో భూసంస్కరణలు నింపాదిగా జరగడం, భూములు ఇచ్చే భూస్వాములకు నష్టపరిహారం ఇస్తామనడం, భూదానోద్యమాలు సాగడం వెరసి తతంగమంతా సంక్లిష్టంగా మారి దారిద్ర్యం తాండవించడం జరిగింది. దీన్ని చే చక్కగానే గ్రహించాడు. పారిశ్రామికీకరణ, సాంప్రదాయ ఆచరణ కలగలిసి సాగే భారతావని జీవితాన్ని హేతుబద్ధంగా విశ్లేషించాడు. భారత్‌లో వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకొని వెళ్లిన కార్యశీలి చేగువేరా.

పార్టీ పదవికి, మంత్రి పదవికి, సైనిక దళాల అధిపతి హోదాకు, క్యూబా పౌరసత్వానికి రాజీనామా చేసి విప్లవ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి కొత్త ప్రాంతానికి, కొత్త ప్రజల మధ్యకు వెళ్లిన సాహసి చేగువేరా. లాటిన్ అమెరికా సృష్టికర్తల విముక్తి కోసం చే క్యూబాను వదిలాడు. ఆ సమయంలో క్యాస్ట్రోకు రాసిన లేఖలోని విషయం అతని పరిణతిని తెలుపుతుంది. తన భార్యా బిడ్డలకు ఆస్తి అనేది సంపాదించలేదని, వారి చదువులు, బతుకు గురించి ప్రభుత్వం చూసుకుంటుందని ఆశాభావం వెలిబుచ్చాడు. సమిష్టి వాద భావనలను వెలిబుచ్చిన చే, సామ్రాజ్యవాద వ్యతిరేక సరికొత్త సమర రంగాలలో విప్లవ స్ఫూర్తిని నింపడానికి వెళుతున్నానని తెలుపుతాడు.

చే గువేరా వ్యాసం చక్కటి విశ్లేషణ, శాస్త్రీయ దృష్టి, గతితార్కిక జ్ఞానంతో సాగుతుంది. 'విప్లవం ఒక చారిత్రక సంభావ్యత' అనే వ్యాసం ఇందుకు ఒక ఉదాహరణ. చరిత్ర పరిణామాన్ని, మార్క్సిజం కార్యశీలతను, అది క్యూబా విప్లవానికి ఏ విధంగా ఉపయోగపడ్డదో, సవివరంగా ఇందులో చర్చించారు. 'గెరిల్లా యోధునికి మొదటి నుంచీ కనీస సౌకర్యాలు లేకపోయినా సర్దుకుపోయే తత్వం అలవడడం, అడవుల్లో, గుట్టల్లో బతకడంతో అదే తమ సొంత ఇల్లు అన్నంతగా అలవాటు పడిపోవడం, గొప్ప నైతిక స్థైర్యం, ఆత్మరక్షణకు తిరుగులేదన్న ధీమా, చావుకైనా తెగించే ధైర్యం - ఈ గుణాలు ప్రభుత్వ సైన్యం మీద పై చేయి సాధించడానికి విశేషంగా తోడ్పడ్డాయి.

'సైన్యం విషయానికి వస్తే వాళ్లలో ప్రాణభయం వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. సైనిక నియంతలతో అంగుష్ఠ భాగస్వామ్యం కలిగి ఉండడం, అతనితో అంటకాగడం మూలాన ఒనగూడే ప్రయోజనాలు అంతంత మాత్రం కావడం, వదులుకోవాల్సి వస్తే ఈ అరకొర సౌకర్యాలేపోతాయి. లేకుంటే ప్రాణాలు ఫణంగా పెట్టాల్సి ఉంటుంది. ఇవన్నీ మానసికంగా సైన్యం మీద తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించాయి.'

గువేరా ఆచరణ, అవగాహనల సారాంశంగా ఈ మాటలు నిలుస్తాయి. ఈ వాక్యాలు సార్వజనీన సత్యాలు.

యూరోపియన్ స్థితిగతుల నేపథ్యం లోంచి మార్క్సిజం రూపొందింది. దాన్ని లాటిన్ అమెరికా పరిస్థితులకు సమన్వయించాడు. ఈ క్రమంలో మార్క్స్, ఏంగెల్స్, మావో ఆలోచనా విధానాన్ని, లెనిన్, స్టాలిన్‌ల ఆచరణ క్రమాన్ని కాచి వడబోశాడు. 'నేను భూమ్మీద ఉన్నంత కాలం రుషి కార్ల్ మార్క్స్ నాకు ముఖ్యం, ఇరుసు కూడా' అని తన తల్లికే రాసిన ఉత్తరంలో పేర్కొన్నాడు. సామ్రాజ్యవాదంపై ఏ దేశం విజయం సాధించినా, ఏ దేశం ఓటమి పొందినా అది తన గెలుపోటములుగా భావించాడు. అందుకే తృతీయ ప్రపంచ దేశాల మధ్య పొత్తు అనివార్యం అని భావించాడు. నాటి ప్రజలు చేను 'తమను విముక్తం చేస్తున్న నాయకుడు'గా తలపోశారు. అసాధారణ ఆ యుద్ధ యోధుడి ముందు అనేక పదవులు చిన్నబోయాయి.

ఈ పుస్తకం పుటల్లో కాసింత కవిత్వంలో బోల్డంత చే తపన, చేతన నింపుకున్న అనేక వాక్యాలు, కవి మిత్రులు స్పృశించిన చేతలు, ఉద్వేగరాతలు, దృశ్యకావ్య వ్యాఖ్యలున్నాయి. చే అంటే హాయ్ అని అర్థం. ఇందులో హాయ్ గొలిపే వచన శైలి ఉంది. చేపై పుస్తకం వెలువరించిన సాహితీమిత్రులు, అభిప్రాయాలు పంచుకున్న రచయితలు అభినందనీయులు.

హాయ్! గువేరా ఇక సెలవు. వీ

భారత చైనా యుద్ధం - కొన్ని అర్ధ సత్యాలు

- ఎస్. కృష్ణమూర్తి

భారత చైనా యుద్ధం జరిగి యాభై ఏళ్లు నిండిన సందర్భంగా వీక్షణం డిసెంబర్ 2012 సంచికలో వ్యాసం ప్రచురించారు, సంతోషం. చాలా విషయాలున్నా రాయడానికి చోటు చాలదు. అయినా విషయ ప్రాముఖ్యత దృష్ట్యా గమనించాల్సిన కొన్ని ముఖ్యాంశాలకు పరిమితమై చూద్దాం. రచయిత మేజర్ జైపాల్‌సింగ్ ఇలా ఒక ముఖ్య సూత్రీకరణతో వ్యాసం ప్రారంభించారు: 'అంతర్గత విధానాలలో ప్రభుత్వాలు, పాలకవర్గాలు చెప్పేవన్నీ అబద్ధాలే అని కచ్చితంగా నమ్మేవాళ్లు కూడా విదేశాల విషయంలో, ముఖ్యంగా యుద్ధాల విషయంలో మాత్రం ప్రభుత్వాలు, పాలకవర్గాలు చెప్పేవన్నీ అక్షర సత్యాలేనని నమ్ముతారు.. తమను తాము వంచించుకుంటారు, ఇతరులను వంచిస్తారు'. సివిల్ మ్యాక్స్‌వెల్ ప్రసిద్ధ గ్రంథం 'ఇండియాస్ చైనా వార్' (1970)ని ఉటంకిస్తూ ఈ యుద్ధంలో 'భారత ప్రభుత్వమే దుందుడుకుగా వ్యవహరించిందని, చైనా బాధితురాలని ఆయన పూర్తిగా భారత ఆధారాల పునాదిగానే రుజువు చేశారు' అని వాస్తవాన్ని పేర్కొన్నారు. ఈ యుద్ధంపై ఇటీవల ప్రచురితమైన ఏజీ నూరాని పుస్తకంలో 'భారత ప్రభుత్వం చేసిన ఐదు కీలకమైన తప్పిదాలను' పేర్కొన్నారు. అంతవరకూ బాగానే ఉంది. కానీ వ్యాస రచయిత పై రెండు పుస్తకాల్లో రుజువు చేసిన విషయాలను కూడా విస్మరించి, వాటికి విరుద్ధంగా కొన్ని అర్ధసత్యాలను చెప్పారు.

1) ఆధునిక యుగంలో యుద్ధాలకు సామ్రాజ్యవాదంతో విడదీయరాని సంబంధం ఉంటున్నది. ఈ యుద్ధంలో కూడా ముఖ్యంగా అమెరికా, నాటి మరో అగ్రరాజ్యమైన సోవియట్ పాత్రలను, వాటి తాబేదారుగా భారత్ పాత్రను రచయిత విస్మరించారు. వారే చివర్లో పేర్కొన్నట్లు ఇది 'కేవలం గతకాలపు కంకాళాలను తవ్వి తీయడానికి మాత్రమే కాదు', నేటికీ జాతీయోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నందువల్ల పరిశీలించాల్సిన విషయం.

'టిబెట్ చైనాలో అంతర్భాగమని భారత ప్రభుత్వం స్వయంగా (1954లో) అంగీకరించింది' అని చెప్పిన రచయిత టిబెట్ ఎవరిది, దాని చరిత్ర ఏమిటి ఇత్యాది 'వేరే చర్చ' అంటూ అనుమానాలు లేవనెత్తారు. నిజానికి భారత్ మాత్రమే కాదు, ప్రపంచంలో అక్షరాలా ఏ ఒక్క దేశమూ టిబెట్ని విడిదేశంగా గుర్తించడం లేదు. చైనా అంతర్భాగంగానే చారిత్రక వాస్తవాన్ని గుర్తిస్తున్నాయి. కానీ సామ్రాజ్యవాదులూ, వారి దళారీగా ఉన్న భారత ప్రభుత్వమూ ద్వంద్వ విధానాలతో అక్కడ ఒక ప్రవాస ప్రభుత్వాన్ని నిలబెట్టి పోషిస్తున్నాయి. దాన్ని మనదేశపు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో గత యాభై ఏళ్లకు పైగా ఉండనిచ్చి, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ వ్యవహరిస్తున్నారు.

అగ్రరాజ్యాల ఆధిపత్య ప్రపంచ వ్యూహాలకు భారత్ లోబడి, విస్తరణవాద విధానాలు అనుసరించడం మూలాన చైనాతో మన సంబంధాలు మెరుగుకాకుండా ఉండిపోయాయి. ఒకప్పుడు భారత్ - సోవియట్ ఒడంబడిక, తర్వాత అమెరికాకి ఊడిగం అవరోధంగా ఉంటూ వచ్చాయి. ఇవన్నీ చెప్పకుండా 'రెండు దేశాల పాలకులకూ ఈ వివాదం రగులుతూ ఉండడమే అవసరం' అనడం వాస్తవ విరుద్ధం. ఇది రచయిత మొదట్లో పేర్కొన్నట్టు పాలకుల వంచనా విధానానికి తోడ్పడుతుంది. సామ్రాజ్యవాదుల, వారి దళారుల కుట్రలకు తోడ్పడుతుంది.

2) సరిహద్దు సమస్య చరిత్ర గురించి పైన పేర్కొన్న ప్రముఖ పుస్తకాలలో ఉన్న వాస్తవాలను సైతం విస్మరించి అరకొరగా, అర్ధ సత్యాలతో రాశారు. వారి ఈ చరిత్ర కథనమంతా బ్రిటన్ - భారత్‌ల కట్టుకథలపై ఆధారపడి, వారిని వెనకేసుకొచ్చేవిగా ఉంది.

'1935లో బ్రిటిష్ అధికారి ఒలాఫ్ కారో దీన్ని తవ్వితీశార'ని, 1937 లో 'సర్వే ఆఫ్ ఇండియా ముద్రించిన పటాల్లో మొదటిసారిగా భారత చైనా సరిహద్దుగా మెక్‌మోహన్ రేఖను చిత్రించారు' అని వ్యాసకర్త పేర్కొన్నది అర్ధసత్యం. 1954 వరకూ 'సర్వే ఆఫ్ ఇండియా పటాలు అన్నీ కూడా' కశ్మీర్ నుంచి నేపాల్ దాకా ఉన్న సరిహద్దు భాగాన్ని 'నిర్వచింప బడలేదు (అన్ డిఫైన్డ్)' అని ఈశాన్య సరిహద్దును 'రేఖ గుర్తించబడలేదు' (అన్ డిమార్కేటెడ్) అని పేర్కొన్నాయని, 1954 తర్వాత మ్యాపుల్లో ఈ అంశాలను పటాల నుంచి తొలగించారని వాటిపై సాధికారిక పరిశీలన జరిపిన కరుణాకర్ గుప్తా తన ప్రసిద్ధ గ్రంథంలో వెల్లడించారు. వెనుక బ్రిటన్ (ఒలాఫ్‌కారో వంటివారు) చేసినది, 1954 తర్వాత మళ్లీ నెహ్రూ ప్రభుత్వం చేసినదీ 'కార్టోగ్రాఫిక్ అగ్రెషన్' (పటాల మూలకంగా దురాక్రమణ)గా అనేక మంది నిపుణులు పేర్కొన్నారు. స్వయంగా నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టరుగా పనిచేసిన సారీన్‌రాయ్ ఇది 'కార్టో గ్రాఫిక్ ఫోర్జరీ' అని పేర్కొన్నారు. ఒలాఫ్ కారో ప్రారంభించిన ఈ ఫోర్జరీని 1954లో నెహ్రూ పూర్తిచేశారని అన్నారు. ఈ దుశ్చరిత్రను కప్పిపుచ్చి, 'రెండు దేశాల పాలకులు' అంటూ చైనానీ నిందించడం వాస్తవాలతో పొసగదు.

3) సరిహద్దు చరిత్రలాగే, దాన్ని అనుసరించి యుద్ధ చరిత్ర వివరణలోనూ తప్పులున్నాయి. ఫార్వర్డ్‌పాలసీ పేరిట సాగినది భారత విస్తరణవాద, దురాక్రమణ విధానం తప్ప వేరుకాదు. దౌత్య 'ప్రయత్నాలేవీ వివాద పరిష్కారం దిశగా అడుగులు వేయలేదు' అని వ్యాసకర్త పేర్కొన్నది నిజమే. దీనికి కారణం పైన పేర్కొన్న సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో భారత్ అనుసరించిన విస్తరణవాదమే. అదే నేటికీ అడ్డం వస్తున్నది. వ్యాసకర్త తాను మొదట సూచించినట్టు పాలకుల వాదనలను వెనకేసుకొచ్చారు. వాస్తవాలను చూడకుండా, రెండు దేశాల పాలకులనూ నిందించి భట్టిప్రోలు పంచాయితీతో ముగించారు.

రచయితలకు సూచన : తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 18వ తేదీలోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. - సం.

మంచి వ్యాసాలు, కాని అవగాహనా లోపాలు

- ఎన్. ఆదిరెడ్డి

వీక్షణంలో కొన్ని నెలలుగా వరుసగా వస్తున్న లోకసంచారి గారి వ్యాసాలు చదువుతున్నాను. ఇప్పటికి ఆరో ఏడో వచ్చినట్టున్నాయి. దాదాపు అన్నీ చదివాను. చాలా సులభ శైలిలో బాగా చదివించే లక్షణంతో వ్యాసాలు బాగుంటున్నాయి. కాని దాదాపు ప్రతి వ్యాసంలో కూడ ఏదో ఒక అవగాహనా లోపం, పొరపాటు అభిప్రాయాలు, మార్క్సిస్టు దృక్పథానికి సరిపడని అభిప్రాయాలు కూడ ఉంటున్నాయి. మొత్తంగా సమగ్ర దృక్పథం ఉండడం లేదు. ఈ లోపాలను తొలగించుకుంటే రచయిత తెలుగు పాఠకులకు చాలా మేలు చేయగలరు. వ్యాసాలను చాలా మంది మిత్రులు బాగా చదువుతున్నారు, పొగుడుతున్నారు గనుక, ఈ లోపాలను గురించి ప్రత్యేకంగా చెప్పి జాగ్రత్త తీసుకొమ్మని కోరవలసి వస్తున్నది. వీక్షణంలో అచ్చు కావడంవల్ల ఈ వ్యాసాలు ప్రామాణికమైనవని చాలా మంది అనుకుంటారు. మనలో చాలా మందికి లోతుగా చదవడం, సూక్ష్మమైన లోపాలను గుర్తించడం అలవాటు లేదు గనుక ఈ వ్యాసాలకు ప్రశంస రావడం కూడా సహజమే. నేను కూడ మొత్తం మీద ప్రశంస తోనే, ఈ లోపాలు తొలగించుకుంటే ఇంకా బాగుంటుంది గదా అనే ఉద్దేశంతోనే ఈ ఉత్తరం రాస్తున్నాను. అన్యథా భావించరనే ఆశిస్తున్నాను. వ్యాసాల మీద ఎప్పటికప్పుడు రాస్తే బాగుండేది గాని రాయలేకపోయినందుకు క్షమించగలరు.

నాకు గుర్తున్నంతవరకు లోకసంచారి గారి మొదటి వ్యాసం 'జీవవైవిధ్యపు కాణాచి మధ్యభారతం' జూన్ 2012 సంచికలో వచ్చింది. ఇది దండకారణ్యంలో ఖనిజాల తవ్వకాలతో జరగనున్న విధ్వంసం గురించి వివరించింది. కాకపోతే ఆ వ్యాసం చదివితే ఎన్‌జిఒలు, పర్యావరణ వాదులు చేసే ప్రచారం విన్నప్పటిలాగ భయం కలుగుతుంది. ఆ ప్రచారంలో నిజాలు ఉంటాయి గాని, ఆ నిజాలను దాటి ఆ పరిణామాలను అడ్డుకోగల శక్తి ప్రజలకు ఉందని, అడ్డుకోవడం సాధ్యమే అనే విశ్వాసం కలగదు. రెండో వ్యాసం '2020 తరువాత ఏం జరగబోతోంది?' (జూలై 2012)లో కూడ అంతర్జాతీయ ద్రవ్య సంస్థల వ్యూహాలను ఇలాగే భయం కలిగించే పద్ధతిలో చెప్పారు. 'మనుషులపై సామ్రాజ్యవాద మాయ' (ఆగస్ట్ 2012) వ్యాసంలో సామ్రాజ్యవాద సంస్కృతి మన మెదళ్లను ఎలా లోబరచుకుంటున్నదో వివరించారు. 'సిరియా పరిణామాలు' (సెప్టెంబర్ 2012) వ్యాసంలో సిరియా గురించి తక్కువ, సామ్రాజ్యవాద వ్యూహాల గురించి ఎక్కువ రాశారు. అందులో బిల్డెర్ బెర్గ్ గ్రూప్ అనే దాని ద్వారా సామ్రాజ్యవాద కుట్ర జరిగిందని అది ఐదువందల సంవత్సరాల వ్యూహం అని రాశారు. ఒసామా బిన్ లాడెన్ ను అమెరికా చంపివేయలేదని, అదంతా నాటకమని రాశారు. చంద్రమండలం మీదికి వ్యోమగాములు వెళ్లడం కూడ కట్టుకథ అని రాశారు. 'ఆరోగ్యరంగంలో ఏం జరుగుతోంది?' (నవంబర్ 2012) వ్యాసంలో అన్ని రోగాలూ కుట్ర పూరితంగా మందుల అమ్మకాల కోసం కల్పించబడుతున్నవేనని రాశారు. ఇక ప్రత్యేక సంచిక వ్యాసం (సామ్రాజ్యవాద విషఫలితాలు)లో పై వ్యాసాలలోని విషయాలతో పాటు అదనంగా అటువంటివే మరికొన్ని విషయాలు చేర్చారు. ఈ వ్యాసాలలో ఉన్న పొరపాటు అభిప్రాయాల గురించి, సమగ్ర అవగాహన లేకపోవడం గురించి స్థూలంగా చెప్పాలంటే:

- ఈ వ్యాసాలన్నిటిలో సామ్రాజ్యవాదం అనే మాట చాలాసార్లు వచ్చింది గాని, అసలు మౌలికంగా సామ్రాజ్యవాదం అంటే ఏమిటో రాలేదు. సామ్రాజ్యవాదపు మౌలిక లక్ష్యమైన ముడిసరుకుల దోపిడీ, మార్కెట్ల ఆక్రమణల గురించి పైపైన మాత్రమే ఉంది. సామ్రాజ్యవాదం సాగించే రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఆధిపత్యం గురించి కొన్ని వివరాలు మాత్రమే ఉన్నాయి. ఆ వివరాలు కూడ ఇంటర్నెట్ మీద, పర్యావరణ, సాంస్కృతిక ఎన్‌జిఒలు విపరీతంగా ప్రచారం చేస్తున్నవే. అవి పైపై విమర్శలు, సంచలనాత్మక విషయాలు మాత్రమే. సామ్రాజ్యవాదపు ఉత్పత్తి విధానం గురించి గాని, సామ్రాజ్యవాదాన్ని ఓడించగల వర్గపోరాటం గురించి గాని ఈ వ్యాసాలలో దాదాపుగా లేదనే చెప్పాలి.
- సామ్రాజ్యవాదం ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల అభివృద్ధి క్రమంలో భాగంగా ఒక నిర్దిష్ట చారిత్రక దశలో పుట్టి పెరిగిందని, అది పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అని ఈ రచనల్లో ఎక్కడా కనబడదు. అది కాగితపు పులి మాత్రమేనని, దాన్ని ప్రజలు ఓడించగలరనే విశ్వాసం కూడ చాల తక్కువగా ఉంటుంది. సామ్రాజ్యవాదం కొంతమంది పెట్టుబడిదారులు కలిసి కూచుని కుట్రపూరితంగా తయారుచేసుకున్న వ్యూహం ప్రకారం తయారయిందని రచయిత అభిప్రాయం అనిపిస్తుంది. సామాజిక, ఆర్థిక, చారిత్రక పరిణామాలను ఇలా కుట్ర సిద్ధాంతాలతో వివరించడం సాధ్యం కాదు, సమంజసం కూడ కాదు.
- ఈ వ్యాసాలలో వర్గపోరాటం గురించి లేదనడానికి ఉదాహరణ రచయిత చాలాసార్లు 99.5 శాతం ప్రజల ఐక్యత గురించి చెప్పారు. ఆక్యుపై వాల్‌స్ట్రీట్ వంటి ఉద్యమాలు ఈ ఆకర్షణీయమైన భావనను తీసుకొచ్చాయి గాని అది పూర్తిగా నిజం కాదు. దోపిడీ పాలకవర్గాలు, వారికి సహకరించేవారు కేవలం 0.5 శాతం మాత్రమే అయితే సమస్య తీవ్రత ఇంతగా ఉండేదే కాదు. ఈ 99.5 ఐక్యత లక్ష్యశుద్ధి లేని ఆకర్షణీయ నినాదంగా మాత్రమే పనికి వస్తుంది.
- ఇటువంటి సమస్యల వల్ల వ్యాసాలు ఎంత బాగున్నాయని అనిపించినా, పాఠకులకు విశేషంగా సమాచారం అందించినా, సమగ్ర దృక్పథాన్ని కలిగించడంలో విఫలమవుతాయి. మరీ ముఖ్యంగా ప్రజాశక్తి మీద విశ్వాసం కలిగించి, ప్రజలను పోరాటానికి ఉద్యుక్తుల్ని చేయడంలో ఉపయోగపడవు.
- ఫిబ్రవరి సంచికలో ఢిల్లీ సామూహిక అత్యాచారం పై రాసిన వ్యాసంలో స్త్రీలపై అత్యాచారాల సంస్కృతి 1991 నూతన ఆర్థిక విధానాలతోనే మొదలైనట్టు, లేదా పెరిగినట్టు రచయిత రాసారు. ఇటీవలి కాలంలో ప్రపంచీకరణ మీద రాస్తున్న చాలామంది అన్ని తప్పులను ప్రపంచీకరణకు అంటగడుతున్నారు. ప్రపంచీకరణ కచ్చితంగా ఘోరమైనదే, ఖండించవలసినదే. కానీ, ప్రపంచీకరణ ముందు కూడా మన సమాజం ఎన్నో అవలక్షణాలతో ఉంది. భూస్వాముల దోపిడీ, కుల అణచివేత, స్త్రీల అణచివేత, మతోన్మాదం, స్త్రీలను భోగ వస్తువులుగా చూసే ధోరణి వంటి ఎన్నో దుర్మార్గాలు ప్రపంచీకరణకు ముందే ఉన్నాయి. వాటిని ప్రపంచీకరణ ఎట్లా మరింత తీవ్రం చేసిందో చెప్పాలి గానీ, అంతకు ముందు ఆదర్శ సమాజం ఉన్నట్టు, ప్రపంచీకరణ తరువాత అది చెడిపోయినట్టు చెప్పడం సరికాదు.

సులభంగా అర్థమయ్యేలా రాసే మంచి శైలి ఉన్న రచయిత ఈ విమర్శలను సరైన పద్ధతిలో తీసుకుంటారని, మరింత ఉపయోగకరమైన వ్యాసాలు రాస్తారని ఆశిస్తున్నాను. వీ

కుండెడు అమృతంలో.. రెండు విషపు చుక్కలు పడవచ్చునా?

- రంగనాయకమ్మ

ఫిబ్రవరి వీక్షణంలో, లోకసంచారి వ్యాసమే ('అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయి?') మొదట చదివాను. అద్భుతంగా ఉంది. అక్కడక్కడా కొన్ని పొరపాట్లు లేకపోతే, అద్భుతాన్ని మించి ఉండేది. మేము, పత్రికలు చదివేటప్పుడు, మంచి వ్యాసాలు దొరికితే, వెంటనే వాటిని స్కాన్ చేసి, నెట్ ద్వారా, వేరే ఊళ్లల్లో - దేశాల్లో ఉన్న కొందరు స్నేహితులకు పంపిస్తాం. అలాగే ఈ వ్యాసాన్ని కూడా, మేం చదవగానే వెంటనే పంపించాం.

ఈ వ్యాసకర్త పరిశీలన ఉత్తమమైనదే. కానీ, అక్కడక్కడా అపశృతులు ఉన్నాయి. పాశ్చాత్య దేశాల్లో వ్యభిచారానికి చట్టబద్ధత ఉండడం, ఒక రకంగా అక్కడ ఒక అవుట్‌లెట్‌గా ఉందన్నట్టు చెప్పారు. ఆ అవుట్‌లెట్‌ని ఉపయోగించాలంటే, అది ఉచితంగా దొరుకుతుందా? దానికి డబ్బు పెట్టాలి. ఏ ఖర్చూ లేకుండా దొరికే మార్గాల్ని తొక్కడం కన్నా, ఖర్చు పెట్టే మార్గాలనే బుద్ధిగా ఎంచుకోరు. 'ఖర్చు పెట్టవలసి వచ్చినా, ఆ మార్గం కొంతైనా మంచిదే కదా?' అని వాదిస్తే, అది ఎలాంటి అర్థానికి దారి తీస్తుందంటే, 'వ్యభిచారాన్ని లీగలైజ్ చేయడం వల్ల కొంత ఉపయోగం ఉంది. ప్రతీ దేశంలోనూ అలా చేయడమే మంచిది' అని చెప్పినట్టే అర్థం వస్తుంది. మొగాళ్లు ఆ వ్యభిచారిణుల వైపు పోతారు కాబట్టి, బైట తిరిగే ఆడ వాళ్ల మీద అత్యాచారాల ప్రమాదం తప్పుతుంది - అని చెపుతున్నట్టు! వ్యాస కర్త అలా చెప్పినా చెప్పకపోయినా, చివరికి అదే అర్థం తేలుతుంది. అలాంటి అర్థం రాకూడదంటే, 'వ్యభిచారానికి చట్టబద్ధత వల్ల, ఒక ఉపయోగం' ఉన్నట్టు చెప్పే మాట ఇక్కడైనా, ఎక్కడైనా, ఎందుకు? దాన్ని ఒక మార్గంగా చూపడం ఎందుకు? 'ఏ లీగలైజేషన్లయినా, ఉచితంగా దొరికే అత్యాచారాల్ని ఆపవు' అని చెప్పాలే గానీ, 'వ్యభిచారాన్ని లీగలైజ్ చేసిన చోట్ల అత్యాచారాలు తగ్గుతాయి' అనే అర్థం వచ్చేలాగ, చెప్తే ఎలాగ? అది చాలా తప్పు అవగాహనలకు దారి తీయదూ? అసలు, అత్యాచారాల సమస్య విషయంలో వ్యభిచారాల లీగలైజేషన్ల మాటలు ఎత్తవలసిన అవసరమేమిటి?

అత్యాచారాల మూల కారణంగా సామ్రాజ్యవాద సంస్కృతిని చెప్పారు. ఆ సామ్రాజ్యవాదానికి మూల కారణం, పెట్టుబడిదారీ సంస్కృతి. దానికి మూల కారణం చూసుకుంటూ పోతే, స్త్రీల శరీరాలు పురుషుల విచ్చలవిడి దౌర్జన్యాల సంస్కృతి కోసమే అని గ్రహించవలసి వస్తుంది. ప్రతిసారీ అంత వెనక్కి వెళ్ళలేం. మనం బతుకుతూ ఉన్నది పెట్టుబడిదారీ సమాజమే కాబట్టి, ప్రజలకు ఆ మాటే వినపడాలి. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు పెట్టుబడిదారీ విధానం ముదిరి సామ్రాజ్యవాదం అవుతుంది. 'సామ్రాజ్యవాద సంస్కృతి వల్ల ఇలా నేరాలు జరుగుతాయి' అని అదే పదే పదే చెప్తూ ఉంటే, 'తప్పు' అంతా దాని మీదకే పోయి, అసలు నేరం చేసిన వాళ్ల తప్పేమీ లేనట్టు తయారవుతుంది వాదం. 'నేరం నాది కాదు, ఆకలిది' అని సినిమా వాళ్లు అన్నది ఆకలి విషయంలో సరైనదే. కానీ, 'నేరం, సామ్రాజ్య వాద సంస్కృతిదే' అంటే, 'నేరం, నేరం చేసిన వాళ్లది కాదు' అనే నినాదం బైల్దేరుతుంది. గతం నుంచీ ఇలాంటి తప్పుడు నినాదాలు చాలా ఉన్నాయి. చేసిన నేరాల్ని చూడకుండా, 'దళితులు కాబట్టే' అనీ, 'స్త్రీలు కాబట్టే' అనీ, నేరాల నుంచీ దాటవేతలు చాలా జరుగుతున్నాయి.

'సామ్రాజ్యవాదం'తో పాటే, 'వినిమయ సంస్కృతి' అని ఇంకో పాట. వస్తువుల్ని అమ్మే - కొనే సంస్కృతి, పెట్టుబడిదారీ విధానంతో సంబంధం లేని వేరే విషయం అయినట్టు! పెట్టుబడిదారీ విధానంలో ప్రధాన లక్షణం, ఎక్కువ లాభాల కోసం పోటీలు పడుతూ, సరుకుల్ని తక్కువ ఖర్చుతో తయారు చేయించడానికి వాటిని ఎక్కువ స్థాయిలో తయారుచేయిస్తూ, సరుకుల గుట్టల్ని పెంచడం. ఇక వాటిని అమ్మడానికి రక రకాల ఎత్తుగడలు! కొంపల్ని వస్తువులతో నింపుకోవాలనే పిచ్చి, పెట్టుబడిదారీ విధానం వల్ల కలిగేది కాక ఇంకెక్కడి నుంచి వచ్చింది? పెట్టుబడిదారీ సంస్కృతి వేరూ, వినిమయ సంస్కృతి వేరూనా? ఒక ప్రయాణీకురాలు, ఒక బస్సుని నమ్మి ఎక్కితే, అక్కడి మగ వాళ్లు ఆమె మీదకి ఉరికి బీభత్సం చేశారంటే, అక్కడ వినిమయ సంస్కృతి లక్షణం ఏమిటి? అక్కడ వస్తువుల కోసం ఆరాటం ఏముంది? అత్యాచారాల కారణాల్ని వెతికేటప్పుడు, 'వినిమయ సంస్కృతి' మాట ఎందుకు?

జరిగిన నేరం ఎంత నీచమైన, ఎంత ఘోరమైన, ఎంత క్రూరమైన నేరం అయినా, 'పేద ప్రజలు, పేద ప్రజలు' అంటారేమిటి? పోలీసులూ, మిలటరీ వాళ్లూ, డబ్బున్న వాళ్లూ చేసే నేరాల్ని అయితే మీడియా వాళ్లు ఎక్కువగా చెప్పరు గానీ, పేద ప్రజల నేరాల్నే పదే పదే చెప్తారెందుకు? - అన్నది వ్యాస కర్త ప్రశ్న. అదా అడగవలసింది? చెప్పని వాళ్ల నేరాలన్నిటినీ కూడా చెప్పమనండి! చెప్పే నేరాల్ని ఆపమనడం ఎందుకు? నేరాలు పేద వాళ్లవి అయితే వాటిని చెప్పొద్దంటారా?

అసలు, అత్యాచారాల సమస్యలో, 'పేద జనం' మాట ఎత్తడం, తప్పు మాట. పేద ప్రజలు చేసే నేరాల్లో, న్యాయమైన నేరాలు, దొంగతనాల వంటివే. వాళ్ళు బతకడానికి అవి చాలా అవసరం. అలాంటి నేరాల కేసుల్లో పేద నేరస్తులకు క్రూరమైన శిక్షలు వేస్తే, 'అయ్యో, పేద వాళ్ళు బతకడానికి చేసేది అంత నేరమా?' అనండి. అంతే గానీ, ఆ పేద మగ వాళ్లే ఆడ వాళ్ల మీదకి ఎగబడితే, 'పేద వాళ్ల నేరాల్ని మీడియా వాళ్లు అన్ని సార్లు చెప్పాలా?' అని వాదనా? పేద మగ వాళ్లకి, ఆడ వాళ్ల దేహాల మీదకి ఎగబడి క్రూరత్వాలు చేసే ప్రత్యేక హక్కులేమైనా ఉంటాయా? అలాంటి హక్కులు ఇవ్వాలా పేద మగవాళ్లకి?

అసలు పేద వాళ్లు అనే వాళ్లు, డబ్బు మదంతో ఉండరు కాబట్టి, వాళ్లు ఆడ వాళ్ల పట్ల ధనికుల కన్నా వివేకంతో ఉండాలి. మరింత సహకారంతో ఉండాలి. అలా ఉండని వాళ్లు, పేద వాళ్ల కోవలోకి వస్తారా?

ఒక మగవాడి వల్ల, లేదా కొందరు మగవాళ్ల వల్ల, ఒక క్రూరమైన నేరం జరిగినప్పుడు, ఆ మగవాళ్లు పేద వాళ్లే అయితే, ఇక 'పేద జనం, పేద జనం' అనే పాట మొదలుపెడతారు. ఒక పేదవాడు చేసిన నేరం విషయంలో, 'పేద జనం' అని, మొత్తం ఆ జనాన్ని ప్రస్తావించే మాట ఎలా పనికొస్తుంది? పేద జనం అంతా అవే నేరాలు చేస్తున్నారా? ఆ జనం, ఏ నేరాలూ లేకుండా, శ్రమలు చేసుకుంటూ, తినీ తినకా బతుకుతోంటే, ఎవడో ఒకడో ఇద్దరో రౌడీలు చేసిన నేరాల గురించి, 'పేద జనం చేసే నేరాలు' అంటూ, నేరాలు చేయని వాళ్లని కూడా, చేసిన వాళ్లతో కలెయ్యడం. ఎందుకు?

సామ్రాజ్యవాద సంస్కృతి అయినా, ఇంకే సంస్కృతి అయినా, అది, అన్ని దేశాల్లోనూ, జనం అందరి మీదా ఉంటుంది. అందరూ తప్పుడు సమాజాల్లోనే ఉన్నారు. కానీ, నేరాలు అందరూ చేయడం లేదు. ఒకే తుక్కు సంస్కృతిలో ఉన్న జనంలో, నేరాలు చేస్తున్న వాళ్లు 10 శాతం అయితే,

నేరాలు చేయని వాళ్లు 90 శాతం అని అర్థం కాదా? నేరం చేసినవాడు ఎందుకు చేశాడో కారణం వెతకడానికి, నేరం చేయని వాళ్లందర్నీ కూడా కలేస్తారా? నేరాలు జరగడానికి వ్యవస్థ ఇచ్చే ఆధారాలెన్నో ఉంటాయనేది సత్యమే. కానీ, అదే వ్యవస్థలో అందరూ నేరస్తులు అవరు. అందరూ నేరాలు చేయరు. పేద మగవాడు చేసే దొంగతనమూ, అదే పేద మగవాడు చేసే అత్యాచారమూ, రెండూ ఒకటి కాదు. దొంగతనం చేసిన పేద వాడిని నాలుగు రోజులు జైల్లో పెట్టి వదిలేస్తే, అత్యాచారం చేసిన పేద వాణ్ణి వెంటనే ఉరి తీసేయాలి. అంత తేడా ఉంది ఆ నేరాలకి. రెంటికీ 'పేద తనం' వాదం పనికి రాదు. రెంటికీ పేద తనం కారణం కాదు. 'దళితులు' అనే కొందరు మనుషులకు, బస్సు నిండా పెట్రోలు గుమ్మరించి ప్రయాణీకులందర్నీ తగలబెట్టే ప్రత్యేక హక్కులేవీ ఉండవు. 'వాళ్లు దళితులు, దళితులు' అని వాదిస్తే, ఆ వాదనలో న్యాయం ఉండదు.

నమ్మి బస్సు ఎక్కిన ఆడపిల్లని క్రూరంగా అవమానాలు చేసిన నీచుల గురించి, 'పేద జనం' అని మాట్లాడితే, అది, మొత్తం పేద జనాన్నంతా అవమానం చేయడమే. ఆ పేద జనంలో, ఆ నేరంతో సంబంధం లేని పేద జనం, ఆ నేరం చేసిన పేద వాళ్లని సమర్థిస్తారా? - అలా చేయరు. ఆ నేరస్తుల్ని తమతో కలుపుకుని, 'వాళ్లు మా వాళ్లే. చేస్తే చేశార్లే' అనరు. 'ఛీ! ఎంత ఘోరం చేశారు! వాళ్లని ఉరి తీయండి!' అంటారు. నేరస్తుల్ని నేరస్తుల్లాగే చూడాలి. ఆ నేరం, చిన్నదా పెద్దదా - ఆ లక్షణాలతోనే దాన్ని చూడాలి. బూర్జువా పార్టీల వాళ్లు, నేరస్తుల్ని అతి పట్టనితనంతో చూస్తారు. ఎందుకంటే, వాళ్లకి ఓట్ల భయం. విప్లవకారులు కూడా, నీచమైన నేరాల వాళ్ల పట్ల, 'దళితుల'నీ, 'పేద జనం' అనీ, సానుభూతులు కురిపిస్తారు. ఎందుకంటే, ఆ జనం తమ సంఘాలకు మద్దతుగా ఉండరేమో అని. ఈ రక రకాల ఎత్తుగడల్లో, న్యాయం చచ్చి, నేరాలే విహరిస్తాయి.

సరే, ఎన్ని పొరపాటు అంశాలు ఉన్నా లోకసంచారిగారి వ్యాసం మంచి వ్యాసం. కానీ కుండెడు అమృతంలో రెండు విషపు చుక్కలు పడవచ్చునా? ✦

చరిత్ర తప్పితే జవాబు కోరే ప్రశ్నలెన్నో...

- ఎన్. నర్సింహులు

వీక్షణం జనవరి 2013 ప్రత్యేక సంచికలో వరవరరావుగారు రాసిన 'ప్రత్యామ్నాయ చరిత్ర నిర్మాణంలో విప్లవోద్యమం' వ్యాసం మీద ఫిబ్రవరి సంచికలో జి. సత్యనారాయణ రెడ్డి, ఎం. ఉదయభాను గార్లు రాసిన చర్చా లేఖలు వివాదాస్పదంగా ఉన్నాయి. దాదాపు పదిన్నర పేజీల వ్యాసంలోని ఒక్క పేరా మీద, అందులోనూ ఒకటి రెండు వాక్యాలమీద ఈ ఇద్దరూ తీవ్రమైన విమర్శలు చేశారు.

ఈ రెంటిలో ఉదయభాను గారి రచన అభ్యంతరకరంగా ఉంది. వీక్షణం ప్రమాణాలకు తగినట్టుగా లేదు. వీక్షణం సంపాదకులు ఇటువంటి వ్యక్తిగత నిందలను, విషయంతో సంబంధం లేని వ్యంగ్యాన్ని, ఎత్తిపొడుపులను ఎందుకు ఎడిట్ చేయలేదో తెలియదు. ఎంతగా వ్యతిరేకించే అభిప్రాయంతోనైనా హుందాగా చర్చ చేయవచ్చు. అది సంస్కారయుతమైన పద్ధతి. కాని ఉదయభాను గారు వాడిన వ్యంగ్యం, దూషణ, ఎత్తిపొడుపు, తిరస్కార ధోరణి చర్చకు మేలు చేయదు.

సరే, ఆ తప్పుడు ధోరణులు అలా ఉంచి, రెండు లేఖల ఉమ్మడి అంశం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పట్ల అంచనా. వరవరరావుగారి వ్యాసంలో ఆ అంచనా సరిగా లేదని ఆ ఇద్దరూ భావిస్తున్నారు. అలా భావించడానికి, ఆధారాలు చూపి చర్చించడానికి వారికి పూర్తి హక్కు ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై దేవులపల్లి వెంకటేశ్వరరావు (డివి) గారి అంచనా కన్న వరవరరావు గారి అంచనా భిన్నమైనదని ఈ ఇద్దరూ భావించారు. అది వారి ఇష్టం. అసలు 'దేవులపల్లి రాసినవన్నీ అబద్ధాలు,...శుద్ధ అబద్ధాలు' అని సుందరయ్యగారు 'విప్లవపథంలో నా పయనం'లో రాశారు. ఆ మాట నమ్మేవాళ్లు కూడ ఉంటే ఉండవచ్చు.

నిజానికి వరవరరావుగారు తన వ్యాసంలో డివిగారి అంచనాను ప్రస్తావించనేలేదు. డివిగారి మీద ఈగ వాలినా ఖండఖండాలుగా నరికేసే ఉత్సాహంతో లేఖలు రాసిన ఇద్దరూ వరవరరావుగారి మీద విమర్శలు గుప్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటపు గుణాత్మక అంశాలను, ప్రత్యేకతలను వివరంగా పేర్కొంటూనే, దానికి రాజ్యాధికార లక్ష్యం స్పష్టంగా లేదని, నక్సల్బరీ తర్వాతనే ఆ స్పష్టత వచ్చిందని వరవరరావు గారు రాశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి, ప్రత్యేకించి ఆంధ్రరాష్ట్ర కమిటీ సెక్రటేరియట్ కు ఆ స్పష్టత ఉండిందని, అది ఆంధ్రా థీసిస్ లోను, 1949లోనే రాసిన, 1982లో అచ్చయిన 'తెలంగాణ సాయుధపోరాటాన్ని విరమించాలనే తప్పుడు ధోరణులపై విమర్శ' అనే పుస్తకం లోను ఉన్నాయని సత్యనారాయణరెడ్డి గారి వాదన. ఆ స్పష్టత డివి గారికి ఉండిందని, అది '1948-49 కాలంలోనే గాక, 1969-70ల తర్వాత రచించిన అనేకానేక రచనల్లో' ఉందని ఉదయభానుగారి వాదన. ఇందుకు రుజువుగా డివి రాసిన 'తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర' పుస్తకంలో ఆంధ్ర థీసిస్ గురించి ఉటంకింపులు ఇచ్చారు. ఇంతకూ చరిత్రను చరిత్రగా చూస్తే వాస్తవాలు ఏమిటి? ఎన్నెన్నో చిన్న చిన్న వివరాలు చెప్పవలసి ఉంటుంది. అందువల్ల ప్రధాన విషయాలు మాత్రమే రాస్తున్నాను.

'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటించక పోవచ్చు. కాని విముక్తి గురించి మాట్లాడింది. భూస్వాధీన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టింది. ఎర్రరాజ్యాన్ని బీజప్రాయంలో చవిచూసింది కూడ. కనుక సమస్య రాజ్యాధికారంపై దృష్టి లేకపోవడం. కార్మిక వర్గ అగ్రగామి పార్టీ లక్ష్యం రాజ్యాధికారం (సీజింగ్ ది పవర్) చేపట్టడం కావాలి. ఆ స్పష్టత నక్సల్బరీ 1967లో ఇచ్చింది' అని వరవరరావు గారు రాశారు. ఆ కాలంలో 'గెరిల్లాలు అనే మాట కూడా అంత ప్రచారంలో ఉన్నట్లు లేదు' అని వరవరరావు గారు రాసినది వాస్తవం కాదు. ఆ మాట తెలంగాణ సాయుధ పోరాట కాలం నాటి రచనలలో ఉంది. కాని ఇక్కడ సమస్య ఆ మాటలు వాడారా లేదా, ఒకరిద్దరికి స్పష్టత ఉందా లేదా అన్నది కాదు, మొత్తంగా పోరాట స్వభావం ఏమిటి, నాయకత్వానికీ శ్రేణులకూ ఉండిన అవగాహన ఏమిటనేది. ఆ విషయంలో వరవరరావు గారి అంచనా సరైనదే.

సత్యనారాయణ రెడ్డి, ఉదయభాను గార్లు అన్నట్టుగా ఆంధ్రా థీసిస్ లో నూతన ప్రజాస్వామిక విప్లవ దశ, చైనా మార్గం, అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ అనే మాటలు, మావో రచనల నుంచి ఉటంకింపులు ఉన్నమాట నిజమే. కాని ఆంధ్ర థీసిస్ చరిత్ర చూస్తే ఆ స్పష్టత మాటల్లో ఉండినా చేతల్లో లేదని, నాయకుల్లో ఒకరిద్దరికి ఉన్నా నాయకత్వానికంతా లేదని, శ్రేణులకు అది అందనే లేదని స్పష్టమవుతుంది.

భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ కాంగ్రెస్ 1948 ఫిబ్రవరిలో కలకత్తాలో జరిగింది. అక్కడ ఆమోదించిన రాజకీయ కార్యక్రమంతో అసంతృప్తి చెందిన

ఆంధ్రరాష్ట్ర కమిటీ కార్యదర్శివర్గం 1948 జూలై 9న 'భారత విప్లవపు ప్రస్తుత దశ- వ్యూహం: సోషలిస్టు దశనా, నూతన ప్రజాస్వామిక దశనా?' అనే లేఖ పంపింది. (దీన్ని 1948 ఏప్రిల్ - మే నెలల్లో రాశామని డివి రాశారు). దీన్నే ఆంధ్రా థీసిస్ అంటారు.

ఇది కార్యదర్శివర్గంలో మెజారిటీ (చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి) రాసినది కాగా, మైనారిటీగా ఒక సభ్యుడు (పుచ్చలపల్లి సుందరయ్య) 'భారత విప్లవపు ప్రస్తుత దశ ఏమిటి, మన వ్యూహాత్మక నినాదాలు ఏవై ఉండాలి?' అనే అసమ్మతి లేఖను కూడ రాశారు. ఈ రెండు లేఖలనూ (మొదటి లేఖను పూర్తిగానూ, రెండవ లేఖను కొంతవరకూ) తీవ్రంగా విమర్శిస్తూ, తిరస్కరిస్తూ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో డిసెంబర్ 1948లో 'భారత జనతా ప్రజాతంత్ర విప్లవ వ్యూహం - ఎత్తుగడలు' అనే డాక్యుమెంటును ప్రకటించింది. (ఈ వివరాల కోసం పీపుల్స్ పబ్లిషింగ్ హౌజ్ ప్రచురించిన డాక్యుమెంట్స్ ఆఫ్ ది హిస్టరీ ఆఫ్ ది కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా - ఏడో సంపుటం; తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురించిన హిస్టారికల్ అండ్ పొలిమికల్ డాక్యుమెంట్స్ ఆఫ్ ది కమ్యూనిస్ట్ మూవ్ మెంట్ ఆఫ్ ఇండియా; జీన్ డి ఓవర్ స్ట్రీట్, మార్షల్ విండ్ మిల్లర్ రాసిన కమ్యూనిజం ఇన్ ఇండియా వంటి పుస్తకాలు చూడవచ్చు).

భారత విప్లవోద్యమ చరిత్రలో ఆంధ్రా థీసిస్ ఎంతో విలువైనదయినప్పటికీ దాని జీవితం ఆరు నెలల కన్న ఎక్కువ లేదు. పోనీ, అది రాసినవాళ్లయినా దాన్ని గుర్తు పెట్టుకోవడానికి, కొనసాగించడానికి, పార్టీ లోపల రెండు పంథాల మధ్య పోరాటంలో దాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నించారా అంటే అదీ లేదు. 'ఈ సిద్ధాంత చర్చలు రాష్ట్ర సెక్రటేరియట్ వరకే పరిమితమై ఉండినవి. అంతకు దాటి వెళ్లలేదు. సెక్రటేరియటులో అభిప్రాయ భేదాలున్నాయనిగాని, సెక్రటేరియటు ఇటువంటి లైను తీసుకొని ఒక థీసిసును తయారు చేసి చర్చ కోసం, నిర్ణయం కోసం పొలిట్ బ్యూరోకు పంపించిందని కాని రాష్ట్రకమిటీ సభ్యులెవరికీ తెలియదు. పోరాట ప్రాంతాలలో ఉండే ఏరియా కమిటీ నాయకత్వాలకు కూడ ఈ విషయం బొత్తిగా తెలియదు...' అని ఉదయభాను ఉటంకించిన భాగంలోనే డివి గారు రాశారు. ఇలా తెలియక పోవడానికి ఆయన సాంకేతిక కారణాలు చెప్పారు గాని, వ్యూహానికి, అవగాహనకు సంబంధించి ఆ కారణాలు చెప్పడం కుదరదు.

ఆంధ్రా థీసిస్‌ను కేంద్ర కమిటీ తిరస్కరించిన తర్వాత దీని వివరాలే ఎక్కడా దొరకకుండా పోయాయి. తిరస్కరిస్తూ రాసిన డాక్యుమెంటులో ఉటంకించిన భాగాలే తప్ప, పూర్తి పాఠం అసలు ప్రతి దొరకలేదని 1960లో ఓవర్ స్ట్రీట్, విండ్ మిల్లర్‌లు రాశారు. 1970ల దాకా తెలంగాణ పోరాటం మీదనే రచనలు రాలేదు గనుక అది మరుగుననే ఉండిపోయింది. మాకినేని బసవపున్నయ్య 1972లో 'సాయుధ తెలంగాణా పోరాటం - వాస్తవాలు' పేరుతో కొన్ని డాక్యుమెంట్లు ప్రచురించినప్పుడు కూడ వాటిలో ఇది లేదు. పీపుల్స్ పబ్లిషింగ్ హౌజ్ 1976 ప్రచురణలో కూడ పాదసూచికలో దీనిపేరు ఉంది గాని, డాక్యుమెంటు లేదు. తెలంగాణ సాయుధ పోరాటానికి సంబంధించి గత నాలుగు దశాబ్దాలలో వెలువడిన పుస్తకాలలో దేనిలోనూ ఇది రాలేదు, ఒకరిద్దరు తప్ప మిగిలిన వారెవరూ దాని గురించి తలచుకోలేదు. బహుశా 2007లో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణలోనే ఇది తొలిసారి వెలుగు చూసింది.

ఈ చరిత్రంతా చెప్పేదేమంటే, ఆ డాక్యుమెంటు ఎంతో స్పష్టతతో ఉన్నదని అనుకున్నప్పటికీ అది రాసిన రోజు అందరికీ చేరలేదు, రాసినవాళ్లే దాన్ని చాల త్వరగా మరచిపోయారు. పోరాట విరమణ పట్ల అసంతృప్తి ఉండిందని చెపుతున్నవాళ్లు కూడ విరమణ తర్వాత రెండు దశాబ్దాలపాటు ఆ డాక్యుమెంటు లోని స్పష్టతను అమలుచేసే ప్రయత్నం చేయలేదు, నిజానికి అప్పుడే స్పష్టత ఉండిందని చెప్పడం కూడ నక్సల్బరీ ప్రజ్వలనం తర్వాతనే మొదలయింది.

Statement about ownership and other particulars of periodical **Veekshanam as required** to be published in the first issue of every year after the last day of February

Form IV (See Rule 8)

1. Place of publication	:	Hyderabad
2. Periodicity of its publication	:	Monthly
3. Printer's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
4. Publisher's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
5. Editor's name	:	N. Venugopal Rao
Whether citizen of India	:	Indian
Address	:	Mythri Residency 3-6-394, Street No. 3 Himayatnagar, Hyderabad - 500 029.
6. Name and addresses of individuals who own the newspaper	:	N. Venugopal Rao

I, N. Venugopal Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

(N. Venugopal Rao)

Date : 1st March, 2013 Signature of the Publisher

ఆ అవకాశం కూడ నక్సల్బరీనే ఇచ్చిందన్నమాట. కొందరయితే నక్సల్బరీని ఖండించడానికి తెలంగాణను తవ్వితీసే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ఇక సత్యనారాయణ రెడ్డి, ఉదయభానుగార్లు ప్రస్తావించిన మరొక పుస్తకం 'తెలంగాణా సాయుధ పోరాటం విరమించాలనే తప్పుడు ధోరణులపై విమర్శ' దేవులపల్లి వెంకటేశ్వర రావు గారి పేరు మీద 1982లో ప్రొలిటేరియన్ లైన్ ప్రచురణలుగా అచ్చయింది. దీన్ని తాను రాశానని, ఆంధ్ర రాష్ట్ర కమిటీ సెక్రటేరియట్ (చంద్ర రాజేశ్వరరావు, పి సుందరయ్య, ఎం బసవపున్నయ్య, భీమిరెడ్డి నరసింహారెడ్డి) ఆమోదించిందనీ డివి 1982లో రాశారు. రచనకూ అచ్చుకూ మధ్య 30 సంవత్సరాల వ్యవధికీ, కనీసం సిపిఐ (ఎం)తో తెగదెంపుల తర్వాతనైనా 15 సంవత్సరాల ఆలస్యానికీ కారణాలు తెలియవు. ఈ డాక్యుమెంటు అప్పుడే చూసిన వారందరూ ఈ రాజకీయాలను వదులుకున్నందువల్ల ఇటువంటి డాక్యుమెంటు ఉండిందని ఎక్కడా ప్రస్తావించలేదు. ఇది సెక్రటేరియట్ దాటి కిందికి వెళ్లిందో లేదో తెలియదు గాని, తమ స్మృతులు, జ్ఞాపకాలు, అనుభవాలు రాసిన తెలంగాణ పోరాట నాయకులలో ఏ ఒక్కరూ ఈ డాక్యుమెంటు ఉనికిని ప్రస్తావించనే లేదు. ఈ డాక్యుమెంటు 1949లో రాసిందే అని నమ్మినా మిగిలిపోయే ప్రశ్నలు ఉన్నాయి. 1949 నాటికే విరమణ తప్పు అంటూ ఎన్నో సరైన వాదనలు పెట్టిన వారు 1951 విరమణను ఎలా ఆమోదించారు? దాన్ని కార్యకర్తలకు వివరించడానికి ఒక ప్రాంతానికి వెళ్లే బాధ్యత కూడ ఎలా తీసుకున్నారు? 1952 తర్వాత ఎన్నికల రాజకీయాలలో కూడ ఎలా ప్రవేశించారు? 1967 దాకా ఈ స్పష్టమైన పోరాట ఆలోచనలను ఎక్కడా రాయకుండా ఎలా ఉన్నారు? అంత స్పష్టత ఉండి కూడ నక్సల్బరీ-శ్రీకాకుళ ప్రజ్వలనాలను ఎందుకు వ్యతిరేకించారు? ఈ డాక్యుమెంటును 1982 దాకా బైటికి తీసుకురాకుండా ఎలా ఉన్నారు? వీ

(... 4వ పేజీ తరువాయి)

మార్క్సి అయ్యాడు. బాలగోపాల్ మార్క్సును మరోమారు తలకిందులుగా నిల్చోబెట్టి హెగెల్‌ను చేసేస్తున్నాడు. సారాంశంలో బాలగోపాల్ భావవాదాన్ని పునరావిష్కరించాడు. చంద్ర బాలగోపాల్ భావవాద పునరావిష్కరణతో మొదలెట్టి తన కుల, వర్గ మూలాలను వైదిక మతంలో కనుగొన్నాడు. "ఇన్నాళ్లు మధురవాణి (మార్క్సిజం?) వలలోపడి ఎలా యాస్ అయిపోయాడు" చంద్ర పాపం! ప్రాయశ్చిత్తంతో సరి అనుకున్నాడేమో, పూజలూ, పునస్కారాలు, మతాచారాలు క్రమం తప్పకుండా పాటించాడని అభిజ్ఞులు చెప్పగా వింటున్నాం. ప్రవృత్తి ప్రకోపించడమంటే మాటలామరి? బాలగోపాల్ మార్క్సిజాన్ని "అభావం" చేశాడు. మార్క్సిజం మీదనున్న అచంచల విశ్వాసాన్ని "పటాపంచలు" చేశాడు. ఇక ఎవరి మూలాలను వాళ్లు వెతుక్కోవడమే తరువాయి. "భ్రాంతి వీడింది" "నిజ ప్రపంచంలోకి" చంద్ర వచ్చి చేరాడు. చంద్ర ఈ రేసులో ముందున్నాడందామా? లేక ప్రవృత్తికి పడిపోయిన ఒకే ఒక్క వికెట్ అందామా? వేణుగోపాల్ 'వెళ్లిపోయిన ఆరుగురు' (ఫిబ్రవరి సంచిక)లో చంద్ర మతాచారాలు, పూజలను యథాలాపంగా ప్రస్తావించారు. యథాలాపంగా కాక మరింత లోతుగా ఉంటే బావుంటుందనే ఉద్దేశ్యంతోనే ఈ ఉత్తరం. ప్రవృత్తి విష ప్రభావం చంద్రపైనేగాదు, పదులు, వందల సంఖ్యలోనున్న విప్లవాభిమానుల మీదా ఉంటుందని అనుకోవచ్చు.

వియమ్
(ఇమెయిల్‌లో వచ్చింది, ఊరు తెలియదు)

ఫిబ్రవరి 2013 వీక్షణంలో ఎన్.వి.ఎస్. నాగభూషణ్ గారి 'తెలుగు భాషా వాదం - కొన్ని సమస్యలు' చాలా మంచి వ్యాసం. భాషా వివాదాల నేపథ్యంలో మంచి సూచనలతో కూడిన సరియైన సలహాలిచ్చినట్లుంది. ఈ వ్యాసంలోని అంశాలు స్వీకరించదగినవి. అందులో భాషోన్మాదులకు కనువిప్పు కలిగేది-ఏ భాషను కించపరచరాదు, ఒకే భాషను గొప్పదిగా భావించరాదు. అయితే మొట్టమొదటగా తల్లి భాషను గౌరవించాలి. ఆ భాషలోనే విద్యార్థికి విజ్ఞాన వికాసాలు కలిగించవచ్చు. అందుకు గాను మొట్టమొదటగా మాతృభాషలో విద్యార్థికి మంచి పట్టుండాలి. ఆ తరువాత ఆ విద్యార్థి ఆసక్తిని బట్టి ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. రచయిత అన్నట్లు నేటి ప్రపంచీకరణ యుగంలో అంతర్జాతీయంగా ఇంగ్లిష్ భాష ప్రథమ స్థానమాక్రమిస్తుంది గదా! ఆ తరువాతనే మిగతావన్నీ. అయితే ఏ భాషనీ నిర్బంధంగా విద్యార్థి తలకెక్కించరాదు. ఎన్ని భాషలు నేర్చుకోవడానికైనా విద్యార్థి ఆసక్తిని బట్టి ఉంటుంది. అనాది నుండి ఈనాటికి మానవ సమూహాలు సంకరం చెందుతూనే ఉన్నాయి. ఇక భాషలు సంకరం చెందకుండా ఎట్లా ఉంటాయి? ఇందులో తప్పు పట్టాల్సిందేమీ లేదు. మానవ వలసలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి కదా! ఇదే సందర్భంలో భాషా పరిణామం కూడా జరుగుతూనే ఉంటుంది. మడి కట్టుకొని కూర్చొన్నట్లుండరాదు. ఒక భాష నుండి మరొక భాషలోకి పదాలు సంకరమయితేనే ప్రజలకు సులువుగా ఉంటుంది. భాషకు పటుత్వం కూడా వస్తుంది. రచయిత చాలా ముఖ్యమైన సూచన చేశారు. 'మొదట తప్పులు లేని తెలుగు రాయడం, చదవడం విద్యార్థులకు నేర్పండి' అని. ఇది చాలా మంచి సూచన. మార్కుల మీద ఆధారపడి విద్యార్థి తెలివితేటల్ని అంచనా వెయ్యరాదు. విషయ గ్రహణ ఏమాత్రముంది అనేది గీటురాయిగా ఉండాలి. ఏదో ఒక విధంగా మార్కుల శాతాన్ని పెంచుకోవడం తగదు. ఇంగ్లిష్ మీడియం లేని రోజులలో కూడా ఇంగ్లిష్ గాని, తెలుగు గాని టెక్స్‌ట్‌బుక్కులే క్షుణ్ణంగా చదివి ఆ భాషలో మంచి ప్రవీణులయ్యారు. తర్జుమా చెయ్యడం అతి సులువుగా వారికుండేది. ఆయా భాషలోని పాఠ్యాంశాల్ని క్షుణ్ణంగా చదివి జీర్ణం చేసుకొన్నప్పుడే తప్పులు లేకుండా రాయగలరు. మాట్లాడగలరు. ఆనాటి ఉపాధ్యాయులు గైడ్స్ మీద ఆధారపడే వారు కాదు. పిల్లల్ని గైడ్స్ కొననిచ్చేవారు కాదు. ఇప్పుడు అయ్యవార్లే చెపుతున్నారను కోవాలి. ఇప్పుడు పునాదిలేని చదువయింది. అందువలనే మాట్లాడటం చాతగాదు, రాయడం అసలే చాతగాదు. మొట్టమొదటగా నేటి విద్యావిధానంలోనే ఈ లోపాలున్నాయి. ఆ లోపాల్ని సరిదిద్ది సరియైన చర్యలు తీసుకొన్నప్పుడే విద్యార్థులు బాగు పడతారు. రచనయిత అన్నట్లు, పూర్వ సాహిత్యమైనటువంటి ప్రబంధాల నుండి అశ్లీల సాహిత్యాన్ని తొలగించి విద్యార్థులకు బోధించాలి. తల్లిదండ్రులు కూడా మార్కులతోనే పిల్లల్ని మెచ్చుకొంటున్నారు. ఏమాత్రం విషయ జ్ఞానం కలిగింది అని ఆలోచించడం లేదు. మార్కుల శాతం బాగా వస్తేనే. లేకపోతే, పిల్లల్ని హీనంగా చూస్తున్నారు. కించపరుస్తున్నారు. ఇది పెద్దవాళ్ల మొదటి తప్పు. ఎంతోమంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. నాదొక సూచన, మొదటగా నీ తల్లిని గౌరవించకుండా వీథిన పడేసి పొరుగింటి తల్లి గోడు విని కళ్లనీళ్లుపెట్టుకొంటారు. మొదట నీ తల్లిని గౌరవించి ఆమె గోడు విని, ఎందరి తల్లుల్ని అయినా ఆ తరువాత ఓదార్చు. అట్లాగే తల్లి భాషను విడవవద్దు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే సాహిత్య సంస్థలు, హక్కుల సంఘాలు విద్యా విధానం మీద గూడా దృష్టి పెట్టి ప్రజలకు సరియైన దారి చూపించవలసిన బాధ్యత ఉంది. దీనిని ఇప్పటి నుండి సామాజిక పోరాటంలో ఒక భాగంగా తీసుకోవాలని నా అభిప్రాయం.

కడియాల సుబ్బనాచారి
దుత్తలూరు, నెల్లూరు

ఫిబ్రవరి 2013 వీక్షణంలో 'అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయి' వ్యాసం అన్ని కారణాలను స్పృశిస్తూ, అన్ని నదులూ చివరికి సముద్రంలో కలుస్తాయన్నట్టు ముఖ్య కారణమైన 'సామ్రాజ్యవాద విష సంస్కృతి'లోనే కలుస్తాయనే మార్క్సిజం వెలుగులో సూటిగా విశ్లేషించిన సైద్ధాంతిక రాజకీయ వ్యాసం. రచయిత లోకసంచారికి నా కృతజ్ఞతలు.

జి. సూరి
హైదరాబాద్

ఫిబ్రవరి సంచికలో అచ్చయిన బయోడీజిల్ వ్యాసం గురించి సైన్స్‌లో తప్పు ఉండదు- వాడే మనిషిలో ఉంటుంది. ఎథనాల్ లేక బయోడీజిల్ లను పెట్రోల్ - డీజిల్‌లో కలిపి వాడే ఆలోచన సరైనదే. ఎప్పుడు, ఎవరు లాంటి ప్రశ్నల జవాబుల మీద ఆధారపడి ఆ కలపడం మంచిదా కాదా అని ఉంటుంది. రచనలో ఇథనాల్, బయోడీజిల్ రెండూ ఒకటి అన్నట్లు అనిపిస్తున్నది. అది సరి కాదు. రెండూ మొక్కల నుంచి వచ్చేవే. అయినా అవి వేరే పదార్థాలు. అభివృద్ధి చెందిన దేశాల లాగా అవి వాడాలా అన్నది మనం నిర్ణయించుకోవాలి. చైనా చేయొద్దనుకున్న పురుగుల మందులు మనం చంకలు గుద్దుకుని చేస్తున్నాం. దానికి మనం బాధ్యులం, చైనా కాదు. బయోడీజిల్ తినడానికి పనికి రాని నూనె గింజల నుంచి తీయాలి. తినే వాటి నుంచి కాదు. వాళ్లకి తినగా ఎక్కువైతే వాళ్లు వాడుకోవచ్చు. అలాగే ఎథనాల్. మొక్కజొన్నలు వాళ్లు పందులకి పెడతారు. మనకి మనుషులు తినడానికే లేవు. అవతల వాళ్లు చెప్పినా మన బుద్ధి వాడి పని చేసుకోవాలి అనుకుంటాను. మన బిజినెస్ గాళ్లు మనకి అపకారం చేసే పనులు చేస్తే, మన సైంటిస్టు మనకి పనికి రానివి చేస్తే మనం ఏమి చేయాలో ఎలా చేయాలో మనం నిర్ణయించుకోవాలి. పక్క వాణ్ణి తిడితే లాభం లేదు. ఏది మంచి వంట నూనెనో మన సైంటిస్టులు చెప్పరు. బయటి వాడు పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, ఇప్పుడు ఖరీదైన ఆలివ్ ఆయిల్ అంటే నోరు మెదవరు. మన ఆయిల్ వ్యవసాయం నాశనం అయిపోయిందాకా పెదిమ విప్పం. మన వేరుశెనగ, నువ్వులు, కొబ్బరి, రైస్ బ్రాన్ నూనెలు శ్రేష్టమైనవి. అతిగా, తప్పుగా వాడకపోతే ఏ రోగమూ రాదు. మన కుంకుడు చెట్టుని నాశనం చేసుకున్నాం. ఒక కుంకుడు చెట్టు నుంచి ఒక చిన్న కుటుంబానికి ఒక సంవత్సరానికి కావాల్సిన కుంకుడు కాయలు, బట్టల సబ్బు, ఆపైన తేనె వస్తాయి. ఎక్కడైనా కుంకుడు చెట్టు వేయటం చూస్తున్నామా? దాని నూనె మన వంట నూనెలని నష్టం కాకుండా చూస్తుంది. మన ప్రజల మీద, మన పరిస్థితుల మీద దృష్టి పెడదాం. ఈ ప్రాబ్లమ్స్‌ని పార ద్రోలుదాం. మన పిల్లలకి మంచి దృష్టంతాలని ఇద్దాం.

మరింగంటి బాపూజీ
హైదరాబాద్

వీ

సింధు వారసత్వ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఇండస్ వర్సెస్ అర్యన్ సంస్కృతి అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించబడుతుంది. సానుకూల, విమర్శనాత్మక అభిప్రాయాలకు ఆహ్వానం.

ఆదివారం, 3 మార్చ్ 2013, ఉదయం 10 గంటలకు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (మినీహాల్), బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

ఇమెయిల్: indusheritage2013@gmail.com, 09573405551

ఆశిష్ నంది అరెస్ట్‌పై సుప్రీం కోర్టు స్టే

జనవరి 26న జైపూర్ సాహిత్య ఉత్సవంలో అవినీతి విశేష భాగం ఒబిసిలు, ఎస్‌సిల వల్లే జరుగుతుందనీ, ఇప్పుడిప్పుడే ఎస్‌టిలు చేరుతున్నారనీ ఆశిష్ నంది వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సదస్సులో తీవ్ర నిరసన వ్యక్తమయింది. ఈ వ్యాఖ్యలపై ఆయన్ను అరెస్ట్ చేయాలని దాఖలైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి సుప్రీంకోర్టు స్టే విధించింది. అలాంటి వ్యాఖ్యలు చేయడానికి నందికి ఎలాంటి 'లైసెన్స్' లేదని ఆక్షేపించింది. ఉద్దేశం ఏదైనా ఆ వ్యాఖ్యలు సమ్మతం కాదు అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అల్తామస్ కబీర్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.

అస్సాంలో బాంబు పేలుళ్లు

అస్సాంలో గణతంత్ర దినోత్సవాన్ని బహిష్కరించాలని ఉల్ఫా సంస్థ పిలుపునిచ్చింది. జనవరి 26 రాత్రి పలు ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు జరిగాయి. మొదట గోల్‌పారా జిల్లా జాలేశ్వర్‌లోని ఆలిండియా డెమోక్రటిక్ యునైటెడ్ ఫ్రంట్ ఎంఎల్ఏ మొయినుద్దీన్ ఇంటిపై బాంబు దాడి జరిగింది. దుబ్రిజిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కూడా బాంబు పేలుళ్లు జరిగాయి.

తమిళనాడులో 'విశ్వరూపం'కు అనుమతి

కమల్‌హాసన్ నటించిన 'విశ్వరూపం' సినిమాను ముస్లిం వర్గాల అభ్యంతరాల కారణంగా తమిళనాడు ప్రభుత్వం విధించిన నిషేధాన్ని నటుడు చంద్రహాసన్ హైకోర్టులో సవాల్ చేశారు. న్యాయమూర్తి జె. వెంకట్రామన్ చిత్రాన్ని చూసి, కమల్ తరపు వాదనలు విని, సెన్సార్ బోర్డు వివరణ, ఇస్లాం సంస్థల వాదనలు పరిశీలించిన అనంతరం చిత్రం విడుదలకు అనుమతిస్తూ జనవరి 29న తీర్పునిచ్చారు.

మార్పుకోసం జనతంత్ర మోర్చా

వ్యవస్థలో మార్పుకోసం రాజకీయాలకతీతంగా 'జనతంత్ర మోర్చా'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తూ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే బీహార్ రాజధాని పాట్నాలో జనవరి 29న ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మైదాన్‌లో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేయబోనని, అధికారానికి దూరంగా ఉంటూనే ప్రజలకు సేవ చేస్తానన్నారు.

ప్రత్యేక గూర్ఖాలాండ్ ఉద్యమం

ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్ర సాధన కోసం జనముక్తి మోర్చా (జెజెఎం) ఆధ్వర్యంలో జనవరి 30న ఢిల్లీలో ఆందోళన చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 'మిలిటెంట్ పోరాటం' చేస్తామని జెజెఎం అధ్యక్షుడు బిమల్ గురుంగ్ హెచ్చరించారు. 'పోలీసులు కాల్పులు జరపొచ్చు, మేం మరణించవచ్చు. ప్రత్యేక గూర్ఖాలాండ్‌ను సాధించుకునేందుకు పోరాటం చేస్తూనే ఉంటాం' అని అన్నారు.

అటవీ చట్టాలను కాలరాస్తూ భూసేకరణ

ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో పోస్కో స్టీల్ ప్లాంట్‌కోసం ప్రభుత్వం పోలీసుల సహకారంతో ఫిబ్రవరి 3న భూసేకరణ ప్రారంభించింది. భూసేకరణను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. పోలీసు బలగాలు వెనక్కి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ పోస్కో ప్రతిరోధ్ సంగ్రామ సమితి (పిపిఎస్ఎస్) ఆధ్వర్యంలో గోబింద్‌పూర్ గ్రామ పరిసరాల్లో చేపడుతున్న భూసేకరణను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పలువురు గాయపడ్డారు. ఈ ప్రాంతం నుంచి పోలీసులు వెళ్లిపోవాలని పిపిఎస్ఎస్ నేత అభయ్‌సాహు పాట్నాలో నిరాహార దీక్ష చేపట్టారు.

అఫ్జల్‌గురుకు ఉరిశిక్ష అమలు

పార్లమెంట్‌పై దాడి కేసులో ఫిబ్రవరి 9న ఢిల్లీలోని తీహార్ జైలులో అఫ్జల్‌గురు (43)ను మెజిస్ట్రేట్ సమక్షంలో ఉరితీశారు. 2001 డిసెంబర్ 13న పార్లమెంట్ దాడి ఘటనలో అఫ్జల్‌గురుకు ప్రమేయముందన్న కారణంతో 2002లో ప్రత్యేక న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. ఫిబ్రవరి 3న రాష్ట్రపతి అఫ్జల్ క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. అఫ్జల్‌గురును ఉరి తీయడంపై మానవ హక్కుల సంఘాలు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేశారు. దేశంలో ఎవరికి ఉరిశిక్ష విధించకూడదు అంటూ నినదించారు.

అలహాబాద్‌లో కుంభమేళా

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ (ప్రయాగ్)లో జనవర 14న మకర సంక్రాంతి రోజున కుంభమేళా మొదలైంది. మార్చ్ 10న మకర శివరాత్రి రోజున ముగుస్తుంది. నాలుగు ప్రముఖ స్థానాలు హరిద్వార్, అలహాబాద్ (ప్రయాగ్), నాసిక్, ఉజ్జయిన్‌లలో ప్రతి మూడేళ్లకు ఒకసారి ఒక్కో ప్రాంతంలో జరిగే కుంభమేళా జరుగుతుంది. పన్నెండేళ్ల తరువాత మళ్లీ అలహాబాద్‌లో ఈ మేళా జరుగుతోంది. ఫిబ్రవరి 9 వరకు దాదాపు మూడు కోట్ల మంది వరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 10న అలహాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓవర్‌బ్రిడ్జికి ఉండే రెయిలింగ్ విరగడంతో తొక్కిసలాట జరిగి 36 మంది మరణించారు. చాలా మంది గాయపడ్డారు. ఘటనకు బాధ్యత వహిస్తూ కుంభమేళా ఇన్‌చార్జ్ పదవికి ఉత్తరప్రదేశ్ సీనియర్ మంత్రి అజం ఖాన్ రాజీనామా చేశారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ధరల పెరుగుదల, కార్మిక చట్టాల ఉల్లంఘన, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణలకు వ్యతిరేకంగా 11 ట్రేడ్‌యూనియన్లు, కార్మిక సమాఖ్యలు ఫిబ్రవరి 20, 21 తేదీల్లో దేశ వ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్నాయి. సమ్మె కారణంగా బ్యాంకింగ్, రవాణ సేవలు ప్రధాన నగరాల్లో స్థంభించాయి. కేరళ మినహా మిగిలిన ప్రాంతాల్లో సమ్మె ప్రభావం మిశ్రమంగా ఉంది.

రక్షణ శాఖలో మరో అవినీతి

రక్షణ శాఖలో ప్రముఖుల కోసం సుమారు 3,600 కోట్ల రూపాయల విలువైన 12 అగస్టావెస్ట్‌లాండ్ హెలికాప్టర్‌ల కొనుగోలులో అవినీతి జరిగినట్లు తెలిసి రక్షణ శాఖ సిబిఐ దర్యాప్తుకు ఆదేశించింది. హెలికాప్టర్ల సరఫరా కాంట్రాక్టును ఇటలీకి చెందిన ఫిన్‌మెకానికాకు చెందిన అనుబంధ సంస్థ ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. భారత వైమానిక దళ మాజీ ప్రధానాధికారి త్యాగి సోదరులకు 362 కోట్ల రూపాయల లంచాలు ఇచ్చినట్లు ఇటలీకి చెందిన ఫిన్‌మెకానికా అధిపతి గూసెపీ ఓర్సీ అరెస్ట్‌తో ఈ విషయం వెల్లడయింది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 జనవరి నుండి 31 జనవరి 2013 వరకు 16 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1771)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	-	4	-	22	20	6	4	3	-	-	3	3	1	2	18	28	-	-	-	3	-
హైదరాబాద్	-	-	-	13	13	-	-	-	2	8	7	8	-	-	30	21	-	-	-	8	-
నల్గొండ	-	6	-	14	19	-	3	2	3	6	1	2	2	9	54	16	-	-	-	5	-
మహబూబ్‌నగర్	-	7	-	23	16	7	-	6	-	7	10	19	22	20	53	9	-	-	-	-	-
మెదక్	-	9	-	6	13	1	8	-	-	4	5	5	-	1	35	15	-	-	-	-	-
నిజామాబాద్	-	-	-	5	14	1	3	-	1	2	1	3	2	1	31	5	-	-	-	-	-
రంగారెడ్డి	-	3	-	12	15	4	17	1	3	13	8	6	2	10	26	3	-	-	-	1	-
వరంగల్	-	3	1	18	9	20	6	8	2	1	-	-	3	8	25	27	-	-	-	-	7
కరీంనగర్	1	9	10	15	20	7	15	7	2	3	5	11	1	2	26	-	-	-	-	-	-
ఖమ్మం	-	2	-	3	9	1	6	2	-	-	4	10	5	-	22	9	-	-	-	-	-
అనంతపూర్	-	7	1	19	9	4	2	1	-	-	3	3	5	4	32	12	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	2	1	-	-	-	-	2	-	-	-	4	31	10	-	-	-	-	-
కర్నూలు	-	6	-	6	6	3	4	7	6	6	4	6	8	5	25	27	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	9	11	8	11	-	7	9	-	-	12	-	64	-	-	-	-	-	-
విశాఖపట్నం	-	1	-	10	15	1	1	-	1	9	1	3	6	-	20	10	-	-	-	8	-
విజయనగరం	-	2	-	8	5	4	3	-	6	8	1	2	-	-	25	4	-	-	-	-	1
మొత్తం	**1**	**59**	**12**	**191**	**195**	**67**	**83**	**37**	**33**	**78**	**53**	**81**	**69**	**66**	**517**	**196**	**-**	**-**	**-**	**25**	**8**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

మీరు-నేను-ఆర్థికం	వి. హనుమంతరావు	రు. 60
ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	50
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
రాజ్యం – సంక్షేమం	కె. బాలగోపాల్	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్సి, ఎస్టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్సి, ఎస్టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు – రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు – అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు – మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దళిత	కె. బాలగోపాల్	120
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
కన్నబీరన్	వ్యాస సంకలనం	రు. 50
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
నడుస్తున్న దారి	వ్యాస సంకలనం	50
హక్కుల బాటసారి	బుర్ర రాములు రచనలు	50
నిగాహ్	కె. బాలగోపాల్ వ్యాసం సంకలనం	200
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
ధ్వంసమైన స్వప్నం	అరుంధతీ రాయ్	75
జంగల్‌నామా	సత్నామ్	100
లాంగ్‌మార్చ్	తెలంగాణ జర్నలిస్టుల సంకలనం	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60

కథ – నవల

గంగానమ్మ	విజయ	15
గుమ్మెటమోత	పాణి	100
గదిలోపలి గోడ	పలమనేరు బాలాజి	60
రుదాలి	మహాశ్వేతాదేవి	45
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
అజేయుడు	అలెగ్జాండర్ ద్యూమా	160
ఘంటారావం	విక్టర్ హ్యూగో	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
చేగెవెరా	కాత్యాయని	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టాస్ పబ్లికేషన్స్	50

Fifty Years of Andhra Pradesh (1956-2006)		300
Towards Understanding Semi Feudal - Semi Colonial Society	R.S. Rao	300
In search of Method	Mudunuri Bharathi	200
Individual Sub-groups, Groups and Freedom	Mudunuri Bharathi	75
Crisis and Development in Marxian Framework	Mudunuri Bharathi	80
Methodoly of Social Enquiry	Mudunuri Bharathi	150
On Education	Mudunuri Bharathi, R.S. Rao	100
Understanding Maoists	N. Venugopal	300

వీక్షణం, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email: veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

KRSA 102B 267 BC

SHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 140 -March 2013 • ISSN 2231-6892
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 28/2/2013 • Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

నూతన సంవత్సర శుభాకాంక్షలతో ....

తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్ష -ప్రధాన కార్యదర్శులు

శ్రీ జి. దేవి ప్రసాద రావు, శ్రీ కె. రవీందర్ రెడ్డి

నేతృత్వంలో వెలువడుతున్న

తెలంగాణ ఎన్జీవో
కేంద్ర సంఘ అధికార మాస పత్రిక

చదవండి... చదివించండి

సబ్ ఎడిటర్ : కారం రవీందర్ రెడ్డి

ఎడిటోరియల్ బోర్డు : కస్తూరి వెంకటేశ్వర్లు, కుమారి బి. రేచల్, ఎం. హరిబాబు
ఆఫీస్ ఇన్-చార్జీ : శైలజాదేవి, ఎంజులా రెడ్డి, తన్వీర్ సుల్తానా, ఉమా
డిస్ట్రిబ్యూషన్ ఇన్-చార్జీ : ఆర్. ప్రతాప్, కె. శ్రీకాంత్, ఏ. వెంకటేశ్ కుమార్
అడ్వర్టైజింగ్ ఇన్-చార్జీ : షేక్ జానీమియా
ఫోటో గ్రాఫర్ : బి. మల్లేష్, పబ్లికేషన్ కన్సల్టెంట్ : కె. రఘు రామారాజు

జీవితకాలం చందా : రూ. 1000/-
6 సంవత్సరాల చందా : రూ. 500/-
సంవత్సరం చందా : రూ. 100/-

" తెలంగాణా ఎన్జీవో కేంద్ర సంఘం "
పేరిట చెక్కులు పంపించగలరు

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA102M267
పుస్తకం పేరు	వీక్షణం
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	mary
పేజీలు విడదీసినది	mary
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	NANDINI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good